# క్రొత్త జన్మ

## THE NEW BIRTH



పెర్రి కోతమ్
Perry B. Cotham

# క్రొత్త జన్మ

# THE NEW BIRTH

( A Compilation of Tracts)

*Author*

**Perry B. Cotham**

*Translator*

**Joshua Gootam**

**CHURCH OF CHRIST**
**P.O. BOX 80, KAKINADA**
**A.P., INDIA- 533 001**

**Copies can be had from**
**SATYA VANI - CHURCH OF CHRIST**
**P.O. Box : 80, KAKINADA**
**A.P. India - 533 001**
**Ph : 0884 2363722**

*Reprint:*
*2022*

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మార్పుజెందుట | 1 |
| 2. | క్రొత్తజన్మ | 23 |
| 3. | మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు | 46 |
| 4. | సిలువపై నున్న దొంగ | 68 |
| 5. | క్షమాపణ నిదర్శనము | 88 |
| 6. | బైబిలు బాప్తిస్మము | 107 |
| 7. | ఈ బండమీద | 124 |
| 8. | రక్షింపబడుటకు ఒకడు సంఘ సభ్యుడు కావలెనా? | 146 |
| 9. | మరణమైన తరువాత - ఏమిటి? | 166 |
| 10. | క్రీస్తు యొక్క రెండవ రాకడ | 197 |
| 11. | ద్రాక్షావల్లి - తీగెలు | 220 |
| 12. | బైబిలు దేవుని నుండి కలిగినదా? లేక మానవుల నుండి కలిగినదా? | 232 |

# 1. మార్పు జెందుట

## (Conversion)

వయసు వచ్చిన ప్రతివారు ప్రభువు తట్టు తిరగవలెను. లేనియెడల వారు నాశనమగుదురు. మార్పుజెందకుండ ఎవరును పరలోక రాజ్యములో చేరలేరు. యేసు ఇట్లనెను: "మీరు మార్పునొంది బిడ్డల వంటివారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 18:3). మార్పుజెందుట అవుసరమని ప్రజలు సాధారణముగ నమ్ముచున్నను మార్పుజెందుట అనగా యేమిటో అది ఎప్పుడు, ఎక్కడ ఎట్లు సంభవించునో యను విషయములను అపార్థము చేసికొనుచున్నారు. మార్పుజెందు విధానమును బైబిలు విపులీకరించు చున్నది గనుక ఈ ప్రశ్నలకు జవాబును కనుగొను నిమిత్తము మనము బైబిలు నొద్దకు వెళ్లవలెను.

### 1. మార్పుజెందుట అనగా నేమి ?

సాధారణముగా మార్పుజెందుట యనగా మారుట, మార్చబడుట యని మనము చెప్పుకొందుము. ఒక స్థితినుండి వేరొక పరిస్థితికి మారు విధానము మార్పుజెందుట Conversion యగును. ఉదాహరణ : కలపను కాగితముగా మార్చుట, ముడి యినుమును ఇనుముగాను, యినుమును ఉక్కుగాను, జంతువుల చర్మములను పాదరక్షలగాను మార్చుట .

లేఖనములలో మార్పుజెందుట యనగా ఒక పరిస్థితి నుండి వేరొక పరిస్థితికి మారుటయని యర్థము. బైబిలు ప్రకారము మార్పునొందుట యనగా నైతికముగాను, ఆత్మీయముగాను, కలుగు మార్పు. క్రైస్తవుడగుటలో ఒకడు దేవుని తట్టు తిరుగు విధానమది. థెస్సలోనీకయులు క్రైస్తవులుగా

మారుటలో వారు "విగ్రహములను విడిచిపెట్టి జీవముగలవాడును సత్యవంతుడునగు దేవుని దాసులగుటకు .. దేవుని వైపునకు తిరిగిరి" యని పౌలు చెప్పెను (1థెస్స 1:9; 14:15 9:35). మార్పుజెందుటలో మానవుడు పాపమునుండి దేవుని తట్టు తిరుగును.

### a). మార్పుజెందుటలో మానవుడు యిమిడియున్నాడు

మార్పుజెందుటలో మానవుడు తనకు తానే తిరుగవలసి యున్నదను సత్యమును బైబిలు వక్కాణించి చెప్పుచున్నది. గ్రీకు క్రొత్తనిబంధనలో మార్పుజెందుటయను పదము ఒక వ్యక్తి తనకు తానుగా తన కొరకు జరిగించు క్రియయని సూచించుచున్నది. మార్పుజెందుటలో పాపి తటస్థముగా యుండక కృషి సల్పువాడుగా యుండును.

### b). మార్పుజెందుట క్షమించబడుట కాదు:

మార్పుజెందుట క్షమించబడుటతో సమానము కాదు. గాని ప్రభువు తట్టు తిరుగుటలో లేక మార్పుజెందుటలో క్షమించబడుట సంభవించును. దేవుడు క్షమించును. అయితే ఒక వ్యక్తి దుర్మార్గత నుండి దేవుని వైపు తిరిగి నప్పుడు దేవుడు క్షమించును. దీనికి ఋజువుగా ఈ క్రింది వచనములను దయచేసి గమనింపుము :

"ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని. హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది వారి చెవులు వినుటకు మందములైనవి. వారు తమ కన్నులు మూసికొని యున్నారు గనుక మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు, చూచుట మట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు" (మత్తయి 15:13; మార్కు 4:12).

"ప్రభువు సముఖమునుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లును

....... మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ.కా. 3:19,20).

"భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలి పడును. వారు మన దేవుని వైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" (యెషయా 55:7).

గనుక ప్రజలు తమ పాపములు క్షమింబపడు నిమిత్తము దేవునివైపు తిరుగవలెను. క్షమాపణ మానవుని హృదయములో కాక దేవుని మనస్సులో జరుగును. మానవుడు దేవుని చట్టమునకు విధేయుడగును. ప్రభువు తట్టు తిరుగును. అటు తరువాత దేవుడతని పాపములను క్షమించును (మార్కు 2:7; హెబ్రీ 8:12). గనుక దేవుని తట్టు తిరిగే పని మానవునిది. అతని పాపములను క్షమించే పని దేవునిది. ఒకడు దేవుని తట్టు తిరిగి క్షమాపణ నొందువరకు పాపియైన వాడెవడును పరిశుద్ధునిగా మార్పుజెందడు

**c). సారాంశము :**

పైన గమనించిన రీతిగా మార్పునొందుటలో రెండు భాగములున్నవి. మొదటిగా మానవుడు చెడుగునుండి మంచికి, పాపమును ప్రేమించి దానిననుసరించుట నుండి నీతిని ప్రేమించి దానిననుసరించుటకు మారవలెను. అటు తరువాత ఈ మార్పు జెందిన మానవుని పాపములను దేవుడు క్షమించును. ఒకనిని సాతాను రాజ్యమునుండి క్రీస్తు రాజ్యమైన సంఘములోనికి చేర్చు విధానము మార్పుజెందుట యగును (కొలస్స 1:13). గనుక మార్పుజెందుట యనగా ఒక పాపి క్రైస్తవుడగు సంపూర్ణ సువార్త విధానమై యున్నది. అందువలన మార్పుజెందినవాడు మారినవాడు. దేవుని తట్టు తిరిగిన వాడు.

## 2. పాపియైన వాడు దేవుని తట్టు ఎట్లు తిరుగును?

పాపియైనవాడు సువార్త విని, విశ్వసించి విధేయత చూపించుటలో ఒకడు క్రీస్తు వైపు మారును. ఆ సంగతిని ఇదే పాఠములో తరువాత మనము కనుగొన గలము. దేవుడు మానవుని ఎదురాడలేని అద్భుతశక్తి వలన మార్చడు గాని అతడాయన తట్టు తిరుగునట్లు ఆత్మావేశము గల తన వాక్యము ద్వారా అనగా బైబిలు ద్వారా ప్రోత్సహించును. మార్పుజెందుటలో దేవుడు, మానవుడు కూడ ప్రాముఖ్య క్రియలను చేయుదురు.

మానవుడు లెక్క అప్పగింపవలసినవాడని అందువలన తాను గైకొను నిర్ణయముల కతడే బాధ్యుడని బైబిలు బోధించుచున్నది (మత్తయి 23:37,38). మార్పుజెందుట యనగా తిరుగుట గనుక మంచి చెడుగుల ఎంపిక మానవుని క్రియయే యగును. యెహోషువ తన ప్రజలను ఇట్లు హెచ్చరించెను. "మీరు ఎవరిని సేవించెదరో..... నేడు మీరు కోరుకొనుడి మీరెవరిని సేవింపకోరుకొనినను నేనును, నాయింటి వారును యెహోవాను సేవించెదము" (యెహోషువ 24:15). "మీకు జీవము కలుగునట్లు మీరు నాయొద్దకు రానొల్లరు" అని క్రీస్తు కొందరితో అనెను (యోహాను 5:40). ఆయనకు లోబడవలసినదని ప్రభువు యెవనిని బలవంతపెట్టడు అని లేఖనములు బోధించుచున్నవి. పాపియైన వాడు నైతికముగా స్వాతంత్రుడని కూడ అవి బోధించుచున్నవి. అతడు తన స్వయిష్ట ప్రకారము నిర్ణయించుకొని దేవుని తట్టు తిరుగవలెను.

### a). మార్పునొందుట మర్మము కాదు :

మార్పుజెందుట యనునది చెప్పుటకంటె అనుభవించు ఒక అద్భుత విధానము కాదు. దేవుడు మానవునికి బైబిలు నిచ్చెను. రక్షింపబడుటకతడు ఏమి చేయవలెనో దానిద్వారా ఆయన అతనికి తెలియజేయును.

మానవుని సహకారము లేకుండగయే ఒక పాపిని మార్చుటకు పరిశుద్ధాత్ముడు అతని హృదయములో నేరుగ ప్రవేశించునని లేఖనములు బోధించుటలేదు. మార్పుచెందుట యనగా "మతాన్ని పుచ్చుకొనుట" కాదు. లేఖనములోని భావమును వ్యక్తపరచు లేఖన విరుద్ధ సంగతి యిది. ప్రజలను మార్చుటకు పరలోకము నుండి శక్తి పంపించుమని ప్రార్థించువారు దేవునిని పక్షపాతిగా యుండుమని కోరుచున్నారు. ఈ విధానము సరియైనదయితే అట్లు అభ్యర్థించువారందరు మార్పుచెందిన వారెందుకు కాలేదు? ఎదురాడలేని నిర్జీవ శక్తి వలన మార్పు సంభవించునని చెప్పు సిద్ధాంతము ఈ దిగువ కారణముల వలన అసత్యమై యున్నది.

1. అది మానవుని నైతిక స్వాతంత్ర్యమును నాశనము చేయును. మానవుని బాధ్యతలన్నిటిని తొలగించును. మార్పుచెందుటలో అతనిని మందకొడిగా తయారుచేయును. (మందకొండిగా మార్పుచెందుట మన రక్షకుడు యోహాను 6:29, 8:24; మత్తయి 7:21-27; మార్కు 16:16లలోచేసిన బోధకు విరుద్ధముగా యున్నది). పాపియైనవాడు మార్పుచెందుటలో క్రియాజనాత్మకమైన వాడుగ పై వచనములు సూచించుచున్నవి.

2. ఒకడు క్షమాపణ నొందుటకు అతడు ఏమియు చేయనక్కరలేదని అది సూచించుచున్నది. అందువలన రక్షణ బేషరతుగా ఈయబడును (బైబిలులో హెబ్రీ 5:9; 6:17,18; 2 థెస్స 1:7-9; 1 పేతురు 1:22లలో చెప్పబడిన వాటికి ఇది విరుద్ధమైనది).

3. అది దేవునిని పక్షపాతిగా చేయుచున్నది. అయితే బైబిలు ఇట్లనుచున్నది. "దేవుడు పక్షపాతికాడు.... ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును" (అపొ.కా. 10:34,35; రోమా 2:11).

ఒక వ్యక్తికి దేవుడు పరిశుద్ధాత్ముని నేరుగా పంపిన యెడల ఆయనను అందరికి తప్పక పంపవలెను. లేనియెడల పక్షపాతము చూపవలెను. ఈ సిద్ధాంతము ప్రకారము ఆ శక్తిని పొందకుండా ఒకడు మరణించిన యెడల యెవరు నిందించబడవలయును? దేవుడే కదా? అయితే దేవుని వాక్యములో విశదపరచబడిన బోధకు, ఈ సిద్ధాంతము విరుద్ధముగా యున్నందున ఇది సత్యము కానేరదు. మానవుడు తుదకు తానే పాపమునుండి తిరగగలడు, తిరగవలెను.

### b). రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది.

పాపులు మార్పుజెందునట్లు దేవుడొక శక్తిని ఉపయోగించడా? యని తరుచు కొందరు అడుగుదురు. అయితే సువార్తయే మార్పుజేయు దేవుని శక్తియై యున్నది. ఈ శక్తి దేవుడు సువార్త ద్వారా వినియోగించును. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

మానవుని రక్షించుటకు ఏది దేవుని శక్తియై యున్నది? అది క్రీస్తు సువార్తయని ఈ వచనము చెప్పుచున్నది. రక్షించు నిమిత్తము సువార్త ఒక్కటే దేవుని శక్తియై యున్నది. అది పాపులను మార్చుటకు సంపూర్ణమై యున్నది. "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యధార్థమైనది. అది ప్రాణమును తెప్పరిల్లజేయును" (కీర్తన 19:7)

సువార్త బోధింపబడకుండ యెవడైనను క్రీస్తువైపు మార్పుజెందినట్టి సందర్భము ఒక్కటి కూడ లిఖింపబడి యుండలేదు. పరిశుద్ధాత్మావేశము కలిగిన వారిలో యెడును ఒకవ్యక్తి మార్పు జెందవలెనంటే అతడు పరిశుద్ధాత్మను పొందవలెనని యెవనికి బోధించినట్లు బైబిలులో కనబడుట లేదు. ఈ మార్పుజేయు శక్తిని క్రిందికి పంపించునట్లు ప్రార్థించుమని చెప్పు ఆజ్ఞ గాని, అట్టి మాదిరిగాని మనకు కనబడదు. సత్యవాక్యము

ద్వారా ఆత్మ తన పనిని చేయును గాని నేరుగా మర్మయుక్తముగా కాదు (యోహాను 6:63 1 పేతురు 1:23; యాకోబు 1:18).

బోధించుట ద్వారా ప్రభువు ప్రజలను తనయొద్దకు ఆకర్షించుకొనును (యోహాను 6:44,45). ఆయన తన వాక్యము ద్వారా ప్రజలు ఆయన తట్టు తిరుగునట్లు “మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి...... మీ దుర్మార్గత నుండి మరలి మనస్సు త్రిప్పుకొనుడి” యని హెచ్చరించుచున్నాడు (యెహెజ్కేలు 14:6; 18:23; 30:32; 33:11; 14:19 యిర్మీయా 7:3).

అందువలన మార్పుజెందుటలో ప్రజలు కృషి సల్పనివారి గాను బాధ్యత లేనివారు గాను యుండిన యెడల వారికి బోధించవలసిన అవసరము లేనేలేదు. కాబట్టి వారు ఆయన తట్టు తిరిగి తమ పాపములను తుడిచి వేయించుకొన లేనందున నిత్యనాశనమొందెదరు గాని ప్రభువు వారిని అంగీకరించ లేనందువలన కాదు (అపొ.కా 7:51).

### c). ఒకడు చిన్న బిడ్డవంటివాడు కావలెను

“మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనే గాని పరలోకరాజ్యములో ప్రవేశింపరని” యేసు చెప్పెను. బిడ్డలవంటి వారనుటలో ప్రజలు పసిబిడ్డలు కావలెనని అనగా అమాయకులు, బోధింపబడతనిగినవారు, నమ్మిక యుంచు వారు, వినయ విధేయతలు కలవారుగ యుండవలెనని ఆయన ఉద్దేశ్యము. పరలోకరాజ్యము చిన్నపిల్లలతో కాదు గాని చిన్న పిల్లలవంటి ప్రజలతో నిండి యున్నది. అనగా బిడ్డలవంటి గుణ లక్షణములు గలవారితో నిండి యున్నది.

## 3. మార్పుజెందుటలో కలుగు ఇతరమార్పులేవి ?

క్రీస్తు తట్టు మార్పుజెందుటలో ఒకనిలో కనబడు మార్పులు మూడు ఉన్నవి : 1) విశ్వాసము వలన హృదయములో మార్పు 2) మారుమనస్సు

వలన జీవితములో మార్పు. 3) బాప్తిస్మము వలన సంబంధములో కలుగు మార్పు ఈ మూడు ప్రత్యేక మార్పులు జెందకుండ యెవడును దేవుని తట్టు తిరుగలేడు.

### a). విశ్వాసము వలన హృదయములో మార్పు :

క్రైస్తవ్యము హృదయ సంబంధమైన మతము గనుక క్రీస్తు వైపు మార్పు జెందునపుడు హృదయములో మార్పు తప్పక కలుగవలెను. బైబిలులో కనబడు హృదయమనగా మనుష్యునిలో ఆలోచించునట్టిది, విశ్వసించునది, గ్రహించునది, కోరునది, నిశ్చయించునది, విధేయత చూపునట్టిది (మత్తయి 9:4; మార్కు 2:6; రోమా 10:10; మత్తయి 13:15; రోమా 10:1; సామె 3:5; 2కొరింధీ 9:7; రోమా 6:17).

గనుక మార్పుజెందుటలో మారవలసినది, మనుష్యుని యొక్క బుద్ధి భావోద్రేకములు గాని భౌతిక సంబంధమైన గుండెకాదు. ఈ మార్పుదేవుని వాక్యమును వినుట ద్వారా కలిగిన విశ్వాసము వలన సంభవించును (రోమా 10:17). ఒకడునమ్మిన తరువాత అతని విశ్వాసప్రేమలు సాతాను నుండి క్రీస్తునకు మార్చబడును. మార్పుజెందుటలో ఒకడు యేసే క్రీస్తనియు, దేవుని కుమారుడనియు విశ్వసించి, పాపమును ప్రేమించుట మాని నీతిని ప్రేమించుటకు నిశ్చయించుకొనవలెను (యోహాను 8:24; మత్తయి 22:37). తద్వారా కలుగు విశ్వాస ఫలితమే హృదయ మార్పు అని పిలువబడును.

### b). మారుమనస్సు ద్వారా జీవితములో మార్పు :

సువార్త బోధించుట ద్వారా క్రీస్తు సిలువ వేయబడి తిరిగి లేచిన ప్రభువని స్థిరపరచబడినప్పుడు అతని జీవితము మార్చబడవలసియున్నది. క్రీస్తునందలి విశ్వాసము అతని జీవిత మార్పునకు దారితీయవలెను. అనగా అతడు పాపము నుండి తిరుగవలెను. ప్రతి విధమైన పాపమును

విడనాడుటకు నిశ్చయించుకొని నీతి న్యాయముల ననుసరించవలెను (యెహె 18:5; 33:14,19). ఒకని ప్రవర్తనలో ఈ మార్పు మారుమనస్సు వలన సంభవించును. మారుమనస్సు అనగా పాపమును గూర్చి దైవచిత్తానుసారమైన దు:ఖము వలన అది కలుగును. దాని ఫలితమే జీవితములో కలుగు మార్పు (మత్తయి 21:28,29; లూకా 15:17-20 యోనా 3:10; మత్తయి 12:41; 3:8; 2కొరింథీ 7:9-10; లూకా 13:3-5; అపొ.కా. 17:30). పాపియైనవాడు పాపమునుండి తిరిగి దానికి వ్యతిరేక మార్గమును ప్రయాణించుటకు నిర్ణయించు కొనవలెను. అతడు క్రీస్తునందు విశ్వాసముంచుటకంటే యెక్కువ చేయవలెను. సమస్త పాపముల నుండి అతడు వైదొలగి వాటిని సంపూర్తిగ విసర్జించవలెను. మారుమనస్సు గత జీవితమును మార్చలేదు. గాని భవిష్యత్ జీవితమును మార్చి నడుపును.

### c). బాప్తిస్మము ద్వారా సంబంధములో కలుగుమార్పు :

విశ్వాసము మారుమనస్సు వలన దేవుని కొరకును నీతిగల జీవితము కొరకును తన్ను తాను ప్రమాణము చేసికొనిన తరువాత ఒకడు తన స్థితిని కూడా మార్చుకొనవలెను. క్రీస్తు దేవుని కుమారుడని ఒకడు తన విశ్వాసమును ఒప్పుకొనిన తరువాత ఈ స్థితి లేక సంబంధము బాప్తిస్మము వలన మార్చబడును (మత్తయి 28:19,20; రోమా 10:10). పౌలు ఇట్లు ప్రకటించెను: "క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3,4; కొలస్స 2:12,13). "క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును

ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

బాప్తిస్మము ఒకని హృదయమును జీవితమును మార్చదు గాని విశ్వాసము మారుమనస్సుల వలన ఒకని హృదయము జీవితము మార్చబడినందున అది అతని స్థితిని మార్చును. మార్పుజెందుటను సంపూర్తి చేయుటలో దైవమానవులు కలసి పాత్ర వహించు క్రియ బాప్తిస్మము. మారుమనస్సు నొందిన విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును. క్రీస్తులో యున్న ఆ వ్యక్తి ఒక నూతన సృష్టి ఆయన శరీరములో ఒక సభ్యుడు క్రైస్తవుడు అగును (2కొరింథీ 5:17; కొలస్స 1:12, 13,14; ఎఫెసీ 1:22, 23).

### d). వివాహము మార్పునకు సారూప్యముగా నున్నది :

క్రీస్తువైపు మార్పుజెందిన ప్రతివాడు క్రీస్తు సంఘసభ్యుడై యున్నాడు. సంఘము క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెయని చెప్పబడినది (ఎఫెసీ 5:22,23; రోమా 7:4; 2 కొరింథీ 11:2). ఒకడు క్రీస్తువైపు మార్పుజెందగనే ఆయన పెండ్లి కుమార్తెలో ఒక భాగమగును. గనుక వివాహములో స్త్రీ మూడు విధములైన మార్పును అనుభవించును: 1. హృదయమార్పు 2. జీవిత మార్పు 3. స్థితిలో మార్పు.

ఒక స్త్రీతాను పెండ్లియాడబోయే పురుషుని కలసి కొన్నపుడు అతనిలో ఆమెకు అంత విశ్వాసము ఉండకపోవచ్చును. ఏది ఏలాగయినను మొదట ఆమె విశ్వాసము సంకుచితముగా యుండును గాని క్రమేపి అది పెరుగును. చివరకు అతనియందు ఆమె సంపూర్ణ విశ్వాసము కలిగి యుండినను ఆమె ఇంకను పెండ్లియాడలేదు. ఆమె హృదయము మారిన తరువాత ఆమె తన స్నేహితులను తగ్గించి వివాహమాడుటకు సంకల్పించుటలో నిమగ్నురాలై తన జీవితమును మార్చుకొనును. అయితే ఇంకా జరుగవలసియున్నది.

యేసు ప్రభువని, రక్షకుడని ఒకడు విశ్వసించగానే పాపియైన వాడు మార్పునొందిన వాడని అనేకులు వాదింతురు. అయితే ప్రభువు తట్టు తిరుగుటలో సంభవించునది అంతా హృదయ మార్పేకాది. ఒక పాపి క్రీస్తునందు విశ్వాసముంచగానే సంపూర్తిగ మార్పునొందిన వాడన్నప్పుడు ఒక స్త్రీ తాను భావిలో పెండ్లి యాడబోయే పురుషునియందు సంపూర్ణ విశ్వాసముంచగానే ఆమెకు వివాహమై పోయినదని కూడ అనుకొనవచ్చును గదా!

అయితే ఉదాహరణకు వీరిద్దరికి ప్రధానము జరిగినది గాని వివాహము జరుగక ముందే ఆ పురుషుడు చనిపోయెనను కొందము. ఆమె పెండ్లాడిన స్త్రీ యగునా ? చనిపోయిన పురుషుడు మిగుల ఆస్థి గలవాడైనను ఆమె దానిలో నుండి ఏమియు పొందదు. ఏలయనగా జరుగవలసిన ఆ ఒక్క క్రియ వివాహము జరుగలేదు. బాప్తిస్మమను క్రియ కూడ అంతే. ఒకడు మార్పుజెందుటను సంపూర్ణము చేయునట్టిది.

## 4. లేఖనముల ప్రకారము ఒకడు ఎప్పుడు మార్పుజెందును?

లేఖనముల ప్రకారము ఒకడు మార్పుజెందవలెనంటే హృదయమార్పు, జీవితమార్పు, స్థితిలో మార్పు ఈ మూడు మార్పులు అవుసరము. జరుగుచున్న మార్పు ఈ క్రమ పద్ధతిలో జరుగవలెను. హృదయమార్పు జీవితమార్పు సంభవించినప్పుడే ఒకడు తన స్థితిలో జరిగే మార్పు కొరకు సిద్ధపడును గాని అంతకు ముందు కాదు. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందువరకు అతడు రక్షించబడినవాడు కాదు. అతడు దేవుని రాజ్యములో లేడు. అతడు క్రైస్తవుడు కాదు, దీని ద్వారా అతడు క్రీస్తులోనికి తేబడును. గత పాపముల నుండి రక్షించబడును. సంఘముతో చేర్చబడును (అపొ.కా. 2:47). యేసు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును" అని చెప్పెను (మార్కు 16:16).

మార్పునొందు విధానములో విశ్వాసము మారుమనస్సు తరువాత ఇంకొక మార్పు కనబడును. “నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి”యని పేతురు ప్రజల నాజ్ఞాపించెను (అపొ.కా. 3:19). ఈ వచనములో కనబడు ‘తిరుగుట బాప్తిస్మమై’ యున్నది.

పాపము యెడల ఒకని తీరును విశ్వాసము మార్చును. ఒకని పాపపు అపరాధములను బాప్తిస్మము లో దేవుడు కడిగివేయును. ఒకడు పాపమును ప్రేమించకను జరిగించకను యుండినను అతని అతిక్రమములను బట్టి ఇంకను అపరాధిగానే యుండవచ్చును. ఉదాహరణకు, ఒకడు తాను చేసిన దొంగతనము నసహ్యించుకొనినంత మాత్రమున తన యపరాధమునుండి అతడు స్వతంత్రుడు కాజాలడు. గనుక పాపక్షమాపణ నిమిత్తము దేవుని సంకల్ప మేమనగా : హృదయమును మార్చునట్టియు పాపమును జయించునట్టియు విశ్వాసము పాపపు కొనసాగుదలను అరికట్టునట్టియు జీవితమును మార్చునట్టియు మారుమనస్సు, సంబంధమును మార్చునట్టియు అపరాధములనుండి విడుదల చేయునట్టియు బాప్తిస్మము అవుసరము.

కాబట్టి మార్పుజెందుటలో విశ్వాసము వలప హృదయము మార్చబడును మారుమనస్సు వలన జీవితము మార్చబడును. ఒకని స్థితి లేక సంబంధము బాప్తిస్మము వలన మార్చబడును (క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనిన తరువాతనే బాప్తిస్మము పొందవలెను). అప్పుడు మాత్రమే ఒక పాపి లేఖనముల ప్రకారము మార్పుజెందినవాడును, తన గత పాపములు క్షమింపబడిన వాడును అగును.

విశ్వసింపబడినప్పుడు సువార్త పాపము యెడల ఒకని తీరును మార్చి దానిని ప్రేమించుట మాన్పించును. అతని జీవితము దేవునికి అయిష్టముగా యున్నదని గమనించి అతడు తన పాపముల విషయమై మారుమనస్సు నొంది వాటిని జరిగించుట మానుకొనును. అట్లు చేసిన

తరువాత మారుమనస్సు పొందిన విశ్వాసి క్రీస్తునందలి తన విశ్వాసమును ఒప్పుకొని తన పాపభారము తొలగించబడు నిమిత్తము బాప్తిస్మము పొందును. పాపయైనవాడు విశ్వాసము వలన పాపపు ప్రేమనుండి, మారుమనస్సు వలన పాపము జరిగించుట నుండి, బాప్తిస్మము వలన పాపభారము నుండి రక్షింపబడును.

## 5. క్రొత్తనిబంధన మార్పుల మాదిరి ఎక్కడ యున్నది ?

అపొస్తలుల కార్యములు అను పుస్తకము ఒక్కటి మాత్రమే క్రొత్తనిబంధనలో మార్పుజెందిన వారి మాదిరిలను కలిగియున్నది. ఒకడు క్రైస్తవుడగుటకు చేయవలసిన దేమిటో తెలిసికొనవలెనన్న అతడు అపొస్తలుల కార్యములు అను పుస్తకమును చదువవలెను. అపొస్తలులు ఏమి బోధించిరో, మనుష్యులు దేవుని వైపు ఎట్లు తిరిగిరో నేర్చుకొనవలెను. అందున్న మాదిరులను అవలంబించుట చాల సూక్ష్మమే. ఏలయనగా పరిశుద్ధాత్మావేశముగలవారి బోధనలను బట్టి అవి జరిగెను. అపొస్తలుల కార్యములు అను పుస్తకము నుండి ఇప్పుడు కొన్ని మాదిరులను గమనించుము :

**1. పెంతెకొస్తునాడు మార్పునొందినవారు :** క్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు దినమున పేతురు గొప్ప జన సమూహమునకు క్రీస్తును గూర్చి బోధించెను. అప్పుడు మూడువేల మంది క్రీస్తు తట్టు తిరిగిరి. సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2).

“పరిశుద్ధాత్ముడు ఈ ప్రజలను మార్చెనా?” అని కొందరు అడుగుదురు. ఆయనే మార్చెనని అందరు అంగీకరింతురు. అయితే ఆయన దాని నెట్లు జరిగించెను? పేతురు చేసిన ప్రసంగము ద్వారా జరిగించెనని జవాబు చెప్పవచ్చును. అపొస్తలుని ద్వారా ఆత్మ ప్రకటించిన దేవుని వాక్యము వారిని క్రైస్తవులగుటకు నడిపించెను. అక్కడ కూడియున్న జన

సమూహము నకు పేతురు సిలువ వేయబడి నట్టియు తిరిగి లేచినట్టియు ప్రభువును గూర్చిన సువర్తమానము బోధించెను. ఆ బోధవలన వారు హృదయములలో నొచ్చుకొనిరి.దేవుని కుమారుని సిలువ వేయుటలో వారు అపరాధులని వారిపై నేరస్థాపన జరిగెను (అపొ.కా. 2:36,37). పేతురు ప్రకటించిన సత్యమునందలి విశ్వాసము వలన సహోదరులారా మేమేమి చేతుము ? అని వారడిగిరి. పరిశుద్ధాత్ముని నడిపింపు వలన పేతురు "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశు ద్ధాత్మ అను వరమును పొందుదురు" అని జవాబిచ్చెను (అపొ.కా. 2:38).

బాప్తిస్మము పొందకముందే పాపక్షమాపణ .జరుగునని కొందరు తలంచుటచేత "పాపక్షమాపణ నిమిత్తము" అను మాటలు వారికి అర్ధము కావు. ఎవని పాపములైనను క్షమించబడలెనంటే బాప్తిస్మము అవుసరమని లేఖనములు విపులీకరించుచున్నవి. మత్తయి 26:28లో అది వివరించబడెను : "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని క్రీస్తు పలికెను.

పాపక్షమాపణ నిమిత్తము, అనగా పాపములు క్షమించబడుట కొరకు క్రీస్తు రక్తమును ఎట్లు చిందించెనో అట్లే పాపక్షమాపణ నిమ్తిము (అనగా పాపములు క్షమించబడుట కొరకు) బాప్తిస్మము పొందవలెనని పేతురు బోధించెను (అపొ.కా. 3:19లో కూడ మార్పునొందుటకవుసరమైన మెట్లు వ్రాయబడియున్నవి).

గనుక క్రీస్తునందు విశ్వాసముంచుట వలన ప్రజలు హృదయములో ప్రభువు తట్టు తిరిగిరి, మారుమనస్సు నొందుట వలన వారి ప్రవర్తనలో వారు ఆయన వైపు తిరిగిరి, బాప్తిస్మము పొందుట వలన సంబంధములో వారాయన తట్టు తిరిగిరి.

**2. సమరయులు మార్పుజెందుట :** సమరయలో మార్పుజెందిన ప్రజలు సువార్తను వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి. వారు మార్పుజెందిన విధానమును లూకా ఇట్లు వ్రాసెను: "అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణము వరకును వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. జన సమూహములు విని ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటల యందు ఏక మనస్సుతో లక్ష్యముంచిరి........ అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 8:5–6,13).

**3. నపుంసకుని మార్పు :** ఐతియోపీయకు జెందిన ఈ అధికారి సువార్తను వినెను, విశ్వసించెను, యేసు దేవుని కుమారుడని తన విశ్వాసమును ఒప్పుకొనెను. బాప్తిస్మము పొందెను. అతడు మార్పుజెందిన సందర్భములో చివర భాగము ఇట్లున్నది : "అందుకు ఫిలిప్పు నోరు తెరచి ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొకచోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి, రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను" (అపొ.కా. 8:35–39).

ఫిలిప్పు బోధించగా యేసునందు విశ్వాసముంచవలెనని ఈ నపుంసకుడు గ్రహించుకొనెను. అది మార్పుజెందుటలో మొదటి మెట్టు. ఈ విశ్వాసమును బట్టియే మార్పుజెందుటలో ఆఖరి మెట్టయిన బాప్తిస్మమును అతడు కోరెను.

**4. తార్సువాడైన సౌలు మార్పు :** అపొస్తలుల కార్యములలో వ్రాయబడిన ఆశ్చర్యకరమైన మార్పులలో తార్సువాడయిన సౌలు మార్పుజెందుట ఒకటి (అపొ.కా. 9:1–23; 22:16; 26:9–18). సౌలు దమస్కునకు పోవు మార్గమున ప్రయాణించు చుండగా యేసు అతనికి కనబడి ఆయనే క్రీస్తని సౌలును నమ్మించెను. అతడు పట్టణములోనికి వెళ్ళవలెనని అతడేమి చేయవలెనో అది అతనికి అక్కడ తెలియజేయ బడునని యేసు అతనితో చెప్పెను. నీవు హింసించుచున్న యేసును నేనే అని యేసు అతనికి తెలియజేయగా మార్గములోనే యేసే రక్షకుడని సౌలుకు దృఢ నమ్మకము కలిగెను (ఇది మార్పుజెందుటలో మొదటి మెట్టు). దీని తరువాత అతడు దమస్కులో చింతాక్రాంతుడై మూడు దినములు ప్రార్థనలో గడిపెను. దీనివలన అతడు మారుమనస్సు పొందినట్లు వ్యక్తపరచెను. అతడిప్పుడు ఆఖరిమెట్టును అనగా బాప్తిస్మమును పొందవలెను. అతడేమి చేయవలెనో తెలియజేయుటకు అననీయ సౌలునొద్దకు పంపబడెను. అననీయ ఇట్లనెను : “గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము” (అపొ.కా. 22:16).

ప్రార్థన ఒక్కటి మాత్రమే యెవరినైన రక్షించగల్గిన యెడల అది సౌలును ఎందుకు రక్షించలేకపోయెను ? జవాబేమంటే : పాపక్షమాపణ నొందుటకు పాపియైనవాడు ప్రార్థన చేయవలెనని ఎన్నడు ఆజ్ఞాపింపబడనే లేదు గనుక బాప్తిస్మమునకు బదులు ప్రార్థన పనికిరాదు.

కొందరనుకొనుచున్న రీతిగా అననీయను కలసికొనక ముందే సౌలు రక్షించబడిన యెడల, అతని పాపములు క్షమించబడక ముందే అతడు రక్షించబడెనన్న మాట! అతడు అననీయను కలసికొనకముందు అతని పాపములు క్షమించబడలేదు. సౌలు అక్కడ రక్షించబడిన యెడల అది అతనికి తెలియదు దానిని గూర్చి యేసుకు కూడ తెలియదు. అంతేకాదు

ఆ సంగతి అననీయకు కూడ తెలియదు. అతడు నిజంగా రక్షించబడితే, మార్పుజెందిన వారందరిలోను దౌర్భాగ్యుడుగా అగుపడెను. ఏలయనగా దమస్కు రోడ్డు మీద జరిగిన సంఘటన నుండి అతడు అననీయను కలసికొను వరకు యున్న మూడు రోజులలో అతడు అన్న పానములేమియు పుచ్చుకొనలేదు. బాప్తిస్మము ద్వారా పాపములు కడుగవేయబడునని బైబిలు బోధించుచున్నందున సౌలు తన పాపములు కడిగి వేయబడక ముందే రక్షింపబడలేదు (అపొ.కా. 22:16).

**5. కొర్నేలి మార్పు :** అన్యజనులలో నుండి క్రైస్తవుడుగా మారిన మొదటివాడు కొర్నేలీ (అపొ.కా. 10; 11:1-18). అతడు తన యింటి వారందరితో కూడ దేవుని యందు భయభక్తులు గలవాడైయుండి ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థన చేయువాడని వర్ణించబడెను. అయితే కొర్నేలివంటివాడు మార్పుజెందవలసిన అవసర మేమున్నది? యని కొందరు అడుగుదురు. దానికి జవాబేమంటే, అతడింకను పాపియైయుండెను! క్రీస్తు తట్టు తిరుగుటకు అవుసరమైన మూడు ప్రాథమిక మార్పులు అతడు అనుభవించలేదు. కొర్నేలీకి ఒక దూత కనబడి నీవు పేతురును పిలిపించుము నీవును నీ యింటి వారందరును ఏ మాటల వలన రక్షణ పొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పునని తెలియజేసెను (అపొ.కా. 11:14). కొర్నేలీఅపొస్తలులు బోధించగా మార్పుజెందిన వారందరు ఒకే రీతిగే క్రీస్తునందు విశ్వసించి, క్రీస్తే ప్రభువని ఒప్పుకొని , ప్రార్థన చేయుచు మూడు దినములు గడిపిన తరువాత అననీయ అతనిని కలసికొనెను. దమస్కు రోడ్డుమీదనే సౌలు రక్షించబడలేదు. రక్షించబడలేదని యిది నిరూపించుచున్నది. యేసేక్రీస్తని పేతురు బోధించిన తరువాత అతడును, అతని యింటివారును యేసుక్రీస్తు నామమందు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను (అపొ.కా. 10:48).

**6. లూదియ మార్పు :** అట్లే లూదియ, ఆమె యింటివారు పౌలు ద్వారా సువార్తను వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:14-15).

**7. చెరసాల అధిపతి మార్పు :** అలాగే ఫిలిప్పుయి చెరసాల అధిపతియు అతని యింటివారును వాక్యము వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి. రాత్రివేళ మహా భూకంపము కలిగిన తరువాత "అతడు దీపము తెమ్మనిచెప్పి లోపలికి వచ్చి, వణకుచు పౌలుకును సీలకును సాగిలపడి వారిని వెలుపలికి తీసుకొని వచ్చి, అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెననెను. అందుకు వారు ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును, నీయింటి వారును రక్షణ పొందుదురని చెప్పి అతనికిని అతని ఇంటనున్న వారందరికినీ దేవుని వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసుకొనివచ్చి వారి గాయములు కడిగెను వెంటనే అతడును అతని ఇంటి వారందరును బాప్తిస్మము పొందిరి. మరియు అతడు వారిని ఇంటికి తోడుకొని వచ్చి భోజనము పెట్టి దేవునియందు విశ్వాసముంచినవాడై తన ఇంటి వారందరితో కూడ ఆనందించెను" (అపొ,కా. 16:29-34).

**8. కొరింథీయుల మార్పు :** కొరింథు పట్టణములో పౌలు క్రీస్తును ప్రకటించెను. "కొరింథీయులలో అనేకులు విని, విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:1-8).

అపొస్తలుల కార్యములు అను పుస్తకము ప్రభువు యొక్క క్షమాపణచట్టమును అతి విశదముగ విపులీకరించుచున్నది. అపొస్తలులు బోధించగా మార్పుజేందిన వారందరు ఒకేరీతిగ మార్పుజెందిరి. ప్రతివాని యొక్క మార్పు దేవుని వాక్యము వలన కలిగెను.

ఆ మార్పు వాక్యము బోధించుటతో ఆరంభమై బాప్తిస్మమిచ్చుటతో

అంతమాయెను. వారు సువార్తను వినిరి, విశ్వసించిరి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందిరి. మరియు వారి విశ్వాసమును ఒప్పుకొనగా బాప్తిస్మము పొందిరి. ఈ విధానము ఎంత సూక్ష్మముగా యున్నదో గమనించుము. ఆధునిక విధానములకు ఎంత వ్యత్యాసముగ యున్నదో గమనించుము.

క్షమాపణననుగ్రహించు షరతులు మార్చబడలేనందున క్రీస్తువైపు మార్పు జెందినవారు ఆనాడు ఏమేమి చేసిరో వాటినే పాపులు కూడ చేయవలెను.

ఒక ఉజ్జీవ కూటములో, వందలకొలది ప్రజలు మార్పు జెందుటను గూర్చి మనము వింటూయుంటాము. అయితే నిజానికి అనేక సందర్భములలో వారిలో ఏ ఒక్కడును క్రొత్తనిబంధన షరతుల ప్రకారము మార్పుజెందియుండ లేదు. అపొస్తలులు చేసిన వాక్య బోధవైపు ప్రజలు మరలవలసి యున్నది. క్రీస్తు సువార్త రక్షణ అందరికి ఒకే రీతిగ యిచ్చుచున్నది గాని రక్షణ షరతులు మాత్రము ప్రత్యేకమైనవి. ఈ షరతులకు లోబడిన యెడల మార్పు సంభవించును. ఒకని దేవుని బిడ్డగాను, క్రీస్తు సంఘ సభ్యునిగాను చేయును. అపొస్తలుల కాలములో ఏది క్రైస్తవునిగా చేసెనో అదే ఈ నాడు కూడ ఒకని క్రైస్తవునిగా జేయును.

అందువలన సువార్తకు లోబడుట వలన మార్పుసంభవించును. ఏలయనగా సువార్తలో ఒకడు క్రీస్తునందు విశ్వసించవలెననియు, పాపములన్నిటి విషయమై మారుమనస్సు పొందవలెననియు క్రీస్తునందలి తన విశ్వాసమును ఒప్పుకొనిన తరువాత యేసుప్రభువు నామమున అతడు నీటిలో ముంచడము బొందవలెననియు ఆజ్ఞాపించబడెను. ఒకడు ప్రభువు తట్టు సంపూర్ణముగ తిరగవలెననిన ఈ ఆజ్ఞలన్నిటికి అతడు విధేయుడుకావలెను. ఈ దైవక్రమమును జరిగించకుండ అభ్యంతర పడువాడు క్రీస్తు కొరకు నిజముగ మార్పుజెందిన వాడు కాదు.

## 6. భక్తిగల ప్రజలు మార్పుజెందుట అవుసరమా?

ఒకడు యధార్థముగను భక్తిగలవానిగను ఉన్నయెడల అతడు దేవునిచే అంగీకరింపబడునని అనేకులు తలంచెదరు. అయితే అపొస్తలుల కార్యములలో మార్పుజెందిన వారిలో అనేకులు నిష్కపటులు, భక్తిగలవారుండిరి. ప్రభువు తట్టు తిరిగిన భక్తిగల వారిలో కొందరిని గూర్చి ఈ దిగువ చూచు కొందము :

**1. పెంతెకొస్తు దినమున యూదులు :** వారు భక్తిగలయూదులు, క్రైస్తవ్యము లోనికి మొట్టమొదటిగా మారినవారు.'ఆకాశము క్రిందనుండి వచ్చిన భక్తిగల యూదులు''(అపొ.కా. 2:5). ఆ కాలమందు జరుగుఆరాధనకు వారుయెరూషలేములో సమకూడిరి. వారు భక్తిగలవారే అయినను వారు మార్పుజెంద వలసి వచ్చినది.

**2. ఐతియొపీయ మనుష్యుడు :** రక్షణ అవుసరమైన మరియొక భక్తిగల పురుషుడితడు (అపొ.కా. 8:26-39). అతడు ఆఫ్రికాలో యున్న ఐతియొపీయ నుండి యెరూషలేమునకుఆరాధనకు వచ్చి వెళ్ళుచుండెను గనుక అతడు చాల భక్తిపరుడే యని అర్ధమగుచున్నది. అతడు తన గృహమునకు తిరిగి వెళ్లుచు తన మతము యొక్క పరిశుద్ధ లేఖనములను చదువుచుండెను. ఫిలిప్పు అతని యొద్దకు రాగా యెషయా వ్రాసిన ప్రవచనముల నతడుఅర్ధము చేసికొనుటకు సహాయకారిగ యుండు నిమిత్తము ఫిలిప్పును అతడు తన రథములోనికి ఆహ్వానించెను. ఈ మనుష్యుడు భక్తిపరుడు, మత సంబంధ విషయములలో యధార్దవర్తనుడు. అది చాల మంచి సంగతి.నిన్ను నీవు ఈ ప్రశ్న వేసికో : "నేననుసరించు చున్న భక్తిమార్గము దేవుని చిత్తమునకు భిన్నముగా యున్నదని గ్రహించిన యెడల ఈ అధికారివలె దానిని విసర్జించగలనా?"

**3. సౌలు :** తార్సువాడైన సౌలుచాల భక్తిపరుడు (అపొ.కా. 23:1;

24:16; 1తిమో 1:12–16). భక్తిపరుడే అయినను అతడు మార్పుజెంద వలసియున్నదని క్రొత్తనిబంధన మనకు తెలియజేయు మరియొక మాదిరి అది (అపో.కా. 9:1–12). అతడు మనస్సాక్షి గలవాడే అయినను అతడు చేయునది తప్పు. నేను సరిగానే యున్నానని ఒకడు తలంచినంత మాత్రమున ఎవడును సరికాడు. అతడు మంచినే చేయవలెనని అతని మనస్సాక్షి అతనికి తెలియజేయవచ్చును గాని ఏది మంచిదో అది తెలియజేయదు. దేవుని వాక్యము దానిని బోధించును.

**4. కొర్నేలీ :** అపొస్తలుల కార్యములను పుస్తకములో కొర్నేలీని మించిన యధార్ధవర్తనుడు, భక్తిపరుడు ఇంకొకడు మనకగుపడడు. ఒకడు మంచివాడైనంత మాత్రమున రక్షింపబడడు. . ఈ నాడు నైతికముగా మంచివారైన ప్రజలనేకులు క్రీస్తునకు వెలుపలయున్నారు. కొర్నేలీవలె వారు కూడ లేఖనముల ప్రకారము మార్పుజెందుట అవుసరము (అపో.కా. 10:1,2).

అపొస్తలుల కార్యములను పుస్తకములో వ్రాయబడిన ఆజ్ఞలకు లోబడని భక్తిపరులందరు క్రీస్తువైపు నిజముగా మార్పుజెందిన వారు కారు. వారు క్షమించబడు నిమిత్తము పైన జెప్పబడిన మెట్టులను అనుసరింపవలెను.

## 7. సంగ్రహము

మార్పు అనునది సూక్ష్మమైనది, అర్థము చేసికొనదగినదే గాని అనేకులు తలంచురీతిగ విపులముగా లేని మర్మయుక్తమైనది కాదని బైబిలు బోధించుచున్నది. లేఖనముల ప్రకారము జరిగిన ప్రతి మార్పులోను మూడు ప్రత్యేక మార్పులున్నవని బైబిలు బోధించుచున్నది. అవేవన హృదయమార్పు, చిత్తమార్పు, మారుమనస్సు వలన తన జీవితములో మార్పు, బాప్తిస్మము వలన తన సంబంధములో మార్పు ఎప్పుడు

సంభవించునో అప్పుడతడు సంపూర్ణముగా మారినవాడగును. ఇట్టి మార్పును పొందిన వారందరిని క్షమింతునని ప్రభువు వాగ్ధానము చేసెను. ఈ విధముగా మారిన వ్యక్తి ఐతియోపీయ అధికారివలె సంతోషించును. ఏలయనగా దేవుని వాగ్దానము వలన అతని పాపములు క్షమింపబడియున్నవనినిర్ధారణ చేయబడెను. యధార్ధముగా మార్పునొందిన వారందరు మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్యరక్షణను పొందుదురు.

✤

# ౨. క్రొత్తజన్మ
## (The New Birth)

యేసుక్రీస్తు బహిరంగ సువార్త సేవచేయు మొదటి దినములలో దేవుని రాజ్యమును గూర్చి ఇంకా ఎక్కువ తెలిసికొను నిమిత్తము నీకొదేము అను పేరు గల మనుష్యుడొకడు రాత్రివేళ ఆయన యొద్దకు వచ్చెను. అతడు యేసునొద్దకు రాత్రివేళ ఎందుకు వచ్చెనో బైబిలు చెప్పుటలేదు. గనుక దానిని గూర్చి యెవనికి తెలియదు. అతడొక పరిసయ్యుడు, యూదుల నాయకుడు, ఇశ్రాయేలీయుల ఉన్నత న్యాయస్థానమైన సమాజ మందిరములో ఒక సభ్యుడు, అంతేగాక అతడు నిష్కపటుడు. సత్యమును గూర్చిన ఆసక్తిగలవాడు (యోహాను 7:50-52; 19:39). ఇవి హర్షించదగిన గుణములు. క్రీస్తు చేయుచున్న అద్భుతములు ఆయన దేవుని నుండి వచ్చిన వాడని రుజువు చేయుచున్నట్లు అతడు గుర్తించెను. దేవునిచేత పంపబడినవాడే అట్టి క్రియలు చేయగలడని అతడు ఒప్పుకొనెను. దేవుని చిత్తమును సరియైన చోటు నుండి అనగా యేసుక్రీస్తునుండి అతడు తెలిసికొన గోరెను.

అతడు యేసునొద్దకు వచ్చి "బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము. దేవుడతనికి తోడై యుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడునుచేయలేడని" చెప్పుచు తన సంభాషణను ఆరంభించగా యేసు అతని హృదయతలంపుల నెరిగి యుండెను (యోహాను 3:2). ఈ శ్లాఘనమును యేసు లెక్కచేయక ఒకడు పరలోకరాజ్య పౌరుడెట్లు కాగలడో దానిని గూర్చి అతనికి బోధింప నారంభించెను: "అందుకు యేసు అతనితో – ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:3).

యేసు మాటలు నీకొదేమును కలవర పెట్టెను. వయస్సు వచ్చిన మానవుడు మరల భౌతిక జన్మనెట్లు పొందగలడో అతడు గ్రహించుకొనలేక పోయెను. "అందుకు నీకొదేము, ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవమారు తల్లిగర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయన నడిగెను" (యోహాను 3:4).

యేసు యిట్లు వివరించెను : "ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3:5). నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జరుగు జన్మ ఒక్కటే కాని రెండు జన్మలు కాదు. ఆ ఒకే క్రొత్తజన్మ లో నీరు, ఆత్మ ఈ రెండును అవుసరమై యున్నవి. క్రొత్తజన్మ అనగా భౌతిక జన్మ కాదు. నీకొదేము రెండవ సారి భౌతికముగా జన్మించగలిగినను యేసుయొక్క మనస్సులో యున్న జన్మ అది కాదు. క్రొత్త జన్మ యొక్క అవుసరతను గూర్చి క్రీస్తు మొదట నీకొదేముకు తెలియజేసెను  తరువాత దానిలో ఏమేమి యున్నదో అతనికి చెప్పెను. దేవుని రాజ్యపౌరులు కావలెనంటే క్రొత్తజన్మ అత్యవుసరమని యేసు చెప్పెను. మనుష్యుల ఆలోచనలను ఎక్కువ ఆకర్షించి నట్టి బహు ప్రాముఖ్య అంశము యిది. "క్రొత్తగా జన్మించుట" యేమిటో అందరు అర్థము చేసికొనవలసిన ప్రాముఖ్యత ఇందులో యున్నది. అయితే తిరిగి జన్మించుట అనగా యేమిటి? దానిలో యేమి ఇమిడి యున్నది?

ఇది గ్రహించుకొన లేనట్టియు, వివరింపబడ లెనటియు అంశమని అనేకులు తలంచిరి.  ఒకడు రక్షింపబడవలెనంటే అతడు అర్థము చేసికొనవలసినది దేవుని వాక్యములో విపులముగ బయలు పరచబడెనని మనము మనస్సు నందుంచుకొనవలెను. గనుక ఈ అంశమును గూర్చి చెప్పుచున్న వచనములన్నిటిని సంగ్రహించి, క్రొత్త జన్మ యొక్క సంపూర్ణ భావమును అందరు తెలిసికొనవలెను.

# 1. దేవునిరాజ్యము యొక్క రీతి

దేవుని రాజ్యమనగా తాను త్వరలో స్థాపింపబోవుచున్న ఆత్మీయ సంస్థయగు సంఘమని క్రీస్తు యొక్క ఉద్దేశ్యము (మత్తయి 16:13-19 హెబ్రీ 12:22, 23,28. దేవుని రాజ్యమును చూచుట యనగా దానిలోని ఆశీర్వాదముల ననుభవించుటయని అర్ధము. దానిలో ప్రవేశింపవలెనన్న అందరు క్రొత్తగా జన్మించవలెను.

భూ సంబంధమైన రాజ్యమొక్కటి స్థాపింపబడునని యూదులు ఎదురు చూచుచుండిరి. నిజానికి నీకొదేము యొక్క మనస్సులో యున్నది కూడ అదే. కాని ప్రభువతని భావములను సరిదిద్దెను. పాతనిబంధన ప్రకారము యూదులందరు, మంచి వారేమి, చెడ్డవారేమి వారి భౌతిక జన్మను బట్టి ఇశ్రాయేలు రాజ్యసభ్యులుగ చేయబడిరి.

ఒక క్రొత్త రాజ్యమును, క్రొత్త నిబంధనను స్థాపించునట్లు క్రీస్తును దేవుడు పంపెను. ఈరాజ్యములో దీవెనలనను భవించవలెనంటే నీకొదేము తిరిగి జన్మించవలెను (మత్తయి 3:7-9; యిర్మియా 31:31-33; హెబ్రీ 8:8-12 లను చూడుము). క్రీస్తురాజ్యము ఆత్మీయమైనది గనుక దానిలో ప్రవేశించుటకు వేరొక జన్మ అవుసరమాయెను. దేవుని బిడ్డ కావలెనంటే ఆత్మీయ జన్మ అవుసరమని యేసు చెప్పెను. ఇంకొక రీతిగ యేసు నీకొదేముకు, నీకొదేము ఈ సూచక క్రియలన్నియు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి గాని నీవొక యూదుడవు. ఆధిక్యత గల పురుషుడవు గనుక నా రాజ్యము స్థాపించబడినపుడు దానిలో ఒక స్థానము తప్పక నీకు రావలసినదని నీవనుకొనుచున్న యెడల నీవు తప్పుగా భావించు చున్నావు. నేను స్థాపించబోవు రాజ్యము భూసంబంధమైనది కాదు. నీవు తిరిగి జన్మించవలసియున్నది. యూదునిగా నీకున్న జన్మ హక్కువలన దాని సభ్యత్వము నీకు దొరుకదు. భౌతికముగా జన్మించినందున

ఇశ్రాయేలు రాజ్యములో నీవు సభ్యుడవైతివి నిజమే గాని దేవుని రాజ్యములో నీవు ప్రవేశింపవలెనన్న క్రొత్తజన్మ నీకవుసరమైయున్నదని చెప్పెను.

ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని నిజముగా ఆ రాజ్యములో ప్రవేశింపనేరడు. ఆ రాజ్యములోని దీవెనలననుభవించు నిమిత్తము అందరు క్రొత్తజన్మ అను ఈ గొప్ప మార్పును అనుభవించ వలసినదే.

## 2. క్రొత్తజన్మ – రాజ్యములోనికి ద్వారము

ఒకడు క్రైస్తవుడగు విధానములో "క్రొత్తజన్మ" అవుసరమని క్రీస్తు చెప్పెను. ఏలయనగా భౌతిక జన్మకు ఆత్మీయ జన్మకు కొన్ని విషయములలో పోలిక కలదు. గాని ఈ రెండును అనన్యమైనవి కావు. తండ్రియొక్క బీజము వలన ఒక శిశువు జన్మించినప్పుడు అతడు ఒక క్రొత్త భౌతిక వాతావరణములో క్రొత్తజీవితములో ప్రవేశించును. అతడొక స్థితినుండి వేరొక స్థితిలోనికి మారును. అదే రీతిగా ఒకడు క్రైస్తవుడైనప్పుడు అతడు ఆత్మీయ జనన మొందును. అతడుపాపపు స్థితినుండి ఆత్మీయ స్థితిలోనికి మారును అతడొక క్రొత్త వాతావరణములోనికి, అనగా దేవునిరాజ్యము లోనికి ప్రవేశించును.

భౌతిక జన్మకు దీనికి గల సమానాంతరములవలన క్రైస్తవుడగు విధానము ఒక ఆత్మీయజన్మయనియు లేక క్రొత్త జన్మయనియు పిలువబడెను. ఒకడు క్రైస్తవుడైనప్పుడు, దేవుని బిడ్డగా మారినప్పుడు అతడీ క్రొత్తజన్మ నొందును. లేఖనములలో పైనుండి కలిగిన ఈ జన్మ "మార్పు" Conversion అనియు ప్రభువులో చేర్చబడుట యనియు పిలువ బడినది (మత్తయి 18:3; అపొ.కా. 15:3; 11,24; 5:14; 2:41,47). ఈ క్రొత్తజన్మ ఒక ఆత్మీయమార్పు, ఒక ఆత్మీయ రాజ్యములోనికి కలిగిన ఒక ఆత్మీయ జన్మ.

## 3. నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను, జన్మించుట - నిర్వచనము

దేవుని రాజ్యములో ప్రవేశించుటకు క్రొత్తజన్మ అవుసరము గనుక, "నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించుట" యని క్రీస్తు చెప్పిన భావమును ఇప్పుడు గమనించుము.

ఆత్మీయ జన్మకు రెండు సంగతులు అవుసరము 1) జనింపజేయ బడుట 2) జననమిచ్చుట. ఈ ఆత్మీయ జననమును బట్టి ఒకడు క్రైస్తవు డగును. దేవుని రాజ్యములో ప్రవేశించును.

1. తిరిగి జన్మించవలెనన్న పరిశుద్ధాత్ముని ద్వారా దేవునిచే జనింపజేయబడవలెను.మొదట జనింపజేయబడకుండ ఆత్మీయముగా గాని భౌతికముగా గాని జీవము ఉద్భవించుట సంభవించదు గనుక, దేవుడు క్రైస్తవులందరికి వారి ఆత్మీయ తండ్రియగుటచేతను, ఒకడు దేవునిచే జనింపజేయబడిన వాడని చెప్పబడెను (మత్తయి 6:9; రోమా 1:7; 1యోహాను 3:1,2). "యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టియున్నాడు" (1యోహాను 4:1).

ఒకడు దేవుని వాక్యము వలన పుట్టింపబడియున్నాడు. ఈ దిగువ వచనములు తండ్రి వలన ఒకడు ఏలాగు పుట్టింపబడియున్నాడో తెలియజేయును. "సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము ఆయన కనెను" (యాకోబు 1:18). "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11). "మీరు క్షయ బీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడిన వారు... మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" (1పేతురు 1:13,25).

గనుక దేవుడు సత్యవాక్యము వలన జనింపజేయును. ఆత్మీయ జీవము సువార్త సాధనము ద్వారా ప్రసారము జేయబడును. బీజము

సజీవము గల విత్తనము. ఆత్మోద్రేకము గలవారి ద్వారా పరిశుద్ధాత్ముడు మానవునికి సువార్తననుగ్రహించెను (1పేతురు 1:22; 2పేతురు1:21). పరిశుద్ధాత్ముడు  అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించునని యేసు వాగ్దానము చేసెను(యోహాను 16:13). ఆయన వారిమీదికి వచ్చినప్పుడు ఆత్మవారికి వాక్‌శక్తి ననుగ్రహించిన కొలది మాటలాడిరి (అపొ.కా. 2:4). నేడు ఆత్మావేశముచే వ్రాయబడిన గ్రంథము క్రొత్తనిబంధన, దానిలో సువార్త వాక్యమున్నది. గనుక ఒకడు సువార్తను నమ్ముట వలన వాక్యము వలన తండ్రిచే పుట్టింపబడిన వాడగును. అట్టివాడు ఆత్మ మూలముగా జన్మించిన వాడని చెప్పవచ్చును కూడా. సువార్త ద్వారా వాక్యమును ఒకని హృదయములో నాటుట ద్వారా ఆత్మ జనింపజేయుటలో వాక్యము ద్వారా దేవుడు, ఆత్మయు కూడ దైవిక జీవమును ప్రసాదించుట జరుగును.

ఆత్మీయ బీజమైన సువార్త జనింపజేయు సాధనమై యుండగా ఈ సాధనమును వినియోగించుటకు దేవుడు మానవులనుపయోగించును. పౌలు కొరింథీయులకు "క్రీస్తు యేసునందు సువార్త ద్వారా నేను మిమ్ములను కంటిని" యని తెలియజేసెను. (1కొరింథీ 4:16). దేవుడు పౌలు ద్వారా వాక్యమను సాధనము వలన కొరింథీయులను కనెను. ఏలయనగా అక్షయమగు విత్తనమును పౌలు ప్రజల హృదయములలో నాటగా వారు దానిని విశ్వసించిరి: దేవుని వలన జనింపజేయబడిరి. ఏలయనగా అతడు నాటిన విత్తనము దేవునిది. సువార్త బోధించుటలో పౌలు దేవుని పనివాడు గనుక పౌలు వారిని కనెను. గనుక నేను మిమ్మును విశ్వాసులుగా చేసితినని పౌలు వారికి చెప్పెను (ఫిలేమోను 1:10). గనుక ఈ జనింపజేయు క్రియలేఖనములలో దేవునికి, పరిశుద్ధాత్మునికి కొన్నిసార్లు సువార్తకునికి వర్తించునట్లు చెప్పబడెను (1యోహాను 5:1; 3:8; 1కొరింథీ 4:15). గనుక బైబిలులో దేవునిచే పుట్టింపబడిన వారు, ఆత్మ మూలముగ జన్మించిన వారు అను పదములు కనబడును. ఇవన్నియు ఒకే జన్మకు

సంబంధించినవి. ఒకడు ముందు దేవునిచేత తరువాత ఆత్మచేత అటు తరువాత వాక్యము ద్వారా పుట్టింపబడడు. అందుచేత ప్రజలలో ఆత్మీయ జీవము ఉండనేరదు. వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు జనింపజేయును.

ఒకడు విశ్వసించునప్పుడు జనింపజేయబడును. దేవుని వాక్యమును వినుటవలన విశ్వాసము కల్గును (రోమా 10:17). విశ్వాసముంచినవాడు జనింపజేయబడినవాడు గనుక దేవుడు పుట్టించు విధానమిది. పరిశుద్ధ లేఖనములగు వాక్యము వలన హృదయములో విశ్వాసము కలుగును. ప్రజలకు దేవుని వాక్యము బోధింపబడినపుడు వారు దాని విశ్వసించిన యెడల వారు దేవుని మూలముగా పుట్టినవారగుదురు.

జనింప జేయబడుట క్రొత్తజన్మలో ఒక భాగమై యున్నది. జనింప జేయబడుట ఒక్కటి మాత్రమే భౌతిక జన్మయెట్లు కాదో అట్లే క్రొత్తజన్మ కూడాను. ఒకడు తల్లి గర్భమందు పడగా జన్మించిన వాడెట్లు కాలేడో అట్లే విశ్వాసి ఆత్మీయముగా జనింపజేయబడినప్పుడు దేవుని కుటుంబము లోనికి జన్మింపవచ్చును లేదా తిరిగి జన్మించుటకతడు తిరస్కరించవచ్చును. (ఈ విషయములో భౌతిక అత్మీయ జన్మలకు తేడా కలదు. భౌతిక జన్మలో ఒకడు తిరస్కరించే అవకాశము లేనేలేదు). ఒకడు విశ్వసించినపుడు అనగా ఆత్మీయముగా జనించినపుడు అతడు దేవుని కుమారుడయ్యే తరుణమును కలిగియున్నాడు. “ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు. తన్ను ఎందరంగీక రించిరో వారందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవుని వలన పుట్టినవారే గాని, రక్తము వలనైనను శరీరేచ్ఛవలనైనను మానుషేచ్ఛ వలనైనను పుట్టినవారు కారు (యోహాను 1:11-13).

దేవుని పిల్లలగుటకు అధికారము కలవారు దేవుని పిల్లలు అప్పుడే కాలేరను సంగతి అందరికి గోచరమే. గనుక మనుష్యుడు విశ్వాస

మూలమున మాత్రమే రక్షింపబడజాలడు(యాకోబు 2:24; యోహాను 12:42,43).

పుట్టుటకు ముందు పుట్టించుట అన్ని సందర్భములలో జరిగినను ఒకడు గర్భములో పడినను (జనింపజేయబడినను)జీవించక పోవచ్చును. గర్భములో పడిన తరువాత జననమిచ్చుట జరుగవలెను. గనుక ఒకడు ఆయన నామమందు విశ్వసించిన మాత్రముననే అతడు దేవుని కుమారుడు కాడు. శరీర మూలముగా జన్మించినది, ఆత్మ మూలముగా జన్మించినది, యను పదములను అందుకే నీకొదేముతో మాట్లాడుచు యేసు గర్భమందు పడినది మొదలుకొని జననమయ్యే వరకు గల సందర్భములను వివరించుటకు చెప్పెను, గనుక ప్రతి క్రొత్తజన్మలోను మొదట జనింప జేయుట అటు తారువాత జన్మమిచ్చుట సంభవించును.

**2. క్రొత్తగా జన్మించుట :** నీటిమూలముగా జన్మించవలెను. నీటిమూలముగా జన్మించుట యనగా బాప్తిస్మము పొందుట : దేవుని రాజ్యములో ప్రవేశించే విధానము ఒక జన్మగా పోల్చబడినను ఇందులో నీరు, ఆత్మయనునవి అలంకారరీతిగా వినియోగించబడలేదు. నీరు ఆత్మయనునవి వాటి భావమును తెలుపు పదములుగా అనగా నీరు, ఆత్మయనియే వినియోగింపబడెను: ప్రభువు నీరు, ఆత్మయను పదముల నుపయోగించినప్పుడు వాటి భావమును నీకొదేము గ్రహించుకొనలేదను సూచనలేమియు వారి సంభాషణలో లేవు. బాప్తిస్మమును గూర్చిన అసత్య బోధ ఇప్పుడు ఎక్కువగా యున్నందున తప్ప యోహాను 3:5ను చదివి అక్కడ క్రీస్తు నీరు, ఆత్మలను గూర్చియే చెప్పెనను సంగతిని యెవరు కాదనలేరు. నీరు అను మాట యోహాను 3:23లో వినియోగింపబడెను. నీరననగా నీరు అనియే దాని భావము, అయితే యోహాను 3:5లో నీరు అను పదము యొక్క భావము నీరు కాదని కొందరు చెప్పుదురు.

నీరు అనగా ఆత్మయని కొందరు చెప్పుదురు. అట్లయిన ఆ వచనము

ఇట్లుండవలెను: “ఒకడు ఆత్మ మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు''. ఇది బహువిపరీతమైనది : నీరు ఆత్మలయొక్క భావము ఒక్కటే అయితే క్రీస్తు ఆ మాటలను అనవుసరముగా వల్లించునా? నీరు దేవుని వాక్యమునకు గురుతుగా యున్నదని కొందరు చెప్పుదురు. అట్లయితే అది ఎఫెసీ 5:27కు విరుద్ధముగా యున్నది. అక్కడ సంఘము “వాక్యముతో లేక వాక్యము వలన జరిగిన ఉదక స్నానమైన యెడల అవి రెండును ఒక్కటే కాజాలవు. యోహాను 4:10 యోహాను 7:38లో యున్న రీతిగ అది జీవజలమని చెప్పుటకు కొందరు ప్రయత్నింతురు. ఈ భావమును ప్రకటన 22:17 తిరస్కరించుచున్నది. జీవజలము అను మాటకు తిరిగి జన్మించిన వారనుభవించు క్రీస్తునందలి ఆత్మీయాశీర్వాదములని అర్ధము. ఏ వచనములో నైన నీరు లేక జలము అను పదము అలంకార రీతిగ వినియోగించ బడినప్పుడు దానిని వర్ణించు పదము కూడ ఉపయోగింప బడెను. యేసు నీకొదేముతో ఒకడు జీవపు నీటిమూలముగా జన్మించ వలెనని చెప్పలేదు గాని ఆయన సూక్ష్మముగా నీటిమూలముగా జన్మించ వలెనని చెప్పెను.

నీటిమూలముగా జన్మించుట యనగా అది భౌతిక జన్మను ఆత్మమూలముగా జన్మించుట యనగా అది క్రొత్తజన్మను సూచించుచున్నవి యని సాధారణముగ కొందరు బోధింతురు. యేసు యొక్క మాటలతో ఈ సిద్ధాంతము ఏకీభవించుటలేదు. “ఒక శిశువు నీటిమూలముగాను, ఒక మనుష్యుడు ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు” అని క్రీస్తు చెప్పలేదు. “ఒకడు (ఒక మనుష్యుడు) నీటి మూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని” అయన చెప్పెను. భౌతిక జన్మ యోహాను 3:5లో చెప్పబడిన నీటి జన్మకాదు. నీకొదేము తన తల్లిదండ్రులకు జన్మించెను.

అది భౌతికజన్మ : కాని ఇప్పుడు అతడు తిరిగి జన్మించవలెనని అనగా భౌతికముగా కాదుగాని నీటిమూలముగాను ఆత్మమూలముగాను దేవుని రాజ్యములో పౌరుడగుటకు జన్మించవలెనని క్రీస్తు అతనికి చెప్పెను. ఒక శిశువు ఏలాగు జన్మించగలడని నీకొదేము అడుగులేదు గాని, ముసలివాడైన మనుష్యుడేలాడు జన్మింపగలడు ? అని యడిగెను. అతడు నీటి మూలముగాను, ఆత్మమూలము గాను జన్మింపగలడనునది దాని జవాబు.

యోహాను 3:5లో యేసు ఏమి ఉద్దేశించెనో నాకు తెలియదు గాని ఆయన నీటిని మాత్రము ఉద్దేశించలేదని కొందరు చెప్పుదురు. అయితే యిది వారికేలాగు తెలియును? బైబిలు నుండి మాత్రము కాదు.

కొందరికి నీరు నీరుగా ఎందుకు అర్ధము కాదంటే అది రక్షణ పొందుటకు బాప్తిస్మమును అత్యవసరముగా చేయుచున్నది. క్షమాపణ నొందుటకు బాప్తిస్మము అత్యవసరమైన దేవుని షరతు అని వారు నమ్ముటకు ఇష్టపడరు. అయితే ఇందులో నీరు అను పదమునుబట్టి క్రీస్తు బాప్తిస్మమును సూచించుట లేదని చెప్పు సిద్ధాంతమేదయినను అది తప్పుదారిని పట్టించుచున్నది. క్రీస్తుయొక్క ఆజ్ఞను బట్టి దేవుని రాజ్యములో యున్న దీవెనలు పొందు నిమిత్తము బాప్తిస్మము అత్యవసరముగా చేయబడినది.

యోహాను 3:5 లో 'నీటిమూలముగా' అను పదములు బాప్తిస్మమును సూచించుచున్నవని బైబిలు పండితులందరు అంగీకరించుచున్నారు. క్రీస్తునుండి జాన్‌కేల్విన్ వరకుయున్న లేఖకులందరు నీటిమూలముగా జన్మించుట యనగా బాప్తిస్మమని అంగీకరించినట్లు విల్లియంవాల్ అను అంగ్లికను సంఘ చరిత్రకారుడు తెలిపెను.

యోహాను 3:5 లో సూచించబడిన బాప్తిస్మమును కాదనకుండ చేయు ప్రయత్నములు ఆధునికమైనవి. ఈ మధ్యవరకు నీటిమూలముగా జన్మించుటయనగా బాప్తిస్మము పొందుటయని క్రైస్తవ లోకమంతయు అంగీకరించెను. అన్ని కాలములలోను యున్న అన్ని డినామినేషన్ల

పండితులందరు ఈ విషయమై ఏకీభావమును కలిగియున్నారని నిజముగా చెప్పవచ్చును. అయితే ఈ వాస్తవమును తొలగించు ప్రయత్నములన్నియు డినామినేషన్ల ద్వేషము చొప్పుననే ఉద్భవించెను. గనుక యోహాను 3:5లో చెప్పబడిన నీరు, నీటి బాప్తిస్మమునే సూచించుచున్నదనుటలో ఏ సందేహము లేదు. రక్షణార్థమై నీటిని ఉపయోగించు మత సంబంధమగు క్రియ బాప్తిస్మ మొక్కటే. క్రైస్తవ్యములో బాప్తిస్మములో తప్ప మరియే క్రియలోను నీరు ఎన్నడు వినియోగించబడలేదు.

బైబిలు ప్రకారము బాప్తిస్మములో ఒకడు నీటిలో సంపూర్తిగా ముంచ బడి దానిలో నుండి లేపబడును. అందువలనే యేసు బాప్తిస్మమును నీటి జన్మగానుదహరించెను. ప్రభువు సమాధిలో పాతిపెట్టబడి దానిలోనుండి తిరిగిలేచెను. అందువలనమృతులలో నుండి ప్రథమ ఫలముగా క్రీస్తు లేపబడెనని పౌలుచెప్పెను(కొలస్స 1:18 1 కొరింథీ 15:20). సమాధిలో నుండి లేచుటయనగా మృతులలో నుండి జన్మించుట అయినప్పుడు నీటిలో నుండి లేచుటయనగా నీటి మూలముగా జన్మించుట యగును. దేవుని రక్షణ సంకల్పములో నీటిమూలముగా జన్మించుట యనగా నీటిలో ముంచబడుటయే తప్ప వేరొకటి కాదు. బాప్తిస్మములో సమాధి పునరుత్థానములున్నవి. తద్వారా ఒకడు నీటిలో ముంచబడి దానిలోనుండి బయటకు తీయబడును. లేఖనములను ఇప్పుడు గమనించుము: “కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతి పెట్టబడితిమి” (రోమా6:4).

బాప్తిస్మములో ఒకడు సంపూర్తిగా ముంచబడునని కొలస్స 2:12లో మరింత విపులముగా యున్నది: “మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతి పెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని

ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి".

అందువలన నీటి మూలముగా జన్మించుట మరియు నీటిలో ముంచబడి నూతన జీవమును పొందినవారమై నడచుకొనునట్లు లేపబడుటయనునవి అనన్యముగా జన్మించుట అసాధ్యము. ఒకని నెత్తిమీద కొన్ని నీళ్ళు చిలకరింపబడి లేక కుమ్మరింనబడిన యెడల ఆ వ్యక్తి బాప్తిస్మము ద్వారా క్రీస్తుతో పాతిపెట్టబడియున్నానని నిజముగా చెప్పలేడు. పరిశుద్ధ లేఖనములలో ప్రభువు అధాకారము చొప్పున ఎన్నడయినను ఎందుచేత నయినను ఎవనిమీదనయినను నీరు ఒక్కటి మాత్రమే చిలకరింపబడలేదు. నీటిలో ముంచడము పొందనివాడు క్రొత్తగా జన్మించిన వాడుకాదు.

పరిశుద్ధాత్ముని హెచ్చరికల ననుసరించుట వలన ఒకడు ముంచ బడును. ఒకడు ఆత్మ యొక్క వర్తమానమును విని విశ్వసించిన తరువాత అతడు ఆత్మ యొక్క నడిపింపు చొప్పున బాప్తిస్మము పొందును: "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1కొరింథీ 12:13). విశ్వాసిని ఒక దశనుండి వేరొక దశకు మార్చుటకు బాప్తిస్మమును పరిశుద్ధాత్ముడు ఏర్పరచెను. ఆత్మయొక్క ఆజ్ఞలకు విధేయుడగుటలో ఒకడు నీటిమూలముగా జన్మించవలెను. గనుక ఆత్మమూలముగా జన్మించుటలో పరిశుద్ధముగా నూతన జీవిత సూత్రములలో మానవుని హృదయము పునరుత్పత్తి యగును. పాపప్రేమ విసర్జించబడును. అట్టి వ్యక్తి దేవునికి సంపూర్ణ విధేయత చూపుటకు నిశ్చయించు కొని మరలును. నీటిలో ముంచబడి పరిశుద్ధ జీవితమును జీవించుట కొరకు లేపబడును. ఈవిధముగా ప్రజలు ఆత్మ మూలముగా జన్మింతురు. ఆత్మ యొక్క నియమములను బట్టి క్రైస్తవులగుదురు (రోమా 8:2). ఈ పనియంతటిలోను కలుగు ప్రతి విధమైన మార్పు దేవుని ఆత్మవలన నడిపించబడును. ఆత్మీయ జన్మలో యున్న రెండు క్రియలలోను

అనగా జనింపజేయుట జన్మమిచ్చుటలోను పరిశుద్ధాత్ముడు దైవసాధనమై యున్నాడు. ఆత్మ తన పనిని సాధించుటలో వినయోగించు సాధనము లిఖింపబడిన దేవుని వాక్యము. అందువలన ఆయన ప్రభావము వలన తిరిగి జన్మించిన వాడు నిజానికి ఆత్మ మూలముగా జన్మించినవాడు.

ముందు గమనించిన రీతిగా జన్మ ఒక మార్పు: అది పరిస్థితిలోను సంబంధములోను కలుగు మార్పు. తత్ఫలితముగా ఒక క్రొత్త వాతావరణములో క్రొత్త జీవిత మేర్పడును. అందువలన క్రొత్తజన్మ ఒకని క్రొత్త స్థితిలోనికి, క్రొత్త వాతావరణములోనికి అనగా దేవుని రాజ్యములోనికి తెచ్చును. పౌలు ఇట్లనెను: "కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను. ఇదిగో సమస్తమును క్రొత్తవాయెను" (2కొరింథీ 5:17).

క్రీస్తులో నున్నవాడు నూతన సృష్టి గనుక అతడు క్రీస్తులో ప్రవేశించునప్పుడొక క్రొత్త జీవితములో ప్రవేశించును. అయితే ఒకడు క్రీస్తులో ఎప్పుడు ప్రవేశించును? బాప్తిస్మము ద్వారా ప్రవేశించునని బైబిలు బోధించుచున్నది. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీారెరుగరా?" (రోమా6:3). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27). ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందునని, క్రీస్తునందున్న యతడు నూతన సృష్టియని బైబిలు బోధించుచున్నది. ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించు వరకు నూతన సృష్టికాడు. అతడు ఆయనలోనికి బాప్తిస్మము పొందువరకు క్రీస్తులో యుండనేరడు. ఈ సమయమందు ఒకడు నూతన జీవము పొంది నడచుకొనునట్లు లేపబడును. గాని దానికి ముందుకాదు. నీటి బాప్తిస్మము నుండి కలుగు పునరుత్థానము వెంబడి నూతన జీవితము ఆరంభమగును (రోమా 6:4).

సువార్త ప్రకటింపబడగా ఒకడు దాని విశ్వసించినపుడు జీవము

ఆరంభమగును  అప్పుడు మారుమనస్సు నొందిన విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును. క్రీస్తులో మాత్రమే ఈ క్రొత్తజీవితము అనుభవించును. అందువలన బాప్తిస్మము క్రొత్తజన్మలో ఒక భాగమని బైబిలు బోధించుచున్నది. క్రొత్తజన్మ వలన క్రొత్త జీవితము కలుగును. ఒకడు బాప్తిస్మపు సమాధినుండి బయటకు రాగా అతడు క్రీస్తునందు జన్మించిన ఒక క్రొత్త శిశువు. అతడు నీటి మూలముగాను. ఆత్మ మూలముగాను జన్మించిన వాడు.

తిరిగి జన్మించుటలో ఒకడు సాతాను యొక్క రాజ్యము నుండి క్రీస్తుయొక్క రాజ్యములోనికి మార్చబడును: అప్పుడు అతనికి పాపక్షమాపణ దొరుకును (కొలస్స1:13,14). యోహాను 3:5లో చెప్పబడిన నీటిమూలము గాను ఆత్మ మూలముగాను కలుగు జన్మవలన ఒకడు లోకము నుండి సంఘములోనికి, అంధకార సంబంధమైన రాజ్యములో నుండి దేవుని ప్రియ కుమారుని రాజ్యములోనికి మార్చబడును. దేవుని కుమారునిగా అగు విధానమంతయు క్రొత్తజన్మలో యిమిడియున్నది. సులభముగా చెప్పుకొనవలెనంటే తిరిగి జన్మించుట యనగా క్రైస్తవుడగుట యని అర్ధము.

తదనంతరము క్రొత్తజన్మ సంపూర్తియగుసరికి మనస్సు నూతన పరచబడును. హృదయము మార్చబడును. విశ్వాసము కలుగును అనగా ఒకడు జనింపజేయబడును. తరువాత అతడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును యిది జన్మయిచ్చుట.

క్రొత్తజన్మ యొక్క రూపకాలంకారము ఈ క్రింది విధముగా పాడుచేయబడును. 1) శిశు బాప్తిస్మములో పుట్టించుటకు ముందు పుట్టుట జరుగును. అనగా విశ్వాసమునకు ముందు బాప్తిస్మమిచ్చుట జరిగినప్పుడు, 2)ముంచడము చిలకరింపుగానో కుమ్మరింపుగానో మార్చబడినప్పుడు : ఏలయనగా ఈ క్రియలలో నీటిలో నుండి బయటకు వచ్చుట

(జననముకలుగుట) లేనందున.

## 4. మానవుని ఆత్మీయత నూతన పరచబడుట

నీకొదేము యేసుతో సంభాషించుచు ఆయన మనస్సులో యున్న జన్మను గూర్చి సంపూర్తిగా అపార్థము చేసికొనినందున క్రీస్తు ఇంకా అతనితో ఇట్లనెను "శరీరమూలముగా జన్మించినది శరీరమును, ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునై యున్నది" (యోహాను 3:6). దీనివలన భౌతిక జన్మ శరీర సంబంధమైనదని క్రొత్తజన్మ మానవుని ఆత్మయొక్క జన్మయని క్రీస్తుయొక్క భావము. క్రొత్తజన్మలో మానవుని ఆత్మ భావనలోను ప్రేమలోను ప్రముఖ మార్పులు జెందును. అది పరిశుద్ధాత్మని వలన కలుగును. జ్ఞానములో అంతర్య పురుషుడు నూతన పరచబడును (2కొరింథీ 4:16; 5:1; కొలస్స 3:10; ఎఫెసీ 4:24). అయితే తిరిగి జన్మించిన మానవుడు భౌతికముగా యిదివరకు లాగేయుండును. అందువలన ఆత్మీయ జన్మలో మానవుని ఆత్మ ఆంతర్య పురుషుడు క్రొత్తగా జన్మించును (రోమా 1:9; 7:22,25).

ఆత్మీయ జన్మను గూర్చి నీకొదేము ఆశ్చర్యపడి యుండవచ్చును. అందువలన క్రీస్తు "నీవు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు" అని అతనితో అనెను. (యోహాను 3:7). తరువాత గాలిని ఆయన ఉదాహరణగా వినయోగించెను: ఆయన "గాలి తనకిష్టమైన చోటను విసరును నీవు దాని శబ్దము విందువే గాని అది యెక్కడినుండి వచ్చునో యెక్కడికి పోవును నీకు తెలియదు. ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడనెను" (యోహాను 3:8).క్రీస్తు యిక్కడ చెప్పిన మాటలను బట్టి క్రొత్త జన్మలో పరిశుద్ధాత్మని పనిని గూర్చి అనేకులు అపార్థము చేసికొనిరి. మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు నేరుగా, మర్మయుక్తముగా, ఎదురాడలేని విధముగా పనిచేయునని ఈ వచనము చెప్పుచున్నదని అనేకులు తలంచెదరు మరల క్రొత్తజన్మ ఆశ్చర్యకరమైన

వర్ణించనశక్యమైన అద్భుత సంఘటన యనియు దానిననుభవించలెనే గాని చెప్పజాలమనియు వారు తలంతురు. గాలియెట్లు గాఢముగా వీచునో అట్లే పరిశుద్ధాత్ముడు కూడ ఆయన కిష్టమైన వారిపై తనకుగా తాను ఊదును: అందువలన ఆత్మీయ జన్మయని జెప్పబడు అంతరంగిక మార్పును కలుగజేయును. అయితే గాలి యెట్లో ఆత్మయు అట్లే, లేక ఆత్మ యొక్క పనియని లేక అట్లే క్రొత్తజన్మలో ఆత్మయొక్క పనియని యేసు చెప్పలేదు. క్రొత్తజన్మ ఒక అద్భుత క్రియయని ఆయన చెప్పలేదు. సరికదా ఆయన మాటలాడలేదు. క్రొత్తజన్మ లేక పరిశుద్ధాత్ముడు గాలి వీచునట్లుండునని ఆయన చెప్పలేదు గాని ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడని ఆయన అనెను: కనబడకుండా వీచు గాలియొక్క ఉదాహరణ క్రీస్తు రాజ్యము ఆత్మీయ రాజ్యమని చూపించు చున్నది. మరియు ఆత్మవలన జనింపజేయబడునది గాలివలె కనబడకుండ మానవుని ఆత్మ, అంతర్య పురుషుడు అని సూచించున్నది.

ఆత్మ గాలివలె ఇక్కడ అక్కడ వీచును. ఎదురాడలేని దేవుని చిత్తమును బట్టి మనుష్యుల చిత్తమును వేరుగా వారిని మార్చుచు పనిచేయు నని యోచించుట అసమంజసము. సువార్త ద్వారా పరిశుద్ధాత్ముడు క్రొత్త జన్మలో యెల్లప్పుడు పనిచేయును గాని నేరుగా మర్మయుక్తముగా అద్భుతముగా మాత్రము కాదు. ఆత్మ నేరుగా అద్భుత రీతిగా పనిని జరిగించిన యెడల ఆయన అందరిని మార్చని యెడల దేవుడు పక్షపాతి యగును (అపొ.కా. 10:34.35). అందువలన యోహాను 3:8లో క్రీస్తు చెప్పినది క్రొత్తజన్మలో పరిశుద్ధాత్ముడు నేరుగా పనిచేయునను సిద్ధాంతమునకు ప్రతికూలముగా యున్నది. ఆత్మయొక్క వర్తమానమగు సువార్తను ఒకడు విని విధేయత చూపించినప్పుడు అతడు ఆత్మమూలముగా జన్మించును.

## 5 . క్రొత్తజన్మ ఋజువు

మార్పు జెందిన వారి సందర్భములను చదువుట ద్వారా క్రొత్తజన్మ

అనగా యేమిటో ఒకడు తెలిసికొనగలడు. ఇవి అపొస్తలుల కార్యములు అను పుస్తకములో రికార్డు చేయబడినవి. ఎందువలననగా సంఘము స్థాపించబడిన తరువాత క్రొత్తజన్మ యొక్క విధానము సవిస్తరముగా అందు రుజువుపరచబడెను. “నీవు తిరిగి జన్మించవలెను” అని అపొస్తలులు చెప్పినట్లు ఎక్కడ లేకపోయినను ఆ మాటలను సమానముగా వారు బోధించిరి. దేవుని రాజ్యములో కొన్ని ఆత్మలు క్రొత్తగా ఎట్లు జన్మించెనో వాటి ఉదహరణలు ఇప్పుడు గమనించుము.

**1. పెంతెకొస్తు దినమున క్రీస్తు రాజ్యము స్థాపింపబడెను.** యేసు వాగ్ధానము చేసినట్లే అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించుటకు పరిశుద్ధాత్ముడు వచ్చెను (యోహాను 14:16; 17–26; 15:25, 27; అపొ.కా. 1:4–8; 2:1–4). ఆ దినమందు మొట్ట మొదటిసారిగా క్రీస్తుయొక్క సంపూర్ణ సువార్త (ఆయన మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములతో సహా ప్రకటించబడెను. పేతురు ప్రసంగమును ప్రజలు వినిన తరువాత యేసే క్రీస్తని అనేకులు నమ్మి “సహోదరులారా మేమేమి చేతుము?” అని యడిగిరి. అందు కతడు “మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి” యని చెప్పెను (అపొ.కా. 2:38). అట్లయినప్పుడు వారికి క్రొత్త జన్మయైన రక్షణ మార్గమును గూర్చి విపులీకరించ బడెను. మూడువేల మంది విధేయులై ఆనాడు దేవుని రాజ్యములో ప్రవేశించిరి. కొన్ని సంవత్సరములు గడచిన తరువాత పేతురు పొంతు, గలతీయ, కప్పదొకియ ఆసియ, బితునియ ప్రాంతములలో చెదరియున్న క్రైస్తవులకు వ్రాయుచు వారు తిరిగి జన్మించిన వారని చెప్పెను (1పేతురు 1:1,23). వీరిలో కొందరు పెంతెకొస్తు దినమున రక్షింపబడిన వారు (అపొ.కా. 2:9,10). పేతురు మొదటి సువార్త ప్రసంగమును చేయగా అతడు రాజ్యపు విత్తనమును విత్తెను: ప్రజలు దానిని వినిరి, విశ్వసించిరి. తమ

హృదయములోనికి దానినంగీకరించిరి, జనింపజేయబడిరి. రక్షణ పొందుటకు మేమేమి చేయవలెనని వారడిగినప్పుడు వారు మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని హెచ్చరింపబడిరి. వారు దానికి విధేయులైరి. మరియు విని, విశ్వసించి బాప్తిస్మము పొందిన వారందరు సంఘముతో చేర్చబడిరి. “మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను” (అపొ.కా. 2:47). దాని వలన వారు రాజ్యములో పౌరులైరి. ఏలయనగా ప్రభువు సంఘమే రాజ్యము. గనుక ఒకడు దేనివలన రాజ్యములో ప్రవేశించునో, దానివలనే క్రొత్తనిబంధన సంఘముతో చేర్చబడును. ఒకడు దేవుని కుటుంబమైన సంఘముతో చేర్చబడును. ఒకడు దేవుని కుటుంబమైన సంఘములో లేకుండా నూతన సృష్టి కాజాలడు (1తిమో 3:15). అపొస్తలుల కార్యములు రెండవ అధాయ్యములో రికార్డు చేయబడిన మూడువేలమంది మార్పుజెందిన సంఘటన క్రొత్తజన్మ యొక్క మంచి మాదిరియై యున్నది.

**2. ఫిలిప్పు ప్రకటించగా సమరయులు మార్పుజెందుట క్రొత్తజన్మ యొక్క మరియొక ఉదాహరణయై యున్నది.** ఆత్మావేశము గలిగిన ‘సువార్తికుడు సమరయకు వెళ్ళి క్రీస్తును గూర్చి బోధించెను. అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:5–12). వారు తిరిగి జన్మించిరి. నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిరి.

**3. ఐతియోపీయ నపుంసకుడు సువార్తను వినెను.** దానిని విశ్వసించెను. క్రీస్తునందు తనకున్న విశ్వాసము నొప్పుకొనెను. పశ్చాత్తాప్తుడై నీటిలో ముంచబడెను. (అపొ.కా. 8:26–39). ఆ నపుంసకుడు ఒక నూతన జీవితములోనికి నీటినుండి వెడలివచ్చెను. అతడు క్రీస్తులో ఒక నూతన సృష్టి: తన త్రోవలో సంతోషించుచు వెళ్ళెను. అతడు కూడా క్రొత్తజన్మను పొందెను.

**4. కొరింథీయులు క్రొత్తజన్మను పొందిన విధానమంతయు ఈ మాటలలో వ్యక్తపరచబడెను :** "మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపో.కా. 18:8).

గనుక సూక్ష్మముగా ప్రజలు తిరిగి జన్మించిన ఉదాహరణలను బట్టి యోహాను 3:1–8 చదువవలెను. క్రీస్తు నీకొదేముతో నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించుటను గూర్చి చెప్పినప్పుడాయన మనస్సులో యేమి ఉండెనో అదే యీ ఉదాహరణలలో జరిగెను. పాపులు రక్షించబడవలెనంటే యేమి చేయవలెనో అపొస్తలులు చెప్పినప్పుడు వారు క్రొత్తజన్మను బాగుగా అర్థము చేసికొనవచ్చును. మరియు లేఖన భావార్థమును లేఖనము ద్వారానే చెప్పుటకన్న మంచి మార్గమొకటి లేదు. గనుక సువార్తను విశ్వసించుట, నిజముగా పాపమును గూర్చి మారుమనస్సు పొందుట క్రీస్తును దేవుని కుమారుడని ఒప్పుకొనుట ప్రభువు నామమున బాప్తిస్మము పొందుట క్రొత్తజన్మయగును. ఒకడు ఈ పనులను చేసిన యెడల అతడు దేవుని రాజ్యములో ప్రవేశించును.

## 6. సమానాంతర వచనములు

అంతేకాకుండా, ఆత్మీయ మార్పు అగు క్రొత్తజన్మను గూర్చిన మరికొన్ని యితర వచనములను గమనించుము.

1. రాజ్యములో ప్రవేశించుటను గూర్చి క్రీస్తు చెప్పిన ఈ సంగతులను గమనించుము : ఎ) నీటి మూలముగా జన్మించుడి = దేవుని రాజ్యములో ప్రవేశించుడి బి) మార్పునొందుడి = రాజ్యములో ప్రవేశించుడి (మత్తయి 18:3). సి) దేవుని చిత్తమును జరిగించుడి = రాజ్యములో ప్రవేశించుడి (మత్తయి 7:21). నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించుడియను మాటలను ఒకడు అర్థము చేసికొనగలడు. అయితే మార్పుజెందుట ప్రభువు తట్టు తిరుగుట యని గ్రహింపగును. ఈ పదము

లన్నియు ఒక్కటే, మరియువాటి ప్రతిఫలము కూడా ఒక్కటే. అది రాజ్యములో ప్రవేశము. దేవుని చిత్తమునకు లోబడని ఒక వ్యక్తి దేవుని రాజ్యమునకు పౌరుడు కాజాలాడు. ఈ మూడు కూడా ఒకే విషయములో సమానమైనవి. గనుక అవి పరస్పరముగా సమానమైనవి.

2. క్రొత్తజన్మ అనునది క్రీస్తు చెప్పిన ఈ మాటలలో వివరించ బడినదని గమనించుము : "మరియు – మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును " (మార్కు 16:15,16). ప్రభువు ఈ లోకములో జీవించియుండగా పరలోక రాజ్యసూత్రములను గూర్చి ఉదాహరణల ద్వారాను ఉపమానముల ద్వారాను బోధించెను: గాని ఆయన లేచిన తరువాత ఖచ్చితమైన ఆజ్ఞలనిచ్చెను. యేసు పరలోక మునకెక్కిపోవకముందు అక్కడ రక్షణ నిమిత్తమై నీకొదేముతో యేమి అవుసరమని చెప్పెనో అదే సంగతులను ఇక్కడ చెప్పను. గాని ఆయన అలంకార రూపకముగా దానిని చెప్పలేదు. యేసు చెప్పిన ఈ రెండు సంగతులు అనగా యోహాను 3:5, మార్కు16:16ల యొక్క భావము సమానమే.

3. క్రొత్తజన్మ అను అంశముపై క్రీస్తు చెప్పిన దానిని అపొస్తలుడైన పౌలు చెప్పిన దానితో పోల్చుదము : "యేసు ఇట్లనెను. ఒకడు నీటిమూలము గాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింప లేడు" (యోహాను 3:5). సంఘమును క్రీస్తు వాక్యముతో ఉదకస్నానముచేత పవిత్రపరచి పరిశుద్ధ పరచెను (ఎఫెసీ 5:27). మరియు "మనము నీతిని అనుసరించి జేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు, నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను' అని పౌలు చెప్పెను (తీతు 3:5). ఈ

వచనములలోని ముఖ్య సంగతులను సమానాంతరముగ ఇట్లు గమనించగలము.

| **యోహాను 3:5** | **ఎఫెసీ 5:27** | **తీతు 3:5** |
|---|---|---|
| 1. నీటి మూలముగా జన్మించుట | ఉదకస్నానము చేయుట | పునర్జన్మ సంబంధమైన స్నానము |
| 2. ఆత్మమూలముగా జన్మించుట | వాక్యముతో | పరిశుద్ధాత్మ నూతన స్వభావము కలుగజేయుట |
| 3. దేవుని రాజ్యములో ప్రవేశము | పవిత్ర పరచబడుట | రక్షించబడుట |

వాక్యముతో ఉదకస్నానము చేత ప్రజలు పవిత్రపరచబడుదురు : ఆ ఉదక స్నానము బాప్తిస్మము (హెబ్రీ 10:22 అపొ.కా. 22:16). పునర్జన్మ సంబంధమైన స్నానము పునర్జన్మలో ఒక భాగమైయున్నది. అది కూడ బాప్తిస్మమే . ప్రజలు విశ్వాసము వలన దేవుని వాక్యయమునకు విదేయత చూపుచు బాప్తిస్మము పొందుటవలన రక్షింపబడుదురని నిజానికి ఈ వచనములు బోధించుచున్నవి. (యోహాను 3:5 మరియు మార్కు 16:16 సమానాంతరములు).

క్రొత్తజన్మయే పునర్జన్మ. తిరిగి ఆరంభించుటయని లేక ఆత్మీయముగా తిరిగి జన్మించుట యని దీని భావము. దేవుని రాజ్యములో ప్రవేశించు విధానమంతయు అనగా విశ్వాసము బాప్తిస్మము దానిలోయున్నవి. పరిశు ద్ధాత్మ వలన నూతన పరచబడుట విశ్వాసము. క్రొత్తజన్మ అంతా అదే కాదు గాని దానిలో అత్యవుసర భాగమై యున్నది. అయితే పునర్జన్మ అంతా బాప్తిస్మమే కాదు. బాప్తిస్మమే క్రొత్తజన్మలో ఒక భాగమై యున్నది.

వాక్యము ద్వారా ఆత్మ అంతరంగిక మార్పును కలిగించిన తరువాత ఒకడు ముంచడము పొందుట ద్వారా రాజ్యములో ప్రవేశింపజేయబడును.

ఒక అవిశ్వాసికి గాని లేక విశ్వాసముంచలేని వానికి గాని బాప్తిస్మ మిచ్చుట క్రొత్తనిబంధన బాప్తిస్మము కాదు. బాప్తిస్మము కేవలము ఒక భౌతిక క్రియకాదు. బాప్తిస్మము పొందువాడు విశ్వసించవలెనని లేఖనములు కోరుచున్నవి. బాప్తిస్మమునకు ముందు అవుసరమైన సంగతులను ఒక శిశువు చేయలేడు గనుక ఆ శిశువునకు బాప్తిస్మమియ్య కూడదు. క్రీస్తు రాజ్యపు చట్టము శిశు బాప్తిస్మమును బహిష్కరించెను. ఒకడు బాప్తిస్మము పొందక ముందు అతనికి బోధింపబడవలెను ( మత్తయి 28:19,20). సంఘసభ్యుడగు ప్రతివాడును మొదటి దేవునిచేత బోధింపబడవలెను (యోహాను 6:45). సంఘసభ్యులైనవాడు విశ్వాసము వలననైన సభ్యుడు (గలతీ 3:26,27).

ఇంకా ఏమంటే, మన నీతి క్రియల మూలముగా గాక పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారా అనగా బాప్తిస్మము ద్వారా దేవుడు రక్షించును అని పౌలు చెప్పుచున్నందున బాప్తిస్మము మానవులు చేయు ఒక నీతి క్రియకాదు. అది దేవుని నీతి క్రియయే (మత్తయి 3:15 రోమా 1:16, 17; 10:1-3; అపొ.కా. 10:34, 35; కీర్తన 119:172; యెషయా 64:6; యోహాను 6:28,29). బాప్తిస్మములో మర్మయుక్తమైన శక్తి ఏమియును లేదు. విశ్వాసములో కూడ అట్టి మర్మయుక్తమైన శక్తి ఏమియును లేదు.ఒకడు క్రీస్తుకు విధేయత చూపగానే ఆయన అతని రక్షణకు కారకుడగును (హెబ్రీ 5:8,9). ప్రభువునకు విధేయులైన వారికి మాత్రమే రక్షణ అనుగ్రహింపబడును.

ఒకడు తనకుగా తాను సంఘములో చేరుట తిరిగి జన్మించుటతో సమానము కాదు. అనేకులు తిరిగి జన్మించక పోయినను సంఖ్య కొరకు

వేలకొలది మంది సంఘసభ్యులని చూపించుట జరుగుచున్నది. అది విచారకరము. నిజానికి అట్టి ప్రజలు క్రీస్తు సంఘములో లేరు. "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యములోనికి ప్రవేశింపలేడు" అని క్రీస్తు చెప్పిన సంగతి క్రొత్తజన్మను పాపికి దేవుని రాజ్యమునకు మధ్య ఉంచుచున్నది.

## 7. సంగ్రహం

**ఈ పాఠములో దిగువ సత్యములు గ్రహించితిమి :**

1. నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని యెవడును దేవుని రాజ్యములో ప్రవేశింపడని క్రీస్తు నీకొదేముతో చెప్పెను.

2. దేవుని రాజ్య విత్తనమైన సువార్త ద్వారా ఆత్మీయముగా ఒకడు దేవుని వలన జనింపజేయబడును.

3. ఒకడు సువార్తను విశ్వసించగానే పరిశుద్ధాత్మ ద్వారా తండ్రివలన జనింపజేయబడును.

4. ఒకడు జనింపజేయబడిన తరువాత లేక విశ్వాసియైన తరువాత అతడు మారుమనస్సు ఒప్పుకోలు బాప్తిస్మము పొందిన యెడల అతడు తిరిగి జన్మించిన వాడగును.

5. మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొందినప్పుడు అతడు ఆత్మమూలముగాను నీటి మూలముగాను జన్మించిన వాడై దేవుని కుటుంబమగు రాజ్యములో ప్రవేశించును.

6. గనుక ఒకడు దేవుని కుమారుడని తన హృదయములో విశ్వసించిన తరువాత అతడు నీటిలో ముంచడము పొందకపోయిన యెడల అతడు క్రైస్తవుడు కాజాలడు.

✤

# 3. మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు
## (The Holy Spirit in Conversion)

ఎవడైనను దేవుని రాజ్య పౌరుడు కావలెనంటే, సంఘసభ్యుడు కావలెనంటే అతడు ఆత్మీయముగ పునర్జన్మించవలెను. ఆత్మమూలముగా జన్మించవలెను. నీకొదేముతో మాట్లాడుచు దేవుని రాజ్యములో ప్రవేశించవలె నన్న ఒకడు తిరిగి జన్మించవలెనని యేసు ఇట్లు ఉద్ఘాటిం చెను : “ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” (యోహాను3:5).

మార్పుజెందుటలో లేక క్రొత్త జన్మలో పరిశుద్ధాత్ముడు తన ప్రభావమును ఉపయోగపరచునని అందరు అంగీకరింతురు. అయితే ప్రశ్న యేమంటే, ఈ ప్రభావము ఎట్లుపయోగపరచబడుచున్నది? అది ప్రత్యక్షముగా ఉపయోగపరచ బడుచున్నదా? లేక పరోక్షముగానా? పరిశు ద్ధాత్ముడుయేమి చేయగలడో యనునది కాదు గాని ఆయన యేమి చేయగలడని బైబిలు బోధించుచున్నదో యనునది గ్రహించుకోవాలి.

మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమునకు అదనము గాను ప్రత్యేకము గాను పనిచేయునని కొందరు బోధింతురు. ఈ పాఠములో, పాపి యొక్క హృదయముపై పరిశుద్ధాత్ముడు యెల్లప్పుడు వాక్యము ద్వారా మాత్రమే పనిచేయునని లేఖనములు బోధించుచున్నట్లు చూపించబడును. మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు మర్మయుక్తముగా, ప్రత్యక్షముగా పనిచేయునని లేఖనములు బోధించుటలేదు.

# 1. ఆత్మ మరియు ఆయన సాధనము

పరిశుద్ధాత్ముడు ఒక మర్మయుక్తమైన ప్రభావము (mystical influence) గాక దైవవ్యక్తియని బైబిలు బోధించుచున్నది. దైవత్వములో ఆయన ఒక వ్యక్తి. ఆయన తండ్రితోను, కుమారునితోను ఏకమై యున్నారు ఆయన వ్యక్తిత్వము, జ్ఞానము, దైవత్వము గల వ్యక్తి. వ్యక్తిత్వము గల ఆయనను గూర్చి చెప్పదగిన సంగతులే ఆయనను గూర్చి చెప్పబడెను (అపొ.కా. 17:29; యోహాను 14:16; 16:7-14; 4:24; రోమా 3:26,27; ఎఫెసీ 4:30; 1 తిమోతి 4:1; అపొ.కా. 20:23; 21:11).

యేసు పరిశుద్ధాత్మని గూర్చి, “ఆయన వచ్చి పాపమును గూర్చియు నీతిని గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును” అని చెప్పెను (యోహాను 16:8). అయితే ఆత్మ పాపమును గూర్చి యెట్లు ఒప్పుకొన జేయును? “ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది”(రోమా 3:20; 7:7). పాపమును ఒప్పుకొనజేయుటలో పరిశుద్ధాత్ముడు ధర్మశాస్త్రమును ఒక సాధనముగా వినియోగించును. పరిశుద్ధాత్ముడు తన పనిని జరిగించు సాధనము దేవుని వాక్యము. పాపమును గూర్చి ఒప్పుకొన జేయు మరొక మార్గము లేదు.

ఆత్మకును ఆత్మయొక్క మాటలకును గల వ్యత్యాసమును మనము మనస్సునందుంచుకొనవలెను. ఆత్మ ఒక వ్యక్తి ,మాటలు ఒక సాధనము. ప్రజలు వాక్యము వలన మాత్రమే గాని లేక ఆత్మ వలన మాత్రమే గాని మార్పునొందరు గాని వాక్యము ద్వారా పనిచేయునప్పుడు ఆత్మ వినియోగించు పరికరము, దేవుని వాక్యము.

ఒక ఉదాహరణను గమనించుము : “ఆనంద్ తన చెట్టును ఒక గొడ్డలితో నరుకును”. ఆనంద్ చెట్టును నరుకును గొడ్డలితో చెట్టును నరుకును. ఆనంద్ అనునతడు తన శక్తిని పరోక్షముగా ఒక సాధనము

ద్వారా వినియోగించి చెట్టును నరుకును. ఇప్పుడీ ఉదాహరణను పరిశుద్ధ లేఖనముల కుపయోగించుము. వాక్యము "ఆత్మయొక్క ఖడ్గమైయున్నది" (ఎఫెసీ 6:17). మార్పుజెందుటలో ఆత్మ హృదయమును నొప్పింపజేయును. అయితే ఆత్మ, ఈ వ్యక్తిని తన ఖడ్గము లేకుండా నొప్పించగలడా ? లేదు. పెంతెకొస్తునాడు మార్పుజెందినవారు ఆయన పనియొక్క మంచి మాదిరియైయున్నారు (అపొ.కా. 2). ఆ దినమందు హృదయములు నొచ్చుకొనబడెను, ప్రజలు ఒప్పింప జేయుబడిరి. మరియు మూడు వేలమంది ప్రభువు తట్టు తిరిగిరి. ఈ ప్రజలను మార్చిన శక్తి సువార్త. ఆత్మ ఆయన మాటలద్వారా వారిని కదిలించెను. పరిశుద్ధాత్ముడే పనిని జరిగించెను. గాని ప్రత్యక్షమాగా కాదు ఆయన తన ఖడ్గమును వినియోగించెను. అపొస్తలుడైన పేతురు ద్వారా ఆత్మచే ప్రకటింపడిన దేవుని వాక్యము ఈ ప్రజల హృదయములను నొచ్చుకొనునట్లు చేసెను. బైబిలు ఇట్లనుచున్నది: "వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా : మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి" (అపొ.కా. 2:37). అపొస్తలుల కార్యముల లేఖకుడగు లూకా "వారు దీనిని అనుభవించి" అని చెప్ప లేదు గాని "వారు ఈ మాట విని" యని చెప్పెను. పరిశుద్ధాత్మా వేశమువలన క్రీస్తే దేవుని కుమారుడని పేతురు బోధించెను. పేతురు యొక్క మాటలవలన ఆత్మ వారిని విశ్వాసులుగా చేసెను మరియు దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెనని నిర్ధారణ యిచ్చెను. అతని ప్రసంగములో పేతురు ఆత్మయొక్క ఖడ్గమును, దేవుని వాక్యమును ఉపయోగించెను (అపొ.కా 7:54).

ఆత్మ బాప్తిస్మము అపొస్తలులకే కలిగెను గాని పాపులకు కాదు. వారిని సర్వసత్యములోనికి నడింపించుటయే దాని ప్రయోజనము. ప్రజలకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అవుసరమైయున్నదని పేతురు పలుకలేదు. గాని వారు క్రీస్తునందు విశ్వసించిన తరువాత, మారుమనస్సు పొంది

పాపక్షమాపణ నిమిత్తము వారిలో ప్రతివాడును బాప్తిస్మము పొందవలెనని అతడు చెప్పెను (అపొ.కా. 2:36–38). ఆత్మయొక్క ఆజ్ఞలకు విధేయులైన వారందరు రక్షింపబడి సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:41,47). గనుక ఈ ఉదాహరణ ద్వారా పాపి మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడెట్లు పనిచేయునో తెలిసికొనగలము. మార్పుజెందుటలో మనుష్య జ్ఞానేంద్రియములపై పరిశుద్ధాత్ముడెట్లు పనిచేయునో తెలిసికొనగలము. మార్పుజెందుటలో మనుష్య జ్ఞానేంద్రియములను పరిశుద్ధాత్ముడు నిర్లక్ష్యము చేయడు . గాని జ్ఞానేంద్రియముల ద్వారా మానవుని పాపములను గూర్చి ఒప్పించి అతనిని విధేయతకు నడిపించును. అపొస్తలుల కార్యములలో క్రొత్తజన్మ నొందిన వారియుదాహరణలను చదువుట ద్వారా ఒకడు ఆత్మ పనిచేయు విధానమును తెలిసికొనగలడు.

ఆ మూడువేల మంది నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిరా? యని ఎవరైన అడుగువచ్చును. అవునని అందరు అంగీకరింతురు. అయితే ఎట్లు? ప్రత్యక్షముగాదేవుని ఆత్మతో నింపబడిన మనుష్యుడొకడు వాక్యమును బోధించెను వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమున జరిగిన సంఘటనలను మనము క్లుప్తముగా చెప్పకొన వచ్చును: 1) యోహాను 16:7–15లో చేయబడిన వాగ్ధానమును నెరవేర్చుచు పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై దిగెను. 2) అపొస్తలులు ఆత్మచే నింపబడినవారై సువార్తను బోధించిరి. సువార్త ద్వారా ఆ జన సమూహములను ఆత్మనీతిని గూర్చియు పాపమును గూర్చియు ఒప్పింపజేసెను. 3) చేయబడిన బోధ మనస్సులలో పనిచేసెను వారియొక్క నమ్మికను భావమును ప్రజలను మార్చి యేసే ప్రభువని, క్రీస్తని విశ్వసించు నట్లు చేసెను. 4) అప్పుడు వారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని ఉపదేశించబడిరి. దేవుని ఆత్మచే వాక్యము ద్వారా జనింపజేయబడిన వారందరు బాప్తిస్మము పొందిరి.

నీటిమూలము గాను, ఆత్మమూలము గాను జన్మించిరి, అట్టివారు దేవుని రాజ్యములో ప్రవేశింపజేయబడిరి.

అందువలన 1) పరిశుద్ధాత్ముడొక వ్యక్తి 2) సువార్త ఆత్మ వినియోగించిన సాధనము 3)సువార్తను మనుష్యులు ప్రకటించిరి 4) పాపిచే దేవుని వాక్యము అంగీకరిచబడెను. తిరిగి జన్మించుటలో ఈ నాలుగు అంశములు కలసి పనిచేయుటను మనము ఎల్లప్పుడు చూడగలము. అవిశ్వాసములో యెవడును తిరిగి జన్మించడు. వినయముతో దేవుని చిత్తమునకు విధేయుడైనంత వరకు క్రొత్తగా జన్మించివాడెవడును బైబిలునందు మనకగు పడడు. మనుష్యులు సువార్తను విని, విశ్వసించి విధేయత చూపించునప్పుడు వారు పైనుండి జన్మించిన వారు, పరిశు ద్ధాత్మ వలన తిరిగి జన్మించిన వారు. అపొస్తులుల యొక్క బోధ ప్రకారము మారుమనస్సు నొందిన విశ్వాసులు నీటిలో ముంచడము పొందినప్పుడు వారు పరిశుద్ధాత్ముని నడిపింపు, ప్రభావముల వలన ప్రవర్తించుచున్నవారు.

## A. మార్పుజెందులో ఆత్మ, వాక్యము

మార్పుజేయుటలో ఆత్మ ఎల్లప్పుడు వినియోగించు సాధనము సువార్త:

1. **ప్రతి విధమైన ప్రాణికి ముందు జననము కలదు.** ఒకడు దేవుని రాజ్యమును చూడవలెనన్న తిరిగి జన్మించవలెనని యేసు చెప్పుచున్నారు. ఒకడు తిరిగి జన్మించవలెనని యేసు చెప్పుచున్నారు. ఒకడు తిరిగి జన్మించవలెనన్న అతడు జనింపజేయబడవలెను. అయితే ఒకడెట్లు జనింప జేయబడును? దేవుని వాక్యము వలన జనింపజేయబడునని బైబిలు చెప్పుచున్నది, "సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:18). "క్రీస్తు యేసునందు సువార్త ద్వారా నేను మిమ్మును కంటిని" (1కొరింథీ 4:15). దేవుని వాక్యము వలన క్రైస్తవులందరు తిరిగి జన్మించిరి యని పేతురు ప్రకటించుచున్నాడు :

“మీరు క్షయబీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు” (1పేతురు 1:22).

ఒకడు ఆత్మమూలముగా తిరిగి జన్మించునా ? అవును గాని లేఖనముల ద్వారా పరిశుద్ధాత్ముడు పనిచేయుటవలననే. లేఖనములు లేకుండ ఎవనిని ఆయన ప్రత్యక్షముగా మార్చడు. సత్యమువలన, అనగా క్రీస్తు సువార్తను విని విధేయత చూపుట వలన క్రొత్తజన్మ కలుగును. ఒకడొక పరికరము ద్వారా ఏదైనా ఒకపనిని సాధించిన యెడల, ఆవ్యక్తియే పనిచేసెను గాని సాధనముగా ఒక పరికరము నుపయోగించెనని మనము గ్రహింతుము.

2. **ఒకడు బ్రతికింపబడవలెను.** అయితే పాపియెట్లు బ్రతికింపబడును? అడతు ఆత్మ మూలముగా దేవుని వాక్యము వలన బ్రదికింపబడును: “నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించు చున్నది” (క్రీర్తన 119:50). నీ ఉపదేశము వలన నీవు నన్ను బ్రదికించితివి. నేనెన్నడును వాటిని మరువను” క్రీర్తన 119:93). “మీరు అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను” (ఎఫెసీ 2:1). ఆత్మ జీవింపజేయునా ? యేసు తన యుపదేశమును గూర్చి యిట్లు చెప్పెను : “ఆత్మయే జీవింపజేయుచున్నది  నేను చెప్పు మాటలు ఆత్మయు జీవమునై యున్నవి” (యోహాను 6:63). గనుక సువార్త ద్వారా ఆత్మ జీవింపజేయును.

**3. ఒకడు రక్షింపబడవలెను**. అయితే ఇది ఎట్లు సాద్యమగును? ఒకడు దేవుని వాక్యమునకు లోబడుట ద్వారా రక్షింపబడును: “అందుచేత సమస్త కల్మషమును, విశ్రవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి

మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21). "నీవును నీ యింటివారందరును ఏ మాటల వలనరక్షణ పొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పునని " తెలియజేయబడగా కొర్నేలి పేతురును తన యింటికి పిలిపించెను (అపొ.కా. 11:14).

**4. ఒకడు వెలుగునొందవలెను.** అయితే ఈ వెలుగు ఎట్లు కలుగును? దేవుడు తన వాక్యయము ద్వారా వెలుగు నిచ్చును: "నీ వాక్యము నా పాదములకు దీపమును, నాత్రోవకు వెలుగునైయున్నది" (కీర్తన 119:105). " నీ వాక్యము వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అవి తెలివిలేని వారికి తెలివి కలిగించును"(కీర్తన 119:130). యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగిచ్చును" (కీర్తన 19:8).

**5. రక్షింపబడుటకు ఒకడు విశ్వాసము కలిగి యుండవలెను.** అయితే విశ్వాసము ఎట్లు కలుగును? అది దేవుని వాక్యమువలన కలుగునని బైబిలు చెప్పుచున్నది. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను అవి యీ గ్రంధమందు వ్రాయబడి యుండలేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30,31). "బహుతర్కము జరిగిన తరువాత పేతురు లేచి వారితో ఇట్లనెను- సహోదరులారా, ఆరంభమందు అన్యజనులు నానోట సువార్త వాక్యము విని విశ్వసించులాగున మీలో నన్ను దేవుడేర్పరచు కొనెనని మీకు తెలియును" (అపొ.కా. 15:6,7).

**6.ఒకడు స్వతంత్రుడు చేయబడవలెను.** అయితే ఈ స్వాతంత్ర్యము ఎట్లు కలుగును ? సత్యము ద్వారా స్వతంత్రము కలుగునని యేసు బోధించెను: “మీరు సత్యమును గ్రహించెదరు అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును”(యోహాను 8:32).

**7.సువార్త వలన పిలువబడవలెను :** అయితే ఒకడు ఎట్లు పిలువబడును? అతడు సువార్త ద్వారా పిలువబడును: “మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను” (2థెస్స 2:14).

**8. ఒకడు ఆకర్షింనబడవలెను :** అయితే ప్రజలు ప్రభువునొద్దకు ఎట్లు ఆకర్షింపబడుదును? వాక్యోపదేశము వలన ఆకర్షింపబడుదురు. ప్రభువును గూర్చి విని నేర్చుకొనినవాడు ఆకర్షింపబడును. అయితే అతడు ఆకర్షింపబడితేనే గాని రాలేడు. దేవుడతనిని తన ఉపదేశము ద్వారా ఆకర్షించు కొనును : “నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నాయొద్దకు రాలేడు అంత్యదినమున నేను వానిని లేపుదును. వారందరును దేవునిచేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది. గనుక తండ్రి వలన విని నేర్చుకొనిన ప్రతివాడును నాయొద్దకు వచ్చును” అని యేసు బోధించెను (యోహాను 6:44-45).

**9. ఒకడు పవిత్రపరచబడవలెను.** అయితే ఒక వ్యక్తి యెట్లు పవిత్రపరచబడును? (1యోహాను 1:7; 2:2). ఆయన ఉపదేశమునకు లోబడుట ద్వారా పవిత్రపరచబడును “నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు” (యోహాను 15:3). “యౌవనస్తులు దేనిచేత తమ నడతను శుద్ధిపరచుకొందురు? నీవాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనేగదా?” (కీర్తన 119:9).

**10. ఒకడు పరిశుద్ధపరచబడవలెను.** అయితే యెట్లు ? ఒకని దేవుడే పరిశుద్ధపరచును (1థెస్స 5:23). ఒకడు ఆత్మవలన పరిశుద్ధ పరచబడునని కూడ బైబిలు బోధించుచున్నది. (1కొరింథీ 6:11). ఆత్మ వాక్యమునకు వేరుగా గాక, వాక్యము ద్వారానే పరిశుద్ధపరచును: “సత్యమునందు వారిని ప్రతిష్ఠచేయుము నీ వాక్యమే సత్యము ” (యోహాను 17:17).

## B. రక్షణలో దేవుని శక్తి

మనుష్యులను రక్షించుటలో ప్రభువు తన శక్తిని వాక్యము ద్వారా వినియోగించునని బైబిలు విపులీకరించుచున్నది. నమ్ము ప్రతి వానిని రక్షించుటకు సువార్తదేవుని శక్తియై యున్నది: “సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది” (రోమా 1:16).

ఈ వాక్యములో రెండు సంగతులు విపులీకరించబడినవి : 1.రక్షించుటకు సువార్తలో యున్న పరిపూర్ణశక్తి 2.జాతి, కుల వివక్షత లేకుండ నమ్ము ప్రతివాని కొరకు సువార్తలో యున్న సార్వజనిక శక్తి . దేవుడు రక్షించుశక్తి సువార్తయని ఈ లోకము నిజముగా తెలిసికొనవలసియున్నది. రక్షింప బడుటకు సువార్త ఒక్కటి మాత్రమే మానవునికున్న నిరీక్షణయై యున్నది.

సువార్త దానియొక్క పవిత్రతలోను, సూక్ష్మీయతలోను బోధింపబడునప్పుడు అది గొప్ప శక్తివంతమైనదై యుండును. ఆంటంబాంబుల కంటె అది ఎంతో శక్తిగలది. అవి పట్టణములను నాశనము చేయును గాని ఆత్మలను రక్షింపజాలవు. మానవాభిప్రాయములు గాని, వేదాంతుల జ్ఞానము గాని ఆత్మలను రక్షించలేవు. సువార్త శక్తిద్వారా దేవుడు

మానవులను రక్షించి తన బిడ్డలనుగా చేసికొనును. మార్పుజెందుటలో అదనపు శక్తిని గూర్చి బైబిలు బోధించుటలేదు. నిజముగా క్రీస్తుసువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నది.

నశించిన వారిని రక్షించు నిమిత్తము సువార్తను తప్ప వేరొక దానిని ఆత్మావేశము నొందినవారు సలహ నీయలేదు. మార్పుజేయునట్టి శక్తిని పైనుండి పంపించుమని ప్రజలు ప్రార్థించునప్పుడు సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నదని వారు తిరస్కరించుదురు. రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నందునను, వాక్యములో సువార్త యున్నందునను మార్పుజేయు శక్తిని పైనుండి పంపించుమని ప్రార్థించుట వ్యర్థము. ఒప్పింపజేయు సాధనముగా లేఖనములున్నవని జ్ఞాపకముంచుకొనుము. "ఆత్మ ఖడ్గమైన దేవునివాక్యము". పరిశుద్ధాత్ముడు లేఖనములకు అదనముగా పాపియొక్క హృదయములో పనిజేయనవసరము లేదు. పాపులు అద్భుతరీతిగా ఆత్మను పొందుదురని బైబిలు బోధించుట లేదు. రక్షింపబడని వాడు సువార్తను విని విశ్వసించి, దానికి విధేయత చూపవలెను.

## C. సువార్త - రాజ్యము యొక్క విత్తనము

మార్పుజెందుటకు ఆత్మీయ విత్తనమైన దేవుని వాక్యము యొక్క అత్యవుసరతను విత్తువాని ఉపమానము మనకు బోధించుచున్నది (లూకా 8:4-15; మార్కు 4:1-20; మత్తయి 13:3-23). భౌతిక విషయములలో గాని, ఆత్మీయ విషయములలో గాని విత్తనము లేకుండా జీవము ఉత్పత్తి కాదు. క్రైస్తవులను తయారు చేయుటకు విత్తనము అతి ప్రాముఖ్యము. దేవుని రాజ్యవిత్తనము వాక్యము. "విత్తనము దేవుని వాక్యమని" క్రీస్తు చెప్పెను (లూకా 8:11). భౌతిక రాజ్యములో గోధుమగింజ యెట్లో అట్లే ఆత్మీయరాజ్యములో వాక్యము కూడాను. దానిలో

జీవము కలదు. విత్తనములు విత్తబడని యెడల కోతయుండదు. సువార్త ప్రకటింపబడని యెడల క్రైస్తవులు ఉండరు. మనుష్యుని హృదయమే పొలము , మానవుడు వినగా విత్తనము దానిలో ప్రవేశించును

వాక్యమును వినినవారి నుండి దానిని వెంటనే తొలగించుటకు అపవాది ఎందుకు ప్రయత్నించును? దాని శక్తి అతడెరుగును. విత్తనము నూతన జీవమునుద్భవింపజేయును. రకింపబడిన వారందరు ఈ బీజము వలననే మరల పుట్టింపబడినవారని బైబిలు చెప్పుచున్నది (1పేతురు 1:23). దేవుని వాక్యము ద్వారా నూతన జీవతము ఒకని హృదయములో సృష్టింపబడునని ఈ వాక్యభాగము చెప్పుచున్నది. మరల, దేవుని రాజ్యపు విత్తనము అక్షయమైనదని కూడ అది ఉద్ఘాటించుచున్నది. క్షయమైన భౌతిక విత్తనమువలె గాక దేవుని వాక్యము ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" యని పేతురు పలికెను (1పేతురు 1:25).

అపొస్తలులు ప్రకటించిన సువార్త జీవము నుద్భవింపజేయునట్టిది, నాశనము లేనట్టిది. పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగా పాపి హృదయములో పనిచేయువరకు దేవుని వాక్యము కేవలము శక్తిహీనమైనదని చెప్పు దుర్బోధను ఇది ఖండించుచున్నది. ఆదిలో పరిశుద్ధాత్ముడు సువార్తకు అనుగ్రహించిన బ్రదికించే శక్తి ఇంకను దానిలోనే యున్నది. జీవము గలదియై, జీవమిచ్చు విత్తనమైన సువార్త ద్వారా పరిశుద్ధాత్ముడు జీవము నిచ్చును. అందువలన బైబిలు ఒక మృత పత్రమేయని అపవాది నమ్మించుటకు ప్రయత్నించును. దానినతడు సాధించినప్పుడు రక్షింపబడే విధానమును మానవుని నుండి అతడు దొంగిలించును.

జీవన ప్రసాదము మానవ హృదయమునకు మర్మముగా యున్నది. వృక్షజీవనమును గూర్చి వ్యవసాయకునికి సంపూర్తిగ తెలియకపోయినను విత్తనము ద్వారా జీవముద్భవించునని యెరిగి విత్తనమును విత్తును. కృప

విషయములో కూడ ఇది సత్యము. సువార్త మొదట బోధింపబడవలెను. ఈ విత్తనము లేకుండ మార్పు సంభవించదు. ఆత్మీయ జీవితము వాక్యము ద్వారా ఎట్లు ప్రసాదింపబడునో యనునది అంశము కాదు, గాని అది లేకుండ క్రైస్తవులు కాలేరనునది హృదయములోనికి విత్తనమెట్లు ప్రవేశించునోయనునది గాక దాని ఫలితమేమై యుండునో యనునది మన అంశము. ప్రజలెట్లు మార్పు జెందుదురో అపవాది యెరుగును గనుక వారు విశ్వసించి రక్షింపబడకుండునట్లు అది వాక్యమెత్తికొనిపోవును (లూకా 8:12). ఈ వాస్తవముల దృష్ట్యా మన ప్రభువు తన అపొస్తలుల కిచ్చిన గొప్ప ఆజ్ఞ ప్రాముఖ్యతను వహించుచున్నది: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:15,16).

ఒకడు విశ్వసించునదేమిటి ? అదే నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియైయున్న సువార్త. విశ్వసించని యెడల ఒకని నాశనము చేయునదేమిటి? సువార్తకు చూపు అవిధేయతయే . దేవుని వాక్యము చేయు పనిని బట్టి అన్ని వేళలందు సువార్తను బోధింపుమని పౌలు తిమోతిని హెచ్చరించెను (2తిమోతి 4:1,2).

## D. లేఖనముల శక్తి వాటి సర్వ సంపూర్ణత

సువార్తను గూర్చిన మరికొన్ని సత్యములను గమనించుము . దేవుని వాక్యము వలన ఈ లోకము సృష్టింపబడెనని లేఖనములు వక్కాణించుచున్నవి. వస్తువుల ఆరంభమును గూర్చి శాస్త్రజ్ఞులు, వేదాంతులు యుగముల తరబడి తమ ఊహలను ప్రకటించుచున్నారు. ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెనని బైబిలు చెప్పుచున్నది (ఆది 1:1). ఈ పనిలో దేవుడు వినియోగించిన సాధనము వాక్యము.

"యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరి

చేత సర్వ సమూహములు కలిగెను. ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను. ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచబడెను" (కీర్తన 33:6,9). ఈ విశ్వమంతటిని సృష్టికర్త తన మాటచేత సృష్టించెను. ఈలోకమెట్లు ఆరంభించెనో చెప్పుట యెవరికిని సాధ్యము కానందున ఈ సత్యమును ప్రతివాడును విశ్వాసము వలన అంగీకరించవలెను. "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదరియు, విశ్వాసముచేత గ్రహించు కొనుచున్నాము" (హెబ్రీ 11:3).

క్రీస్తు ఈ లోకములో యున్నపుడు ఆయన మాటలు శక్తివంతమైనవి. ఆయన చేసిన అద్భుతములన్నియు ఆయన మాటయొక్క శక్తివలననే చేసెను. ఆయన మాట పలికితే చాలు క్రియ ఆయెను. అట్లే ఆయన బోధ కూడాను, ఆయన వాక్యము శక్తితో కూడినదై యుండెను (లూకా 4:32).దేవుని వాక్యము నిష్ఫలముగా ఆయన యొద్దకు మరలక అది ఆయన పంపిన కార్యమును సఫలము చేయునని యెషయా పలికెను (యోషయా 55:10,11). యిర్మియా ద్వారా దేవుడిట్లు పలికెను: "నా మాట అగ్నివంటిది కాదా? బండను బద్దలు చేయు సుత్తె వంటిది కాదా?" (యిర్మియా 23:29). దేవుడు చెప్పిన యే మాటయైనను నిరర్థకము కానేరదని బైబిలు బోధించుచున్నది (లూకా 1:36). దేవుని వాక్యము యెల్లప్పుడు శక్తివంతమైనదై యుండెను.

దానియొక్క కర్తవలె, దేవుని వాక్యము నిత్యమైనది, ఆది యెన్నటికిని గతించదు (యెషయా 40:8 1 పేతురు 1:24,25). యేసు ఇట్టనెను : "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" (మత్తయి 24:35). కొందరు చెప్పురీతిగా బైబిలు మృతమైనది కాదు. గాని అది సజీవమై బలముగలదై యున్నది. ఆత్మీయ జీవపు

శక్తితో అది నిండియున్నది: “దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా యున్నది” (హెబ్రీ 4:12). మానవ హృదయములోని వాక్యము రక్షించును, బ్రతికించును. మార్పుజేయును. వాక్యములో యున్న దేవుని తలంపులలో శక్తి యున్నది. మనుష్యుని రక్షణార్థము పలుకబడిన దేవుని మాటలో ఎంత శక్తి యున్నదో వ్రాయబడిన దానిలో అంతేశక్తి యున్నది. మనుష్యుని రక్షణార్థము పలుకబడిన దేవుని మాటలో ఎంత శక్తి యున్నదో వ్రాయబడిన దానిలో కూడా అంతేశక్తి యున్నది.

మానవుని జీవమునకు భక్తికి కావలసినదంతటిని ప్రభువు తన వాక్యములో ఇచ్చియున్నాడు(2పేతురు 1:3). మానవుని భక్తి తత్వ విధులన్నిటికి పరిశుద్ధ లేఖనములు సర్వసంపూర్ణ మార్గదర్శియై యున్నవని బైబిలు చెప్పుచున్నది. రక్షింప బడుటకు ప్రజల కవుసరమైనదేదియు దేవుని వాక్యమునందు ఇయ్యబడకుండ లేదు. ఒకడు పాపలోకమును వీడి ఆత్మయొక్క నిత్య గృహమగు పరలోకములో ప్రవేశించువరకు నడువవలసిన త్రోవలో దేవునివాక్యము నడిపింపని ఒక్క అడుగు కూడ లేదు. గనుక తన ఆత్మ రక్షణార్థము మానవునికి అవుసరమైనదంతయు పరిశుద్ధ లేఖనములలో ఈయబడినది. అది ఒక్కటే అతని విశ్వాసమునకు ఆచరణకు ఈయబడిన దైవమార్గదర్శి. “దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది” (2తిమోతి 3: 16,17).

అంతేకాదు మానవుడు ఎంత పతనమైపోయినను, సువార్తకు లోబడుట ద్వారా క్రైస్తవునిగా మారగలడు. త్రాగుబోతులతోను,

స్వేచ్ఛాపరులతోను నిండియున్న కొరింధు పట్టణములో పౌలు సువార్తను ప్రకటించిన సంఘటనను బట్టి, ఘోర పాపులను కూడ రక్షించుటకు సువార్తలో యున్న శక్తిని మనముసులభముగా గ్రహించుకొనగలము. మార్పుజెందినవారు సాధారణముగా అవినీతిలో మునిగిపోయిన దీనులు. కొంత కాలమైన తరువాత, "సహోదరులారా, మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి. మీలో లోకరీతిని జ్ఞానులైనను , ఘనులైనను గొప్ప వంశము వారైనను అనేకులు పిలువబడలేదు" అని పౌలు వారికి వ్రాసెను. కొరింధువారి దురలవాట్లను అనగా విగ్రహారాధన, వ్యభిచారము, ఆడంగితనము, త్రాగుడు, దొంగతనము మొదలగు వాటిని గూర్చి చెప్పి, "మీలో కొందరు అట్టివారై యుండిరి గాని, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడిరి" యని పౌలు వారికి తెలియజేసెను (1కొరింథీ 6:1). సువార్తను కొరింధీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మముపొందిరి" యని అపొస్తలుల కార్యములలో వ్రాయబడియున్నది (అపొ.కా. 18:3).క్రొత్తనిబంధన అనేకుల మార్పును వర్ణించుచున్నది గాని రక్షించుటలో సువార్త యొక్క శక్తిని నిరూపించుటకు కొరింధీయుల సందర్భము చాలును.

ఆత్మ యున్న పాపపు స్థితి ఎంత ఘోరమైన దైనను దేవుని వాక్యము దానిని రక్షించగలదని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 1:21). అయితే దేవుని వాక్యమునకు మించినశక్తి అవుసరమని కొందరు ఏల చెప్పుదురు? మనుష్యుడన్న రీతిగానే అతడు విధేయుడైన యెడల సువార్త యున్న రీతిగానే అతనిని రక్షించును. బైబిలులో లిఖింపబడిన దేవునివాక్యము దేవుడుద్దేశించిన కార్యము నంతటిని సాధించుటకు శక్తి సువార్తయందు లేక ఆయన ఉపదేశము నందున్నది. మార్పుజేయుటలో యెహోవా

వినియోగించినదంతయు ఇదే.

ఒకడు దేవుని బిడ్డ అయిన తరువాత అతడు పెరిగి దేవుని కుటుంబములో బలవంతుడగునట్లు అతనికి ఆహారమవుసరము. దేవుని పిల్లలు ఆయన వాక్యమును భుజించుట వలన ఎదుగుదురు. "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1పేతురు 2:3; అపొ.కా. 20:32). "చదువుట యందు జాగ్రత్తగా యుండుము వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము" (1తిమోతి 4:13,15). "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" (మత్తయి 4:4).

అంత్య దినమందు అందరికి తీర్పు తీర్చబడును. వాక్యము వలన వారికి తీర్పు తీర్చబడును. తీర్పును గూర్చి యేసు ఇట్లనెను: "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు నేను చెప్పిన మాటయే వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48; ప్రక 20:12).

బయలుపరచబడిన సత్యము (బైబిలు) ద్వారా తప్ప పరిశుద్ధాత్ముడు పాపులతో గాని క్రైస్తవులతో గాని ప్రత్యక్షముగా సంప్రదించడు అని లేఖనములు విపులముగా బోధించుచున్నవి (ఎఫెసీ 3:3-5,17; 5:18,19; కొలస్స 3:16). విశ్వాసము వలన దేవుని బిడ్డను ఆత్మ వాక్యము ద్వారా నడిపించును, మార్గమును చూపును. ఇది గాక మరొక మార్గము లేదు (2 కొరింధి5:7; రోమా 10:17). "బైబిలు దేవుని యొక్క పరిపూర్ణ అంతిమ బయల్పాటు, ఆత్మీయ విషయము లన్నిటిలో మానవునికి అదొక్కటి మాత్రమే అధికార పూర్వకమైనట్టియు, నిర్ధోషమైనట్టియు మార్గదర్శి (1కొరింధీ 2:10-13; 2 యోహాను 1:11; యూదా 1:3).

## 2. మనుష్యుని తత్వము

మనుష్యుని తత్వమును గూర్చిఅనేకులకు అపోహలు కలవు. మానవులు జననము నుండి సంపూర్తిగా పతనమై పోయినవారని అందువలన వారిని మార్చుటకు పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా పనిచేయవలెనని వారు తలంతురు. అయితే బైబిలు వారసత్వ పతనమును బోధించుటలేదు. “ఆజ్ఞాతిక్రమమే పాపము”(1యోహాను 3:4). ఒక వ్యక్తి చేయునది పాపము. అదొక క్రియ, అదొకవారసత్వము కాదు. పాపము చేయువాడే మరణము నొందును తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారునిదోష శిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆనీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును” (యెహెజ్కేలు 18:20).

పసిపిల్లలు పాపముతో పుట్టుటలేదు. తల్లిదండ్రుల యొక్క క్రియలను వారు వారసత్వము వలన పొందరు. వారినుండి పిల్లలకు పాపము అంకురించదు (మత్తయి 18:1–3; 19:14). మరణము, నాశమును గూర్చి లేఖనము ఇట్లను చున్నది. “మీ పాపము చేతను అపరాధముల చేతను మీరు చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను.... స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి” (ఎఫెసీ 2:1–3).

వారసత్వము వలన మీరు చచ్చిన వారనిగాక లేక చచ్చిన వారివలె జన్మించిరి యని గాని చెప్పక మీఅపరాధముల చేతను పాపముల చేతను చచ్చిన వారని ఈవచనము చెప్పుచుండుట గమనించుము. ఎఫెసీయులు సువార్తకు లోబడక ముందు వారి యతిక్రమముల వలన పాపములలో చచ్చినవారైరి. ఆదాముయొక్క పాపమువలన భౌతిక మరణము అందరికీ సంప్రాప్తమాయెనను సంగతి సత్యమే (1కొరింథీ 15:22). అయితే

ఆదాము యొక్క అతిక్రమము వలన అందరు పాపముతో పుట్టుదురనుట అసత్యము. మనుష్యుని పాపములే అతని దేవుని నుండి దూరము చేయును మీ దోషములు మీకును దేవునికిని అడ్డముగా వచ్చెను. మీపాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు" (యెషయా 59:1,2).

సువార్త బోధింపబడినప్పుడు వాక్యము వినిన వారిలో కొందరు రక్షింనబడవచ్చును  లేదా ఉపదేశమును తిరస్కరించి నాశన మొందవచ్చును (అపో.కా. 28:27). మానవుడు నైతికముగా స్వతంత్రుడు గనుక అతడు ఆత్మయొక్క మాటలను ఎదురాడునప్పుడు ఆత్మనే ఎదురాడును (అపో.కా. 7:51; నెహెమ్యా 9:30). "అయితే మీకు జీవము కలుగునట్లు మీరు నా యొద్దకు రానొల్లరు" అని యేసు చెప్పెను (యోహాను 5:40). మీరు రాలేదు అని ఆయన చెప్పలేదు గాని రానొల్లరు అని చెప్పెను.

పాపులు సువార్తకు విధేయత చూపుటకు మనస్కరించని యెడల వారిని రక్షించు శక్తి ఈ విశ్వమంతటిలో ఏదియులేదు. ఆయనకు లోబడవలెనని దేవుడు యెవనిని ఒత్తిడిచేయడు. రక్షణ వర్తమానమును పాపియైనవాడు తిరస్కరించి నశించిన యెడల ఆ తప్పు అతనిదే. అతడు రక్షింపబడ గలవాడు. అతని అవిధేయతను బట్టి నశింపజేయుట కంటె అతని రక్షించుటకు దేవుడు సంతోషించి యుండును. యెవడును నశింపవలెనని ఆయన ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని ప్రభువు కోరుచున్నారు (2పేతురు 3:9 యెహెజ్కేలు 18:23-28, 32:11; అపో.కా. 24:25; 28:23-28).

### 3. పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా పనిచేయుట లేదు

వివరింప లేకుండగను అగోచరము గాను యున్న పరిశుద్ధాత్ముని

పనివలన యెవడును తిరిగి జన్మించినట్లు బైబిలు చెప్పుటలేదు. మార్పుజెందుటలో ఏ పాపియు ఆత్మయొక్క ప్రభావమును ప్రత్యక్షముగా అనుభవించిన సంఘటన కూడ ఏదియు లేదు. అట్టి పని అవుసరమని ఆత్మావేశ లేఖకుడెవడును బోధించలేదు. ప్రార్థించవలెనని ఆత్మావేశ లేఖకుడెవరు బోధించలేదు వారిలో యెవడును మతము పట్టుకొనుటను గూర్చి గాని, కృపననుభవించుటను గూర్చి గాని, తక్షణమే మార్పు జెందుటను గూర్చి గాని వ్రాయలేదు. ఇవన్నియు ఆధునికమైనవే. బైబిలు చేయు బోధను ప్రజలు అపార్థము చేసికొనిరని అది సూచించుచున్నది. బైబిలులో మార్పుజెందిన వారు దేవుని వాక్యశక్తి వలన మార్పుజెందిరి. ప్రతి సందర్భములోను సువార్త బోధింపబడెను. పాపియైనవాడు తనకు తానే తిరిగి జన్మించక పోయినను, ఆత్మీయ వర్తమానమగు సువార్తను విని విధేయత చూపుట వలన అతడు తిరిగి జన్మించెను.

వాక్యమునకు వేరుగా పరిశుద్ధాత్ముడు ప్రజలను ప్రత్యక్షముగా మార్చుచున్న యెడల ప్రజలందరు ఎందుకు మార్చబడలేదు? వేలకొలది విగ్రహారాధికులు ఎందుకు మార్చబడలేదు? అయితే సువార్త ఎక్కడ విన్పింపబడలేదో అక్కడ క్రైస్తవులు కనిపించరు. అందువలననే నశించుచున్న వారు విని రక్షింపబడుటకు వాక్యమును ప్రకటించుటకు సువార్తికులు పంపబడుచున్నారు. పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా పనిచేసి ప్రజలను మార్చునను సిద్ధాంతమే యధార్థమైతే సువార్తను బోధించుటకు లోకమందతటా మనుష్యులను పంపవలసిన పని యేమున్నది? అయితే ఈ సిద్ధాంతమును నమ్మువారు దీనికి జవాబీయలేరు.

మార్పుజెందుటకు పరిశుద్ధాత్ముని ప్రత్యక్షపని అవుసరమైన యెడల, దేవుడు అందరినీ మార్చుట లేనందున ఆయన పక్షపాతియగును. మార్పుచేయు శక్తిని ప్రభువు కొందరి కనుగ్రహించి మరికొందరికి

అనుగ్రహించని యెడల ఆయన పక్షపాతి. అయితే దేవుడు పక్షపాతికాడని బైబిలు విశదీకరించుచున్నది(అపో.కా. 10:34; రోమా 2:11; 1పేతురు 1:17). పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా పనిచేయునను సిద్దాంతము మానవుల బాధ్యతలన్నిటిని తొలగించుచున్నది. ఈ సిద్ధాంతము నిజమే అయితే తీర్పులో పాపి నాశనమయిన యెడల దానికి దేవుడే కేవలము బాధ్యుడగును.

సాతానుని మాటల వలన హవ్వ పాపములో బడెను. (ఆది 3:1–6,13). నేడు మానవుడు దేవుని మాటల వలన నీతిలో నడిపించబడును. దేవుని మాటల కంటె అపవాది మాటలు శక్తివంతమైనవా ? పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా పనిచేయునను సిద్ధాంత ప్రకారము దేవుడు తన వాక్యము ద్వారా పాపి యొక్క హృదయమును సమీపంచలేదు. వాక్యమునకు వేరుగా పరిశుద్ధాత్ముడు తన శక్తిని ప్రయోగించుచున్న యెడల రక్షించుటకు సువార్త దేవుని శక్తి కాదు (రోమా 1:16).

ఇంతకు ముందు మనము చూచుకొనిన రీతిగా, క్రైస్తవ యుగారంభములో అపొస్తలులు పరిశుద్ధాత్మను పొందిరి. ఆయాత్మ వారికి వాక్‌శక్తి ననుగ్రహించిన కొలది వారు మాటలాడిరి, ప్రజలు అపొస్తులుల మాటలను వినినప్పుడు ఆత్మ యొక్క మాటలను వినిరి. వారు వినిని దానిని విశ్వసించి విధేయత చూపినప్పుడు ఆత్మ పలుకులను విందురు. ఆత్మావేశము గలవారు ఈ నాడు జీవించి యుండకపోయినను వారి లేఖనములున్నవి. పరిశుద్ధ లేఖనములు ఆత్మావేశము గలవి (నెహెమ్యా 9:30; 2 తిమో 3:16,17; 2పేతురు 1:21).

అపొస్తలుల కాలములో అనేకులు మార్పునొందలేదు. తమ యిచ్ఛను బట్టియే వారు మార్పునొందలేదు గాని వారికి ఒక ప్రత్యేక శక్తి లేకుండ జేయుట వలన కాదు(అపొ.కా. 24:25; 26:28). అయితే

రక్షింపబడినవారు సువార్తను వినిరి . విశ్వసించిరి, తమ పాపముల విషయమై మారుమనస్సునొందిరి. క్రీస్తు దేవునికుమారుడని తమ విశ్వాసమును ఒప్పుకొనిన తరువాత బాప్తిస్మము పొందిరి. అట్లు దేవుని రాజ్యములో ప్రవేశించిరి (అపొ.కా. 2).

లేఖనములకు బదులుగా దేవుని సహాయము నడిగినవాడు నరకములో యాతన పడుచున్న ధనవంతుడొకడు మాత్రమే యున్నాడు. అతని అభ్యర్ధన తిరస్కరించబడెను (లూకా 16:19,31). మృతుల లోకము నుండి లాజరునుపంపి భూమిపై జీవించుచున్న తన ఐదుగురు సహోదరులు మారుమనస్సు పొందునట్లు హెచ్చరించవలెననియు తద్వారా వారు అతడున్న ఘోర ప్రదేశమునకు రాకుందురనియు ఆ ధనవంతుడు అబ్రహామును కోరెను. అయితే వారియొద్ద మోషేయు, ప్రవక్తలును ఉన్నారు వారు వారి మాటలు వినవలెనని అతనికి చెప్పబడెను. ఆ ధనవంతుడు జీవించియుండగా మోషేయు, ప్రవక్తలును చెప్పిన మాటలను లక్ష్యపెట్టిన యెడల అతడా ప్రదేశమునకు వెళ్ళియుండకపోను. తన సహోదరులు కూడ లేఖనములను లక్ష్యపెట్టినయెడల తనకు కలిగిన దుస్థితినుండి తప్పించుకొనగలరు. ఈనాడు ప్రజలు పాత, క్రొత్త నిబంధనలను కలిగియున్నారు. దేవుడు, పరిశుద్ధాత్ముడు, క్రీస్తు కూడ ప్రజలు మారుమనస్సు నొందునట్లు పంపించే దంతయు ఇంతే . అద్భుత మేమియు చేయబడదు. దేవుడు ఉద్దేశించిన కార్యము, అనగా స్త్రీ పురుషుల ఆత్మల రక్షణ సాధించబడునట్లు లేఖనములు సర్వ సంపూర్ణములై యున్నవి. గనుక ఏలాగు వినుచున్నారో, ఎట్లు వినుచున్నారోయను దానిని గూర్చి అందరు జాగ్రత్త పడవలెను (లూకా 8:18; మార్కు 4:24).

## 4. ముగింపు:

పాపిని మార్చుటలో పరిశుద్ధాత్ముడు వాక్యమునకు వేరుగా గాక

ఎల్లప్పుడు వాక్యము ద్వారానే పనిచేయునని ఈ పాఠములో మనము నేర్చుకొంటిమి. ఆయన ఎన్నడు మర్మయుక్తముగా, ప్రత్యక్షముగా పనిచేయడు. పరిశుద్ధాత్ముడు దేవుని నిత్య సాధనము ద్వారా పాపిని జనింపజేసి, జీవింపజేసి మార్చును. సువార్త బోధింపబడిన తరువాత తన పాపముల విషయమై మారు మనస్సునొంది, క్రీస్తు నందలి విశ్వాసమును ఒప్పుకొని, బాప్తిస్మము పొందువాడు క్రైస్తవుడగును. దేవుని వాగ్దానములన్నిటిని అనుభవించును. అతడు మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్యజీవ కిరీటమును పొందును (ప్రకటన 2:10).

✤

# 4. సిలువపై నున్న దొంగ

## (The Thief on the Cross)

ఇద్దరు దొంగల మధ్య క్రీస్తు సిలువపై యుండగా మొదట వారిద్దరు ఆయనను అపహాస్యము చేసిరి. గాని తరువాత వారిలో ఒకడు తన మనస్తత్వమును మార్చుకొనెను. అతడు "ఆయనను చూచి యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో – నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:42, 43; మత్తయి 27:32–44; మార్కు 15:27–32). సిలువపైనున్న ఈ దొంగ యొక్క సంఘటనను గుర్తించుము.

### 1. ఆ దొంగ యేసును యేమి అడిగెను ?

ఆ దొంగ క్షమాపణను అడిగెనా ? అతడు ప్రభువా, నీవు నీ రాజ్యము లోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమని అడిగెను. ఈ కోరికనుబట్టి అతని ఉద్దేశ్యమేమిటి ? ఏరకమైన రాజ్యము అతని మనసులో యుండెను ?

క్రీస్తు భూమిపై జీవించుచుండగా పరలోక రాజ్యము సమీపించి యున్నట్లు, ఆసన్నమై యున్నట్లు ప్రకటించబడెను (మత్తయి 3:2; 4:17). గాని ప్రజలు సాధారణముగా ఒక భూసంబంధ రాజ్యమును గూర్చి ఊహించుకొను చుండిరి. క్రీస్తు పునరుత్థానుడైన కొన్ని దినముల వరకు అపొస్తలులు కూడఅట్లే భావించి యుండిరి (మత్తయి 20:20–28; అపొ.కా. 1:6). యేసుతో మూడు సంవత్సరముల కంటె ఎక్కువ సహవాసము చేసిన అపొస్తలుల కంటె ఈ దొంగ క్రీస్తు రాజ్యము యొక్క తత్వమును బాగుగా యెరిగి యుండెనా ? బహుశా ఈ దొంగ యేసును

గూర్చి, ఆయన ఘనకార్యములను గూర్చి వినెను. యేసు గ్రుడ్డివారి నేత్రములను తెరువగలిగి చనిపోయిన వారిని లేవదీసి, నీళ్ళమీద నడిచి మరియు అనేక అద్భుతములను చేయగలిగెను. గనుక ఆయన సిలువ మీదనుండి దిగివచ్చి తన రాజ్యమును స్థాపించి తన శత్రువులపై పాలన చేయునని అతడు తలంచి యుండెను. గనుక ఆయనను దూషించుటమాని ఆదొంగ మారుమనస్సు పొంది, ప్రభువా, నీరాజ్యములో నన్ను జ్ఞాపకము చేసికొనుమని చెప్పెను. "నన్ను కూడ క్రిందికిదించెదవా, యేసూ?" అని బహుశ అతని ప్రశ్న యొక్క భావమై యుండెను. అయితే ఆ సమయమందు క్రీస్తు తన రాజ్యమును గూర్చి అతనికి వివరించలేదు (యోహాను 18:36). గాని నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని అతనికి సూక్ష్మముగా చెప్పెను

## ౨. యేసు జవాబులో ఏమి ఇమిడి యుండెను ?

యేసు ఆ దొంగకు జవాబిచ్చినప్పుడాయన ఉద్దేశ్యమేమిటి? ఆయన పాపములు క్షమించెనా ? ఆయన అతని పాపములు క్షమించెనా ? ఆయన అతని పాపములు క్షమించెనని సాధారణముగ అందరు భావింతురు. అయితే నేడు నీవు నాతో కూడా పరదైసులో యుందు వనుటలో ఆయన దేనిని సూచించెను?

యేసు సమాధిని సూచించి యుండకపోను ఏలయనగా పరదైసు అనగా సమాధియని అర్థము కాదు. ఆయన వారి శరీరములను గూర్చి గాక, వారి ఆత్మలను గూర్చి సూచించెను. వారిద్దరు చనిపోబోవు చున్నారనియు మరియు వారి ఆత్మలు ఆరోజే పరదైసులో కలసి యుండుననియు ఆయన ఉద్దేశ్యము.

పెంతెకోస్తునాడు పేతురు క్రీస్తుయొక్క పునరుత్థానమును గూర్చి

మాట్లాడినప్పుడు, "క్రీస్తు పాతాళములో (Hades) విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు" చెప్పెను (అపొ.కా. 2:31). క్రీస్తు శరీరము సమాధిలో యుండగా ఆయన ఆత్మ పాతాళము (Hades)లో యుండెను.

మరణము సంభవించిన తరువాత శరీరము నుండి వేరైన ఆత్మలు పునరుత్థానము వరకు కనిపెట్టుచు యుండు ప్రదేశమునుపాతాళము (Hades) అను పదము సూచించుచున్నది. క్రీస్తు వినియోగించిన పరదైసు అను పదము పాతాళములో ఒక భాగము. అది మృతులైన నీతిమంతుల ఆత్మల నివాసము (లూకా 16:22,23 2పేతురు 2:4).

క్రీస్తు సిలువమీద చనిపోయినప్పుడు ఆయన ఆత్మ ఆయన శరీరమును విడిచెను (యోహాను 19:30). అట్లే ఆ దొంగ చనిపోయి నప్పుడు అతని ఆత్మ దానియొక్క గుడారమును (మంటిఘటమును) వదలిపోయెను. క్రీస్తు యొక్కయు ఆ దొంగ యొక్కయు ఆత్మలు ఆనాడు పరదైసులోనికి వెళ్ళెను. యేసు ఆ దొంగ కలసి పరదైసులో యుండగా వారు పాతాళములో యుండిరి, అయితే క్రీస్తుయొక్క ఆత్మ మూడవదినమున అనగా ఆదివారమున పాతాళము నుండి బయటికి వచ్చెను మరియు దేవుని శక్తి వలన ఆయన శరీరము కుళ్ళిపోకుండా మృతులలో నుండి లేపబడెను (లూకా 24:1-8; 1 కొరింథీ 15:14; అపొ.కా. 13:36,37) కానిఆ దొంగ యొక్క శరీరమైతే లేపబడలేదు అది సమాధిలోనే యుండిపోయెను. క్రీస్తు మరల వచ్చునప్పుడు ఆయన శబ్దమును విని సమాధులలో నున్న వారందరు లేపబడువరకు అతని శరీరము అక్కడనే యుండును (యోహాను 5:28,29).

యేసు ఆ దొంగతో మాట్లాడుచు పరలోకమును గూర్చి చెప్పలేదు. క్రీస్తు పునరుత్థానుడైన నలుబది దినముల తరువాత పరలోకమునకు

ఎక్కివెళ్ళెను (అపొ.కా. 1:3-11; 16:19). ఆ దొంగ మరణించినప్పుడు దేవుడు నివసించు పరలోకమునకు వెళ్ళలేదు . అతడు క్రీస్తుతో మరణించిన వారి ఆత్మల అదృశ్య నివాసమగు పాతాళమునకు వెళ్ళెను. ఆఖరి దినమున మృతుల పునరుత్థానమయ్యే వకరు అతడు పరలోకమునకు వెళ్ళడు. తీర్పునాడు నీతిమంతులతో ప్రభువు, "నాతండ్రిచేత ఆశీర్వదింప బడిన వారలారా, రండి ..... మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" యని చెప్పును. మరియు దుర్మార్గులతో ఆయన "శపింపబడిన వారలారా, నన్ను విడిచి.... నిత్యాగ్నిలోనికి పోవుడి" యని చెప్పును (మత్తయి 25:34,41).

## 3. అతని సందర్భము ఈనాడు వర్తించునా ?

ఆ దొంగ అతని రక్షణ నిమిత్తము ఏమి చేసెనో లేక ఏమి చేయలేదోయనునది ప్రభువు ఈనాడు కోరుచున్న దానితో సంబంధము లేదు. ఎందు వలన ? ఎందువలన అనగా మానవుడుఈనాడు వేరొక నిబంధనను బట్టి జీవించుచుయున్నాడు.

## 4. మరణ శాసనమును వ్రాసినవాడు జీవించు చుండగా షరతులు వేరుగా యుండును

ప్రభువు మరణించకముందు ఆయన క్షమాపణ ఆశీర్వాదమును ఆయన కిష్టము వచ్చిన షరతులపై ఎప్పుడైనను ఇచ్చే హక్కును కలిగియుండెను. ఉదాహరణకు ఒకడు తన ఆస్థిని పంచిపెట్టు నిమిత్తము వీలునామాను వ్రాసెనను కొందము గాని అతడు జీవించి యుండగా తన ఆస్థిని తన కిష్టము వచ్చిన వారికిచ్చు కొనవచ్చును. అట్లే క్రీస్తుతో కూడాను. ఆయన ఈ లోకములో పరిచర్య చేయుచుండగా రకరకాల షరతులపై ఆయన కిష్టమువచ్చిన వారిని క్షమించెను. కొన్ని ఉదాహరణలను గమనించుము :

## 1. పక్షవాయువు గలవాడు

పక్షవాయువు గల ఒక మనుష్యుని నలుగురు యేసునొద్దకు తీసికొని వచ్చిరి. యేసు "కుమారుడా, నీ పాపములు క్షమింపబడి యున్నవని పక్షవాయువు గల వానితో చెప్పెను" .పాపములు క్షమించు ఆయన అధికారమును గూర్చి కొందరు ఆశ్చర్యపడుచుండగా ఆయన ఇట్లనెను: "ఈ పక్షవాయువు గలవానితో నీ పాపములు క్షమింపబడి యున్నవని చెప్పుట సులభమా? నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుమని చెప్పుట సులభమా? అయితే పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారునికి అధికారము గలదని మీరు తెలిసికొనవలెనని వారితో చెప్పి పక్షవాయువుగల వానిని చూచి నీవు లేచి నీ పరుపెత్తుకొని యింటికి పొమ్మని నీతో చెప్పు చున్నననెను" (మార్కు 2:5-12).

బాప్తిస్మము పొందవలెనని అతనికి చెప్పబడెనా? యని కొందరు అడుగుదురు. లేదు ! అంతేకాదు క్షమించబడుటకు అతడు క్రీస్తునందు విశ్వసించి మారుమనస్సు పొందవలెనని కూడ అతనికి చెప్పబడలేదు. అయినను కూడ యేసు ఆ మనుష్యుని పాపములు క్షమించెనని బైబిలు తేటగా చెప్పుచున్నది. అయితే ఈనాడు క్షమించబడుటకు ఎవడూ ఈ సంగతులు చేయరాదని దీని యర్థమా? కానేకాదు ! మారుమనస్సు పొందిన విశ్వాసి పాపక్షమాపణ నొందుటకు బాప్తిస్మము పొందవలెననెడి క్రీస్తు శాసనము అప్పుడు అమలులో లేదు అది క్రీస్తు భూమిమీద పరిచర్య చేయుచున్నప్పుడు జరిగెను. గనుక క్రొత్త నింబంధన అప్పుడు అమలులో లేదు.

## 2. పాపియైన స్త్రీ

పశ్చాత్తాపము నొందిన స్త్రీ యొకతె క్రీస్తు నొద్దకు వచ్చి తన కన్నీళ్ళతో ఆయన పాదములు కడిగి తన తలవెంట్రుకలతో వాటిని తుడిచెను. ఆయన

“నీ పాపముల క్షమింపబడి యున్నవి. నీ విశ్వాసము నిన్ను రక్షించెను సమాధానము గలదానవై వెళ్ళుమని ఆస్త్రీతో చెప్పెను” (లూకా 7:48-50).

బాప్తిస్మము పొందుమని చెప్పకుండగనే ఆమె పాపములు క్షమించబడినందున ఈ రోజు కూడ ఒకడు బాప్తిస్మము పొందకుండ ఎందుకు రక్షింపబడలేదు? అని మరల కొందరు అడుగుదురు. ఇప్పుడు మానవులు లోబడుచున్న క్రీస్తు చట్టము అప్పటికి అమలులోనికి రాలేదు. దానికి జవాబు ఇదే. ఆమె ఎన్నడు బాప్తిస్మము పొంది యుండకపోవచ్చునని ఒకడు తలంచ వచ్చును గాని నేటి మన రక్షణ విషయములో అది కొరగానిది.

**3. జక్కయ్య**

జక్కయ్యను గూర్చిన సందర్భములో కూడ అదే సంగతిని చెప్పవచ్చును: “అందుకు యేసు ఇతడును అబ్రహాము కుమారుడే ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను ” (లూకా 19:9,10).

ఈ ప్రజలు పాతనిబంధన చట్టముక్రింద యున్నారని మనము గుర్తించు కొనవలెను. అన్యుల నుండి వేరైన వారనుటకు ఇశ్రాయేలీయులందరు అబ్రహాము కుమారులని, అన్యులు ‘పరదేశు లు’‘కుక్కలు’ అని చెప్పబడుచుండేవారు (మత్తయి 15:25-26 ద్వితీ 7:6 ఆమోసు 3:2). ఇశ్రాయేలీయులలో అనేకులు నశించిన గొర్రెలని పిలువబడుట కూడ నిజమే (మత్తయి 10:6). గాని వారెన్నడు పరదేశు లని పిలువబడలేదు. యేసు జక్కయ్యను అబ్రహాము కుమారుడే యని పిలిచెను. దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికిన సుంకరి పరదేశి

కాదు (లూకా 18:10–14). క్రీస్తు మరణము వలన మోషే ధర్మశాస్త్రము తొలగించబడి నప్పుడు క్రొత్తనిబంధన అమలులోనికి వచ్చెను. ఇశ్రాయేలీయులు దేవునిచే ఏర్పరచుకొనబడిన ప్రజలుగా ఇక లేకపోయిరి (ఎఫెసీ 2:11–16; రోమా 2:28,29; గలతీ 3:24–29). త్వరలో స్థాపించబడబోవుచున్న క్రొత్త రాజ్యములో యూదుని రక్తము నిష్ప్రయోజనమని, ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను క్రొత్తగా జన్మించవలెనని యేసు నీకొదేముతో చెప్పెను (యోహాను 3:1–5). గనుక ఈ దొంగ, పశ్చాత్తాపపడిన స్త్రీ, పక్షవాయువు గల మనుష్యుడు జక్కయ్యలు పాపములో యున్న పరదేశులువలె గాక తప్పుచేసిన బిడ్డలవలె క్షమింపబడిరి.

### 4. ధనవంతుడైన యౌవ్వన అధికారి

క్రీస్తు ధనవంతుడైన ఈ అధికారితో నీకు కలిగిన వన్నియు అమ్మి బీదలకిమ్ము : నీవు వచ్చి నన్ను వెంబడింపుమని చెప్పెను (లూకా 18:18–23). కాని అతడు దానిని చేయలేదు. అయితే నిత్యజీవమును పొందుటకు ప్రతివాడు తనకున్న దానిని అమ్మి బీదలకియ్యవలెనని ఇప్పుడు ప్రతివానికి ఎందుకు చెప్పరాదు? అయితే ఇది సర్వసామాన్య ఆజ్ఞకాదని ప్రతివారు ఎరుగుదురు. అట్లేక్రీస్తు చనిపోక ముందు ఇతరులను క్షమించుటలో యున్న షరతులు కూడాను.

### 5.సిలువపై యున్న దొంగ

క్రీస్తు దొంగ జీవించియుండగా నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువని ఆతనితో చెప్పెను. అయితే మరణ శాసనము లేక వీలునామా వ్రాసినవాడు మరణించినప్పుడే అది అమలులోనికి వచ్చును. గనుక క్రొత్త నిబంధన అమలులోనికి రాకముందు ఈ దొంగ జీవించి మరణించెను. గనుక దాని షరతులకు అతడు ఎన్నడు కట్టుబడి యుండలేదు.

నేడు మనము క్రీస్తు యొక్క క్రొత్తనిబంధన క్రిందయున్నాము. మొదటి నిబంధన అంతమైపోయినది అది ఇక అమలులో లేదు. (కొలస్స 2:14; రోమా 6:14). సిలువకు ఆవలి వైపున దొంగయు ఈవలివైపున మనమును నివసించుచున్నామని గుర్తుంచుకొనవలెను. పాతనిబంధన ఇంక అమలులో యుండగా క్రీస్తుతో పరదైసులో యుండే వాగ్దానమును ఆ దొంగ పొందెను ఏలయనగా క్రీస్తు చనిపోవువరకు పాతనిబంధన అమలులో యుండెను. గనుక క్రైస్తవ యుగములో ఆ దొంగ రక్షణ పొందిన విధానము ఒక మాదిరిగా యుండ నేరదు. ఏలయనగా ఆ దొంగ క్రీస్తు యొక్క క్రొత్తనిబంధన క్రింద ఎన్నడు లేడు.

పాత క్రొత్త శాసనముల మధ్య క్రీస్తు సిలువయున్నది. "ఇదియుగాక యాజకులు మార్చబడిన యెడల ఆవశ్యకముగాయాజక ధర్మము సహా మార్చబడును"(హెబ్రీ7:12).క్రీస్తుయొక్క యాజక ధర్మము క్రింద జీవించుచున్నప్పుడు మానవుడు ఆయన చట్టము క్రింద యుండును. ధర్మశాస్త్రము మార్చబడకముందు క్రీస్తు భూమిపై జీవించుచున్నప్పుడు క్షమాపణ నొందుటకు ప్రజలేమి చేసినను, నేటి రక్షణలో మాత్రము మార్పురాదు క్రీస్తు మరణించిన తరువాత, ఆయన క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చిన తరువాత నేటి ప్రజలు జీవించుచున్నారు. గనుక అందరు దానికి లోబడవలెను. అందువలన నేటి ప్రజలు ఆ దొంగవలె రక్షణను కోరుచున్నను అతనివలె వారు రక్షింపబడలేరు (రోమా10:9,10 మార్కు 16:16). క్రీస్తు ఒక వీలునామాను వ్రాసెను. దానిలో పాపక్షమాపణ షరతులను వివరించెను. ప్రజలు నేడు ఆ షరతులకు కట్టుబడి యుండవలెను. కాలము అంతమయ్యేసరికి ఆ శాసనము అమలులో యుండును.

క్రీస్తు తన వ్యక్తిగత పరిచర్య కాలములో వివిధ షరతులపై పాపములను క్షమించెనని అందరు అంగీకరింతురు. క్రీస్తు ఆ దొంగను

పక్షవాయువు గలవానిని పాపపు స్త్రీని క్షమించెను అయితే పాపక్షమాపణ పొందుటకు క్రొత్త నిబంధనలో విధించిన షరతులకు లోబడవలెనను వాస్తవమును ఈ సందర్భములు నిరర్ధకము చేయవు. క్రీస్తు వ్యక్తిగత కాలములోని ఆ సంఘటనలు సువార్త వలన కలిగిన మార్పుకాదు. అప్పటికి మరణ శాసనమును వ్రాసినవాడు జీవించుచుండెను. గనుక అవి ఇప్పుడు వర్తించవు. ఆయన మరణించిన తరువాత క్రీస్తు తన శాసనమును బట్టియే ప్రజలను ఆశీర్వదించును. ఈనాడు ఆ శాసనములోని షరతులకు, సువార్త ఆజ్ఞలకు లోబడకుండా యెవడును పాపక్షమాపణను పొందడు.

## 5. సువార్త ఒక శాసనముగా పౌలు ప్రకటించెను:

"ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున, పిలువబడిన వారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము ఆయన క్రొత్తనిబంధనకు మధ్యవర్తియై యున్నాడు. మరణశాసన మెక్కడ ఉండునో అక్కడ మరణశాసనము వ్రాసినవాని మరణము అవశ్యము, ఆ శాసనమును వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా ?" (హెబ్రీ 9:15-17).

మరణశాసనము లేక వీలునామా వ్రాసే అలవాటు చాల కాలము నుండి యున్నది. ఈ వాక్యభాగములో లేఖకుడు క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనను గూర్చి మరి ముఖ్యముగా అది అమలులోనికి వచ్చిన సమయమును గూర్చి మాట్లాడుచున్నాడు. ఈ క్రొత్తనిబంధన ఒక వీలునామా వలె యున్నది. సరియైన వీలునామాకు ఈ దిగువ సంగతులు అవసరము:

**1. వీలునామా వ్రాసినవాడు :** అతడు వయస్సు వచ్చినవాడు, తగిన జ్ఞానము కలిగినవాడై యుండవలెను (మరణశాసనమును వ్రాసిన వానిగా క్రీస్తు దీనిని నెరవేర్చెను) (లూకా 3:23).

**2. మరణ శాసనసొత్తు :** మరణ శాసన పూర్వకముగా ఇచ్చే ఆస్థి(రక్షణ అనే వరమును ఇచ్చుటకు క్రీస్తు కలిగి యుండెను) (యోహాను 10:10; 2కొరింథీ 8:9).

**3.వారసులు :** ఆస్తినుండి కొన్ని లాభములను పొందే వ్యక్తులు (మన ప్రభువు లోకమంతటికి విమోచన అనుగ్రహించెను) (మత్తయి 11:28; తీతు 2:11 ప్రకటన 22:17).

**4. షరతులు :** ఒక వీలునామాలో షరతులుండ వచ్చును లేక పోవచ్చును కూడ ఒకవేళ షరతులున్న యెడల వీలునామా వ్రాసినవాడు వాటిని విపులముగా తెలియజేయవలెను మరియు అతడు కోరిన రీతిగనే వారసులు వాటిని అమలు పరచవలెను. క్రీస్తు యొక్క మరణశాసనము షరతులతో కూడినట్టినది సువార్త ఆజ్ఞలే ఆ షరతులు.

**5.సాక్షులు:** చట్టరీత్యా యుండవలెననిన వీలునామాకు తగిన సాక్షులు ఉండవలెను (క్రీస్తు యొక్క అపొస్తలులే ఆయన సాక్షులు) (లూకా24:38; అపొ.కా. 1:8,21; 2:32; 26:16-18).

**6.వీలునామా వ్రాసినవాని మరణము:**వీలునామా అమలులోనికి రావలెనంటే దానిని వ్రాసినవాడు ముందు చనిపోవలెను. (మన రక్షకుడు సిలువపై చనిపోయెను) (యోహాను 19:30,33,34).

**7. అమలుపరచువారు :** వీలునామా వ్రాసినవాడు మృతినొందిన తరువాత దానిని పరిశోధించినప్పుడది అమలులోనికి వచ్చును. అప్పుడు వీలునామాలోని షరతులు ప్రకారము అమలు పరచువారు ఆస్థిని

పంచుదురు. క్రీస్తు తన వీలునామాలో యిచ్చిన పాపక్షమాపణ షరతులను అపొస్తలులు పొరబాట్లు లేకుండా ప్రకటించు నిమిత్తము ఆయన మరణించిన తరువాత అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించుటకు పరిశుద్ధాత్ముడు పంపబడెను (యోహాను 14:26;16:13; లూకా 24::49).

ఒక వీలునామా అమలులోనికి రావలెనంటే దానిని వ్రాసినవాని మరణము ఆవశ్యము అను వాస్తవమును బైబిలు వక్కాణించుచున్నది దానిని వ్రాసినవాడు మరణించితేనే గాని అది చెల్లదు (హెబ్రీ 9:16,17).మరణ శాసనమును వ్రాసినవాడు జీవించు చుండగా తనకున్న దానిని ఇష్టము వచ్చినట్లు వాడుకొన వచ్చును. అయితే అతడు మరణించిన తరువాత ఆస్థి యొక్క దీవెనలను తన వీలునామా ద్వారా మాత్రమే పంచిపెట్టగలుగును. మరల అతడు జీవించి యుండగా ఆ వీలునామాను మార్చవచ్చును, చింపి వేయవచ్చును, అసలు వీలునామా లేకుండగనే చేసికొనవచ్చును. కాని అతడొక వీలునామాను వ్రాసిన యెడల అది అతని అర్థము చేసి కొందురు. అయితే క్రీస్తుయొక్క వీలునామాయగు క్రొత్తనిబంధన ఎప్పుడు అమలులోనికి వచ్చెను? దానకి జవాబు ఏమంటే – ఆయన మరణము తరువాత.

**అయితే "క్రీస్తు వీలునామాలోని క్షమాపణ షరతులేమిటి?"**

యనునది ఇప్పుడున్న ప్రశ్న. బోధించుట ద్వారాను, ఉపదేశించుట ద్వారాను తెలియజేయ బడవలసిన క్రీసు వీలునామాలోని షరతులేమంటే : 1. విశ్వాసము 2. మారు మనస్సు. 3.తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామములోనికి బాప్తిస్మము, వీటిని ఆయనతన గొప్ప ఆజ్ఞలో విశదపరచెను:

"అయితే యేసు వారియొద్దకు వచ్చి –పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు కుమారుని

యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మియ్యుడి" (మత్తయి 28:18,19).

మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16).

"క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలో నుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్తజనములలో ఆయన పేరిట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది" అని ఆయన వారికి చెప్పెను (లూకా 24:46,47).

క్రీస్తు పునరుత్థానుడై 40 దినములు అయిన తరువాత ఆయన ఆరోహణుడు కాకముందు ఈ గొప్ప ఆజ్ఞను ఇచ్చెను. దానిలో క్షమాపణషరతులను ఆయన పేర్కొనెను. అపొస్తలులు పైనుండి శక్తిని పొందువరకు వారు యెరూషలేములో కనిపెట్టవలెనని దానిలో ఆయన చెప్పెను (లూకా 24:49). అప్పుడు మాత్రమే వారాయన వీలునామాలోని షరతులను ప్రకటింప వచ్చును. ఆయన ఆరోహణుడైన పది దినముల తరువాత పెంతెకోస్తునాడు పరిశుద్ధాత్ముడు వచ్చెను. మరియు ఆనాడు క్రీస్తు చిత్తప్రకారము రక్షణషరతులు మొట్టమొదటిగా ప్రకటింపబడెను (అపొ.కా.2). ఆదినము క్రొత్తనిబంధన యొక్కయు, క్రైస్తవ యుగము యొక్కయు ఆరంభదినము మరియు సంఘము యొక్క జన్మదినము అదే ఆయన రాజ్యము (అపొ.కా. 11:15). క్రీస్తు వీలునామా అమలులోనికి వచ్చిన దినము పెంతుకొస్తుదినము.

## 6. క్రీస్తు వీలునామా అమలు పరచబడెను.

ఆ క్రొత్త చట్టము నిజానికి అపొస్తలుల బోధద్వారా బయలుపరచబడెను అపొస్తలుల కార్యములు అను పుస్తకములో

మార్పుజెందినవారి ప్రతి సందర్భములోను వారు బాప్తిస్మము పొందినట్లు మనము గుర్తించగలము. క్రొత్త నిబంధనలో మార్పునొందిన వారి ప్రతి ఉదాహరణలోను బాప్తిస్మమున్నది. బాప్తిస్మము పొందుటకు నిరాకరించిన వాడెవడును క్షమించబడినట్టి ఒక వచనము కూడ ఎక్కడ లేదు ఆ వీలునామా షరతులపై తప్ప వేరే విధముగా పాపక్షమాపణ నొందినవారి ఉదాహరణ ఒక్కటి కూడా లేదు. ఈ దిగువ ఉదాహరణలను గమనించుము:

పెంతెకొస్తునాడు సువార్తను వినినవారు విశ్వాసులై "మేమేమి చేయవలెను? అని అడిగిరి (అపొ.కా. 2:37). అందుకు పేతురు "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:38). దీనిని వారు చేసిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది ప్రభువునకు విధేయులై బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:36-41). ఈ సందర్భములో క్రీస్తు శాసనములోని ప్రతి షరతు జరిగించబడెను. మారుమనస్సు నొందిన విశ్వాసి గత పాపముల నుండి రక్షణ పొందవలెనంటే బాప్తిస్మము అవుసరమని అపొ.కా. 2:38 తేటగా బోధించుచున్నది.

ఫిలిప్పు క్రీస్తును గూర్చి బోధించుచుండగా సమరయులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:35-39). (మత్తయి 10:32,33 రోమా 10:10ని కూడ చూడుము).

తార్సువాడైన సౌలు ప్రభువునందు విశ్వసించి, తన పాపములను గూర్చి మారుమనస్సు పొంది మూడు దినములు ప్రార్ధన చేసెను. అయినను అననీయ అతనితో "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొందినీ పాపములను కడిగివేసుకొనుమని చెప్పెను" (అపొ.కా 22:16). క్రీస్తు రక్తము

పాపములను కడిగివేయు ననుట నిజము. అయితే క్రీస్తు చిందించిన రక్తము దరికి చేరుటకు సౌలు క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందవలసివచ్చెను (ప్రకటన 1:5 రోమా 6:3 యోహాను 19:34). బాప్తిస్మమునకు ముందు సౌలు యొక్క పాపములు క్షమించబడలేదు.

పౌలే లూదియకును ఆమె యింటివారికిని వాక్యమును బోధించెను ఆమెయు ఆమె యింటివారును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:14,15).

అట్లే పౌలు గొప్ప పట్టణమగు కొరింధునకు వెళ్ళి సిలువవేయబడిన యేసుక్రీస్తును ప్రకటించెను. “మరియు కొరింధీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి” (అపొ.కా. 16:33).

గనుక యేసుయొక్క వ్యక్తిగత పరిచర్య కాలములో సంకల్పము వివిధములుగా యుండెను గాని క్రీస్తు మరణించినప్పటి నుండి సమాన షరతులును క్రొత్తనచట్టమునకు విధేయతయు కోరబడెను. అందరు ఒకే షరతులపై రక్షించబడిరి. గొప్ప ఆజ్ఞలో పేర్కొనబడిన ప్రభువు యొక్క క్షమాపణ చట్టము అది. ఆ చట్టము వర్తించకుండ ఏ ఒక్కడు లేడు.

పాపక్షమాపణ షరతు బాప్తిస్మము అనుదానికి ముఖ్యముగా అభ్యంతరము చెప్పువారు, “సిలువపై నున్న దొంగ సంగతి యేమిటి?అతడు బాప్తిస్మము పొందలేదు అయినను ప్రభువతని రక్షించెను. గనుక ఈనాడు కూడా బాప్తిస్మము పొందకుండగనే ప్రజలు రక్షింపబడవచ్చునని” చెప్పుదురు. ఇంతకు ముందు గమనించినట్లుగా ఈ మాటలు దేవుని వాక్యమును సరిగ విభజింపవలసిన ప్రాధమిక సూత్రమును మరచినట్లు తెలియజేయుచున్నవి (2తిమో 2:15). ఆ దొంగ ఎన్నడు బాప్తిస్మము పొందలేదని తరచు కొందరు చెప్పుచుందురు. అయితే ఇది నిరూపింపబడగలదా ? అట్లయిన దానివలన ఈనాడు ఏదైన భేదము కలుగునా?

బాప్తిస్మమిచ్చు యోహాను అనేకులను నీటిలో ముంచెను మరియు క్రీస్తు ఆయన వ్యక్తిగత పరిచర్యలో తన అపొస్తలుల ద్వారా యోహాను కంటె ఎక్కువమందికి బాప్తిస్మమిచ్చెను (మత్తయి 3:1–6; మార్కు 1:4,5; యోహాను 4:1–2). ఆ దొంగ కూడ బాప్తిస్మము పొంది యుండవచ్చును గాని ఎవరు యెరుగరు.

అయినను మన వాదన కొరకు ఆ దొంగ ఎన్నడు బాప్తిస్మము పొంద లేదనుకొందము. ప్రభువు అతనిని పరదైసునకు కొనిపోయెను. అది ఈనాటి రక్షణను మార్చునా? మార్చదు. అప్పటికి క్రొత్తనిబంధన అమలులో లేదుగాని ఇప్పుడు అమలులో యున్నది. క్రొత్తనిబంధన రక్షణ సంకల్పములో బాప్తిస్మము యొక్క అవుసరతకు ఆ దొంగ బాప్తిస్మము పొందినది లేనిది అను దానికి ఏమియు పొందిక లేదు.

## 7. శాసనము నిరర్ధకము చేయబడదు

చట్టరీత్యా యున్న వీలునామా పరీక్షించబడినప్పుడు దానిలోని షరతుల నెవడు మార్చలేడు. వీలునామా వ్రాసిన ఒకనిని మరొకడు కొంత సహాయము అడిగెననుకొందము అతని యొక్క సహృదయతను బట్టి ఈ వ్యక్తికి అతడు కొంత సహాయము చేయును ఏలయనగా అతడు జీవించుచుండగా ఎవరికి ఏమి ఇయ్యవలెనో తన యిష్టప్రకారము చేసికొన వచ్చును. తరువాత అతడు చనిపోయెను. అతని దగ్గర నుండి వ్యక్తిగతముగా కొన్ని షరతులను నెరవేర్చితే గాని చనిపోయిన వాని ఆస్థినుండి ఏమియు పొందలేడు. అయితే అతడు వీలునామాను అమలు జరుపువాని యొద్దకుకువెళ్ళి నా మిత్రుని ఆస్థిలో నుండి కొంత నాకు కావలెను అని కోరెనను కొందము. కాని ఈ వీలునామాలోని షరతులు నీకు వర్తించవు అని అతనికి జవాబియ్యబడును. ఆమనుష్యుడు జీవించు చుండగా నాకు కొంత యిచ్చెను గదా యని అతడు వాదించవచ్చును

గాని ఇస్తే ఇచ్చి యుండవచ్చును ఇప్పుడతని వీలునామా మా దగ్గరయున్నది. అది అమలులోయున్నది అని అతనికి జవాబియ్యబడును. అతడు జీవించి యున్నట్లయితే నాకు తప్పక అతడు సహాయము చేయును అని అతడు మరల చెప్పును. అయితే పరిస్థితులు ఇప్పుడు మారిపోయినవి. వీలునామాలోని షరతులను బట్టి మేము నడుచుకొనవలెనని దానిని అమలు జరుపువారు అతనికి చెప్పుదురు.

అట్లే క్రీస్తుయొక్క వీలునామా ఇప్పుడు అమలులో యున్నది. మరియు మానవులందరు దానిలో కోరబడినట్లుగా క్షమాపణ షరతులను తప్పక ప్రకటించ వలెను. ఈ వీలునామాలోని షరతులకు లోబడువారందరు క్షమాపణ పొందుదురు. క్రొత్తనిబంధనలో ప్రకటించబడిన షరతులను పాటించని వారికి క్షమాపణ వాగ్ధానము లేదు.

## 8. వీలునామా తేటగా యున్నది

ఈ వీలునామా తేటగా అందరికి అర్ధమయ్యే రీతిగా యున్నది, ఒకడు పాప క్షమాపణను పొందవలెనంటే అతడు క్రీస్తు శాసనములోని షరతులన్నిటికి విధేయుడు కావలెను. మారుమనస్సు పొందిన విశ్వాసులు క్రీస్తునందున్న విశ్వాసమును ఒప్పుకొని పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెనని అది చెప్పుచున్నది.అయితే కొందరు ప్రభువు శాసనము "ప్రభువునందు విశ్వాసముంచిప్రార్ధించుము నీవు రక్షింపబడుదువు" అని చెప్పుచున్నట్లుగా మార్చుటకు ప్రయత్నించిరి. రేడియోలో బోధించు అనేకులు పాపులు రేడియో దగ్గర వంగి క్రీస్తునుతమ స్వంత రక్షకునిగా అంగీకరించి ప్రభువును ప్రార్దించిన యెడల ఆయన వారిని వెంటనే రక్షించునని చెప్పుదురు. ఇట్టిది బైబిలు అధికారమును పొందనట్టిది. క్షమాపణ కొరకు ప్రార్ధించుమని ఫిలిప్పు నపుంసకునికి బోధించలేదు. ప్రభువా, నేనేమి చేయవలెను? అని సౌలు అడిగినప్పుడు కూడ ప్రభువు

సౌలును క్షమించలేదు (అపొ.కా. 9:6). ఆ దొంగ యేసును ఒకటి కోరెను. ప్రభువతని క్షమించెనని చెప్పబడెను. అయితే సౌలు యేసుకు మొర్రపెట్టు సరికి ప్రభువు శాసనము అప్పటికే ముద్రవేయబడెను. మార్చబడలేకపోయెను. గనుక సౌలు క్రొత్తనిబంధన నియమములకు లోబడ వలసివచ్చెను.

మన రక్షకుడు ఆయన శిష్యులు ప్రార్థించవలెనని ఉపదేశించెను. అయితే ప్రార్థన దేవుని బిడ్డలకున్న ఒక తరుణమనే సంగతిని అనేకులు చూడలేకపోవు చున్నారు (మత్తయి 6:9; 1యోహాను 2:1; హెబ్రీ 4:14-16; 1థెస్స 5:17,18; ఫిలిప్పీ 4:6,9). సరిగదా, పాపియైన వాడెన్నడు దేనికొరకైన ప్రార్థన చేయమని చెప్పబడలేదు. సౌలు తన ప్రార్థన వలన రక్షింపబడలేదు కాని రక్షింపబడుటకే లేచి బాప్తిస్మము పొందుమని అతనికి చెప్పబడెను. క్షమాపణ నొందుటకు పాపియైనవాడు ప్రార్థన చేయవలెనని క్రొత్తనిబంధనలో ఎప్పుడు చెప్పబడలేదు. మరియు క్రైస్తవుడైన వాడెవడు బాప్తిస్మము పొందవలెనని చెప్పబడలేదు.

“నమ్మి తనచేతులు పెకెత్తినవాడు రక్షించబడునని యేసుచెప్ప లేదు”. బాప్తిస్మము పొందుడి అనే మాటను అనేకులు తీసివేసి నీ చేతులు పైకెత్తి తలను వంచుకొనుము అను మాటలను ప్రవేశపెట్టిరి.

గనుక ప్రజలు ప్రభువు షరతులకు లోబడి ఎందుకు పాప క్షమాపణను పొందుటలేదు ? యేసు చెప్పిన వాటిని ప్రతివాడు అర్థము చేసికొనగలడుగదా. ఉదాహరణకు ఒక గొప్ప ధనవంతుడు చనిపోయి తన వీలునామాలో, నాయందు విశ్వాసముంచి నీటిలో బాప్తిస్మము పొందిన వానికి 10 వేల రూపాయిలు యివ్వబడును అని వ్రాసెననుకొందము. ఆవీలూనామాను ఎవరైన అపార్థము చేసికొందురని నీవనుకొందువా? ప్రజలు అతి త్వరలో నీటిలో ముంచడము పొందుదురు. దాని పద్ధతిని గూర్చి కూడా ఎవరు సణుగరు. అంత డబ్బును పోగొట్టుకొనుటకు వారు

ఇష్టపడరు. దీనికి సమానాంతరముగా యున్న క్రీస్తు మాటలను గమనించుము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడును'' (మార్కు 16:16). రక్షించబడుటకు ఒకడు విశ్వసించి బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు యొక్క ఉద్దేశ్యము కానియెడల ఇక మాటలో అర్ధమేమియు లేదన్న మాట !

పదివేల రూపాయలకంటే ఎంతో ఎక్కువను క్రీస్తు వాగ్ధానము చేసెను. సూక్ష్మమైన తేలికయైన షరతులపై ఆయన పాపక్షమాపణ వాగ్దానము చేసెను. మరియు అంతము వరకు నమ్మకముగా యుంటే నిత్యజీవమును ఆయన వాగ్దానము చేసెను (మార్కు 10:30 ప్రకటన 2:10). ఈ దీవెనలు నీవు పొందునట్లు ఆయనకు లోబడుము. "మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందిన వాడై.... తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:9,10). "ఆయన ఆజ్ఞలను గైకొని జీవవృక్షమునకు హక్కు గలవారై గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించువారు ధన్యులు" (ప్రకటన 22:14) .

## 9. మరణ శయ్యే మీద మార్పుజెందు వారి సంగతి యేమిటి?

మరణశయ్యే మీద కూడ మార్పు జెందవచ్చునని బోధించుటకు కొందరు సిలువపైనున్న దొంగను గూర్చిన కథను వినిపింతురు. ఒకడు సత్యము నెరిగి, దానిని తిరస్కరించి అతని జీవిత ఆఖరిగడియ వరకు కనిపెట్టి రక్షింపబడిన ఉదాహరణ ఒక్కటి కూడా క్రీస్తు వీలునామాలో లేదు. అయినను ఒకడు పాపములో జీవించి, దేవునికి వ్యతిరేకముగా అనేక సంవత్సరములు గడిపి తాను చనిపోవు గడియలలో దేవుని నుండి క్షమాపణను అడిగిన యెడల దేవుడతని క్షమించుననియు, అప్పుడంతా క్షేమమే యనియు సిలువపైనున్న దొంగ సందర్భమును బట్టి బోధింతురు. మరల అతని ఆత్మ శరీరమును విడువగానే అతడు దేవుని ప్రశాంత

సన్నిధిలోనికి కొనిపోబడి ఆయనతో నిత్యము జీవించునని వారు బోధింతురు. ఇది నిశ్చయముగా అపాయకరమైన బోధ. అది దుర్మార్గులు తమ దుష్ ప్రవర్తన విడిచి తమ ప్రాణములను రక్షించు కొనకుండ వారిని ధైర్యపరచును (యెహెజ్కేలు 13:20). చావు సమీపించుచున్నదనగానే అనేకులు తమ పాపముల విషయమై ఎంతో దుఃఖపడుచు రక్షింపబడ గోరుదురు. నిజానికి అట్టి దుఃఖము దేవుని యెడల ప్రేమను బట్టి గాక భయమును బట్టి కలుగును! వారు ఇప్పుడు బాప్తిస్మము పొందుటకు వీలు లేకున్నను దేవుడు అట్టివారిని రక్షించడా? యని అనేకులు అడుగుదురు. కాని వారు ఈ ప్రశ్నలను గమనించవలెను : మొదటిగా, వీరు బాప్తిస్మము పొందే అవకాశమును ఎప్పుడైనా నిరాకరించిరా ? రెండవదిగా, వారు విధేయత చూపించగల సమయమున్నను విధేయత చూపకుండా ఇది వరకు ఉన్నారా? చివరిగా, ఎవరి దోషము వలన వారు ఇప్పుడు ఈ పరిస్థితిలో యున్నారు? నిశ్చయముగా అది ప్రభువుది కాదు! సమయమంతా దాటి పోయిన తరువాత ధనవంతుడు తన పరిస్థితిని మార్చుకొనగోరెను (లూకా16:23-26).

అందువలననే "ఇదిగో ఇదియే అనుకూల సమయము. ఇదియే రక్షణ దినము" అని దేవుడు మనలను హెచ్చరించుచున్నాడు (2కొరింథీ 6:2). "నేడు మీరాయన శబ్దమును వినిన యెడల మీ హృదయములను కఠినపరచు కొనకుడి" (హెబ్రీ 3:15). తమ బుద్ధి పూర్వకముగా విధేయులు కాలేనివారై ప్రభువా, మమ్మును కరుణించుము అని కేకలు వేయువారిని రక్షించుటకు ప్రభువు వాగ్దానము చేయలేదు. ప్రభువతనిని రక్షించుటకు ఇష్టపడిన యెడల అది ఆయన విశేషాధికారమగును గాని మానవునిది కాదు. ప్రభువు తన వాక్యములో చెప్పినది ప్రకటింపబడలెను. మరియు ఆలస్యము చేయుటలో గల అపాయమును గూర్చి ప్రజలు హెచ్చరింపబడవలెను. తన మరణశయ్య పైనుండి కేవలము తన భక్తిని

ప్రకటించుటయే మానవుని రక్షించుటకు ప్రభువు వాగ్దానము చేయలేదు.

"దీపము వెలుగుచుండగా ఘోరపాపి బహుశ తిరిగి రావచ్చును" అని కొందరు చెప్పుదురు. గాని "దీపము వెలుగుచుండగా, ఓ పాపీ, తిరిగి వచ్చుటకు వేగిరపడుము ఏలయనగా నీవు సంసిద్ధుడవు కానప్పుడు మరణము సంభవింపవచ్చును" అని క్రైస్తవుడు చెప్పవలెను.

మానవుని పాపముల కొరకు క్రీస్తు సిలువపై తన రక్తమును చిందించెను. విధేయత గల విశ్వాసము ద్వారా ఈ పాపయాగమును ఉపయోగించుకొనవలెను. "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు..... క్రీస్తుయేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలు పరచెను" (రోమా 3:24,25; గలతీ 5:6; రోమా 6:3,4; గలతీ 3:26,27; ఎఫెసీ 2:8).

సువార్తకు లోబడి రక్షింపబడే ఆఖరి తరుణము ఒకానొకప్పుడు రావచ్చును. ఆ సమయము ఎప్పుడు వచ్చును ? ఎవరు యెరుగరు. గనుక ఈనాడే లోబడుము.

✤

# 5 . క్షమాపణ నిదర్శనము

## (The Evidence of Pardon)

ఒకడు దేవుని కుమారుడో కాదో తెలిసికొనుట యెట్లో యనునది ప్రతివానికి ప్రాముఖ్యమైనట్టిది ఇప్పుడును, నిత్యమును మానవుని ఆనందమును గూర్చి అది యున్నట్టిది. ఎవడును తన రక్షణను గూర్చి సంశయిస్తూ యుండవలెనని ప్రభువు తప్పక కోరడు. అయినను ఈ ప్రాముఖ్య సంగతిని గూర్చి అనేకులు చింతించుచు తమ జీవితమును గడుపుదురు. మరియు ఎన్నడు వారు పూర్తిగ సంతృప్తి జెందరు.

### 1. భావములు క్షమాపణ నిదర్శనములా ?

అనేకులు శారీరక భావములపై తమ క్షమాపణ ఋజువులను ఆధారపరతురు. వారు సంతోషముగా లేనియెడల వారు క్షమించబడినవారు కారు. అయితే ఒకని క్షమాపణ నిదర్శనము కొరకు దేవునిచే అంగీకరించబడుట కొరకు శారీరక భావములు నమ్మదగినవి కావు.

#### A. ఒకడు నిజానికి తప్పుగా భావించవచ్చును

ప్రతి మతములోను మేము నీతిమంతులమే యని భావించుకొను వారు కలరు. తార్సువాడైన సౌలు తాను మార్పుజెందక ముందు క్రైస్తవులను హింసించుటలో ఇది సత్యము ఏలయనగా కొంతకాలమయిన తరువాత అతడిట్లనెను: “సహోదరులారా, నేనునేటివరకు కేవలము మంచి మనసాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచుకొంటిని” (అపొ.కా. 23:1). మరల, “నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని నేనను కొంటిని” యని అతడనెను (అపొ.కా. 26:9).

పౌలు మంచి మనస్సాక్షి గలవాడును, భక్తిపరుడునై యుండినను

సంఘమునకు వ్యతిరేకముగా పోరాటము సాగించుటలో అతడు తప్పుచేసెను (గలతీ1:13; 1తిమో1:12-16). సహృదయత కలిగి యుండుట అంగీకరించబడుటకు నిదర్శనముకాదు. నైతిక తీర్మానము విద్యవలన కలుగు ప్రతిఫలము. జరిగించబడిన ఒక క్రియను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మనస్సాక్షి యున్నది. అది సరియైనదే యని ఒకడు నమ్మి దానిని జరిగించిన యెడలఒకని మనస్సాక్షి దానినంగీకరించును అయితే అది సరి కాదని యెరిగియు దానిని జరిగించిన యెడల వాని మనస్సాక్షి దానిని తిరస్కరించును. కాని మంచి చెడ్డలను మనస్సాక్షి నిర్ణయించదు. దేవుడు నైతిక తీర్మానముల మార్గదర్శిగా యున్నప్పుడు మాత్రమే భావించవచ్చును అపార్థము చేసికొనిన తీర్మానములనతడు కలిగియుండవచ్చును. మానవునికి సత్యమును తెలియజెప్పుటకు మనస్సాక్షి అంగీకరించిన యెడల దానిని బట్టి దేవుడు ఆనందించునని అర్థము కాదు. బైబిలు ఇట్లనుచున్నది: “ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును” (సామె 14:12; 16:25; 12:15).

అతడు తప్పు చేయుచుండ వచ్చునని సౌలుకు ఎన్నడు తట్టలేదు. అయితే అతడు సరికాదు. నేను సరియే యని అతడు తలంచినను అతడు సరికాదు, సహృదయత ఒక్కటి మాత్రమే సరిపోదు. ఒకడు నమ్ము దానిని బట్టి ఏమైనా కలుగునా ? యని ప్రజలు తరుచు అడుగుదురు. పౌలు సందర్భములో అది కలిగెను.అయితే అది సులభమైనది కాకపోయినను సౌలు మార్పునొందెను. అతడెందువలన మారెను? అతడు సరికాడని అతడెరిగెను. నిజానికి తప్పుగా భావించినవాడు సత్యమును వినినప్పుడు రెండింటిలో ఒక సంగతి జరుగును : అతడు తన తప్పును విడిచిపెట్టును లేదా అతడు సహృదయుడై యుండుట మానుకొనును. అతడు సత్యమునకు లోబడిన యెడల అతడింక తప్పుచేయుచున్న వాడు కాడు. అతడు

సత్యమునకు లోబడని  యెడల అతడింక సహృదయత కలిగిన వాడు కాడు. సత్యము అందించబడినప్పుడే అసత్య భావములనుండి తప్పక వేరుపడవలెను.  సత్యమును వినిన తరువాత యెవడును నిజానికి తప్పుగా భావించలేడు. గనుక పౌలు అసత్యమును విడనాడి సహృదయుడై యుండెను(లూకా 8:15).

## B. సాక్ష్యముపై భావములు ఆధారపడి యుండును

విశ్వసించిన సాక్ష్యముల ఫలితముగా భావములు కలుగును గాని అవి ఆ సాక్ష్యము యొక్క యధార్థతను గూర్చిన రుజువు కాదు. తాను క్షమింపబడితినని ఒకడు విశ్వసించిన యెడల, అది నిజమైనను వట్టిదైనను అతడట్లే భావించును. అసత్య సాక్ష్యమును విశ్వసించుట ద్వారా కలుగు సంతోషమ లేక దుఃఖ భావములు ఎంత గాఢముగా యుండునో సత్యమును విశ్వసించుట ద్వారా కూడా అవి అంతే గాఢముగా యుండును.

ఒకడు నిజముగా ఎట్లు మోసగింపబడవచ్చునో యాకోబు తాను ప్రేమించిన కుమారుడగు యోసేపు మరణించెనని నమ్మి అతని గూర్చి ప్రలాపించుటలో కాననగును. తన కుమారుడు మరణించెనని నమ్ముచు యాకోబు ప్రలాపించినను, యోసేపు  మరణించలేదు. ఇరవై రెండు సంవత్సరముల తరువాత యాకోబు అతనిని ఐగుప్తులో చూచెను. యాకోబు యొక్క భావములు నిజమే అయినను, అవి అతని కుమారుని మరణమును గూర్చిన నిదర్శనముకాదు. అతడు వినిన సాక్ష్యము సత్యము కాదు.

యోసేపు చనిపోయెనని యాకోబు ఎందువలన దృఢముగా నమ్మెను? అది అతని పెద్ద కుమారుని అబద్ధ మాటల వలనను, రక్తపు మరకలు గల అంగీ వలనను కాదా? అవును. నిజమే యాకోబు చూచిన దానిని, వినిన దానిని బట్టియే యోసేపు మరణించెనని అతడు విశ్వసించెను. ఈఅబద్ధ సాక్ష్యమును నమ్ముట వలన దుఃఖము సంభవించెను

నిరాశ కలిగెను. ఒకడు నమ్ము దానిని బట్టి అతని భావములు నిర్ణయించబడును. యోసేపు మరణించెనని యాకోబు నమ్మినంత కాలము అదే నిజమైనట్లుగా అతడు దుఃఖములో మునిగిపోయెను.

కొన్ని సంవత్సరముల క్రితము ప్రమాదములో చిక్కుకొని మరణించిన ఒక యౌవనస్థుని అంత్యక్రియలను జరిగించుటకు ఈ పుస్తక గ్రంథకర్త పిలువబడెను. ఒక యౌవనస్థుని శవముపై అంత్యక్రియలు జరిగించబడెను. అయితే తరువాత, అందరికీ ఆనందమును ఆశ్చర్యమును కలిగించునట్లు ఆ యౌవనుడు తన యింటికి (సజీవుడుగా) తిరిగి వచ్చెను! మేమందరము నిజానికి తప్పుగా భావించితిమి. ఈ యౌవనస్థుని అంత్యక్రియలను జరిగించుచున్నట్లు నేను నమ్మితిని, తన తల్లి తన కుమారుని సమాధి చేయుచున్నట్లు నిజముగా నమ్మెను.ఆమెయు మిగిలిన కుటుంబ సభ్యులును నిజముగా ప్రలాపించిరి. కాని ఆ కుమారుడు చనిపోయెనని అనుకొని, దానిని విశ్వసించినను అది సత్యము కాకపోయెను. మేమందరము మోసగించబడితిమి. గనుక మానవుని కందిన సమాచారము సత్యమైనను, అసత్యమైనను అతడు దాని యందు గల విశ్వాసమును బట్టి అతని భావముల తత్వమును, ఉద్రేకతయు ఆధారపడి యుండును.

జీవిత సమస్యలలో మానవుడు తన భావములపై ఆధారపడలేడు గనుక తన రక్షణను గూర్చిన ఆత్మీయ విషయములలోఅట్లు చేయలేడని అతడు గ్రహించవలెను. భావములు విశ్వాసము మీదను, విశ్వాసము సాక్ష్యము మీదను ఆధారపడి యున్నవి. సౌలు క్రైస్తవులను హింసించుటలో సరియే చేయుచున్నానని నమ్మినను అతడు మోసగించబడెను. యోసేపు చనిపోయెనని యాకోబు నమ్మినంత మాత్రమున అది నిజము కాలేదు అట్లే ఒక తల్లి తన కుమారుడు చనిపోయెనని నమ్మినను కూడ అది నిజము కాలేదు.

ఒక అబద్ధమును నమ్మిన యెడల అది నిజము కాదు. అయినను మత సంబంధ విషయములలో ప్రజలు సహృదయత కలిగి ఏమి నమ్మి ఆచరించి నను అది బైబిలు ప్రకారముండినను లేకపోయినను సరే వారు రక్షింప బడుదురని భావించేవారు కలరు. కాని యేసు ఇట్లనెను : "మీరు సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:32).

ఒకడు అంగీకరించిన మత బోధ తప్పు అయిన యెడల అతనిలో కలుగు భావములు బలమైనవయినను అతని విశ్వాసాచరణలు తప్పగును. ఒకడు మంచిగానే యున్నానని అనుకొనినంత మాత్రమున అతడు క్షమించబడెననియు, దేవునికి అంగీకారయుక్తముగా ఆరాధించు చున్నాననియు తెలిసికోలేడు. విశ్వాసము యొక్క ఫలితము భావములుగాని దానియొక్క కారణము కాదు. గనుక ఒకని భావములు కారణములు కాకుండ ఫలితమై యున్నందున ఒకని భావములు పాపక్షమాపణ యొక్క నిదర్శనము కానేరవు.

రక్షణకును, అంగీకారయోగ్యమైన ఆరాధనకును ఒకడు తన భావములను నిదర్శనముగా అంగీకరించిన యెడల ఆదిమ క్రైస్తవ్యము వలె దేవతార్చన కూడ సరియైనది యని నిరూపించగలడు. దీని నంగీకరించుటకు యెవడు సిద్ధముగా యున్నాడు?

అంతే కాకుండ భావములు క్షమాపణ యొక్క నిదర్శనమయిన యెడల ఒకడు రక్షింపబడినప్పుడతడెట్లు భావించవలెను? భావములు క్షమాపణ యొక్క నిదర్శనమని దేవుడెక్కడ వర్ణించలేదు. ఇవి నిజము కానేరవు. ఒకడు తాను భావించుచున్న రీతిని బట్టి క్షమించబడినతినని ఎరుగలేడు గాని ప్రభువుచే క్షమించబడినప్పుడు అతడానందించు అవకాశము గలదు.

## ౨. అయితే క్షమాపణ ఋజువేమిటి ?

ఈ ప్రాముఖ్య ప్రశ్నకు జవాబు ఇచ్చునప్పుడు పాపక్షమాపణ పాపి యొక్క హృదయములోగాక దేవునిమనస్సులో సంభవించునని ప్రజలు గుర్తుంచు కొనవలెను(నెహెమ్యా 9:17). పాపి తనలో తాను క్షమాపణను పొందలేడు, అది అతనిలో లేదు కాని అతనికొరకు పరలోకములో అది జరుగును. పాపక్షమాపణ ప్రజలలో సంభవించే మార్పుకాదు. క్షమించుట దేవుని క్రియయైయున్నది. పాపులు ఎన్నడయినా క్షమించబడిన యెడల దేవుడే దానిని జరిగించవలెను.

హృదయాంతరంగిక మార్పు క్షమాపణ యని అనేకులు భావించిరి అయితే మారుమనస్సులో ఈ మార్పు సంభవించును మరియు పాపక్షమాపణకు ముందు ఇదిజరుగును (అపొ.కా. 2:38 3:19). పాపియొక్క హృదయమార్పు క్షమాపణ గాని క్షమాపణ యొక్క ఋజువు గాని కాదు.

క్షమించుటకు అధికారము గల దేవుడు చెబితేనే గాని ఒకడు క్షమించబడినట్లు తెలిసికొనలేడు. చెరసాలలో యున్న వాడొకడు క్షమించబడినట్లు ఎట్లు తెలిసికొనగలడు. అట్లే ఒక వ్యక్తి దేవుడతనని క్షమించినట్లు తెలిసికొన గలడు. ఒకడు తానను కొనుచున్నందువలన గాని తాను కనుచున్న కలల వలనగాని కాక క్షమించుటకు అధికారముగలవాడు చెబితేనేతాను క్షమించబడి నట్లు ఎరుగ గలడు. క్షమించుట దేవుని యొక్క క్రియగనుక, అది పరలోకములో జరుగును. గనుక క్షమాపణను గూర్చి ఆయన చెప్పినప్పుడే ప్రజలు దానిని గూర్చి తెలిసికొనగలరు.

### A). క్షమించుటకు దేవుడు షరతుల నిచ్చెను

పాపములు క్షమించుటకు దేవుడు వాగ్దానము చేసినప్పుడు దేనిపై

ఆధారపడి దానిని జరిగించవలెనో నిర్ణయించు హక్కు ఆయనదే యని ప్రజలు గ్రహించవలెను. బైబిలులో దేవుడు కొన్ని షరతుల నిచ్చెను. మరియు ప్రజలు వాటికి లోబడినప్పుడు వారి పాపములను క్షమింతునని ఆయన వాగ్దానము చేసెను. ఆయన వాక్యము ద్వారా తప్ప ప్రభువు అతని కొరకు ఏమి చేసెనో ఒకడు ఎట్లు తెలిసికొనలేడో అట్లే బైబిలు బోధ ద్వారా తప్ప వేరే విధముగా అతడు పాపక్షమాపణ నిర్ధారణను కలిగి యుండలేడు. అతడు తన రక్షణ జ్ఞానమును కలిగియుండుటకు ప్రభువుయొక్క రక్షణ షరతులేమిటో తెలిసికొని వాటికి విధేయత చూపవలెను. అట్లయితే ఆ షరతులేమిటి ? విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మములు క్షమాపణ షరతులని క్రొత్తనిబంధన బోధించుచున్నది. దయచేసి ఈ దిగువ లేఖనములను గమనించుము:

యేసు ఇట్లనెను: “మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును” (మార్కు 16:15,16). “మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు” (లూకా 13:3).

“ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును” (రోమా 10:10).

“అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను” (అపో.కా. 8:37).

“మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి  అప్పుడు మీరు పరిశు ద్ధాత్మ అను వరము పొందుదురు” (అపో.కా. 2:38).

గనుక ఈ విధముగా దేవుడు పాపములను క్షమించినట్లు

నిస్సందేహముగా ఒకడు తెలిసికొనగలడు . క్షమించబడవలెనంటే ప్రజలు ఏమి చేయవలెనో దేవుడు తన వాక్యమునందు పదే పదే విపులముగా చెప్పెను .ప్రజలు వాటిని చేసినప్పుడు ఆయన వారి పాపములను క్షమింతునని తన వాక్యమునందు వాగ్దానము చేసెను. ఒకని పాపములు క్షమించబడినవని చెప్పగల నిజమైన ఋజువు ఇదియే.

గనుక మత సంబంధ విషయములన్నిటిలో పొరబాటు లేని మార్గదర్శి యిది: ముందుగా ఊహించుకొనిన భావము లెట్లున్నను, మానవుని రక్షణను గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నను అది సరియైనది. దేవుడిచ్చిన క్షమాపణ చట్టమొకటి యున్నది. ఆ చట్టమునకు అన్యుడైన పాపి విధేయుడైనప్పుడతడు క్షమించబడును.

## B). పాపమునుండి విడుదల పొందు నిమిత్తము సువార్తకు లోబడుట అవసరము

పాపక్షమాపణ పొందే మార్పుజెందు విధానము ఒక్కొక్కసారి 'సువార్తకు లోబడుట ' యని చెప్పబడినది (రోమా 10:16). ప్రజలు పాపము నందున్నవలన నశించిపోవుదురు. పాపమునుండి రక్షించబడుటకు వారు సువార్తకు లోబడ వలెను. అయినను క్రీస్తు యొక్క క్షమాపణ షరతుల బైబిలు జ్ఞానము చాలమందికి లేదు. క్రైస్తవునిగా ఒకడు ఎప్పుడు ఎట్లగునో లేక ప్రభువు సంఘ సభ్యునిగా ఎట్లగునో వారికేమియు తెలియదు. గాని రక్షణ సంకల్పమును దేవునివాక్యము చాల విపులముగా చూపించుచున్నది.

### 1. సువార్తకు లోబడుట వక్కాణించబడినది

**a).** సువార్తకు లోబడకపోవుట అపాయకరము. ......"దేవుని సువార్తకు అవిధేయులైన వారిగతి యేమవును?" అని పేతురు అడుగుచున్నాడు (1పేతురు 4:17).

**b).** 2థెస్స 1:7–9లో పేతురడిగిన ప్రశ్నకు పౌలు ఇట్లు జవాబిచ్చుచున్నాడు : "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతోకూడ పరలోకము నుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయును ". కొందరికి ప్రతిదండనయు, కొందరికి విశ్రాంతియు లభించునని గమనించుము. ప్రతి దండనయనగా సమూల నాశనము కాదు గాని స్పృహ కలిగియున్న నిత్యవేదన. ఎంత భయంకరమో!

**c). సత్యమునకు విధేయులగుట ద్వారా ప్రజలు తమ మనస్సులను (ఆత్మలను) పవిత్రపరచుకొందురని పేతురు చెప్పుచున్నాడు:** "మీరు సత్యమునకు విధేయులగుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి ....." (1పేతురు 1:23). ఒకడు క్రీస్తురక్తము వలన శుద్ధిచేయబడును గాని ఒకడు వాక్యమునకు లోబడవలెను (1యోహాను 1:7; ప్రక 1:5; అపొ.కా. 22:16). క్రీస్తు అందరి కొరకు చనిపోయెను (హెబ్రీ 2:9). అందరు రక్షింపబడుదురా ? కాదు, గాని ఎవరు లోబడుదురో వారే రక్షింపబడుదురు (హెబ్రీ 5:8,9; ప్రక 22:14).

**d).** రోమాలోని క్రైస్తవులు ఉపదేశక్రమమునకు హృదయ పూర్వకముగా లోబడినప్పుడు పాపముల నుండి విడుదల పొందిరి. "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి" (రోమా 6:17,18). క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానములు సువార్త వాస్తవములు (1కొరింథీ 15:1–4). క్రైస్తవులగుటలో పాపులు పాపము యెడల నూతన జీవితము జీవించుటకు తిరిగి లేపబడుదురు (రోమా 6:3,4). ప్రజలు సువార్త ఉపదేశ క్రమమునకు లోబడుదురు. గనుక రోమీయులు సువార్తకు లోబడినప్పుడే పాపము నుండి విడుదల పొందిరి గాని అంతకు ముందు

కాదు. వారొక క్రొత్త జీవితమును జీవించుటకు బాప్తిస్మము నుండి లేపబడితిరి. సువార్తకు విదేయత చూపుటనగా దాని అర్థమిది.

**2. ఒకడు ఏమి చేయవలెను ?**

a). ఒకడు సువార్తను విని విశ్వసించవలెను (అపొ.కా. 3:22, 23, 28; రోమా 10:17). అనగా ఒకడు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మవలెను (మార్కు 16:15,16; అపొ.కా. 16:31).

b). ఒకడు తన పాపములన్నిటిని గూర్చి మారుమనస్సు పొందవలెను (లూకా 13:3,5; అపొ.కా. 2:38; 17:30).

c). క్రీస్తు ప్రభువని ఒకడు ఒప్పుకొనవలెను (రోమా 10:9,10; అపొ.కా. 8:37; 1తిమో 6:12).

d). ఒకడు బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; మత్తయి 28:18-20). ఇవన్నియును పాపక్షమాపణ పొందు నిమిత్తము జరిగించబడవలెను.

***3.* అదెట్లు జరిగించబడును ?**

a). **ఒకడెట్లు వినును ? దేవుని ఎట్లు విశ్వసించును ?**

1) ఒకడు చెవితో వినును (ప్రక 2:7).

2) హృదయ పూర్వకముగా క్రీస్తునందు విశ్వసించును (అపొ.కా. 8:37).

3) ఒకని మనస్సు మేధస్సు, చిత్తములే హృదయము (మత్తయి 9:4; రోమా 10:10).

b). **ఒకడు మారుమనస్సు ఎట్లు పొందును?**

1) నీనెవవారు మారుమనస్సు పొందిరి (లూకా 11:32). యోనా

చేసిన బోధను వారు విశ్వసించినప్పుడు వారు తమ దుర్మార్గత నుండి తొలగిరి (యోనా 3:10). 2) తప్పిపోయిన కుమారుడు మారుమనస్సు పొందెను(లూకా 15:17-20). నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్ళుదునని అతడనుకొనెను. అతడు లేచి వెళ్ళెను.

3) మారుమనస్సు అనగా దుఃఖము కాదు (2కొరింథీ 7:10). మార్చబడిన జీవితము మారుమనస్సు కాదు. మారుమనస్సు తరువాత నవరణ జీవితము కలుగును (లూకా 3:8). అవినీతిని మాని నీతిని జరిగించుటకు చేసికొనిన నిశ్చయిత అది.

c) **ఒకడెట్లు ఒప్పుకొనును?**

ఒకడు నోటితో ఒప్పుకొనును(రోమా 10 9,10). ఒకడు తన కలలను, భావములను పాపములను గాక క్రీస్తును ఒప్పుకొనును (అపొ.కా. 8:37; 1తిమో 6:12,13).

d) **ఒకడెట్లు బాప్తిస్మము పొందును ?**

ఒకడు నీటిలో పాతిపెట్టబడి దానినుండి లేపబడును (రోమా 6:4; కొలస్స 2:2).

**4. అది ఎందుకు జరిగించబడును ?**

a) ఒకడు ఎందుకు విశ్వసించవలెను? (యోహాను 8:21,24; మార్కు 16:16). శిక్షనుండి తప్పించుకొనుటకు.

b) ఒకడు ఎందుకు మారుమనస్సు పొందవలెను? (లూకా 13:3,5; అపొ.కా. 17:30,31; 2 పేతురు 3:9). మారుమనస్సు పొందనివాడు నశించును

c) క్రీస్తు ప్రభువని ఒకడు నోటితో ఎందుకు ఒప్పుకొనవలెను?

(రోమా 10:9, 10; మత్తయి 10:32,33; మార్కు 8:38). రక్షణ కల్గునట్లు ఒప్పుకొనవలెను.

d) ఒకడు ఎందుకు బాప్తిస్మము పొందవలెను? (మార్కు 16:16; అపొ.కా. 2:38; 22:16; 1పేతురు3:21). పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను.

## 5. దేవుడేమి చేయును ?

a) ఒకడు సువార్తకు లోబడినప్పుడు, దేవుడతని పాపములు క్షమించును (అపొ.కా. 2:38; లూకా 24:47; మార్కు 16:16).

b) రక్షించబడిన వానిని ఆయన తన సంఘముతో చేర్చును (అపొ.కా. 2:47). ఆయన సంఘమే సరియైన సంఘము. దానిలోఆయనే ఒకని చేర్చును.

1) రక్షణ షరతులే సంఘ సభ్యత్వపు షరతులు, ఒకడు రక్షింపబడి సంఘ సభ్యుడు కాకుండా యుండుట యనునది ఏదియు లేదు.

2) సువార్తకు లోబడినవాడు మతశాఖలో చేరర్చబడడు. రక్షింపబడి మీకిష్టమైన సంఘములో చేరుడి యని అపొస్తలులు ఎన్నడు బోధించలేదు. సువార్తకు లోబడిన వారందరు ఒకే షరతులకు లోబడిరి, ఒకే శరీరమైన సంఘముతో చేర్చబడిరి.

c) సంఘసభ్యులు రక్షించబడినవారు. క్రైస్తవుడు అనే కుటుంబ నామమునకు వెనుక ముందు ఏమియు కలుపకుండ దానిని ధరింతురు (అపొ.కా. 11:26; 1పేతురు 4:16). ఏ సమాజములోనైన యున్న బాప్తిస్మము పొందిన విశ్వాసులు ఆ ప్రదేశములో క్రీస్తు సంఘమగుదురు. అట్టి స్థానిక సంఘములు క్రీస్తుసంఘములని పిలువబడెను (రోమా 16:16).మరియు వారు ఆయన ఆదేశముల ప్రకారము ఆరాధింతురు

(అపో.కా. 2:42; 20:7; 1కొరింథీ 16:1-2; ఎఫెసీ 5:19).

d) సువార్తకు విధేయులైన వారికి దేవుడు నిత్యజీవమును వాగ్దానము చేసెను (1యోహాను 2:25; రోమా 6:22,23). ఇది షరతులతో చేయబడిన వాగ్దానము వారు నమ్మకముగా యుండవలెను ప్రకటన (2:10).

## 6. పాపులు మోసగించబడగలరు

మీరు క్రీస్తును మీఆత్మీయ రక్షకునిగా అంగీకరించిన తక్షణమే రక్షించబడుదురు అని కొందరు పాపులకు తరచు చెప్పుదురు. ఈ మాటలు చెప్పినది ఆత్మ ప్రేరితులు కాని మానవులే గాని ప్రభువు కాదు. ఈ సంగతిని పాపులకు చెప్పువారు, వారు క్రీస్తునెట్లు అంగీకరించవలెనో లేక పాపులు రక్షించబడుటకు దేవుడేమి కోరుచున్నాడో తెలియజెప్పరు. మార్పు అంతయు ఒక మానసిక క్రియ యని, అనగా క్రీస్తు వారి రక్షకుడని పాపులు హృదయములో విశ్వసించగానే రక్షణ కలుగునని వారు సాధారణముగా బోధింతురు. దీనికి వ్యత్యాసముగా దేవుని వాక్యము కొన్ని ప్రత్యేక షరతులను ఇచ్చుచు పాపులు వాటికి లోబడినప్పుడు మాత్రమే రక్షణను వాగ్దానము చేయుచున్నది. ఎట్లయినను 'క్రీస్తును అంగీకరించు' వారు రక్షింపబడినవారమని అనుకొందురు. ఏలయనగా వారు మార్పుజెందినవారనీ, వారిప్పుడు దేవుని పిల్లలని వారికి తెలియజెప్ప బడినను, వారు చెప్పు రీతిగానే వారు భావించుచున్నారనుటలో సందేహమేమియు లేదు. అయితే వారు క్షమించబడినట్లే సంతోషముగా యుందురు. ఈ పరిస్థితిలో నిష్కపటమైన సహృదయత గలవారనేకులు ఉండుట విచారకరము. వారు క్షమించబడిపోయినట్లు వారనుకొందురు గాని నిజానికి బైబిలు విశ్వాసము వలన మాత్రమే రక్షణను బోధించుట లేనందున వారు నశించిపోవుచున్నారు (యాకోబు 2:24).

ఒకని రక్షణను గూర్చిన భావములు బైబిలునకు విరుద్ధముగా యున్నయెడల, అతడొక అబద్ధమును నమ్ముట వలన అట్టి భావము లేర్పడినవని తెలియనగును. ఉదాహరణకు :- ఒకడు బాప్తిస్మము అక్కర లేకుండ రక్షింపబడితినని అనుకొనుచున్నయెడల అతడు తప్పు. ఏల యనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని" క్రీస్తు చెప్పెను. మరియు పేతురు 'మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి" యని చెప్పెను (మార్కు 16:16; అపో.కా. 2:38). క్రీస్తుయొక్కయు, ఆత్మ ప్రేరితులైన ఆయన అపొస్తులుల యొక్కయు సాక్ష్యము కంటే ఒక మనుష్యుని భావములే క్షమాపణ యొక్క మంచి నిదర్శనములని యెవడు తలంచడు. గనుక క్షమాపణ నొందుటకు ప్రభువు కోరిన దానిని నెరవేర్చకుండ ఒకడు క్షమించబడితినని అనుకొనుచున్న యెడల అతని భావములతని మోసగించుచున్నవి.

## 3. ఆత్మలయొక్క సాక్ష్యము క్షమాపణ నిర్ధారణ నిచ్చుచున్నది

క్షమాపణ నిదర్శనము రెండు ఆత్మలపై ఆధారపడియున్నది : అవి దేవుని, మానవుని ఆత్మలు. దేవుడు ఏ షరతులపై క్షమాపణను వాగ్దానము చేసెనో వాటిని మానవుడు నేర్చుకొనవలెను. మరియు అతడు ఆ షరతులకు లోబడినట్లు అతడు తన మనస్సులో ఎరిగియుండలెను. పరిశుద్ధాత్ముడు అపొ.పౌలు ద్వారా ఇట్లు చెప్పెను : "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు" (రోమా 8:16).

**గమనిక** : లేఖనములు రెండు సాక్షులను గూర్చి చెప్పుచున్నవి. (1) దేవుని ఆత్మ లేక పరిశుద్ధాత్మ (2) మానవుని ఆత్మ. ఆత్మ మన ఆత్మకు సాక్ష్యమిచ్చుచున్నాడని గాక, ఆత్మ మన ఆత్మతో సాక్ష్య మిచ్చుచున్నాడని ఈ వాక్యము చెప్పుచున్నది. 'ఎ' అనువాడు 'బి'తో సాక్ష్యమిచ్చుచున్న యెడల (ఎబి) ఇద్దరు సాక్ష్యమిచ్చుచున్నారు.

సాక్ష్యమిచ్చువాడు సాక్షి గనుక, ఆత్మ మన ఆత్మతో సాక్ష్యమిచ్చుచున్నాడని వాక్యము చెప్పుచున్నది గనుక ఈ ఇద్దరి సాక్ష్యమును వినవలెను.

### A. ఆత్మయొక్క సాక్ష్యము బైబిలులో యున్నది.

ఆత్మ ప్రేరితులైన వారి ద్వారా పరిశుద్ధాత్ముడు యిచ్చిన సమాచారము ఆత్మయొక్క సాక్ష్యమనబడినది (నెహెమ్యా 9:30; హెబ్రీ 10:15-16; యిర్మియా 31:31; అపొ.కా. 1:16; 2 సమూ 23:2). గనుక దేవుని ఆత్మ మాటల ద్వారా సాక్ష్యమిచ్చును. ఆత్మ ప్రేరేపణ వలన ఈయబడిన బైబిలు దేవుని మనస్సు యొక్క బయల్పాటు. అది నమ్మదగిన సాక్షి (2పేతురు 1:21; 1కొరింథీ 2:10-13). లేఖనములలో పాపులు ఎట్లు రక్షింపబడుదురో పరిశుద్ధాత్ముడు చెప్పియున్నాడు: అనగా వారు (1) సువార్తను వినవలెను (2) క్రీస్తునందు విశ్వాసముంచవలెను (3) పాపములన్నిటిని గూర్చి మారు మనస్సు పొందవలెను (4) క్రీస్తును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను మరియు (5) పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందవలెను. పాపియైనవాడు ఈ షరతులకు లోబడినప్పుడు, దేవుడతని పాపములు క్షమించునని ఆత్మ వాగ్దానము చేయుచున్నాడు.

### మానవుని సాక్ష్యము తన హృదయము నుండి కలుగును

మానవుని ఆత్మ తనలోని సంగతులునెరుగును మరియు అతడు చేయు దానిని గూర్చి సాక్ష్యమిచ్చును (1కొరింథీ 2:11). క్షమాపణ నొందుటకు ఆత్మ ద్వారా బైబిలు నందుంచబడిన ఆజ్ఞలకతడు లోబడెనో లేదో అది యెరుగును. అట్లు సాక్ష్యమియ్యగలినట్టిది ఒకని మనసాక్షి లేక ఆత్మయే (రోమా 9:1).

సువార్తలో యుంచబడిన ప్రభువు ఆజ్ఞలకు ఒక పాపి విధేయుడై

నప్పుడు ఆత్మ తన ఆత్మతో అతడు దేవుని బిడ్డయని సాక్ష్యమిచ్చును. భావముల ద్వారాను దర్శనముల ద్వారాను కాక దేవుని వాగ్దానములలో ఆత్మ సాక్ష్య మిచ్చును. గనుక క్షమాపణ షరతులను గూర్చిదేవుని మనస్సు బయల్పరచుట ద్వారా ఆత్మ సాక్ష్యమిచ్చును. మరియు ఈ రక్షణ ఆజ్ఞలకు ఒకడు విధేయుడైనాడో లేదో యను దానిని గూర్చి మానవుని ఆత్మ సాక్ష్య మిచ్చును. గనుక ఒకరు గాక ఇద్దరు కలసి సాక్ష్యమిత్తురు : పరిశు ద్ధాత్ముడు క్షమాపణ షరతులను సూచించును, మానవుని ఆత్మ ఆ షరతులకు లోబడినట్లును సాక్ష్యమిచ్చును. ఈ ఇద్దరు సాక్షులు వారి సాక్ష్యములో ఏకమైనప్పుడు క్షమాపణను గూర్చిన సమస్య తీరిపోవును. గనుక ఒకడు క్రీస్తు రక్తము వలన పాపమునుండి పరిశుద్ధుడు కావలెనంటే అతడు ఆత్మ యొక్క నియమమునకు లోబడవలెను (రోమా 8:2) అది ఆత్మ క్రొత్త నిబంధన లో బయల్పరచిన క్షమాపణ షరతులు.

రోమా 8:16 యొక్క భావమును గ్రహించుటకు ఒక ఓటరు యొక్క ఉదాహరణను గమనించుము. ఒకడు ఓటు వేయుటకు అర్హుడో కాదో అతడెట్లు తెలిసికొనును ? అతని భావముల వలనా? కాదు, గాని ప్రభుత్వము దానిని ప్రకటించును. అయితే ఎట్లు ? దానియొక్క చట్టముల వలన, శాసనముల వలన ప్రకటించును. ఒకడు ఓటరుగా యుండవలెనంటే 1) అతడు భారతదేశ పౌరుడు కావలెను 2) కనీసము 18 సంవత్సరములు వయస్సు కలిగియుండవలెను మొదలగు షరతులున్నవి. ఒకడు తన మనస్సు నెరిగిన వాడయితే ఈ షరతులన్నిటిని అతడు నెరవేర్చిన యెడల అతడు ఓటు వేసే హక్కు గలవాడని యెరుగును. అట్లే ఒకడు దేవుని బిడ్డయగుటకు అవుసరమయిన షరతులను ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. గనుక ప్రతివాడు ఈ షరతులకు లోబడెనో లేదో తనకు తానే పరీక్షించుకొనవలెను (2 కొరింథీ 13:5). ఏలయనగా ఈ రెండు ఆత్మల సాక్ష్మము వలననే ఒకడు క్రైస్తవుడని యెరుగగలడు.

ఒకడు తండ్రి యింటిలో నమ్మకమైన కుమారునిగా యుండుటకు అతనికి ఉండవలసిన ప్రవర్తన గూర్చి దేవుని ఆత్మ బైబిలులో సాక్ష్యమిచ్చుచున్నాడు (2పేతురు 1:5–11; అపొ.కా. 2:44; 20:7 తీతు 2:12; ప్రక2:10). ఒకని జీవితమును గూర్చిన వాస్తవములు ఆ సాక్ష్యముతో ఏకీభవించినప్పుడు, ఒక క్రైస్తవుడెట్లు జీవించవలెనో అట్లు జీవించుచున్నట్లు అతడెరుగును.

మరల బైబిలు చెప్పురీతిగా గాక వేరే విధముగా ప్రజలు పాపక్షమాపణ వాగ్దానమును కలిగియుండలేదని విశదమగుచున్నది. అందువలననే రక్షణ నిమిత్తము ఆత్మ బయలుపరచిన దానిని గాక మానవులు చెప్పు వంద సంగతులను చేసినను అతడు క్షమించబడినట్లు ప్రభువునుండి వాగ్దానమును పొందలేడు. కాని ఒకని పాపములు క్షమించబడుటకు ఆత్మ యిచ్చిన షరతులు నెరిగి వాటికి లోబడిన యెడల, ఖచ్చితముగా అతని పాపములు క్షమింపబడియున్నవని, అతడిప్పుడు దేవుని కుమారుడని, ప్రభువు సంఘ సభ్యుడని చెప్పగలడు, పరిశుద్ధ లేఖనములపై ఆధారపడుట ద్వారా అతడు పొరపాటు పడనవసరము లేదు అతని క్షమాపణను గూర్చి సందేహించ నవసరము లేదు.

## 4. క్షమాపణను గూర్చిన జ్ఞానము సంతోషమును కలిగించును

లేఖనములను పరిశీలించుటలో, ఆదిమ క్రైస్తవులు సువార్తకు లోబడుట ద్వారా క్షమాపణ యొక్క నిర్ధారణకలిగి యుండిరనియు ఆ నిర్ధారణ వారికి ఎక్కువ సంతోషమును కలిగించెననియు మనము తెలిసికొన గలము.

ఉదాహరణకు : ఐతియోపియా ఘనుడు తన త్రోవలో సంతోషముతో ఎట్లు వెళ్ళగలిగెను? (అపొ.కా. 8:35–39). ఫిలిప్పు ఆతనికి యేసును గూర్చి బోధించుచు, ప్రభువు యిచ్చిన రక్షణ షరతులను అతనికి

తెలియజేయగా అతడు క్రీస్తునందలి తన విశ్వాసము నొప్పుకొని బాప్తిస్మము పొందినప్పుడే రక్షించబడినట్లు అతడెరిగి యున్నందున అతడు సంతోషించెను గదా? రక్షించబడినట్లు అతడు భావించుచున్నందున అతడు రక్షణ నిర్ధారణను పొందలేదు. అతడు ప్రభువునకు విధేయుడైనట్లు, దేవుడు తన వాగ్దానమును నెరవేర్చినట్లును అతడెరుగును (మార్కు 16:16; అపొ.కా. 2:47). గనుక క్షమాపణను గూర్చిన అతని సంతోషమునకు కారణమాయెను. క్రొత్త నిబంధనలో మార్పుజెందిన ప్రతివాని సందర్భములోను క్షమాపణ నిదర్శనము కనబడుచున్నది, మార్పులేని దేవుని వాక్యమొక్కటియే వారి రక్షణ యొక్క ఋజువైయున్నది. వారు రక్షింపబడునట్లు ప్రజలు నమ్మవలెనని, తద్వారా కలుగు భావములు దానియొక్క నిదర్శనముగా అంగీకరించవలెనని, అపొస్తలులు బోధించినట్లు బైబిలులో ఎక్కడ కనబడదు. అయినను కూడ ప్రజలు నూతిలో కప్పవలె ఆలోచింతురు. అంటే వారు సంతోషముగా యున్నారు గనుక రక్షింప బడితిమని వారెరిగినట్లు చెప్పుదురు. మరియు వారు రక్షింపబడి నట్లెరుగుదురు గనుక సంతోషముగా యున్నామని చెప్పుదురు. కాని ఆదిమ క్రైస్తవులు రక్షింపబడి నప్పుడు వారి భావములను బట్టి సంతోషించిరి. ఈ నాటి ప్రజలతో కూడ అట్లే యుండును. ఒకడు సంతోషముగా యుండవచ్చును గాని ఒకడు అనుకొనినంత మాత్రమున క్షమాపణ కలుగదు. మానవుని ఆజ్ఞల ఆధారముగా  కలిగిన క్షమాపణ యొక్క జ్ఞానము వలన  సద్భావములు కలుగును. తత్ఫలితముగా దేవుని వాక్యము యిచ్చు దానికంటె ఎక్కువ నిదర్శనమును రక్షణను గూర్చి ఎవడైనను అడిగినయెడల ప్రభువునందు అతని కున్న అవిశ్వాసము బయల్పడును. ఆత్మ యొక్క సాక్ష్యము యదార్థమని నమ్ముచు విధేయత చూపినవాడు దేవుడు తన పాపములనుక్షమించెనని యెరిగి సంతోషించును.

## 5. ముగింపు

దేవుడు తన పాపములను క్షమించెనని ఒకడు నిస్సందేహముగా ఎట్లు తెలిసికొనగలడు ? దేవుడు క్షమాపణ నియమమును తన వాక్యమునందు ఇచ్చి యున్నాడు. మరియు ఆ నియమము నెరిగి దానికి విధేయత చూపిన ప్రతివాడు తాను రక్షింపబడినట్లెరుగును! దేవుని వాక్యము ద్వారానే పాపి రక్షణయొక్క నిర్ధారణ పొందును. గనుక దర్శనములు, కలలు క్షమాపణ నిదర్శనము కావు. దేవుని నుండి క్షమాపణ నిర్ధారణను పొందిన వ్యక్తి  నిజముగా ఆనందించును (రోమా 15:13; 1పేతురు 1:8; యోహాను 15:11).

ప్రభువు రక్షణను వాగ్దానము చేసిన  షరతులకు నీవు లోబడితివా? నీవు లేఖనముల ప్రకారము మార్పుజెందితివని ఖచ్చితముగా చెప్పగలవా? ఈ ప్రశ్నకు సమాధానమిచ్చు ఒకే మార్గమున్నది : రక్షింపబడుటకు నీవు చేసిన క్రియలను అపొస్తలుల కార్యములు అను పుస్తకములో మార్పుజెందిన వారి క్రియలతో పోల్చి చూచుకొనుము. రక్షింపబడుటకు వారు చేసిన క్రియలనే నీవు చేసిన యెడల, నీవు క్షమింపబడిన వాడవు.

క్షమించు షరతులను ప్రభువే ఆదేశించెను. రక్షింపబడగోరు ప్రతివాడును వాటినంగీకరించి లోబడవలెను.

✤

# బైబిలు బాప్తిస్మము

## (Bible Baptism)

బైబిలు నెరిగిన ప్రతి విద్యార్ధికి బాప్తిస్మము తెలిసిన అంశమే. అయినను మానవులలో బాప్తిస్మమును గూర్చిన భేదాభిప్రాయములు ఎన్నో కలవు. ఇందును గూర్చిన సమస్య విశ్వాసములోనే గాని గ్రహింపులో కాదు. సహృదయతతో లేఖనములను పరిశోధించిన యెడల ఈ అంశమును గూర్చిన ప్రతిబంధకము లన్నియు మటుమాయమగును. బైబిలు బాప్తిస్మము యేమిటి ?

క్రీసుకు ముందు వచ్చిన యోహాను యొక్క బోధనల సందర్భముగా బాప్తిస్మము క్రొత్తనిబంధనలో మొదట పరిచయము చేయబడినది. ఇక్కడ మన పఠనము ఆరంభమగును.

### 1. బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క పని

ప్రభువు యొక్క రాకడను గూర్చి మార్గమును సిద్ధపరచు నిమిత్తము బాప్తిస్మమిచ్చు యోహాను దేవునిచే పంపబడెను. యూదులు తమ నడవడిని, తమ జీవితమును మార్చుకొనవలెనని చెప్పు అతని గంభీర స్వరము అరణ్యములో యోర్దాను నది ఒడ్డున కొంతకాలము మట్టుకు వినబడెను (మత్తయి 3:1–2).

ఈ గొప్ప పురుషుడు జన్మించగానే అతనికి యోహాను అను పేరు పెట్టబడెను (లూకా 1:13, 58–63). బాప్తిస్మమియ్యవలెనని అతడు ఆదేశింపబడి నందున అతడు బోధించుటకు, బాప్తిస్మమిచ్చుటకు ఆరంభించెను. అందువలన అతడు బాప్తిస్మమిచ్చు యోహానని పిలువబడెను. దేవుని రాజ్యము ఆసన్నమై యుండెను. యెషయా చేసిన

ప్రవచన నెరవేర్పుగా యోహాను ప్రభువు కొరకు ప్రజలను సిద్ధపరచుచుండెను (మత్తయి 3:3 యెషయా 40:3-4). దిద్దుబాటు కలిగిన జీవితమును గూర్చియు, ఆసన్నమైయున్న దేవుని రాజ్యమును గూర్చియు అతడు ఉద్రేకపూర్వకముగా ప్రకటించుచుండగా జన సమూహములు అతని చుట్టూ గుమిగూడిరి. "అంతట యూదయ దేశస్థులందరును, యెరూషలేము వారందరును బయలుదేరి అతనియొద్దకు వచ్చి తమ పాపములను ఒప్పుకొనుచు యోర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి" (మార్కు 1:5).

ముప్పయి సంవత్సరములు వచ్చిన తరువాత ఒకనాడు యేసు గలిలయలోని నజరేతు నుండి 70 మైళ్ళు ప్రయాణము చేసి యోర్దాను చేరుకొని యోహానుచే బాప్తిస్మము పొందగోరెను. ఇది ఎంత అందమైన దృశ్యమో! ఇక్కడ యోహాను నది ఒడ్డున యున్నాడు. అతడు ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలుదట్టియు ధరించుకొనెను (మత్తయి 3:4). అతని ప్రక్కన పవిత్రుడు దీనుడైన ఈ గలిలయుడు నిలుచుండెను. ఆయన జన్మించినప్పుడు దూతలు పాడిరి, జ్ఞానులు ఆరాధించిరి. భూలోకమంతయు ఆనందించెను. ఆయన తన వడ్రంగి సామానును ఒక ప్రక్కన పెట్టి తన ఆప్తమిత్రులను, బంధువులును విడిచిపెట్టెను. ఆయన బహిరంగముగా సువార్తచేయుటకును, మానవ విమోచన భారమును తనకుగా తాను మోయుటకును సంసిద్ధుడాయెను.

ఆయన సన్నిధిలో ఈ గొప్ప బోధకుడైన యోహాను ఖిన్నుడాయెను. "నేను నీ చేత బాప్తిస్మము పొందవలసిన వాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా ? అని యోహాను ఆయనను నివారింపజూచెను గాని యేసు ఇప్పటికి కానిమ్ము నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను" (మత్తయి3:14,15). యేసుకు బాప్తిస్మమిచ్చుటకు యోహాను ఎందుకు

నివారింపజూచెను ? అతడు పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమై బాప్తిస్మమును ప్రకటించుచున్నందువలన (మార్కు 1:4 లూకా 3:3). యేసు మారుమనస్సు పొందవలసిన విషయమేదియును లేదు. క్షమాపణ నొందవలసిన పాపమేదియులేదు (1పేతురు 2:22; హెబ్రీ 4:15). యోహాను ఉద్దేశము యిది: "నేను పాప క్షమాపణ నిమ్తిము బాప్తిస్మమిచ్చుచున్నాను. గనుక నీవేల నాయొద్దకు వచ్చుచున్నావు?సరిగదా, నేను నీయొద్ద బాప్తిస్మము పొందవలసినవాడను". యేసుయొక్క పాపరహిత జీవితమును బట్టి యోహాను ఆయనను నివారింపజూచెను. అతనిచే బాప్తిస్మము పొందవలసిన వ్యక్తిగా యేసును గూర్చి అతడు తలంచలేదు. నీటిలో బాప్తిస్మమిచ్చుటకు యోహాను దేవునిచే ఆజ్ఞను పొందెను. క్రీస్తు బాప్తిస్మము యొక్క ఆజ్ఞకు లోబడుట దేవుని చిత్తమై యుండెను.

యోహాను యిచ్చిన బాప్తిస్మము యొక్క గమ్యము పాపక్షమాపణ. "అంతట అతడు వచ్చి పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము పొందవలెనని యొర్దాను నదీ ప్రదేశమందంతట ప్రకటించుచుండెను" (లూకా 3:3). యోహానుచే బాప్తిస్మము పొందినవారు క్రీస్తునందలి తమ విశ్వాసమును గాక తమ పాపములను ఒప్పుకొనుచు అతనియొద్దకు వచ్చిరి. వారికి బాప్తిస్మమియ్యకముందు ప్రజలు తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెనని యోహాను ఆజ్ఞాపించెను. వారు మారుమనస్సు నొందనియెడల వారికి బాప్తిస్మమిచ్చుట కతడు తిరస్కరించెను (మత్తయి 3:7-10). యోహాను బాప్తిస్మము యొక్క ప్రయోజనము యేసు ఎరిగి యుండెను. దానికాయన సమ్మతించెను. యూదులు ఏ కారణము చొప్పున బాప్తిస్మము పొందుచుండిరో అదే కారణము కొరకు ఆయన బాప్తిస్మము పొందుట అసాధ్యమని ఆయన యెరుగును. అందుకే ఇప్పటికి కానిమ్ము నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని యేసు చెప్పెను. దేవుని ఆజ్ఞలన్నియు

నీతియని వ్రాయబడియున్నది (కీర్తన 119:172).

యోహాను చేయుచున్నది దేవుని ఆజ్ఞ ప్రకారముండెను, తన తండ్రి చిత్తమును సంపూర్తిగ నెరవేర్చుటకు క్రీస్తు ఆసక్తిని కలిగియుండెను అందువలన ఆయన యోహానుచే బాప్తిస్మము పొందెను.

## A. దేవుడనుగ్రహించిన ఒక పవిత్ర దృశ్యము

యేసు బాప్తిస్మము పొందిన దృశ్యమును ముగ్గురు సువార్తికులు వ్రాసిరి. అది బైబిలులో అతి మనోహర దృశ్యము (మత్తయి 3:13–17; మార్కు 1:4–11; లూకా 3:21,22). దేవుని ఆజ్ఞలకు లోబడుచు యోహాను చేతుల మీదుగా ఆయన నీటిలోనికి దిగి బాప్తిస్మము పొందెను. ఆయన నీటిలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రార్థించుచుండెను. "ఇదిగో ఆకాశము తెరువబడెను, దేవుని ఆత్మ పావురము వలె దిగి తన మీదికి వచ్చుట చూచెను. మరియు , ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందిచుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:16–17).

నీతియావత్తు నెరవేర్చుటకు ఆసక్తి కలిగియున్న తన కుమారుని గూర్చి దేవుడు ఆనందించెను. 1500 సంవత్సరముల క్రితము సీనాయి కొండపై మోషే ధర్మశాస్త్రము ఈయబడినప్పటి నుండి నిత్యదేవుని యొక్క స్వరము ఆకాశముల గుండ వినబడుట యిది మొదటిది. క్రీస్తు దేవుని కుమారుడని బహిరంగముగా ఒప్పుకొనుట కూడ యిది మొదటిది. యేసు కొండమీద రూపాంతము పొందినప్పుడు కూడా అదే స్వరము యేసు దేవుని కుమారుడని ప్రకటించెను (మత్తయి 17:5; లూకా 9:28–36). దేవుడైయున్న ముగ్గురు మూర్తులు, తండ్రియైన దేవుడు,కుమారుడైన క్రీస్తు , పరిశుద్ధాత్ముడు యేసుయొక్క బాప్తిస్మము సమ్మతించుటకు ఏకమైరి. (వారి నామములోనికి మనము ఇప్పుడు బాప్తిస్మము పొందుచున్నాము).

## B. యేసు యేల బాప్తిస్మము పొందెను?

ఇతరులు పొందిన రీతిగా యేసు యోహానుచే బాప్తిస్మము పొందలేనందున "యేసు యేల బాప్తిస్మము పొందెను?" అని తరచు కొందరు ప్రశ్నింతురు. దానికి జవాబుగా ఈ దిగువ సంగతులను గమనించుము :

1. పాప క్షమాపణను పొందు నిమిత్తము గాని, పొందినందు వలన గాని యేసు బాప్తిస్మము పొందలేదు. పాపక్షమాపణ నిమిత్తమైన బాప్తిస్మము పాపపు ఉనికిని తెలియజేయుచున్నది. అయితే క్రీస్తులో పాపము ఎన్నడు లేదు. అందువలన క్రీస్తు పొందిన బాప్తిస్మము వేరు.

2. యాజక ధర్మమును నిర్వర్తించు నిమిత్తము యేసు బాప్తిస్మము పొందలేదు. యేసుయొక్క బాప్తిస్మము ఆయనను యాజకునిగా ప్రతిష్టించెనని కొందరు భావింతురు. అనేక కారణములవలన ఇది సత్యము కాదు, a) యేసు యూదా గోత్రమునకు చెందినవాడు గనుక ఆయన అహరోను క్రమము చొప్పున యున్న యాజకుడు కానేరడు (హెబ్రీ 7:14). b) యోర్దానులో పొందిన బాప్తిస్మము లేవీ యాజకుల ప్రతిష్టతను గూర్చి యున్న యూదుల చట్టమును నెరవేర్చలేదు (నిర్గమ 29, లేవీ 8చదువుము). c) క్రీస్తు భూమి మీద యుండగా యాజకుడు కానేరడు (హెబ్రీ 8:4). d) పరలోకములో క్రీస్తు మెల్కిసెదెకు క్రమము చొప్పున యాజకుడై యున్నాడు (హెబ్రీ 7:17).

3. నీతియావత్తు నెరవేర్చుట మనకు తగియున్నది అను కారణమును యేసు యోహానుకు చూపించి బాప్తిస్మము కోరెను. గనుక రెండు తరగతుల ప్రజలున్నారని మనము గ్రహించవలెను : a) దేవుని చిత్తము నంగీకరించిన వారు, b) దానిని తిరస్కరించిన వారు, దేవునికి లోబడిన వారికిని లోబడని వారికిని మధ్యరేఖగా యోహాను బాప్తిస్మముండెను. మారుమనస్సు

నొందుటకు గాను లేక క్షమాపణ నొందుటకు గాను క్రీస్తుకు పాపములు లేకపోయినను బాప్తిస్మము పొందుట వలన దేవునికి లోబడిన వారితో ఏకీభవించుటకు ఆయన ఆపేక్షించెను. బాప్తిస్మము పొందకుండ దేవుని సంకల్పమును తిరస్కరించిన యూదులతో కలిసి యుండుటకు క్రీస్తు సమ్మతించ లేదు (లూకా7:30). బహు స్వల్ప విషయములలోను కూడా ఆయన దేవుని చిత్తమునకు లోబడుట ఎంతో ఆశ్చర్యము. యేసు తనకుగా తాను సంతోషించుటకుగాక అన్ని విషయములలోను తండ్రి చిత్తమును నెరవేర్చుటకు ఈ లోకమునకు వచ్చెను. “నా యిష్టమును నెరవేర్చుటకు నేను రాలేదు నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని” అని ఆయన చెప్పెను (యోహాను 6:38). ఆయన ఈ లోకములో జీవించుచుండగా యేసు విధేయతను ఆజ్ఞాపూర్వకము గాను ఉదాహరణ ద్వారాను బోధించెను. పరలోకమందున్న తండ్రికి ప్రజలు విధేయత చూపవలెనని ఆయన బోధించెను. పరలోకమందున్న తండ్రికి ప్రజలు విధేయత చూపవలెనని ఆయన బోధించుట మాత్రమే గాక ఆయన మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపెను (ఫిలిప్పీ 2:8). ఒక మాదిరిగా యుండుటకు క్రీస్తు బాప్తిస్మము పొందెనని బైబిలు చెప్పకపోయినను ఇంత చక్కటి క్రియను చేయుటద్వారా విధేయతను గూర్చినగొప్ప మాదిరిని ఆయన మనకిచ్చెను. మారుమనస్సు తప్ప నేడు ప్రజలు దేవునికి ఏయే విషయములలో విధేయత చూపవలెనో వాటన్నిటిలో క్రీస్తు ఒక మాదిరి యుంచిపోయెను. మానవుడు ఆయన అడుగు జాడలలో నడచు నిమిత్తము నిజముగా ఆయన ఒక మాదిరి యుంచిపోయెను(1 పేతురు 2:21). అందువలన ఆయన “నన్ను వెంబడించుము” అని చెప్పుచున్నారు.

4. యేసు బాప్తిస్మము పొందిన తరువాత తండ్రియైన దేవుడు ఆయనను తన కుమారుడని బహిరంగముగా ఒప్పుకొనెను. యోహాను

ఈ సంఘటనకు సాక్షిగా యుండు నిమిత్తము యేసు బాప్తిస్మము పొందెను (యోహాను 1:31-34). యేసు బాప్తిస్మము పొందినప్పుడు పరిశుద్ధాత్ముడు ఆయన మీదికి దిగిరాగా యేసుయొక్క దైవత్వము యోహానుకు నిర్ధారణ అయెను. అందువలన యేసే క్రీస్తని, లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయని, దేవుని కుమారుడని అతడు సాక్ష్యమిచ్చెను (యోహాను 1:29). యోహాను బాప్తిస్మము రెండు విధములుగ ప్రయోజనకారి ఆయెను. ఈ లోక ప్రజలకు పాపక్షమాపణ అందజేసెను, ఇశ్రాయేలీయులకు యేసే మెస్సీయ యని సూచించెను.

అందువలన క్రీస్తు తన నిజ స్వరూపమును బయలు పరచు నిమిత్తము ఆయన బాప్తిస్మము పొందవలెనని దేవుడు సంకల్పించెను. ప్రజలు యెదుట దేవుడాయనను తన కుమారుడని ఒప్పుకొను అవకాశము కల్పించు నిమిత్తము క్రీస్తు బాప్తిస్మము పొందెను. యేసుఎందు నిమిత్తము బాప్తిస్మము పొందెనో దాని నిమిత్తము మరొకడెవడైనను బాప్తిస్మము పొందుట అసాధ్యము. అతడే దేవుని అద్వితీయ కుమారుడని చెప్పబడు నిమిత్తము ఏ మానవుడు ఇప్పుడు బాప్తిస్మము పొందలేదు.

### 1. నేడు బాప్తిస్మము ఆజ్ఞాపింపబడి యున్నది

యేసు తన అపొస్తలుల కిట్లు చెప్పెను "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు16:15,16). ఒకడు రక్షణా నందముననుభవింవలెనంటే ఆనాడు బాప్తిస్మము దేవుని సంకల్పములో ఎట్లు ఒక భాగమై యుండెనో అట్లే ఈ నాడును ఉన్నది (మత్తయి 28:19). అయితే లేఖనముల ప్రకారము బాప్తిస్మపు క్రియయేమిటి? దానిని ఎవరు పొందవలెను ? ఎట్లు పొందవలెను? తెలిసికొందము:

## ౨. బాప్తిస్మము యొక్క క్రియ

క్రీస్తు ఎట్లు బాప్తిస్మము పొందెను? ఆయన నీటిలో ముంచబడెను. యేసు యోర్దానులో యోహాను చేత బాప్తిస్మము పొందెను (మార్కు 1:9) అని విపులముగా వ్రాయబడి యున్నది. తరువాత యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలోనుండి ఒడ్డునకు వచ్చెను (మత్తయి 3:16). క్రీస్తుకు యోహాను యోర్దాను నీళ్ళలో బాప్తిస్మమిచ్చెను. క్రీస్తు నీళ్ళలో ముంచబడెను.

ముంచడమును కించపరచుటకు గాను కొందరు యేసు యోర్దాను నది ఒడ్డున నిలబడి యున్నట్లును, ఒక పొట్టేలు కొమ్ములో నుండి కొన్ని నీళ్ళను యోహాను ఆయన తలపై చిలకరించునట్లునుయున్న ఒక చిత్రమును చూపింతురు. మన మెరిగియున్న వాస్తవము లన్నిటికి ఇది భిన్నముగా యున్నది. యోహాను యేసుకు బాప్తిస్మమిచ్చుచుండగా యెవడును ఒక చిత్రమును గీయలేదు. మనకు చూపించబడుచున్న చిత్రము యెవడో ఒక మానవుడు తన ఊహాను బట్టి గీసినది. క్రీస్తు బాప్తిస్మమును పరిశుద్ధ లేఖనములు వర్ణించురీతిగా మనమంగీకరించకూడని కారణము లేమైన ఉన్నవా?

బాప్తిస్మమనగా ముంచడమని, ఒక సమాధి పునరుత్థానములని బైబిలు ప్రశ్నింపతగని రీతిగా బోధించుచున్నది. "కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితివిు" (రోమా 6:4). "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స 2:12).

బాప్తిస్మము పొందినవారి సందర్భములను క్రొత్తనిబంధనలో చదువుట ద్వారా ముంచడమే యధార్ధమని, ,చిలకరింపు కుమ్మరింపులు బాప్తిస్మము కానేరవని మనము కనుగొనగలము. అపొస్తలుల కాలములో అది యెట్లు జరిగించబడెనో తెలిసికొను నిమిత్తము ఐతియోపీయుడైన ఘనుడొకడు బాప్తిస్మము పొందిన సందర్భమును గమనించుము : "వారు త్రోవలో వెళ్ళు చుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు – ఇదిగో నీళ్ళు నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను అతడు ఫిలిప్పును మరియెన్నడును చూడలేదు" (అపొ.కా. 8:36–39).

ఫిలిప్పు. నపుంసకుడు నీళ్ళయొద్దకు వచ్చిరి. వారిద్దరు నీళ్ళలోనికి దిగిరి. నపుంసకుడు నీళ్ళలో ముంచబడెను. వారిద్దరు నీళ్ళలో నుండి వెడలి వచ్చిరి. బాప్తిస్మము అను పదమునకు ముంచుట పాతి పెట్టుట యని అర్ధము. పదముల కేమైనా అర్ధమున్న యెడల యేసు బాప్తిస్మము పొందినప్పుడు జరిగిన సంగతి యిదే. యేసు నీళ్ళలో నుండి వెడలి వచ్చెనని మార్కు వ్రాసెను (మార్కు 1:10).అంటే ఆయన దానిలోనికి వెళ్ళెను. బాప్తిస్మము పొందుటకు ఆయన నీళ్ళలోనికి దిగిన యెడల ఆయన నీళ్ళలో ముంచబడెననుటలో సందేహమేమియును లేదు. అందువలన క్రీస్తు నీళ్ళయొద్దకు వచ్చెను ఆయన నీళ్ళలోనికి దిగెను ఆయన దానిలో పాతిపెట్టబడెను. దానినుండి తిరిగి లేపబడెను. క్రీస్తుపై యోహాను కొన్ని నీటి చుక్కలను చిలకరించి దానిని బాప్తిస్మమని చెప్పలేదు. బైబిలులో ఏ సమయ మందైనను ఎవరి మీదనైనను నీరు ఒక్కటి మాత్రమే ప్రభువు అధికారము చొప్పున చిలకరింపబడిన సందర్భమును దేనిని పరిశుద్ధ

లేఖనములలో మనము కనుగొనలేము.

చరిత్ర ప్రకారము క్రీ॥శ॥251లో నోవేషన్ అనునతనికి మొదటి సారిగా ముంచడము కాని బాప్తిస్మము ఈయబడెను. అతడు రోగియై యుండెను గనుక అట్లు చేయబడెను. దీని తరువాత చిలకరింపు, కుమ్మరింపులు ఆచరణలోనికి వచ్చెను. రోగులకు ఇచ్చుచుండుట వలన వీటిని రోగుల బాప్తిస్మమని కూడ పిలుచుచుండెడివారు. గాని క్రీ॥శ॥ 1311 లో ఇటలీలోని రావెన్నలో కూడిన సభ చిలకరింపును రోగులకేమి, రోగులు కానివారి కేమి చట్టబద్ధము చెసెను (Johnson's Universal Encyclopedia, Vol.1. page 488).

అందువలన అపొస్తలుల కాలమైపోయిన అనేక సంవత్సరముల తరువాత బాప్తిస్మమునకు బదులుగా చిలకరింపు, కుమ్మరింపులు ప్రవేశపెట్టబడెను. ముంచడమునకు బదులుగా చిలకరింపు, ప్రవేశపెట్టుటకు వారి సంఘమునకు అధికారము కలదని కొందరు చెప్పుచుందురు. గాని బైబిలు అట్లు బోధించుటలేదు (దానియేలు 7:25; ప్రకట 22:18,19; 2 యోహాను:9).

గనుక లేఖనముల ప్రకారము బాప్తిస్మమునకు ఈ దిగువ సంగతులు అవుసరము 1) నీరు (అపొ.కా. 8:36) 2) విస్తారమైన నీరు (యోహాను 3:23) 3) నీటిలోనికి దిగివెళ్లుట (అపొ.కా. 3:36) 4) బాప్తిస్మ మిచ్చువాడు, పొందువాడు కూడ నీటిలోనికి దిగి వెళ్లుట 5) నీటిసమాధి, పునరుత్థానములు (రోమా 6:4; కొలస్స 2:12) 6) నీటిలో నుండి వెడలి వచ్చుట చిలకరింపు, కుమ్మరింపులకు ఇవి అవుసరము లేదు. సరిగదా బైబిలు కోరుదానికి బదులుగా అవి యున్నవి. బాప్తిస్మము అను మాటకు అర్ధమిచ్చు ఒకే ఒక్క క్రియయున్నది గాని మూడు కావు దాని యర్ధము చిలకరింపు, కుమ్మరింపు, ముంచడము అని కానేరదు.

బాప్తిస్మమునకు లేఖనములు కోరు అవుసరతలన్నియును ముంచడములో తీరుచున్నవి. గనుక బాప్తిస్మమనగా ఒక వ్యక్తిపై నీళ్ళను కుమ్మరించుట, చికలరించుట కాదు.

## 3. బైబిలు బాప్తిస్మము పొందుటకు అర్హత గలవారు

బాప్తిస్మము యొక్క క్రియ ముంచడము అని గ్రహించిన తరువాత బాప్తిస్మమును ఎవరు పొందవలెనో ఇప్పుడు గమనించుము. యేసు తన అపొస్తలుల కిట్లు ఆజ్ఞాపించెను: "కాబట్టి మీరు వెళ్ళిసమస్త జనులను శిష్యులనుగా చేయుడి తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:19). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు నొంది..... పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి " యని అపొస్తలుడైన పేతురు చెప్పెను (అపొ.కా. 2:38).

గనుక బాప్తిస్మము ప్రయోజనకారియై యుండవలెనంటే, దానికంటె ముందు బోధింపబడుట, విశ్వాసము, మారుమనస్సు జరిగియుండవలెను. బాప్తిస్మము విశ్వాసముతో కూడిన క్రియ గనుక బాప్తిస్మమునకు ముందు యధార్థమైన విశ్వాసముండవలెను(గలతీ 3:26,27; ఎఫెసీ 2:8,9; హెబ్రీ 11:30; 8:8-12; యోహాను 6:45). అట్లే బాప్తిస్మమునకు ముందు క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనుట జరుగవలెను. ఐతియోపీయ కోశాధికారి యేసుక్రీస్తు దేవుని కుమారుడని తన హృదయ పూర్వకముగా నమ్ముచున్నట్లు ఒప్పుకొనెను (అపొ.కా. 8:37). అపొ.పౌలు ఇట్లనెను: "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10).

కొన్ని మతశాఖలలో శిశు బాప్తిస్మమనే ఆచారము కలదు. అయితే

బైబిలు దానికి సమ్మతించుటలేదు. గనుక అది తప్పు. పసిపిల్లలకు సువార్త బోధించలేము. వారు యేసునందు విశ్వసించలేరు. మారుమనస్సు పొందలేరు. క్రీస్తే ప్రభువని తమ నోటితో ఒప్పుకొనలేరు. గనుక బాప్తిస్మము పొందుటకు పసిపిల్లలు సరియైనవారు కారు. క్రీస్తు యిచ్చిన ఆజ్ఞ పసిపిల్లలకు వర్తించదు. సరిగదా క్షమాపణ నొందు నిమిత్తము వారికి పాపములు ఏమియు లేవు కనుక వారు సురక్షితులని బైబిలు బోధించుచున్నది. పరలోకరాజ్యము ఈలాటి వారిదే యని యేసు బోధించెను (మత్తయి 19:14 18:3). పసిపిల్లల బాప్తిస్మమును గూర్చిన ఆజ్ఞగాని, ఉదాహరణ గాని క్రొత్తనిబంధనలో మనకు కనబడదు. అయితే పసిపిల్లల బాప్తిస్మము పొందితే వారికెవరు బాప్తిస్మ మిచ్చిరి ? వారెవరి బిడ్డలు ? అదెప్పుడు ఎందువలన జరిగెను ?

సమరయ ప్రజలకు "ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతనిని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" యని చెప్పబడెను (అపొ.కా. 8:12). కొరింధులో బాప్తిస్మము పొందినవారిని గూర్చి చెబుతు, "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" యని వ్రాయబడెను (అపొ.కా. 18:8). గనుక పసిపిల్లలకు బాప్తిస్మమిచ్చువారు దేవుని క్రమమును సంపూర్తిగా తారుమారు చేసిరి. ఏలయనగా బాప్తిస్మము లేఖనములు ప్రకారముండవలెనన్న దానికంటె ముందు బోధింపబడుట, వినుట, విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు జరిగియుండవలెను. మారుమనస్సు పొందిన విశ్వాసులు మాత్రమే బైబిలు ప్రకారము బాప్తిస్మము పొందవలెను.

బైబిలుకు వ్యతిరేకముగా యుండుట వలన శిశు బాప్తిస్మము రెండు అపోహలపై ఆధారపడి యున్నది: 1) పసిపిల్లలు పాపముతో పుట్టుదు రనునది (అది ఆదిమ పాపమనే అబద్ధసిద్ధాంతము). 2) బాప్తిస్మపు నీటిలో

ఈ పాపమును కడిగి వేసే శక్తి ఏదో ఉన్నది అనునది. అయితే ఆదాము పాపము వలన పసిపిల్లలతో సహా మనుష్యులందరికి భౌతిక మరణమే సంప్రాప్త మాయెను (రోమా 5:12-14). గాని ఎన్నడు అతని పాపము కాదు.

## 4. బైబిలు బాప్తిస్మము యొక్క ప్రయోజనము

పాపక్షమాపణకు ముందు బాప్తిస్మము జరుగవలెనని, బాప్తిస్మము పాపక్షమాపణ కొరకని లేఖనములు బోధించుచున్నవి. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన పైకెక్కి పోవకముందు తన అపొస్తలులకు ఒక గొప్పఆజ్ఞను యిచ్చెను. అదేమనగా, “మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడును” (మార్కు 16:15-16).

రక్షణ షరతులను యిచ్చునప్పుడు యేసు చెప్పిన దానిని జాగ్రత్తగా గమనించుము : “నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును”. నమ్మినవాడు రక్షించబడును. అటు తరువాత అతని కిష్టమయితే బాప్తిస్మము పొందవచ్చును అని ఆయన చెప్పలేదు. లెక రక్షించబడినవాడు విశ్వసించి బాప్తిస్మము పొందవలెను అని ఆయన చెప్పలేదు. బాప్తిస్మము పొందినవాడు విశ్వాసము లేకుండగనే రక్షించబడును అని కొందరు చెప్పుదురు: మరికొందరయితే నమ్మినవాడు బాప్తిస్మము లేకుండగనే రక్షించబడునని చెప్పుదురు. నమ్మి బాప్తిస్మము పొందనివాడు రక్షించబడునని యెవడైనను చెప్పగలడా ? బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని యేసు చెప్పలేదు గాని, “నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడెనని చెప్పెను”. క్షమాపణ నొందుటకు బాప్తిస్మము ఒక షరతు అని ఇక్కడ బైబిలు చెప్పుచున్నది. పాపియైనవాడు రక్షణ పొందవలెనంటే నమ్మి బాప్తిస్మము పొందవలెను.

నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని యేసు చెప్పినందున, బాప్తిస్మమునకు ముందే ఒకడు రక్షించబడునని చెప్పుట బుద్ధిహీనత యగును,

పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సుతో సహా బాప్తిస్మము ఒక షరతైయున్నది. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని పేతురు చెప్పెను (అపొ.కా. 2:38; లూకా 24:47; మత్తయి 26:28). ఆత్మావేశము కలిగిన అపొస్తలుడు ఇట్లు చెప్పినందున బాప్తిస్మము పొందకముందే అతడు రక్షింపబడడనుట యగును. అననీయ సౌలునొద్దకు వచ్చి అతడు మారుమనస్సు నొందిన విశ్వాసియని కనుగొనెను. "గనుక నీవు తడవు చేయుట యెందకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొను మని" అతనికి చెప్పెను (అపొ.కా. 22:16). గనుక బాప్తిస్మము పాపికిని, క్రీస్తు రక్తము వలన అతని పాపములు కడిగివేయబడుటకును మధ్యయున్నది (ప్రకట 1:5; రోమా 6:3–5; యోహాను 19:34; కొలస్స 2:12,13).

అపొ.పేతురు నోవహును అతని కుటంబమును ఓడ ద్వారా రక్షింపబడుటను గూర్చి చెబుతు, "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది  ఆదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థానము మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" యని వ్రాసెను (1పేతురు 3:21). బాప్తిస్మము రక్షించునని ఈ వచనము చెప్పుచున్నది.

అపొ.పౌలు యిట్లు చెప్పెను : "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము

పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు క్రీస్తును ధరించుకొందురని బైబిలు చెప్పుచున్నందున, బాప్తిస్మము పొందక ముందయెవడైన రక్షింపబడిన యెడల అతడు క్రీస్తులోనికి రాకముందే రక్షింపబడెనని యర్థము ! అయితే క్రీస్తులో రక్షణ యున్నది (2 తిమో 2:10; ఎఫెసీ 1:3). గనుక బాప్తిస్మము విశ్వాసమను షరతుతో రక్షణ కొరకు ముడివడి యున్నది. అదొక క్రైస్తవ విధియని ఎన్నడు చెప్పబడలేదుగాని క్రైస్తవుడగుటకు విధేయత చూపవలసిన ఒక ఆజ్ఞయై యున్నది. "ఒకడు నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" యేసు చెప్పెను (యోహాను 3:5). క్రొత్తజన్మలో నీటి భాగము బాప్తిస్మము.

అంతేగాకుండ, రక్షింపబడవలెనంటే ఒకడు సువార్తకు లోబడవలెనని బైబిలు బోధించుచున్నది (2థెస్స 1:7-9). మరియు సువార్త యిచ్చు ఆజ్ఞలలో ఒకటి బాప్తిస్మము. రక్షణ పొందు నిమిత్తము బాప్తిస్మము ఒక షరతు గాని అదొక పుణ్యకార్యము కాదు. క్రీస్తు రక్షకుడు, గాని తనకు విధేయులైన వారినే ఆయన రక్షించును (హెబ్రీ 5:9 ప్రక 22:14; ఎఫెసీ 1:7; 2 రాజులు 5:1-14; యోహాను 9:1-7).

## 5. నేడు బాప్తిస్మము యొక్క అత్యవుసరత

మారుమనస్సు పొందిన విశ్వాసులు పాపక్షమాపణ నొందవలెనంటే వారు బాప్తిస్మము పొందవలెననునది దేవుని చిత్తమైనందున, ప్రజలు దేవుని ఆజ్ఞలన్నిటికి లోబడుట ఇప్పుడు అవుసరము. క్రీస్తుయొక్క మాదిరిని బట్టియు, ఉపదేశమును బట్టియు చూచిన అనేక మత శాఖలవారు బాప్తిస్మమునకు తగు ప్రాధాన్యత ఇవ్వకపోవుట, దానికి విలువలేదని చెప్పుట ఎందువలనో మనము గ్రహించెకొనుట కష్టము. బాప్తిస్మము పొందనవుసరము లేదని చెప్పువారి యొక్క మనస్తత్వమును మనము

శంకించవలసి వచ్చుచున్నది. మన ప్రభువు బాప్తిస్మము పొందుట ద్వారా తండ్రి యొక్క చిత్తమును నెర వేర్చుట ఎంత ప్రాముఖ్యమో మనకు తెలియజేసెను. బాప్తిస్మము దేవుడిచ్చిన ప్రత్యక్ష ఆజ్ఞయైయున్నది. మానవుడు దానికి లోబడిన యెడల, దేవుడతని రక్షించెదనని వాగ్దానము చేసెను. దేవుని చిత్తమును జరిగించుటకు సందేహించు వాడెవడును యేసు యొక్క అడుగు జాడలలో నడుచుకొనలేడు. మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మపు నీటిలో నుండి వెడలి వచ్చువరకు దేవుడతనిని తన బిడ్డగా అంగీకరించడు. ప్రభువు ఆజ్ఞలను తిరస్కరించువాడు ప్రభువునే తిరస్కరించును (లూకా 10:16; అపొ.కా. 10:48; 2:41). దేవుని ఆజ్ఞలు అవుసరమైనవి, అవుసరము కానివియని విభజించుటకు కొందరు పూనుకొనిరి. ఇట్టి మనస్తత్వము వెనుక తీవ్రమైన రెండు అపోహలున్నవి మొదటిది అవుసరము కాని ఆజ్ఞలను దేవుడు ఆదేశించెననునది, రెండవది మానవుడు అవుసరమైన ఆజ్ఞలు, అవుసరము కాని ఆజ్ఞలను వేరు పరచగలడనునది, అయితే దేవుడాజ్ఞాపించిన దేదియు ప్రాముఖ్యము కానిది కాదు, అవుసరము కానిది కాదు.

క్రొత్తనిబంధనలో మార్పుజెందిన వారి సందర్భములలో యున్న గొప్ప వాస్తవము ఏమంటే బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తుకు లోబడ నిశ్చయించు కొనిన పాపులు వారు బాప్తిస్మము పొందేవరకు అన్నపానములు పుచ్చుకొన లేదు, నిద్రపోలేదు. దీనికి ఉదాహరణగా ఫిలిప్పీ చెరసాల అధిపతి యున్నాడు. “అతడు రాత్రి ఆ గడియలోనే వారిని తీసికొనివచ్చి వారి గాయములు కడిగెను వెంటనే అతడును అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందిరి” (అపొ.కా. 16:33).

బాప్తిస్మము అత్యవసరము గనుక రాత్రి ఆ గడియలోనే వారు బాప్తిస్మము పొందవలసివచ్చెను. బాప్తిస్మము అవుసరము లేని యెడల దాని వలన ఆత్మకేమీ ప్రమాదము లేదుగనుక దానికి లోబడుటకు వారు

జాగుచేసి యుండేవారు. ఒక్క రాత్రికూడ జాగుచేయబడకూడదు. ఒకడు దేవుని ప్రేమించిన యెడల ఆయన ఆజ్ఞలను గైకొనును (యోహాను 14:15; 1యోహాను 5:3; 2:3-5).

## 6. ముగింపు

బైబిలు బాప్తిస్మము అను ఈ అంశమును క్లుప్తముగా గమనించుదము: 1)బాప్తిస్మము యొక్క క్రియ, నీటిలో ముంచడము 2) బాప్తిస్మమును పొంద వలసినవారు మారుమనస్సు పొందిన విశ్వాసులు 3) బాప్తిస్మము యొక్క ప్రయోజనము –పాపక్షమాపణ పొందు నిమిత్తము. సరియైన వ్యక్తి (మారుమనస్సు పొందిన విశ్వాసి) పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము పొందుటయే లేఖనముల ప్రకారము బాప్తిస్మము. క్రొత్తనిబంధన కాలములో యున్న ఒకే బాప్తిస్మము యిది (ఎఫెసీ 4:4,5). బైబిలుతో బాప్తిస్మము సమన్వయించవలెననిన ఈ షరతులన్నియు నెరవేర్చబడవలెను.

ఏ పాపములేని యేసు బాప్తిస్మము పొందకుండ ఆజ్ఞ యావత్తును నెరవేర్చలేక పోయిన యెడల, పాపియైన మానవుడు దానినిప్పుడు ఎట్లు నెరవేర్చ గలడు ? గనుక దేవుడిచ్చిన ఈ సూక్ష్మ ఆజ్ఞను గూర్చి యెవడును అభ్యంతర పడక క్రీస్తువలె వెంటనే దేవునికి విధేయత చూపవలెను.

✤

# 7. "ఈ బండమీద"

## ("Upon this Rock")

ఫిలిప్పుదైన కైసరయ వాస్తముగా ఒక బండపై నిర్మించబడిన పట్టణము. ఆ పట్టణ ప్రాంతములో యేసు తన శిష్యులను మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని అడిగెను (మత్తయి 16:13). వారు రకరకాల జవాబునిచ్చిరి. కొందరు ఆయన బాప్తిస్మమిచ్చు యోహాననియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచుండిరి. అప్పుడు ప్రభువు తన శిష్యులనే నేరుగా ఒక ప్రశ్న అడిగారు : "మీరైతే నేనెవడనని చెప్పుకొనుచున్నారు?" అని ఆయన అడిగెను (మత్తయి 16:15). అప్పుడు పేతురు తన విశ్వాసమును ఘనముగా ఒప్పుకొనెను: "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు". పేతురు ఈ ముగింపుకు వచ్చుటకు అనేక సంగతులు కారణమాయెను. మన ప్రభువు చేసిన అద్భుతముల నతడు తిలకించాడు, సాటిలేని ఆయన బోధనలాలకించాడు, ఆయన పరిపూర్ణ జీవితమును పఠించాడు, మిగిలిన అపొస్తలులందరి హృదయ భావములను బహుశ పేతురు పలికాడు వారిలో యెవరు అతని మాటను కాదనలేదు.

ఆయన దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొనగా యేసు ఇట్లు చెప్పెను : "సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు. పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే కాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానిఎదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును

బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" (మత్తయి 16:17-19). ఇది చాల ప్రాముఖ్యమైన వాక్యభాగము. దానిలో విపులముగా చెప్పబడిన సత్యములను గమనించుము :

## 1. సంఘము క్రీస్తుచే స్థాపించబడెను

మనము చదివిన మొదటి సత్యమేమంటే క్రొత్తనిబంధన సంఘము క్రీస్తుచే స్థాపించబడెను. క్రీస్తుచే స్థాపించబడిన సంఘము ఒక దైవిక జీవి. అది విశ్వాసములోను, బోధలోను, పాలనపద్ధతిలోను, ఆరాధనలోను ఐక్యతలోను మరియు సభ్యత్వ షరతులలోను ప్రభువు కోరు రీతిగా యుండును. ఈ విషయములలో సంఘము పరిపూర్ణమై యున్నది అది అభివృద్ధి చేయబడలేదు. అట్లు ఆయన తన సంఘమును, ఆదిమ సత్య సంఘమును స్థాపించుటలో మరొకడెవ్వుడును దైవాధికారమును పొందలేదని ఆయన చూపించెను.

సంఘమును స్థాపించుటను గూర్చి క్రీస్తు పలికినప్పుడు, అది తనదైనట్లు "నా సంఘమును " కట్టుదును అని పలికెను. అందువలన సంఘము క్రీస్తుది. అది క్రీస్తు సంఘము ఏలయనగా ఆయన దానిని కట్టెను. మరల, సంఘమును ఆయన తన స్వరక్తమిచ్చి కొనెను కనుక సంఘము క్రీస్తుకే చెందును (అపొ.కా. 20:28; ఎఫెసీ 5:25-27). ప్రభువు యొక్క స్థానిక సంఘములను గూర్చి పలుకుచు వాటిని "క్రీస్తు సంఘములు" అని అపొ.పౌలు చెప్పెను (రోమా 16:16).

## 2. సంఘము పేతురుపై నిర్మించబడలేదు

రెండవదిగా, సంఘము పేతురుపైగాక పేతురు చేసిన ఒప్పుకోలుపై, అనగా నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువుఅను దానిపై

నిర్మించబడెను. ఈ బండమీద–అని యేసు చెప్పినప్పుడు ఆయన నేరుగా లేక వ్యక్తిగతముగా తనను గూర్చి గాని లేక పేతురును గూర్చి గాని పలుకలేదు. అట్లయితే ఈ బండయేమిటి ? నిశ్చయముగా అది పేతురు ఒప్పుకొనిన సత్యమే. ఆసత్యముపైన సంఘము స్థాపించబడెను. దానిపైననే అది నేటికిని నిలచి యున్నది. ఈ సత్యమే క్రైస్తవ్యము యొక్క ఆధారము. యేసు దేవుని కుమారుడను సత్యమును సంఘ సభ్యుడుగుటలో ప్రతివాడును విశ్వసించి ఒప్పుకొనవలెను (అపొ.కా. 8:37 రోమా 10:9,10).

మత్తయి 16:18లో మూడు గ్రీకు పదములున్నవి. వాటిని మనము జాగ్రత్తగా గమనించవలెను.

1. పెట్రాస్– అనగా పేతురు అని అనువదించబడినది. ఇదొక నామ వాచకము, పుంలింగము రాయి, రాతి ముక్క లేక చిన్నరాయి అని దీని యర్థము.

2. పెట్ర–అనగా బండయని అనువదించబడినది. నామవాచకము, స్త్రీ లింగము, పెద్ద బండయని, గొప్ప బండయని అర్థము. పెట్రాస్ అను పదము గాక వేరొక పదము.

3. ఎక్లీషియా –అనగా సంఘము అని అనువదించబడినది. నామ వాచకము, స్త్రీ లింగము. పిలువబడిన సమాజము లేక సంఘము అని యర్థము (అపొ.కా. 19:32, 39,41). ఈ లోకమునుండి ఆత్మీయముగా పిలువబడిన ప్రజల సమాజము అని ఇక్కడ దాని యర్థము.

పేతురుపై సంఘము స్థాపించబడెనని నమ్మువారు ఇక్కడ క్రీస్తు, “పేతురు నీవు బండవు, ఈబండమీద నా సంఘమును కట్టుదును” అని చెప్పెనను కొందురు. దీనినుండి మిగిలిన అపొస్తలులుమీదను, సంఘమంతటి మీదను పేతురు ఘనత గలవాడని వారనుకొందురు.

అయితే యేసు చెప్పినది అది కాదు. యేసు పునాదిని గూర్చి ఉపయోగించిన పదములు పేతురు సంఘము యొక్క పునాది అనే అపోహను తొలగించుచున్నవి. గమనించుము: 1) క్రీస్తు తన సంఘము యొక్క నిర్మాణికుడు 2) యేసుక్రీస్తు దేవుని కుమారుడను సత్యమే ఆ బండ. అది సంఘము యొక్క పునాది. 3)పేతురు దాని ద్వారము యొద్ద తాళపు చెవులను పట్టుకొని యున్నాడు. ఉపమానములోని ఒక వ్యక్తి ఒకే సమయమందు రెండు స్థానముల నాక్రమించుకొనుట వ్యాకరణరీతిగా యుక్తము కాదు. గనుక యేసు పేతురును ఎక్కడ ఉంచెనో అక్కడనే అతడున్నాడు అనగా తాళపు చెవులు కలిగియున్న ద్వారపాలకునిగా యున్నాడు.

క్రీస్తు జన్మింపక వందల సంవత్సరముల పూర్వము యెషయా యిట్లు ప్రవచించెను: "ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు. సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి. అమూల్యమైన తలరాయి. బహుస్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16). అపొస్తలుడైన పేతురు ఈ ప్రవచనమును క్రీస్తుకు వర్తింపజేసి ఆయనే సీయోనులో వేయబడిన ఏర్పరచబడినదియు అమూల్యమగు ముఖ్య మూలరాయి యని ప్రకటించెను. క్రైస్తవులు ఆయన మీదనే నిర్మించబడిరి. అట్లేక్రైస్తవులు కూడా సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా అనగా సంఘముగా కట్టబడియున్నారు. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పిన మాటలను పేతురు ఇట్లు అర్థము చేసికొనెను (1పేతురు 2:38; అపో.కా. 4:11-12; ఎఫెసీ 2:18-22).

యేసుక్రీస్తు దేవుని కుమారుడను దానిపైననే గాని సీమోనుపేతురుపై సంఘము స్థాపించబడలేదనునది అపొ.పౌలు కొరింధులోని సంఘమునకు

వ్రాసిన మాటల వలన మరికొంత నిర్ధారణ యగుచున్నది. “వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు ఈ పునాది యేసుక్రీస్తే”(1కొరింధి 3:11; 10:4). యేసే క్రీస్తని పౌలు ప్రకటించి నప్పుడు ఆ పట్టణములో అతడు పునాది వేసెను (అపొ.కా. 18:1-5).

క్రీస్తు యిట్లు చెప్పెను: “నీవు పేతురువు (Petras) ఈ బండ (Petra) మీద నా సంఘమును కట్టుదును”. క్రీస్తు తన సంఘమును (పెట్రాస్) మీద గాక (పెట్రా) మీద కట్టుదునని ప్రకటించెను. ఏదోము బండలోనుంచి మల్చబడిన పట్టణమును అపొస్తలులు ఎరిగియున్నవారు గనుక ఈ బండమీద నా సంఘమును కట్టుదును అని యేసు చెప్పిన మాటల యొక్క అర్ధమును అనగా పేతురుపై గాక అతడు ఒప్పుకొనిన సత్యముపై ఆయన దైవత్వముపై తన సంఘమును కట్టుదును అని వారు సరిగా గ్రహించు కొనిరి. గనుక గొప్ప బండయైన మెస్సీయపై ఆయన కుమారత్వముపై మన ప్రభువు యొక్క సంఘము స్థాపించబడియున్నది. దానికి వేరొక పునాది లేదు.

యేసేక్రీస్తని దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొనిన దానిని నిర్దేవులుకాదని నిరూపించగలిగిన యెడల సంఘమంతయు తక్షణమే శిధిలమై పడిపోవును. అయితే అలంకార రూపకముగా యేసు తన సంఘమును కట్టిన గొప్ప బండ ఈ సత్యమే.

## 3. సంఘ నిర్మాణము భావియై యుండెను

మనుము నేర్చుకొనవలసిన మూడవ పాఠమేమంటే ఈ సంభాషణ జరుగుసరికి సంఘము ఇంకను నిర్మించబడలేదు. కట్టుదును అను మాట భవిష్యత్తును సూచించుచున్నది. అబ్రాహాముగాని, మోషే గాని లేక బాప్తిస్మమిచ్చు యోహాను గాని ప్రభువు యొక్క సంఘమును స్థాపించలేదు.

క్రీస్తు సంఘమును కట్టుదును అని చెప్పుసరికి వారందరు మృతిజెంది యుండిరి. బాప్తిస్మమిచ్చు యోహాను ఎన్నడు సంఘసభ్యుడు కాడు (మత్తయి 11:11).

క్రీస్తుయొక్క పునరుత్థానము తరువాత మొదటి పెంతెకొస్తునాడు, యెరూషలేములో సంఘము స్థాపించబడెను. పెంతుకొస్తుకు ముందు సంఘమును గూర్చిగాని లేక రాజ్యమును గూర్చిగాని చెప్పబడినప్పుడెల్ల అది భావిలో యున్నట్టే చెప్పబడెను గాని ఆనాటి తరువాత సంఘము స్థాపించబడి యున్నట్లు మనము చదువగలము (మత్తయి 3:1,2; 6:9,10; మార్కు 9:1; అపొ.కా. 1:6,8; 2:14; కొలస్స 1:13,14; ప్రక 1:9). యెరూషలేము పట్టణములో సంఘము ఆరంభమగునని ప్రభువు ప్రవచించెను (యెషయా 2:2,3; జెకర్యా 1:16; లూకా 24:47; అపొ.కా. 2:11-15). గనుక సంఘము ఎప్పుడు, ఎక్కడ ఎవరిచే స్థాపించబడెనో మానవుడు తెలిసికొనగలడు. సంఘము పెంతోకొస్తునాడు యెరూషలేములో అపొస్తలుల ద్వారా క్రీస్తుచే స్థాపించబడెను.

## 4. ఒకే ఒక్క సంఘమును స్థాపించుటకు క్రీస్తు వాగ్ధానము చేసెను

అంతేగాక, సంఘమును గూర్చి క్రీస్తు ఏకవచనములో మాటలాడెను. మతశాఖలు పేరులోను, సిద్ధాంతములోను, ఆచరణలోను ఒకదానితో నొకటి భిన్నముగా యుండగా క్రీస్తు ఒకే ఒక్క సంఘమును కట్టుదును- సంఘములు అని బహువచనమును గాక సంఘము అని ఏకవచనమును ఆయన ఉపయోగించెను. అనేక స్థానిక సంఘము లను గూర్చి బైబిలు లో మనము చదువగలము గాని క్రీస్తు ఒకే సంఘము స్థాపించెను. సంఘము యొక్క ఏకత్వమును గూర్చి బైబిలు తరచు వక్కాణించు చున్నది (1కొరింథీ 12:12, 20-27; 8:5,6; ఎఫెసీ 1:22,23; 4:4-6). శరీరము ఒక్కటే. ఆశరీరమే సంఘము. ప్రభువు ఒక్కడే ఏలాగు ఉన్నాడో

ఆలాగే శరీరము కూడ ఒక్కటే యున్నది. గనుక క్రీస్తు సంఘములు అను పదము క్రీస్తుకు చెందిన స్థానిక సంఘములను సూచించున్నది. అవన్నియు ఒకే విశ్వాసమును, ఆచరణను కలిగియున్నవి. క్రీస్తుసంఘములోని పాలనాంకము స్థానిక సంఘము. అది దాని పాలనపద్ధతిలో స్వతంత్రము కలిగి క్రీస్తుయొక్క పర్యవేక్షణలో పెద్దలచే నడిపింపబడును (అపొ.కా. 14:23).

## 5. రక్షింపబడినవారే సంఘము

నా సంఘమును కట్టుదును అని క్రీస్తు పలికినప్పుడు దేనిని స్థాపించుటకు ఆయన ఉద్దేశించెను? ఈ ప్రశ్నకు జవాబుగా ప్రభువు సంఘమని పిలువబడే సంస్థకు వివిధ నామకరణములు ఉపయోగింపబడినవి. ఉదాహరణకు :

1) ఈ సంస్థకు లోకమునకు గల సంబంధమును గూర్చి చెప్పుటలో అది సంఘము అని పిలువబడినది. సంఘము అనగా పిలువబడినవారని యర్థము (యోహాను 15:19; 2 థెస్స2:13,14).

2) దానియొక్క ప్రభుత్వ కోణమునుండి పరికించిన అది రాజ్యము అని పిలువబడినది. ప్రభుత్వ శాఖలన్నిటి పైనను అధికారము కలిగి క్రీస్తు దానికి రాజుగా యున్నారు. మత్తయి 16:18,19లో సంఘము, రాజ్యము అను పదములు ఒకే సంస్థను సూచించుటకు గాను క్రీస్తు వినియోగించెను. క్రీస్తు సంఘములో యుండుట యనగా క్రీస్తు రాజ్యములో యుండుటయే.

3) సంఘము యొక్క పాలన పద్ధతిని బట్టి పరికించిన అది శరీరము అని పిలువబడినది. క్రీస్తు దానికి శిరస్సుగాను క్రైస్తవులందరు దానిలో సభ్యులుగాను ఉన్నారు (రోమా 12:5).

4) అదొక కుటుంబముగా పరికించబడినప్పుడు దేవుని యిల్లు అని చెప్పబడినది. దేవుని బిడ్డలందరు దానిలో అనగా సంఘములో సభ్యులుగా యున్నారు (1తిమో 3:15; రోమా 8:14-17).

5) సంఘము యొక్క ఆరాధనను బట్టి పరికించిన అది దేవుని ఆలయము అని పిలువబడినది (1కొరింధీ 3:16,17; 6:10 1కొరింధీ; 6:16). సంఘము ఒక భౌతిక ఆలయము లేక గుడి కాదు (అపొ.కా. 7:48; 17:24). దేవుడు దానిలో నివసించి ఆరాధింపబడువాడు గనుక అదొక ఆత్మీయ మందిరము. క్రొత్తనిబంధనలో సంఘము అను పదము ఒక గుడిని ఎన్నడును సూచించుట లేదు.

6) దానితో క్రీస్తుకు ఉన్న సంబంధమును బట్టి అది క్రీస్తు యొక్క వధువు. వ్యక్తిగత సభ్యులు ఆయన నామమును ధరింతురు (ఎఫెసీ 5:23-32; అపొ.కా. 11:26; 26:28; 1 పేతురు 4:16).

ఒకే సంస్థ ఇన్ని విధములుగా ఎందుకు వర్ణించబడెనో మనము తెలిసికొన గలము. ఏలయనగా ఒక పురుషుడు సహోదరుడుగాను భర్తగాను, తండ్రిగాను, వైద్యునిగాను, భారతీయుని గాను, క్రైస్తవునిగాను ఉండగలడు. అతడు ఒకడే ఆయినను ఆరుకోణములనుండి అతని మనము పరికింపవచ్చును.

దేవుని సంఘములోనికి ప్రవేశింపజేయు శాసనము లేఖనములలో విపులముగా వివరించబడినది. వాక్యమును వినుట ద్వారా క్రీస్తు దేవుని కుమారుడని కలిగే విశ్వాసము, గత పాపముల విషయమైన మారుమనస్సు క్రీస్తుపందలి విశ్వాసము యొక్క ఒప్పుకోలు , పాపక్షమాపణ నిమిత్తమైన నీటి బాప్తిస్మము దానిలో యున్నవి (మార్కు 16:15,16; రోమా 10:17; అపొ.కా. 2:38; 22:16). ఎవడైనను అట్లు దేవుని చిత్తమునకు లోబడిన యెడల ప్రభువతని రక్షించి తన సంఘమందు చేర్చుకొనును (అపొ.కా.

2:47). ఒకడు ఏసమయ మందు ఏ విధముగా క్రైస్తవుడు లేక దేవుని బిడ్డయగునో అదే సమయమందు అదే రీతిగా అతడు సంఘ సభ్యుడగును.

రక్షింపబడుట సంఘ సభ్యుడగుట వేర్వేరుగా యుండునని అనేకులు తలంతురు. సంఘములు (మతశాఖలు ) అన్నియు మంచివే యనియు, దానిలో ఎవడైనను సభ్యుడు కాగోరుచున్న యెడల అతడు దానిలో తనకుగా తాను చేరవలెననియు అనేకులు భావింతురు. ఈ భావములన్నియు బైబిలు జ్ఞానము లేకుండా మతశాఖల తత్వమును బట్టి ఆలోచించుట వలన కలుగును.

క్రీస్తు నిర్మించిన సంఘము ఒక డినామినేషన్‌గా బైబిలులో ఎన్నడు చెప్పబడలేదు. దానిలో ఎవడు తనకుగా తాను ఎన్నడు చేరినట్లు రికార్డు ఏమియు లేదు.

సంఘము అను పదము బైబిలులో ప్రాథమిక భావములతో ఉపయోగింపబడినది 1) రక్షింపబడిన వారందరితో యున్న సార్వజనిక భావము (ఉదా: మత్తయి 16:18; ఎఫెసీ 5:23 2). ఒక చోట కూడుకొనుచు కలసి పనిచేయుచున్న క్రైస్తవుల సమాజమగు స్థానిక సంఘభావము (ఉదా: 1కొరింథీ 1:1,2; రోమా 16:16). ఒకే ఒక్క సంఘమున్నది. అది రక్షింపబడినవారి సమూహము. క్రీస్తుచే నిర్మింపబడి అది ఆయనకే చెందినట్టిది. క్రొత్తనిబంధనలో సంఘమునకు వాడబడిన భావమునకు ఏ డినామినేషన్ కూడా సరిపోదు. “బైబిలులో బయలు పరచబడిన సంస్థకు లేక సంఘమునకు వేరుగా యుండి బైబిలులో లేని గుణములను కలిగిన ఒక మత సంస్థ డినామినేషన్” అని ఒకరు పలికిరి. దేవుని వాక్యములో లేనిదానిని నమ్మకుండ, చేయకుండ,చెప్పకుండ, కలిగియుండకుండ ఏ డినామినేషన్ అయిన నిలబడియుండుట అసాధ్యము. డినామినేషన్లన్నియు బైబిలులో యున్నదానిని కొద్దో గొప్పో

బోధింతురు  గాని బైబిలులో యున్న సంగతులను వారు బోధించుట వలన వారు డినామినేషన్లుగా తయారుకాలేదు.

సంగ్రహముగా, సువార్తకు లోబడి రక్షింపబడిన వారి సమూహమే సంఘమని బైబిలు బోధించుచున్నది. శిరస్సుగా క్రీస్తు పాలన చేయును. మరియు ఆయన సంఘములో ఆయన ఆత్మ నివసించును. రక్షింపబడిన వారు, సంఘము ఒక్కటే, రక్షింపబడినవారు సంఘము, క్రైస్తవులందరు (రక్షిపబడినవారందరు) సంఘస్థులు కావలెను. ఒకడొక కుటుంబములో లేకుండ ఆ కుంటుంబసభ్యుడెట్లు కాలేడో అట్లే ఈ సంఘసభ్యుడు కాకుండ యెవడును క్రైస్తవుడు కానేరడు సరిగదా క్రీస్తు రాజ్యములో అనగా ఆయన గృహమయిన సంఘములోనే రక్షణ యున్నది (కొలస్స 1:13, 14; 1తిమోతి 3:16).

## ఎ).క్రొత్తనిబంధన సంఘము విభజింపబడని క్రైస్తవుల సమూహము

క్రీస్తుసంఘము ఒకే శరీరమైనందున, వివిధ నామములను, పాలన పద్ధతిని, విశ్వాస ప్రమాణమును కలిగియున్న అనేక శరీరములుగా అది విభజింపబడి యుండలేదు. అపొస్తలుల కాలములో క్రైస్తవులు అనేక సంస్థలుగా (సంఘములుగా) విడిపోలేదు.గాని వారు క్రీస్తు శరీరమైన ఒకే సంఘములో సభ్యులుగా యుండిరి. మొదటి శతాబ్దపు క్రైస్తవులు ఒక డినామినేషన్‌లో గాక క్రీస్తు సంఘసభ్యులై యుండిరి. క్రైస్తవులలో చీలికలు ఖండింపబడెను(1కొరింధీ 1:10). తన శిష్యులందరు ఏకమై యుండవలెనని క్రీస్తుప్రార్ధించెను (యోహాను 17:20,21). ప్రజలు ఈ నాడు ఏ డినామినేషన్‌కు చెందకుండా క్రైస్తవులుగా, క్రీస్తు సంఘ సభ్యులుగా మాత్రమే యుండవలెను. ఒకడు ఏ డినామినేషన్‌లోను లేకుండ క్రీస్తుసంఘములో యుండగలడు.

యేసు ఒకే ఒక సంఘమును స్థాపించెను గనుక మానవులు యితర సంఘములను స్థాపించి అవి ప్రభువు సంఘములని ఆరోపించుట తగదు. సరిగదా క్రీస్తు సంఘమును ఒక డినామినేషన్‌గా విభజించే హక్కు కూడ వారికి లేదు. బహుశా డినిమినేషన్లన్నియును ఒకే రీతిగా యుండవచ్చునేమో గాని వాటిలో ఏదియు క్రీస్తు సంఘముతో సమానముగా యుండలేదు. డినామినేషన్‌లు మానవ కల్పిత సంస్థలు మాత్రమే. యేసు సంఘమును నిర్మించిన చాలకాలము తరువాత అవి స్థాపింపబడెను గనుక అవి క్రీస్తు సంఘము కానేరవు. మానవులు ప్రొటెస్టాంటు డినామినేషన్ల వలె సవరణ చేయబడక క్రొత్తనిబంధన సంఘమును పునరుద్ధరించ పూనుకొనియున్న యెడల ఈనాడు మతశాఖల తత్వమును మనమెరుగక పోదుము. క్రీస్తు తన సంఘమును స్థాపించిన 15 వందల సంవత్సరముల తరువాత 16వ శతాబ్దములో ప్రొటెస్టాంటు డినామినేషన్లు ఆరంభ మాయెను. క్రొత్తనిబంధనలో క్రీస్తుసంఘము బయలుపరచబడెను గాని మానవ కల్పిత డినామినేషన్లు ఒక్క సారి కూడ దానిలో కనబడవు.

## బి). ఏ జనాంగము లోనైనను క్రీస్తుసంఘమును ఈనాడు పునరుత్పత్తి చేయవచ్చును

క్రీస్తు బోధింపబడగా ప్రజలు ఆయనయందు విశ్వసించి, మారు మనస్సునొంది, ఆయనను దేవుని కుమారుడని ఒప్పుకొని, ఆయనలోనికి బాప్తిస్మము ఎక్కడ పొందుదురో అక్కడ క్రైస్తవులు ఉత్పత్తి యగుదురు. గనుక ప్రజలు క్రొత్తగా జన్మించు సాధనము, సంఘము కొనసాగింపబడు సాధనము దేవుని వాక్యమై యున్నది (యాకోబు 1:18).

రాజ్యము యొక్క విత్తనము దేవుని వాక్యమని యేసు వివరించెను (లూకా 8:11). 21వ శతాబ్దములో కూడ అదే విత్తనమును విత్తిన యెడల ఆదిలో యెట్టి ఫలితముల నిచ్చెనో అదే ఫలితములను ఇప్పుడును

యిచ్చును. సంఘము ఆ సంఘమేయని నిర్ధారణ చేసికొనుటకు మానవుడు సంఘచరిత్రను అపొస్తలుల కాలము వరకు వెనుకకు తిరుగవేయ నక్కరలేదు. అదే విత్తనమును విత్తిన యెడల అదే ఫలములు వెంబడించును. మొదటి శతాబ్దములో సువార్త క్రైస్తవులను, క్రీస్తు సంఘములను ఉత్పత్తి చేసెను. ఈనాడు ఈఅదే సూక్ష్మవర్తమానము బోధింపబడిన యెడల అది క్రైస్తవులను, క్రీస్తు శరీర సభ్యులను ఉత్పత్తి చేయును. నిజసంఘము ఏ ప్రాంతములో యున్నను, అది బైబిలులో మనకు కనబడు సంఘమై యున్నది. ఈనాడు పేరులోను, బోధలోను, ఆరాధన, ఆచరణలోను ఏసమూహమైన క్రొత్తనిబంధన ప్రకారమున్న యెడల నిజానికి అదే క్రీస్తు సంఘము అపొస్తలుల కాలములోయున్నది. ప్రతివిత్తనము దాని జాతి ప్రకారము పునరుత్పత్తి కలిగియున్నది. ప్రతివిత్తనము దాని జాతి ప్రకారము పునరుత్పత్తి కలిగించునుగనుక ఆదిను సువార్తను బోధించుట ద్వారా ఏ యుగములోనైనను సరే మొదటి శతాబ్దపు శిష్యులతోఅన్ని విషయము లలోను సమానముగయుండు శిష్యుల సంఘములను కలిగియుండుట సాధ్యమే.

క్రొత్తనిబంధనలో వర్ణించబడిన క్రీస్తు సంఘమును సంపూర్ణముగా పునరుత్పత్తి చేయగలిగిన యెడల డినామినేషన్లు వాటికవే నాశనము చేయబడును.ఏలయనగా ప్రజలందరు లేఖనములలో చెప్పబడిన వాటినే బోధించి ఆచరించిన యెడల, డినామినేషనులుండవు. అట్టిది సాధ్యమే గనుక అందరు ఏకమై క్రీస్తు నిర్మించిన ఒకే సంఘముతో యుండే దినమును త్వరలో దేవుడనుగ్రహించు గాక !!

## 6. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలవనేరవు

ఆరవదిగా, "ఈబండమీద నా సంఘమును కట్టుదును పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని" యేసు చెప్పెను (మత్తయి

(16:18). మరణించిన వారి ఆత్మలు పునరుత్థానము వరకు ఉండు ప్రదేశము పాతాళలోకము (Hades). సంఘము వ్యాప్తి జెందుటలో పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని లేఖనములు బోధించుచున్నను, ఈ వచనము యొక్క సందర్భము దాని నిర్మాణమును గూర్చి ఉద్దేశించబడినది. సంఘము స్థాపించబడుటలో పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు. అంటే యేసు మృతులలో నుంచి లేచి తన సంఘమును నిర్మించకుండా పాతాళ(అదృశ్య) లోకశక్తులు ఆపుచేయలేవు. తన సంఘమును కట్టుటకు క్రీస్తు నిశ్చయించెను, పాతాళలోక ద్వారములు లేక అదృశ్యలోకము దానిని ఆపుచేయలేదు.

మరణముగాని లేక మరి ఏ శక్తిగాని సంఘమును సంపూర్తిగా ఎన్నడు నాశనము చేయబోదు ఇది నిజము. ఆయన రాజ్యము నిత్యము నిలుచును (దానియేలు 2:44). అది నిశ్చలమైనది. తరువాత అనేక సంఘసభ్యులు విశ్వాస భ్రష్టత్వములో పడిపోయినను, దేవుని రాజ్యపు విత్తనమగు వాక్యము అక్షయమైనది గనుక ఇంకను సజీవముగా యున్నది (1తిమో 4:1,3; 2 థెస్స 2:2,10; 1 పేతురు 1:23). ఏ కాలమందైనను క్రీస్తు సంఘము ఈ భూమిపై కనబడకున్న యెడల, దాని పునరుత్పత్తి శక్తి ఉండెను. ఏలయనగా విత్తనము నిలిచియుండెను. మరియు ఆ విత్తనము నిత్యమైనది (మార్కు 13:31).

## 7. రాజ్యపు తాళపు చెవులు పేతురుకు ఈయబడెను

ఏడవదిగా మత్తయి 16లో మనము నేర్చుకొనవలసిన దేమంటే రాజ్యపు తాళపుచెవులు క్రీస్తు పేతురుకు ఇచ్చెను. తాళపు చెవులు శక్తిని లేక అధికారమును సూచించుచున్నవి. "పరలోకరాజ్యము" అనుటలో ఈజీవితా నంతరమున్న నిత్యపరలోక రాజ్యమని క్రీస్తు ఉద్దేశ్యము, అది క్రీస్తు శరీరము, దేవుని కుటంబము. సంఘములోనికి ప్రజలు ప్రవేశించుట

యెట్లో తెలుపు అధికారము పేతురుకు వాగ్దానము చేయబడెను. క్షమాపణనొందు షరతులు, రాజ్యములో ప్రవేశింపజేసే షరతులు కూడ ఒక్కటే. ఈ అధికారమును తరువాత ప్రభువు అపొస్తలులందరికి వాగ్దానము చేసెను (మత్తయి 18:18). పెంతెకొస్తునాడు మొట్టమొదటిగాపేతురు ఇశ్రాయేలీయులకు సువార్త ప్రకటించి నందునను కొర్నేలి ఇంటివద్ద అన్యజనులకు మొదటిగా సంఘ ద్వారమును తెరచినందునను అతనికీ ఘనత లభించెను(అపొ.కా. 2 అపొ.కా. 10 11: 1-18).వీరిద్దరికి సంఘ ద్వారమును అతడు ఒకే లాగున తెరిచెను.

నీవు భూమిమీద దేనిని బంధింతువో అది పరలోకమందు బంధింపబడును అనునది యేసు పేతురుకు చేసిన వాగ్దానము. అంటే పరలోకమందు ఏది అప్పటికే బంధింపబడెనో లేక విప్పబడెనోదానిని అపొస్తలులు ఈ లోకమునకు ప్రకటించిరి. గనుక పేతురును, మిగిలిన అపొస్తలులును భూమి మీద దేని బంధించిరో లేక విప్పిరో అనగా రక్షణ షరతులు, సంఘమును గూర్చిన అన్ని విషయములు పరలోకమందును బంధింపబడెను లేక విప్పబడెను లేక ఆమోదించబడెను. వారియొక్క బోధనలో అపొస్తలులు పరిశుద్ధాత్మని వలన సర్వ సత్యములోనికి నడిపింపబడిరి (యోహాను 16:13). గనుక ఈ నాడు క్రొత్త నిబంధనలో లిఖింపబడియున్న వారి బోధ మాత్రమే క్రైస్తవుల విశ్వాస ప్రమాణమై యున్నది, ఈ రకమైన ఉపదేశము ప్రభువు సంఘము యొక్క విశ్వాస ప్రమాణమై యున్నది".

## A. పేతురు పోపా ?

మిగిలిన అపొస్తలులకంటే పేతురు అనేకసార్లు వ్యక్తిగత ప్రాముఖ్యత కలిగియుండుట నిజమే. అపొస్తలుల జాబితాలన్నిటిలో అతని పేరు ముందు కనబడును (మత్తయి 10:2-4). అయితే ఈనాడు తరచుగా అడుగబడుచున్న ప్రశ్న పేతురు ప్రముఖుడా? యనునది కాదుగాని, పేతురు

సంఘ శిరస్సుగా యుండెనా? మరియు రోమా పట్టణపు బిషప్పులు పేతురు తరువాత వచ్చిన వారా? యనునది. పేతురు మొదటిపోప్ (Pope) అనియు మన ప్రభువు యొక్క సంఘము అతనిపై నిర్మించబడెననియు అతనికి అతని తరువాత వచ్చిన వారికిని సమస్తాధికారము ఈయబడెననియు కొందరు భావింతురు. అయితే మన ప్రభువు పేతురుకు మత సంబంధమైన ప్రాముఖ్యతను ఏమియు ఇయ్యలేదని ఈ క్రింది లేఖనముల వలన తెలిసికొనవచ్చును:

1) సంఘపు పునాది పేతురు అని మత్తయి 16:18 బోధించుట లేదు. క్రీస్తు తన సంఘమును బండలో ఒక చిన్న ముక్క అయిన రాతిపై గాక, అనిశ్చలమైన పర్వత బండపై అనగా పేతురు ఒప్పుకొనిన సత్యముపై నిర్మించెను. 2) మిగిలిన అపొస్తలులు నేరుగా క్రీస్తునుండియే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. మరియు బంధించుటకును, విప్పుటకును సమానము గా ఆత్మ ప్రేరితులైరి (మత్తయి 18:18; యోహాను 20:21-23; అపొ.కా. 1:8; 2:1-4). గనుక పేతురుకు కలిగిన ప్రాముఖ్యత అంతా సువార్తద్వారములను ఈలోకమునకు మొదట తెరచుటలోనే యుండెను.

3) క్రీస్తు పేతురును సంఘశిరస్సుగా నియమించుటకు గాని లేక వారందరిపై అధికారిగా నియమించుటకు గాని యోచించుచున్నట్లు అపొస్తలులెవరు భావించి యుండలేదు. ఫిలిప్పుదైన కైసరయలో సంభాషణ జరిగిన కొన్ని దినముల తరువాత సలోమియు ఆమె ఇద్దరు కుమారులును ఆయన రాజ్యములో ప్రముఖ స్థానములను గూర్చి క్రీస్తు నడిగిరి (మత్తయి 20:20-28; మార్కు 10:35-45). అంతేకాదు వారు ఆఖరి రాత్రి భోజనము దగ్గర ఆ పండ్రెండుగురిలో గొప్పవాడెవరోయను దానిపై వివాదమేర్పడెను (లూకా 22:21-30). అయితే ఈ గొప్ప స్థానమును అప్పటికే ప్రభువు పేతురుకు ఇచ్చియుండిన యెడల వారెవరును

దానిసంగతి ఎరుగకుండుట వింతయే. అయితే వారందరు సహోదరులనియు , వినయముతో పరిచర్య చేయుటలో నిజమైన ఘనత లభించుననియు, వారిలో ఎవడును మిగిలిన వారిపై అధికారము చేయరాదనియు క్రీస్తు తన శిష్యులకు చెప్పెను (మత్తయి 18:14).

4) అపొస్తులులలో ఒకడనని, యేసు యొక్క దాసుడనని తోటి పెద్దనని పేతురు తనను గూర్చి తెలియజేసెను (1 పేతురు 1:1 1పేతురు 5:1).కాని భూమిపై సంఘమునకు తాను శిరస్సుననిఅతడెన్నడు చెప్పుకొొన లేదు. మిగత అపొస్తులులపై ఎట్టి అధికామును చెలాయించలేదు. క్రైస్తవులు సజీవమైన రాళ్ళవలె నుండి పోపుగా యున్న అతనిపై గాక క్రీస్తుపై నిర్మించబడిన వారని కూడ అతడు తెలియజేసెను (1పేతురు 2:3–8).

5) పేతురు ఒక వివాహితుడు అతనికొక భార్య, అత్తకూడ కలరు (మత్తయి 9:14).సంఘము స్థాపించబడిన అనేక సంవత్సరముల తరువాత కూడ అతడు తన భార్యను కలిగియుండెను (1కొరింథీ 9:5). పేతురు తరువాత వచ్చిన వారమని చెప్పుకొనువారి ఆచారమునకు ఇది విరుద్ధముగా యున్నది. అయితే పేతురు గనుక మొదటి పోపు లేక బిషప్పు అయ్యుంటే అతడు వివాహితుడై యుండెను ఏలయనగా అధ్యక్షుడగువాడు ఏకపత్నీ పురుషుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (1తిమో 3:2–5; తీతు 1:6). ఏవిధముగా నైనను ఈనాటి పోపుల ఆరోపణలను ఇది ఖండించుచున్నది.

6) మానవారాధనలో ఆనందభరితులగుచున్న పోపుల స్వభావమునకు విరుద్ధముగా పేతురు మరొక మానవుని నుండి ఆరాధన నంగీకరించలేదు. సరిగదా అతని వ్యక్తిగత జీవితములో అతడు దోషము లేనివాడు కాదు. అతడొక సారి అపరాధిగా తీర్చబడెను గనుక పౌలు అతనిని ముఖాముఖిగా ఎదిరించెను. అతడెన్నడును పొరపాటు పడని

వాడైతే ఈ సంగతి జరుగకపోవును (అపొ.కా. 10:25,28; గలతీ 2:11).

7) మిక్కిలి శ్రేష్ఠులైన అపొస్తలులకంటే నేను ఏ విషయములోను తక్కువ వాడను కాను అని పౌలు చెప్పెను గనుక పౌలు కూడ సంఘశిరస్సుగా యుండెనా?(2కొరింథీ 11:5; 12:11). అట్లు కానేకాదు. సరిగదా ముఖ్యముగా అన్యజనులతో ఏర్పడిన సంఘమునకు శిరస్సుగా ఎవడైన యుండతగిన యెడల అతడు పౌలు. ఏలయనగా అన్యజనాంగములకు అపొస్తలుడుగా యుండుటకు ప్రభువుతని ఏర్పరచుకొనెను.

వాస్తవముగా పేతురు యొక్క మత సంబంధ ప్రాముఖ్యతను గూర్చి క్రీస్తు ఎన్నడు పలుకలేదు. పేతురు ఆరోపించు కొనలేదు, మిగిలిన అపొస్తలులు దానిని అంగీకరించలేదు. ఏరీతిగనైనను పేతురు సంఘశిరస్సు కాదు. సంఘము స్థాపిచబడిన తరువాత, అపొస్తలులెవరు పేతురు తమ అధికారియని గాని లేక సంఘశిరస్సని గాని పలుకలేదు. సరిగదా సంఘమను శరీరమునకు క్రీస్తే శిరస్సు అని, ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగవలెనని వారు బోధించారు (కొలస్స 1:18).

మత్తయి 16:18 ప్రకారము పేతురుకేదో ప్రముఖ స్థానము ఈయబడినదని మనము అంగీకరించామనుకొందాము. అయినను కూడ పేతురు రోమాలో బిషప్పుగా యున్న ఋజువులేమియు లేవు. ఒకవేళ అతడు బిషప్పుగా యున్నను అతని ప్రముఖతను మరొకనికిచ్చిన ఋజువేమియు లేదు. అపొస్తలులను నేరుగా ప్రభువే నియమించెను. వారి తరువాత వారి స్థానమును అలంకరించిన వారవరును లేరు. పేతురు తరువాత పొరపాటు చేయనివారు అతని స్థానము నలంకరించవలెనని అట్టివారు క్రీస్తు ప్రతినిధులని సంఘ శిరస్సు అని

బైబిలు ఎక్కడ బోధించుటలేదు, పేతురు ఎన్నడయినా రోమా పట్టణములో యున్నట్టి వాస్తవమేదియు కనబడుట లేదు. అదొక పారంపర్యాచారమే. అయితే రోమాలోయున్న పోపులందరి ఘనతకు, దోషరక్షతత్వ ఆరోపణలకు యిది మాత్రమే ఆధారమై యున్నది.

సీమోను పేతురు రోమా పట్టణపు మొదటి బిషప్పు కాదనియు, సంఘశిరస్సు కాదనియు నిరూపించుకొనుట కొరకు ఈ దిగువ వాస్తవములను గమనించుము : 1) పేతురు రోమాలో పోపుగా యుండెనని విన్పడుచున్న క్రీ॥శ॥44వ సంవత్సరములో అతడు యెరూషలేములో యుండెను (అపొ.కా. 12). 2)పౌలు కొరింధునుండి రోమీయులకు పత్రికను వ్రాసినప్పుడు క్రీ॥శ॥ 58లో పేతురు రోమాలో లేడు. ఆ ప్రతికలో పేతురు అక్కడ ఉన్నట్లేమియు చెప్పబడ లేదు. ఇరవైయేడుగురు క్రైస్తవులకు శుభమని చెప్పిన తరువాత పౌలు ఒక ఖైదీగా రోమాకు వెళ్ళి అక్కడ రెండు సంవత్సరములుండెను. ఆ సమయములో అతడు కొలస్సయులకు, ఫిలేమోనుకు, ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు పత్రికలను వ్రాసెను. ఈ ఒక్కొక్క పత్రికలో అతడు అనేకులను గూర్చి వ్రాసినను పేతురును గూర్చి అతడేమియు వ్రాయలేదు. పేతురుగనుక పోపు అయితే పౌలు అతనిని మరల నిర్లక్ష్యము చేసెనా ? 4) తరువాతపౌలు రోమానుండి తిమోతికి రెండవ పత్రికను వ్రాసెను. అయినను ఆ పట్టణములో పేతురు యొక్క ఉనికిని గూర్చి దానిలో ఏమియు చెప్పబడలేదు. అందరు అతని విడిచి వెళ్ళిరి గాని లూకా మాత్రమే తనయొద్ద ఉన్నాడని పౌలు చెప్పెను (2తిమో 4:11). పేతురు ఎక్కడున్నాడు? మరణ ఘడియలో అతని సందర్శించుటకు పోపు భయపడెనా ? 5) పేతురు వ్రాసిన రెండు పత్రికలలోను అతడు రోమాలో నివసించినట్లు ఏమియు చెప్పబడలేదు: సరిగదా దానికి తూర్పుగా యున్న బబులోనులో అతడుండెను (1పేతురు 5:13). 6)ఆత్మ ప్రేరిత లేఖకుడెవడును పేతురు రోమాలో యున్నట్లు ఎన్నడు చెప్పలేదు. అయితే

ఎప్పుడైనా భూగర్భ పరిశోధనలను బట్టి పేతురు రోమాలో చనిపోయెనని నిరూపించగలిగిన యెడల, అక్కడనుండి సంఘ శిరస్సుగా అతడు పరిపాలించెనని, రోమా పట్టణ బిషప్పులుఅతని స్థానము నలంకరించు వారని, సంఘశిరస్సులని,రక్షణ పొందుటకు ప్రజలు రోమాలోని పోపుకు లోబడవలెనని చేయు ఆరోపణలు మాత్రము ఇంకనులేఖనములలో ఆధారము లేనివిగానే యుండును.

సర్వాధికారమును కలిగి సార్వజనిక సంఘశిరస్సుగా క్రీస్తు మాత్రమే యున్నారు. ఆయన పరమందు నిత్యము జీవించును. క్రీస్తు సంఘ ప్రధాన కార్యాలయము పరమందే యున్నది. ఆయన సంఘమునకు భూమిమీద ప్రధాన కార్యాలయమేమియు లేదు (ఫిలిప్పీ 3:20).

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఇహ పరములయందు ఆయనకు సర్వాధికారము కలదని చెప్పెను (మత్తయి 28:18). సంఘమునకు భూమిమీద ఒకరును పరలోకములో ఒకరును శిరస్సుగా లేరు. దృశ్యాదృశ్య శిరస్సులతో సంఘము దృశ్యాదృశ్యముగా యుండునని చెప్పువారు బైబిలులో లేని పదముల నుపయోగించుచున్నారు. క్రీస్తు సంఘముపై అధికారిగా యుండు తరుణము భూమిమీద ఎవరికి ఈయబడలేదు, సరిగదా ఒక మానవునికి సంఘమునకు కట్టడలను నియమించు అధికారము ఆయన ఎన్నడు ఈయులేదు. సంఘము క్రీస్తుకు లోబడియుండవలెనని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 5:24). గనుక పొరపాట్లు చేయగల మానవమాత్రుడెవడును ప్రభువు సంఘమునకు శిరస్సుగా లేడు.

## B. మొదటి పోపు ఎప్పుడు ఆవిర్భవించెను?

"పోపు" అను పదమునకు తండ్రి యని అర్థము. యేసు ఇట్లనెను: "భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు ఒక్కడే మీ తండ్రి

ఆయన పరలోకమందున్నాడు" (మత్తయి 23:9; కీర్తన 111:9).

అన్ని రకములైన మతసంబంధ బిరుదులను, దుస్తులను ప్రభువు ఖండించెను. నేను ఘనుడను నీవు అల్పుడవు అనే భావము పోపులగుటకు దారితీసెను. అయితే అపొస్తలులు చనిపోయిన కొన్ని వందల సంవత్సరముల వరకు పోపులు ఉద్భవించలేదు. చరిత్ర ప్రకారము ఈనాడు "పోపు" అనబడే బిరుదు ఈదిగువ రీతిగా ఆవిర్భవించెను: క్రీ॥శ॥ 533లో రోమాలో యున్న బిషప్పునకు జస్టీనియన్ అనునతడు "సంఘప్రభువు" అనే బిరుదు నిచ్చెను. క్రీ॥శ॥ 599లో కాన్‌స్టాంటినోపిల్‌లో బిషప్పుగా యున్న జాన్ ది ఫాస్టర్ అనునతడు సంఘపు స్వారజనిక బిషప్పు (Universal Bishop) అనే బిరుదు తనకు తానే ధరించుకొనెను. అతడాపని చేసినందుకు రోమా బిషప్పయిన గ్రెగరీ ది గ్రేట్ అతనిని తీవ్రముగా ఖండించెను. అయితే కొన్ని సంవత్సరములు గడిచిన తరువాత ఫోకస్ అను బహురక్త దాహము గల రోమా చక్రవర్తి ఆ బిరుదును క్రీ॥శ॥ 606లో బోనిఫేస్ 3 అనునతనికి ధరింపజేసెను. నాటినుండి నేటివరకు రోమా బిషప్పులందరు ఒకరి తరువాత మరొకరు ఆ బిరుదును ధరించుకొనుచు యున్నారు. మొదటి ఆరు శతాబ్దములలో జరిగిన సంఘసభల తీర్మానములన్నిటిని పరిశీలించి చూచిన, పోపుయొక్క ఉ నికిని గూర్చి గాని, సార్వజనిక బిషప్పును గూర్చి గాని మనకు ఎక్కడా కనపడదు. మొదట ధరించుకొనెను. అయితే అప్పటికి రోమాలోయున్న బిషప్పు అది లేఖన విరుద్ధమని, క్రైస్తవ విరుద్ధమని, దయ్యముల సంబంధమైనదని దానిని వ్యతిరేకించెను.

సంఘ చరిత్రను బాగుగా పరిశీలించిన, రోమన్ కేథలిక్కు సంఘ పాలన క్రొత్తనిబంధనను బట్టిగాక పురాతన రోమా సామ్రాజ్య ప్రభుత్వ మాదిరిని బట్టి యున్నదని, అది సత్యమునుండి క్రమముగాభ్రష్టత్వములో పడుట వలన సంభవించెనని విశదమగును (2థెస్స 2).

పోపుల మతాధికారము మూడు ఊహలపై నిలచియున్నది: 1) సంఘములో పేతురు సర్వాధికారమును కలిగియుండెననునది, 2) పేతురు రోమా పట్టణపు బిషప్పు లేక పోపు అనునది, 3) పేతురుకున్న ప్రత్యేక శక్తి అతడు మరణించగా అతని స్థానము నలంకరించిన వానికి, తరువాత అందరికి అందించబడెననునది. అయితే ఈ ఊహలన్నియు అబద్ధములే. కనుక బైబిలు బోధను బట్టి సంఘము యొక్క అధికారమును గూర్చియున్న ఆరోపణలన్నియు దోష భరితమైన పునాదిపై ఆధారపడి యున్నవని బయల్పడినది.

## 8. ముగింపు

ఏదైనా భవనము యొక్క బలము, వయస్సుల రహస్యము దాని పునాదిలో యుండును. భవనము ఎంత అందమైనదయినను అది బలహీనమైన పునాదిపై ఆధారపడిన యెడల అది మన్నదు. ఈ భూమిపై యున్న సంస్థలన్నిటికంటె ఘనమైనదియు, మహిమ గలదియు అయిన ప్రభువు సంఘము దైవిక పునాదిపై, క్రీస్తుపై అనగా అనిశ్చలమైన గొప్ప బండవలె యుండగా దానిపై క్రీస్తు సంఘము నిలిచియున్నది. యేసు స్థాపించిన సంఘమునకు మనుష్యులు స్థాపించిన సంస్థలకు ఉన్న ప్రాముఖ్య భేదము ఇదే. అవి లోపములతో నిండియున్న పునాదులగు మానవ కల్పిత విశ్వా స ప్రమాణములు, వేదాంతములు, ఊహలపై నిర్మించబడెను. కాలము గడచుకొలది అవి పడి పోవును. ఏలయనగా కీర్తనల గ్రంధకర్త ఇట్లు ప్రకటించెను : "యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే" (కీర్తన 127: 1). మరల యేసు ఇట్లనెను: "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" (మత్తయి 15:13; 7:21-27).

ప్రభువు సంఘము స్థాపించబడినప్పటినుండియు దాని పైకి అనేక

తీవ్రమైన తుఫానులు చెలరేగెను. కాని వాటన్నిటినుండి అది ప్రశాంతముగా, నిశ్చలముగా నిలిచియున్నది, ఈ దైవిక సంస్థ ఎల్లప్పుడు నిలిచేయుండును. మానవులందరు క్రీస్తుసంఘ సభ్యులు కావలెనని మేము విజ్ఞాపన చేయుచున్నాము. ఏలయనగా ఇట్టి సంబంధమును కలిగియుండుట వలన మాత్రమే ఎవడైనను రక్షింపబడి ప్రభువుకు అంగీకృతమైన కృషి చేయగలడు (ఎఫెసీ 5:23; మత్తయి 27:1-16).

"ఎల్లప్పుడు కొట్టుకొనిపోవు ఇసుకపై కొందరు తమ నిరీక్షణను నిర్మింతురు. కొందరు తమ ఘనత మీదను లేక ధనము మీదను లేక భూమి మీదను నిర్మింతురు. నేనయితే నిత్యము నిలుచు బండపై యుగయుగములు ఉండు యేసు పై నిర్మింతును".

✤

# 8. రక్షింపబడుటకు ఒకడు సంఘసభ్యుడు కావలెనా ?

## (Must One be a Member of the Church to be Saved?)

"రక్షింపబడుటకు ఒకడు సంఘసభ్యుడు కానవుసరము లేదు, సంఘము ఎవరిని రక్షించదు, ఒకడు ఏ సంఘసభ్యుడు కాకుండా క్రైస్తవుడుగా యుండగలడు" అనే సంగతులను మనము సాధారణముగా వినుచుందుము. ఒకడు మంచి పౌరుడుగా యుంటే క్రైస్తవునిగా యుండుటతో సమానమని అనేకులు తలంచెదరు. ఈ సంగతులు సత్యమో కాదో మనము పరిశోధించుట మంచిది. అవి సత్యమని బైబిలు బోధించుచున్న యెడల అందరు వాటిని అంగీకరించి, దేవుని చిత్తమని వాటిని బోధించవలెను. అయితే అట్టి భావములకు విరుద్ధముగా బైబిలు బోధించుచున్న యెడల అందరు సమాన బలముతో వాటిని వ్యతిరేకించవలెను. బైబిలు ఈ లోకప్రియ సిద్ధాంతములను బోధించుచున్నదో లేదో ఒకడు తెలిసికొనగలడు.

### 1. ప్రభువు ఎక్కడ రక్షించును?

ప్రభువు రక్షించునని బైబిలు బోధించుచున్నట్లు అందరు అంగీకరింతురు : మంచివారందరు సంఘము వెలుపల ఉన్నను లేక మరెక్కడ ఉన్నను రక్షించ బడుదురు అను భావము బైబిలులో కనబడుచున్నదా ? ప్రశ్న యేమంటే, ప్రభువు రక్షించునదెక్కడ ? సంఘములోనా లేక సంఘము వెలుపలా ? సంఘమునకు వెలుపల ఒకడు క్రైస్తవుడుగా యుండగలడా? ప్రభువు సంఘమునకు వెలుపల

ఒకడు రక్షింపబడగలడా ? అయితే బైబిలు రక్షకుడెవరో యని బోధించుట మాత్రమే గాక ఆయన ఎప్పుడు ఎక్కడ రక్షించునో కూడ బోధించుచున్నందున ఈ ప్రశ్నకు బైబిలు జవాబిచ్చును. మానవుడు క్షమాపణ నొందుటకు షరతుల నిచ్చువాడు రక్షకుడే . మరియు రక్షణ నొందుటకు అతడు దేని ద్వారా ఏ ప్రదేశములో యుండవలెనో ఆయనే చెప్పును. క్రీస్తు ఎప్పుడు ఎక్కడ రక్షించునో చెప్పే హక్కును ఆయన కలిగియున్నాడని అందరు అంగీకరింతురు. ప్రభువు అందరి రక్షణను కోరుచున్నారు. అయితే మానవుడు దానిని పొందవలెనంటే దేవుడు దానినెక్కడ ఉంచెనో ఆ ప్రదేశములోని కతడు ప్రవేశించవలెను. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమింపలేదు" (థెస్స 5:9; 2 పేతురు 3:9; 1 తిమో 2:4; తీతు 2:11).

## A. దేవుడు దాని ఆవరణములో దీవెనలుంచెను

రక్షణ విషయములో దేవుడు ఎల్లప్పుడు కొన్ని షరతులను, నియమములను ఉంచెను. వాటిననుసరింపని వారందరు దానినుండి బహిష్కరింపబడిరి. ఉదాహరణకు నోహు దినములలో జలప్రళయములో నాశనము కాకుండ దేవుడు మానవులకు రక్షణ నందించెను. గాని ఆ ఓడలో ప్రవేశించుటకు ఎవరయితే యిష్టపడిరో వారికే అది వర్తించెను. ఆ రక్షణను గూర్చి పేతురు ఇట్లువ్రాసెను: " దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు ఆయన ఆత్మ రూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి " (1పేతురు 3:19-30).

ఈ వాక్య భాగము రక్షణ ఓడలో యుండెనని విపులీకరించుచున్నది.

ఓడకు వెలుపల యున్న వారందరు నశించిరి. జలప్రళయము నుండి రక్షింపబడే స్థానము మరొకటి లేదు  గనుక ప్రజలు ఆ ఓడలో ప్రవేశింపని యెడల వారు నశించిరి. ఆ వృత్తాంతము చివర  ఎనిమిది మంది మాత్రమే రక్షింపబడిరని కనబడుచున్నది. వారు ఓడలోనికి, రక్షణలోనికి ప్రవేశించిరి. గాని మిగిలిన మానవ జాతి అంతయును దేవుని నియమములను పాటించుటలో విఫలులై రక్షణను ఆవరించుకొనియున్న గోడలలోనికి ప్రవేశించలేకపోయిరి! గనుక వారు నాశన మొందిరి. నోవహు దినములలో జలప్రళయము నుండి రక్షణను దేవుని షరతులు ఓడలో యుంచినందున, ఈనాడు పాపము నుండి రక్షణను దేవుడు ఎక్కడ ఉంచెను?  అనే ప్రశ్న తప్పక వచ్చును  దేవుడు రక్షణను తప్పక సంకల్పించెను మరియు బాధ్యత గలవారందరు రక్షింపబడవలెనంటే కొన్ని షరతులను కూడ ఆయన విధించెను. ఈ నియమములకు వేరుగా ప్రజలు రక్షణను ఇంకొకచోట గాని, ఇంకొక విధముగా గాని పొందలేరు.

## B. రక్షణ క్రీస్తులో యున్నది

రక్షణ క్రీస్తులో యున్నదని, క్రీస్తుద్వారానే దేవుడు రక్షించునని బైబిలు బహు విపులముగా ప్రకటించుచున్నది. పౌలు ఇట్లనెను: “అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తుయేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను” (2తిమో 2:10). అంతేగాక అపో. పేతురు క్రీస్తును గూర్చి ఇట్లు పలికెను : “ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే. ఆ రాయి మూలకు తలరాయి ఆయెను. మరి ఎవని వలనను రక్షణ కలుగదు  ఈ నామముననే మనము రక్షణ పొందలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము” (అపో.కా. 4:11-12).

క్రీస్తు యేసునందు రక్షణ పొందవచ్చునని అపో.పౌలు చెప్పుచున్నందున, మరింకొక చోట ప్రజలు రక్షణ పొందలేరా ? యనే ప్రశ్నను  మనమడుగువచ్చును. అయితే మరి ఎవనివలనను రక్షణ కలుగదు అని పేతురు ఖచ్చితముగాను, విపులముగాను చెప్పుచున్నాడు. గనుక క్రీస్తులోనే రక్షణ యున్నది గాని మరింకెక్కడా లేదని బైబిలు వక్కాణించుచున్నది. జలప్రళయము నుండి రక్షణను ప్రభువు ఒక ఖచ్చితమైన ప్రదేశములో ఎట్లుంచెనో అట్లే ప్రేరితులైన వారు రక్షణను ఒక ఖచ్చితమైన ప్రదేశములో యుంచిరి. ఒక్కటి ఓడలో యుండెను, మరొకటి క్రీస్తులో యున్నది. ఈనాడు రక్షణ మరొకచోట ఎక్కడ లభించదు  అది క్రీస్తు యేసులో మాత్రమే దొరుకును. గనుక రక్షింపబడుటకు అనేక మార్గములున్నవని భావించునప్పుడు మానవులు అపోహపడుచున్నారు. పరలోకమునకు వెయ్యి మార్గములు లేవు  రెండు కూడా లేవు. యేసు ఒక్కడే ఆ మార్గము . ఆయన ఒక మార్గము కాదు  ఆయనే మార్గము.

"నేనే మార్గమును, సత్యమును జీవమును   నాద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" అని యేసు ప్రకటించెను (యోహాను 14:6). రక్షణ క్రీస్తులో తప్ప వేరొకచోట ఎక్కడ లేనందున మానవులు రక్షణను ఇంకెక్కడ పొందలేరు. గనుక రక్షణ పొందే ప్రదేశము ఆయన లోనే యున్నది.

## 2. క్రీస్తులో యున్న దీవెనలు యేమిటి ?

### A. ఆత్మీయ ఆశీర్వాదములన్నియు క్రీస్తులో యున్నవి

"మనప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక . ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదములను మనకనుగ్రహించెను" అని

అపో.పౌలు ప్రకటించెను (ఎఫెసీ 1:3). క్రీస్తులో యున్న అనేక దీవెనలలో కొన్నిటిని మరియు క్రీస్తులో యుండుట అనగా యేమిటో యను దానిని గమనించుము :

**1) విమోచన క్రీస్తులో యున్నది :** "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతి మంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). రక్షణకు లేక పాప క్షమాపణకు ఉన్న వేరొక పదము విమోచనము. పాపమునుండి మానవుని విమోచించుటకు క్రీస్తు చనిపోయెను. అయితే ఆయన రక్తము యొక్క క్రయ ధనముచే కొనబడు నిమిత్తము ఆ విమోచనమున్న స్థావరపు సరిహద్దులలోనికి ఒకడు రావలెను (1పేతురు 1:18,19; ఎఫెసీ 2:13). గనుక విమోచనము షరతులపై ఆధారపడి యున్నది.

**2) క్షమాపణ క్రీస్తులో యున్నది:** "ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:14). పాప క్షమాపణ క్రీసులో యున్నందున ఒకడు తన పాపములు క్షమించబడవలెనంటే అతడు ఆయనలో యుండవలెను (ఎఫెసీ 1:7).

**3) ఒకడు క్రీస్తులో నూతన సృష్టి :** "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2కొరింథీ 5:17). క్రొత్తగా జన్మించిన వాడే నూతనసృష్టి (యోహాను 3:5). అనగా అతడు క్రైస్తవుడు అయితే క్రీస్తుకు వెలుపల యెవడును నూతన సృష్టికాడు.

**4) జీవము క్రీస్తులో యున్నది.** "ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను" (యోహాను 1:4). "ఆ సాక్ష్యమేమనగా–దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను. ఈ జీవము ఆయన కుమారుని యందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు

జీవము గలవాడు  దేవుని కుమారుని  అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (యోహాను 5:11,12).

ఒకడు ఆత్మీయ జీవముననుభవించుచు అది దొరుకని ప్రదేశములో యుండనేరడు. మరల ఉదాహరణకు : కాలారంభమున వివిధ ప్రాణులకు ఆయా స్థానములను దేవుడు ఏర్పరచెను. చేపలు నీటిలో యుండవలెనని ఆయన ఆదేశించెను. ఏ చేపయైనను నీటికి వెలుపల జీవించగలదా ? లేదు. వాటి భౌతిక జీవనమును దేవుడెక్కడ నిర్దేశించెనో అక్కడే చేపలు జీవించవలెను. దీని అనుసరణనే ఇప్పుడు గమనించుము : దేవుడు ఆత్మీయ జీవమును ఎక్కడు ఉంచెను? నిశ్చయముగా అది క్రీస్తులోనే యున్నది. కుమారుని కలిగియున్న ప్రతివాడు కుమారునికున్న జీవమునే కలిగియుండును. గనుక మానవునికి ఆత్మీయ జీవముగల ప్రదేశము క్రీస్తులోయని గ్రహించవలెను.

**5) ఒకడు క్రీస్తులో సమాధానము పొందును:** "సమస్తమును దేవుని వలన నైనవి  ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధానపరచుకొని, ఆ సమాధాన పరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు ఆసమాధాన వాక్యమును మాకు అప్పగించెను. కావున.... దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలు కొనుచున్నాము " (2కొరింధీ 5:18-20).

సమాధానము అనునది పాపక్షమాపణను, రక్షణను సూచించు మరియొక్క పదము. దేవుడు మానవుడు సమాధాన పరచబడినప్పుడు మానవుని పాపములు క్షమించబడును  అతడు మరల దేవునితో ఏకపరచబడును. పాపములు క్షమించబడును  అతడు మరల దేవునితో ఏకపరచబడును. దేవుడు మానవుడు క్రీస్తులో కలియుందురు  గనుక

క్రీస్తులో యుండుట అనగా దేవునితో సమాధానపడుటయని అర్ధము.

**6) ఆయన శరీరములో ఒకడు సమాధాన పరచబడును:** “తన సిలువ వలన ... వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని ఈలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు” (ఎఫెసీ 2:16). కనుక దేవునితో సమాధాన పడుటకు మానవుడు ఆ ఒకే శరీరములో యుండవలెను ఆ ఒకే శరీరములో యుండుట అనగా క్రీస్తులో ఉండుటయే.

## B. క్రీస్తులో యుండుట అనగా సంఘములో ఉండుటయే

ఆ ఒకే శరీరమే సంఘమని బైబిలు వివరించుచున్నది: “ సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను, ఆ సంఘము ఆయన శరీరము సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది” (ఎఫెసీ 1:22, 23). “సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు” (కొలస్స 1:18). “సంఘము అను శరీరము కొరకు.... ” (కొలస్స 1:24). గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

దేవునితో సమాధాన పరచబడుట అనగా, పాపములు క్షమించ బడుట అని యర్ధము గనుక, ప్రజలు సంఘములో రక్షించబడుదురు లేక సమాధానపరచబడుదురు.

ఇప్పటి వరకు లేఖనముల నుండి ఈ దిగువ సంగతులు ధృవపరచబడెను: 1) ప్రజలు ఒకే శరీరములో సమాధానపరచబడుదురు (ఎఫెసీ 2:16). 2) ఆ శరీరము సంఘము (ఎఫెసీ 1:22,23; కొలస్స 1:18,24). 3) గనుక ఆ ఒకే శరీరమైన సంఘములో ప్రజలు రక్షించబడుదురు లేక సమాధానపరచబడుదురు.

సంఘమను శరీరమునకు రక్షకుడు క్రీస్తేయని బైబిలు బోధించుచున్నది: "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). సంఘము క్రీస్తు శరీరమై యున్నందునను, మరియు క్రీస్తు శరీరమునకు రక్షకుడైనందునను ఒకడు రక్షింపబడి ఆయన సంఘములో సభ్యుడు కాకుండ యెట్లుండగలడు? రక్షింపబడవలెనంటే ఒకడు క్రీస్తు దేనికి రక్షకుడైయున్నాడో దానిలో సభ్యుడుగ యుండవలెను.

'సంఘము ఎవరిని రక్షించదు' అనే మాటలను మనము తరచు వినుచుందుము. ఇది నిజమే. అయినను ప్రభువు సంఘము యెవరిని రక్షించదను మాట నిజమే గాని క్రీస్తుసంఘమును రక్షించును. గనుక ఎవరు క్రీస్తు శరీరములో యుందురో వారికే రక్షణ వాగ్దానము చేయబడినది. సంఘము రక్షకుడు కాదుగాని, అది రక్షింపబడినవారు, రక్షింపబడిన వారందరు సంఘములో యుందురు లేక రక్షింపబడినవారే సంఘము. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" అని బైబిలు చెప్పుచున్నది (అపో.కా. 2:47). ప్రజలను ప్రభువు రక్షించి వారిని అదే సమయమందు తన సంఘముతో చేర్చునని ఈ వచనము చెప్పుచున్నది. వారు మొదట రక్షించబడి తరువాత చేర్చబడలేదు. లేక చేర్చబడి రక్షింపబడ లేదు. గాని వారు చేర్చబడుటలో రక్షించబడిరి, రక్షింపబడుటలో చేర్చబడిరి.

**మరొక సమీక్షను గమనించుము:**

1) రక్షణ క్రీస్తులో యున్నది గనుక, రక్షింపబడుట యనగా క్రీస్తులో నుండుటయే (2తిమో 2:10).

2) రక్షింపబడుట సంఘములో యుండుట సమానమే. ఏలయనగా రక్షింపబడు వారిని ప్రభువు సంఘముతో చేర్చును (అపో.కా. 2:47).

3) గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

**ఈ లేఖనముల ముగింపు ఈ విధముగా యున్నది:**

ఒకడు క్రీస్తులో యుండి ఆయన సంఘమునకు వెలుపల యుండలేడు. ఏలయనగా సంఘము క్రీస్తు శరీరమైయున్నది. ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తులోనికి ప్రవేశించుట అవసరము, ఆయన సంఘములో యుండుట అవుసరము. ప్రభువుయొక్క ఆత్మీయ శరీరమైన సంఘములో రక్షణయున్నది. రక్షింపబడుచున్న వారినందరినీ సంఘముతో ప్రభువు చేర్చు చున్నందున క్రొత్త నిబంధన సంఘమునకు వెలుపల రక్షింపబడిన వారెవరును లేరు.

## C. క్రైస్తవులందరు సంఘములో యున్నారు

సంఘసభ్యుడు కాకుండా యెవడును క్రైస్తవుడు కానేరడు ఏలయనగా ఒకడు దేనివలన క్రైస్తవుడగునో దానివలననే రక్షింపబడి సంఘముతో చేర్చబడును. క్రైస్తవులందరు సంఘసభ్యులు మరియు సంఘసభ్యులు మాత్రమే క్రైస్తవులు. గనుక సంఘసభ్యుడు కాని వాడెవడును రక్షింపబడలేడు, క్రైస్తవుడు కానేరడు.

ప్రభువు సంఘమునకు వెలుపల ప్రజలు రక్షింపబడగలిగిన యెడల వారు లోకములోనే రక్షింపబడగలరు (కొలస్స 1:13–14). సంఘము అను పదమునకు పిలువబడిన వారని యర్ధము. ఆత్మీయరాజ్యములు రెండున్నవి : అవేవనగా – సాతాను రాజ్యము, క్రీస్తురాజ్యము. రక్షించబడిన వారందరు క్రీస్తు రాజ్యమను సంఘములోనికి మార్చబడియున్నారు (మత్తయి 16:18,19). మరల సంఘము దేవుని మందిరమై యున్నది (1తిమో 3:15). ఒకడు సంఘమునకు వెలుపల రక్షింపబడగల్గితే, అతడు

శరీరమునకు వెలుపల రక్షింపబడగలడు. దేవుని రాజ్యమునకు దేవుని కుటుంబమునకు వెలుపల రక్షింపబడగల్గితే సంఘములో దేవుడు వేటిని ఉంచెనో వాటిని లేకుండ రక్షింపబడగలడు. క్రీస్తునందు సమస్త ఆత్మీయాశీర్వాదములు ఉన్నవి. క్రీస్తులోనే ఒకడు వీటిని అనుభవించగలడు. క్రీస్తులో యుండుట అనగా సంఘమైన ఆయన శరీరములో యుండుటయే.

మరల బాధ్యతగల ప్రజలు ఆ దైవసంస్థకు వెలుపల రక్షింపబడగల్గితే, విలువలేని సంస్థ కొరకు క్రీస్తు చనిపోయెనన్న మాట! సంఘమును కొనుటకు క్రీస్తురక్తము వినియోగించబడినందున, సంఘసభ్యులు కానివారు ఆ రక్తపు ఆశీర్వాదములను పొందలేరు. సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడగల్గిన యెడల, ఇద్దరు రక్షింపబడుదురు. ఇద్దరు రక్షింనబడిన యెడల లోకమంతా రక్షింపబడును. అయితే సంఘములో యున్నవారినే క్రీస్తు రక్షించునని బైబిలు చెప్పుచున్నది.(ఎఫెసీ 5:22; 1:22-23). గనుక దానిలో లేనివారు నశించిన స్థితిలో యున్నారు.

యేసు రక్షించునని లేఖనములు బోధించుచున్నవి మానవులను ఆయన శరీరమైన సంఘమునకు వెలుపల గాక దానిలో రక్షించునని అవి ధృవపరచుచున్నవి. క్రీస్తులో యుండుట ఆయన సంఘములో యుండుట అనునవి దేవునితో గల సంబంధమును వర్ణించుటకు ఉపయోగింపబడిన సరిసమాన పదములు. దేని ద్వారా క్రీస్తు పాపిని రక్షించునో దాని ద్వారానే అతడు క్రైస్తవుడగును, ప్రభువు సంఘ సభ్యుడగును.

ప్రభువు సంఘము యొక్క బైబిలు నిర్వచనమును ప్రజలు అర్ధము చేసికొన్నప్పుడు, దానిలో సభ్యునిగా యుండు అవుసరతను వారు గమనించగలరు. క్రీస్తు సంఘము, అనగా రక్షింపబడిన వారందరు. రక్షింపబడిన వారే తప్ప వేరొకరు కాదు.

విమోచింపబడిన వారందరు క్రీస్తు సంఘమై యున్నారు. క్రీస్తువారికి శిరస్సు. అది భూమిపై యున్న పరలోక రాజ్యము లేక దేవుని రాజ్యము. సంఘము శరీరమై యున్నందున, శరీరము సంఘమై యున్నందున క్రీస్తు శరీరమే క్రీస్తు సంఘము. మరియు స్థానిక సంఘములన్నియు (Congregations) క్రీస్తు సంఘములై యున్నవి (ఎఫెసీ 1:22-23; 1కొరింథీ 12:27; రోమా 16:16). క్రీస్తు సంఘము, క్రీస్తు సంఘములు అను పదములు ఒకే భావమును వ్యక్తపరచుచున్నవి -అది సంఘమును క్రీస్తునిర్మించెననునది. అదొక డినామినేషన్ కాదు.

క్రీస్తురాజ్యములో, సంఘములో మాత్రమే రక్షణ లభించును. అయినను క్రొత్తనిబంధన సంఘమును గూర్చి అపార్ధము చేసికొనుటవలన ఒకడు సంఘము వెలుపల గాని లోపలగాని రక్షించబడునని అనేకులు భావింతురు. అందువలననే రక్షింపబడుట యనగా ఒకటి, సంఘసభ్యు డగుట అనగా వేరొకటి యని ప్రజలు భావింతురు. సంఘములన్నియు (డినామినేషన్లన్నియు) ఒకటేయనియు, అందొక దానిలో సభ్యుడు కావలెనన్న ఒకడు తనకుగా తాను చేరవలెననియు సంఘమును గూర్చిన ప్రతీతి. మతశాఖల తత్వమును బట్టి ఆలోచించుటవలన అట్టి భావము లుద్భవించును.

క్రీస్తు నిర్మించిన (క్రొత్తనిబంధన) సంఘము ఒక డినామినేషన్గా ఎన్నడు చెప్పబడలేదు. దానిలో ఎవడును తనకుగా తాను చేరినట్టు రికార్డు ఎక్కడలేదు. మానవ సంస్థలలో ఒకడు చేరు రీతిగా సంఘములో చేరలేడు. గాని ఒకడు సువార్తకు విధేయుడగుట ద్వారా ప్రభువుచే సంఘముతో చేర్చబడును (అపొ.కా. 2:47).

"అన్ని సంఘములలోను మంచివారులేరా?" యని తరుచు ప్రజలు అడుగుచుందురు. నైతికముగా చూస్తే అవును, తప్పక యున్నారు, అయితే

నైతికబుద్ధి రక్షణతో సమానమని ఇది నిరూపించుచున్నదా ? డినామినేషన్లు అన్నియును మంచివే యనియును, సంఘములన్నియు సరియైనవే యనియు దీనిభావమా? ఇది నిజమైన యెడల ఏ సంఘమునకు చెందని మంచివారు కొందరున్నారు గనుక ఏ సంఘము సరికాదని యిదే నిరూపించుచున్నది. లాజికల్‌గా ఆ వాదమును గమనించుము:

1. ఒకడు క్రైస్తవునిగా యుండుటకు నైతికముగా మంచి అలవాట్లు ఉంటే సరిపోవును.

2. అన్ని సంఘములలో నైతికముగా మంచివారున్నారు.

3. గనుక అన్ని సంఘములలోను క్రైస్తవులున్నారు, కాని

ఎ) క్రైస్తవుడగుటకు కావలసినదంతా ఉత్కృష్ట నైతిక బుద్ధియే.

బి) ఏ సంఘమునకు చెందని మంచివారున్నారు.

సి) గనుక ఏ సంఘమునకు చెందని క్రైస్తవులున్నారు: లేక క్రైస్తవునిగా యుండుటకు ఏ సంఘమునకు చెందనవసరము లేదు.

అయితే క్రొత్తనిబంధన సంఘమునకు వెలుపల యెవడును రక్షింపబడ నేరడని బైబిలు బోధించుచున్నది. సంఘములన్నియు మంచివేయని కూడ బైబిలు బోధించుటలేదు. అంతే కాదు ఒక డినామినేషన్ యొక్క సభ్యత్వము క్రీస్తు శరీర సభ్యత్వమునకు సమానము కాదు. అయితే పైన చెప్పబడిన వాదములలో యున్న దోషమేమిటి ? నైతికముగా మంచితనము ఒక్కటే ఒకని క్రైస్తవునిగా చేయునను అసత్య సిద్ధాంతముపై అవి అధారపడియున్నవి: ఒకడు దేవుని కుటుంబమునకు వెలుపలయుండి దేవుని బిడ్డ ఎట్లు కాలేడో అట్లే ఒకడు క్రీస్తు శరీరమునకు వెలుపల యుండి రక్షింపబడి క్రైస్తవుడు కాజాలడని లేఖనములు బోధించుచున్నవి. ఒకడు ఆత్మీయముగా తిరిగి జన్మించినప్పుడు దేవుని కుటంబమగు సంఘములో అతడు ప్రవేశించును (యోహాను 3:3–5).

## D. ఏ డినామినేషన్‌లోను లేకుండా ఒకడుక్రైస్తవుడు కాగలడు

అన్ని డినామినేషన్లలోను క్రైస్తవులు లేరా ? యని కొందరు అడుగుదురు. ఒకటి మాత్రము సత్యము : క్రైస్తవ్యము యొక్క మొదటి శతాబ్దములో డినామినేషన్లలో క్రైస్తవులు ఎవరు లేరు, ఏలయనగా అప్పుడు డినామినేషన్లు ఏమియులేవు. అప్పుడు క్రైస్తవులుండిరి. వేలకొలది యుండిరి. కాని వారందరు ఆ ఒకే శరీరములో, ప్రభువు సంఘములో యుండిరి (అపొ.కా. 4:32; 1కొరింథీ 12:12-27). వారు డినామినేషన్ సంబంధులు కాక, క్రైస్తవులు మాత్రమే. క్రొత్తనిబంధనలో చెప్పబడిన క్రైసవుడెవడు ఆధునిక డినామినేషన్ యొక్క సభ్యుడు కాదు. క్రీస్తును వెంబడించుచున్నామని చెప్పుకొను వారిలో కూడా అది ఇప్పుడు అట్లే యుండవలెను. బైబిలు సూచించు మార్గమునకు అందరు లోబడినప్పుడు అట్లుండును.

డినామినేషన్ అనగా ఒక ప్రత్యేకపేరు, విశ్వాస ప్రమాణము లేక కేంద్ర కార్యాలయమును బట్టి విడిపోయిన ఒక శాఖ, గుంపు, తరగతి అని అర్ధము. ప్రొటెస్టాంటు డినామినేషన్లు పదహారవ శతాబ్దములో, అనగా క్రీస్తు తన సంఘమును స్థాపించిన1500 సంవత్సరములు తరువాత ఆరంభమాయెను. క్రొత్తనిబంధనలో ఏ ఒక్క డినామినేషన్‌ను గూర్చి చెప్పబడలేదు. ప్రభువు సంఘము ఒక డినామినేషన్ కాదు. అది అన్ని డినామినేషన్ల కలయిక కూడా కాదు. అది దేనియొక్క శాఖగాని భాగము గాని కాదు. మతశాఖల తత్వము క్రొత్తనిబంధనకు విరుద్ధమైనది. ఒకడు డినామినేషనులో సభ్యుడైయున్నందుకు దేవుడతనిని రక్షించునని తెలియజేసే లేఖనము ఏదియును లేదు.

రక్షింపబడవలెనంటే ఒకడు ఏదో ఒక డినామినేషన్ యొక్క సభ్యుడై యుండనవుసరము లేదని మతశాఖల వారే చెప్పుచుందురు. అది నిజమే

అయితే రక్షింపబడవలెనంటే ఒకడు క్రీస్తు శరీరమయిన సంఘములో సభ్యుడై యుండవలెనని బైబిలు బోధించుచున్నది. ఆత్మ ప్రేరితులైనవారు ఎవరిని డినామినేషన్‌లో చేరవలెనని చెప్పలేదు కాని ఒకడు రక్షింపబడ వలెనంటే క్రీస్తులో యుండవలెనను దానియొక్క ప్రాముఖ్యతను వక్కాణించిరి. క్రీస్తులో యుండుటయనగా ఆయన సంఘములో యుండుటయేయని వారు వివరించిరి. గనుక క్రీస్తు స్థాపించిన సంఘమునకు వెలుపల యెవడును రక్షింపబడలేడు.

నిజముగా, ఒకడు ఏ డినామినేషన్‌లోను సభ్యుడు కాకుండా రక్షింపబడి క్రైస్తవుడు కాగలడు. ఒక డినామినేషన్‌లో చేరే అవుసరము లేదు. ప్రజలను రక్షించుటలో డినామినేషన్ చేయగలిగేది ఏదియు లేదు ఏలయనగా వాటిలో దేనికి చెందకుండగానే ఒక వ్యక్తి రక్షింపబడగలడని ప్రజలు ధారాళముగా ఒప్పుకొందురు. కొందరు వ్యక్తులు ఒక డినామినేషన్‌గా తయారైన యెడల, లేక దానికి చెందిన యెడల, అపొస్తలుల కాలములో క్రైస్తవులు ఏమి చేయలేదో దానిని చేతురు. ప్రజలు క్రొత్తనిబంధననుసరించిన యెడల, వారు క్రైస్తవులుగా మాత్రమే యుందురు: క్రీస్తు శరీరమైన సంఘమునకు మాత్రమే చెందుదురు. సరిగదా నిజసంఘమును ఇప్పుడు కలిగియుండవలెననిన యుగముల తరబడి ఎరుగకుండా యున్న క్రీస్తుసంఘము యొక్క ఉనికిని మనము కనుగొననక్కరలేదు. రాజ్యముయొక్క విత్తనమైన వాక్యము సంఘముయొక్క నిజస్వరూపమును మనకు గ్యారంటీ చేయుచున్నది.

## E. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను

ఒకే ఒక్క శరీరమున్నదని బైబిలు బోధించుచున్నది : “అవయవ ములు అనేకములైనను శరీరమొక్కటే” (1కొరింథీ 12:20). “శరీర మొక్కటే.... ” (ఎఫెసీ 4:4). గనుక ప్రతివాడు చేయవలసినదేమంటే,

సువార్తకు లోబడవలెను ప్రభువుచే రక్షింపబడి ఆయన సంఘములో చేర్చబడవలెను. అప్పుడతడు ఆయనలో సంపూర్ణుడగును. "ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించు చున్నది మరియు ఆయనయందు మీరును సంపూర్ణులై యున్నారు. ఆయన సమస్తప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు" (కొలస్స 2:9,10).

క్రీస్తునందు మానవుడు సంపూర్ణుడగును గనుక, మానవకల్పిత మత సంస్థలలో సభ్యుడుగా యుండుటవలన కలిగే లాభము ఏదియు లేదు. ఆత్మీయ ఆశీర్వాదములన్నియు క్రీస్తునందున్నవి. క్రొత్తనిబంధన యందు విశ్వాసముంచి దానినాచరించువాడెవడును ప్రభువు సంఘ సభ్యుడు గాను, క్రైస్తవునిగాను మాత్రమే తప్ప మరొక విధముగా యుండలేడు. ప్రజలు క్రైస్తవులుగా, క్రీస్తుశరీర సభ్యులుగా మాత్రమే యుండుటకు సంతృప్తిజెంది డినామినేషన్లు నుండి దూరముగా యుండవలెను (1కొరింథీ 1:10-13; యోహాను 17:20,21; ఎఫెసీ 4:1-6). ఈ రోజుల్లో నేను క్రైస్తవుడను అని ఒకడు చెప్పినను, నీవు ఏ సంఘ సభ్యుడవు ? లేక ఏ డినామినేషన్‌తో నీకు పొందికయున్నది? అనే ప్రశ్నను కొందరు అడుగుచుందురు. బైబిలు సంఘము యొక్క ఉపదేశము నుండి తొలగిపోయినట్లు ఇది నిరూపించుచున్నది. ఏలయనగా సువార్తకు చూపు విధేయత రక్షించును, ప్రభువు సంఘముతో మాత్రమే చేర్చును.

సంగ్రహముగా, సంఘమనగా ఈ లోకమునుండి సువార్త ద్వారా పిలువబడిన వారని బైబిలు బోధించుచున్నది. దానిపై క్రీస్తు శిరస్సుగా యేలును, మరియు దానిలో ఆయన ఆత్మ నివసించును. రక్షింపబడిన వారే సంఘము. మరియు క్రీస్తు శరీరములో సభ్యులుగా యుండవలెను.

గనుక రక్షింపబడుటకు ఒకడు సంఘసభ్యుడు కావలెనా? యను ప్రశ్న యొక్క జవాబు సంఘమనగా యేమిటో, అంటే డినామినేషన్ అనా ? లేక క్రీస్తు శరీరమైన సంఘమా ? అను దానిపై ఆధారపడి యుండును. పరిశుద్ధ లేఖనముల ప్రకారము క్రీస్తు నిర్మించిన సంఘమునకు వెలుపల రక్షింపబడగలిగిన యెడల క్రీస్తు లేకుండగనే రక్షింపబడవచ్చునని నిర్ధారణ అయినది, ఇది సాధ్యము కాదని బైబిలు బోధించుచున్నందున, ఒకడు ప్రభువు సంఘసభ్యుడు కాకుండా రక్షింపబడనేరడు (అపో.కా. 4:12 2 తిమో 2:10).

## 3. అనేకులు నశింతురా ?

క్రొత్తనింబంధనలో తేటగా యున్న ఈ భోదను గూర్చి చెప్పుసరికి, "చాలా ఎక్కువమంది నశింతురన్న మాట " యని అనేకులు పలుకుదురు. తప్పకుండ అది సత్యమే (మత్తయి 7:13-14). ఇదే అభ్యంతరమును నోవహుచేసిన బోధను గూర్చి కూడా వారు చెప్పవచ్చును గాని జలప్రళయము నుండి రక్షింపబడవలెనన్న ఒకడు ఓడలో నుండవలసివచ్చెను. మరియు రక్షింపబడుటకు ఓడలో ప్రవేశించుట అవుసరమని అనేకులు తలంచలేదు. కేవలము ఎనిమిది మంది మాత్రమే నాశనమునుండి తప్పించుకొనిరి. దేవుడు ఒకని రక్షించవలెనంటే ఓడకు వెలుపల రక్షించలేడా ? యని నోవహును కొందరు అడిగి యుండవచ్చును. ఆయన రక్షించగలడని మనమంగీకరించినను ఆయన ఏమి చేయగలడు అనేది గాక ఆయన వాగ్దానము చేసెనదే ప్రశ్న. పాపమునుండి రక్షణను గూర్చి అదేవిధమైన పరిస్థితి ఇప్పుడున్నది. సీయోనులో, సంఘములో ప్రభువు రక్షణ నుంచెను అది ఆయన శరీరము (యెషయా 46:13; హెబ్రీ12:22, 23). క్రీస్తునకు వెలుపలయున్నవారు పాపములో నశింతురు (ఎఫెసీ 2:12). పాపులలో ప్రధానుడగు తార్సువాడైన సౌలును

సత్పురుషుడగు కొర్నేలియు కూడా రక్షణ ననుభవించుటకు క్రీస్తులోనికి లేక సంఘములోనికి ప్రవేశింపవలసి వచ్చెను (అపొ.కా. 9:1-22; 1తిమో 1:15; అపొ.కా. 10 11:1-18). ఈ రెండు విపరీత పరిస్థితుల మధ్యయున్న వాడెవడైనను క్రీస్తులోను లేక ఆయన సంఘమగు శరీరములోను రక్షింపబడును.

## 4. ఒకడు క్రీస్తులోనికి ఎట్లు ప్రవేశించును?

క్రీస్తులో యుండుటను గూర్చిన ప్రాముఖ్యతను గ్రహించిన తరువాత, ఆయనలోనికి ప్రవేశించుట యెట్లో బైబిలు వివరించుచున్నది అవును. ఒక ప్రత్యేక సంఘటన ద్వారా క్రీస్తులోనికి ఒక ప్రత్యేక ప్రవేశము కలదు. క్రీస్తులోనికి ప్రవేశించుట ద్వారా ఒకడు దేవుని రక్షణనుపయోగించు కొనవలెను. మానవులను క్రీస్తులోనికి తీసికొనివచ్చు దైవమార్గము బాప్తిస్మమని బైబిలు వక్కాణించుచున్నది: “క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? “ (రోమా 6:3). “క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు ” (గలతీ 3:27). ప్రజలు ‘క్రీస్తులోనికి’ బాప్తిస్మము పొందియున్నారని బైబిలు రెండుసార్లు ప్రకటించుచున్నది. గనుక ఒకడు క్రీసులోనికి ఇట్లు ప్రవేశించును. అంతేకాకుండా ఆయన శరీరములో అనగా సంఘములో ప్రవేశించే మార్గము బాప్తిస్మమని బైబిలు చెప్పుచున్నది: “మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి” (1కొరింథీ12:13).

లేఖనములలో ఈయబడిన రీతిగా ఆ ఒక్క ఆత్మయొక్క ఉపదేశమును వెంబడించుట ద్వారా ప్రజలందరు ఒక్క శరీరములోనికి అనగా సంఘములోనికి బాప్తిస్మము పొందుదురు. బాప్తిస్మము పొందిన విశ్వాసు లందరు క్రీస్తు సంఘమై యున్నారు. మరియు ఒకడు బాప్తిస్మము

పొందేవరకు అతడు క్రీస్తులోను లేక ఆయన సంఘములోను ఉండనేరడు. గనుక క్రీస్తులోను, ఆయన శరీరమయిన సంఘములోను ఉండనేరడు. గనుక క్రీస్తులోను, ఆయన శరీరమయిన సంఘములోను ఒకని ప్రవేశింపజేయు క్రియయగు బాప్తిస్మము అతని రక్షించే విధేయత చూపించు క్రియయైయున్నది. రక్షణ క్రీస్తులో యున్నది మరియు ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును గనుక అతడు బాప్తిస్మము పొందేవరకు రక్షింపబడలేడు. ఇంకొక మాటలో రక్షణ పొందలెనంటే ఒకడు బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపొ.కా. 2:38; 22:16; 1పేతురు 3:21). క్రీసులోనికి బాప్తిస్మము పొంది మారుమనస్సు పొందిన విశ్వాసులు మాత్రమే క్రీస్తు సంఘసభ్యులు. దిగువ దానిని ఇప్పుడు గమనించుము :

1 విమోచనము క్రీస్తులో యున్నది (ఎఫెసీ 1:7).

2. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును (గలతీ 3:27).

3. గనుక విమోచింపబడుటకు ఒకడు బాప్తిస్మము పొందవలెను.

అయితే ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించకముందు అతడు మొదట క్రీస్తు నొద్దకు రావలెను. గనుక విశ్వాసము , మారుమనస్సు, ఒప్పుకోలు అతని క్రీస్తు నొద్దకు తెచ్చునని బైబిలుబోధించుచున్నది (హెబ్రీ 11:6; రోమా 10:10; అపొ.కా. 11:18; 1తిమో 6:12-13). యొద్దకు, లోనికి అనుమాటలలో బేధమున్నది. ఉదా:- ఒకడొక ఇంటియొద్దకు వచ్చి, తరువాత ఇంటిలో యుండకముందు అతడు మొదట దానిలో ప్రవేశించవలెను. అందుకే ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెనని బైబిలు చెప్పుచున్నది.

ఒకడు క్రీస్తులో గాని లేక ఆయనకు వెలుపల గాని యున్నాడు (రోమా 16:7). బాప్తిస్మము పొందనివాడు క్రీస్తుకు వెలుపల ఉన్నవాడు గనుక క్రీస్తునందున్న ఏ ఒక్క ఆశీర్వాదమును పొందనేరడు. గాని

క్రీస్తులోనికి ముంచబడిన వాడు ఆయనలో యున్నవాడు గనుక ఆయన యందున్న ఆత్మీయాశీర్వాదములన్నిటిని పొందగలడు. అతడు బాప్తిస్మము ద్వారా క్రీస్తులో ప్రవేశించినపుడే అతడు రక్షణ పొందును. ఆయన శరీరమైన సంఘములో చేర్చబడును.

## 5. యెట్టి మృతులు ధన్యులు ?

ఒకడు క్షమించబడి, సంఘ సభ్యుడైన తరువాత అతడు క్రీస్తునందు లేక ఆయన సంఘమందు నమ్మకమైన విధేయతగల జీవితము జీవించవలెను. అప్పుడతడు పరలోకములో నిత్యము రక్షింపబడును (1పేతురు 1:9; ప్రకట2:10). మృతులైన నీతిమంతులను గూర్చి బైబిలు ఇట్లు చెప్పుచున్నది "ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులని వ్రాయుమని పరలోకమునుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే వారు తమ ప్రయాసమును మాని విశ్రాంతి పొందుదురు వారి క్రియలు వారివెంట పోవునని ఆత్మ చెప్పుచున్నాడు" (ప్రకటన 14:13).

ఒకడు ప్రభువులోనికి మృతిజెందదు గాని, ప్రభువునందు మృతిజెంద వచ్చును. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది ఆయనలో యుంటేనే గాని అతడు ప్రభువునందు మృతిజెందలేడు. ప్రభువునందు మృతులైనవారే ధన్యులని చెప్పబడెను గాని ఆయనకు వెలుపల మృతినొందిన వారిని గూర్చి కాదు. క్రీస్తునకు వెలుపల జీవించి, మృతినొందిన వానికెవనికిని ఏ నిరీక్షణ లేదు.

## 6. ముగింపు

క్రీస్తునకు వెలుపల యెవడును రక్షింపబడుట, క్షమించబడుట, లేక దేవునితో సమాధానపరచబడుట అసాధ్యము. సంఘములో లేకుండా యెవడును రక్షింపబడడు ఏలయనగా రక్షణ క్రీస్తు శరీరమయిన

సంఘమునకు వెలుపలగాక దాని లోపలయున్నది. ఒకడు రక్షింపబడిన యెడల అతడు సంఘములో యున్న యెడల అతడు తన గత పాపములనుండి రక్షింపబడి యున్నాడు. అందువలననే సంఘసభ్యత్వము యొక్కయు పాపక్షమాపణ యొక్కయు షరతుల ఒక్కటే. రక్షింపబడినవారు సంఘము గనుక, రక్షింపబడుటకు ఒకడు దాని సభ్యుడు కావలెను. ఒకడు క్రీస్తు శరీరమయిన సంఘము వెలుపల రక్షింపబడగలిగిన యెడల అతడు క్రీస్తుకు వెలుపల రక్షింపబడగలడు. అయితే రక్షణ క్రీస్తులో యున్నది. గనుక అది అసాధ్యమని బైబిలు చెప్పుచున్నది. గనుక ప్రభువు సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడి క్రైస్తవుడుగా యుండలేదు.

ఆత్మీయఆశీర్వాదములన్నియు క్రీస్తునందే కలవని గుర్తించి జనులందరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు ఆశించవలెను. వారు క్రీస్తునందు నమ్మకముగా జీవించి ప్రభువునందు మృతిజెందవలెను. బైబిలులో కొంత భాగమునే అంగీకరించి నేను క్షేమముగా యున్నాననుకొని మిగిలిన భాగమును తిరస్కరించుట ఎంతో ఘోరమైనది. అట్లే క్రీస్తునకు వెలుపల మృతిజెంది నిత్యము నశించుట కూడా ఎంతో ఘోరమైనది.

✤

# 9. మరణమైన తరువాత - ఏమిటి ?

## (After Death - What Then?)

మరణమును గూర్చియు దాని తరువాత జరుగబోయే దానిని గూర్చియు, ప్రజలు తెలిసికొన గోరుదురు. “సమాధియనంతరము జీవమున్నదా? లేక మరణముతో సమస్తమును అంతమగునా ?” యని వారడుగుదురు. ఈ భూమిపై మరణము ఏలునంత కాలము “మనుష్యుడు మరణించిన యెడల అతడు మరల బ్రతుకునా ?” యని మానవులు అడుగుచుందురు (యోబు 14:14).

దేవుడు ఈ అంశముపై మాట్లాడెను. మరణము యొక్క భావమును దానియనంతరము సంభవించే పరిస్థితులను గూర్చి బయలుపరచబడిన ఆయన వాక్యము మానవునికి తెలియజేయు చున్నది. లేఖనములు అధికార పూర్వకమైన వని అవే అఖరి ఆధారములని గుర్తించబడవలెను (2తిమో 3:16, 17; 1కొరింధీ 14:37; 2 పేతురు 1:3, 21). ‘ఆఖరి సంగతుల సిద్ధాంతమును’ బైబిలు వేత్తలు ఈ జీవితాంతము యొక్క భావమును, మరణ, పునరుత్థానముల మధ్యగల సమయమును క్రీస్తు రెండవరాకడను, ఆఖరి తీర్పును, నిత్యగమ్యమును బైబిలు బోధను బట్టి నిర్వచించుట కుపయోగించుదురు.

### 1. మానవుడెవరు?

మరణానంతరము మానవుని గమ్యమును పరిశోధించునప్పుడు మానవుని యొక్క ఆరంభము, తత్వము అతని నిర్మాణములను కూడ పరిశోధించుట అత్యవసరము. మానవుడెవరు మరియు అతడెక్కడనుండి

వచ్చెను? “నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?” (క్రీర్తన 8:4). దీనికి రెండు జవాబులున్నవి. 1. మానవుడు అనేక యుగముల తరబడి జరుగుచుయున్న పరిణామ కార్యక్రమమువలన పరిణమించిన ఒక జంతువు లేదా 2. మానవుడు దేవునిచే సృజింపబడిన ఒక ఆత్మీయ వ్యక్తి. మానవుడు అల్పజీవరాసులనుండి పరిణమించిన వాడై కేవలము మర్త్యుడేయని కొందరు చెప్పునది నిజమే అయిన యెడల మరణించిన వారిని గూర్చిన ప్రశ్నలన్నిటికిని సులభముగా జవాబీయ వచ్చును. మరణించిన వారిక లేకుండ పోయిరి. వారు నిర్మూలింపబడిరి. మరియు చనిపోవువారందరు కూడ అట్లే నిర్మూలించబడుదురు.

మానవుని ఆరంభమును గూర్చియున్న పరిణామ సిద్ధాంతము (Theory of Evolution) ఎప్పుడు నిరూపించబడలేదు, నిరూపించ బడనేరదు. మానవుని ఆరంభమును గూర్చియు, అతని తత్వమును గూర్చియు లేఖనములు దానికి వేరుగా బోధించుచున్నవి. మానవుడు దేవుని స్వరూపమందు యెహోవా వలన సృజింపబడెనని లేఖనములు ఖచ్చితముగా చెప్పుచున్నవి : “దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను దేవుని స్వరూప మందు వాని సృజించెను స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను” (ఆదికాండము 1:27). ఆ కార్యము యొక్క సరియైన క్రమము ఇట్లు వర్ణించబడెను: “దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను” (ఆది 2:7).

మానవుని సంపూర్ణ తత్వమంతయు శరీరము, జీవము, ఆత్మ అని అపొ.పౌలు బోధించుచున్నాడు. మీ ఆత్మయు జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగా సంపూర్ణము గాను ఉండునట్లు కాపాడబడును గాక” (1థెస్స 5:23). శరీరము అనగా మాంసము లేక భౌతిక భాగము. జీవమనగా భౌతిక జీవమని కొన్నిసార్లు

చెప్పబడెను (కీర్తన 78:50). అది అనేకసార్లు మానవును సంపూర్ణ తత్వమును సూచించును (అపొ.కా. 2:41; 1పేతురు 3:20). ఆత్మ అనగా అమర్త్యమైన (immortal) మానవుని తత్వము. ఇంగ్లీషులో Soul మరియు spirit అను పదములు కొన్ని సారులు సరిసమానముగా వాడబడెను. లేఖనములు మానవుడు శరీరము, ఆత్మయని తరుచు చెప్పుచున్నవి (రోమా 8:10; 1 కొరింథీ 7:34; 5:5; లూకా 8:55; అపొ.కా. 2:31; ఆది 35:18; 2 రాజులు 17:21,22). మానవుడు బాహ్య పురుషుడు, అంతరంగ పురుషుడు అని చెప్పినప్పుడు పౌలు మానవుని మిశ్రమ తత్వమును మరల సూచించెను (2కొరింథీ 4:16). శరీరములో ఆత్మ నివసించును.

"దానియేలను నేను నా దేహములో మనోదుఃఖము గలవాడనైతిని" యని దానియేలు పలికెను (దాని 7:15). మనుష్యుని యొక్క యదార్థమైన 'నేను' అనునది శరీరములో నివసించు అదృశ్య ఆత్మ. మనుష్యుల అంత రంగములో జీవాత్మను సృజించువాడు యెహోవా యని జెకర్యా చెప్పెను (జెకర్యా 12:1). మరల, "అయినను నరులలో ఆత్మ ఒకటి యున్నది. సర్వశక్తుడగు దేవుని ఊపిరి వారికి వివేచన కలుగజేయును" (యోబు 4:49 44:22). గనుక మానవుడు శరీరములో నివసించుచున్న ఒక ఆత్మ ఆయాత్మయే అతని నిజ వ్యక్తిత్వము.

మానవుని ఆత్మ దేవుని యొక్క సంతానమై యున్నందున అది తండ్రివలె యుండి అమర్త్యమైనదని బైబిలు బోధించుచున్నది. దేవుడు ఆత్మయై యున్నాడు (యోహాను 4:24). మన శరీర సంబంధులైన తండ్రులకు వ్యత్యాసముగా దేవుడు మన ఆత్మలకు తండ్రి (హెబ్రీ 12:9). మనము దేవుని సంతానమై యున్నామని పౌలు ప్రకటించెను (అపొ.కా. 17:29). దేవుడు ఆత్మయైయున్నాడు. మరియు మానవుని ఆత్మ దేవుని సంతానమై యున్నది. దేవుని నుండి కలిగిన ప్రత్యేక వ్యక్తి ఆత్మ గనుక

అది మానవుని అమర్త్యభాగమై యున్నది. శరీరము ద్వారా మానవుడు ఈ భూమితో సంబంధము కలిగి యున్నను తన ఆత్మ ద్వారా అతడు దేవుని స్వరూపమందున్నాడు. ప్రతి జాతినుండి ఆ జాతియే ఉద్భవించును. దేవుడు ఆత్మను తన అమర్త్య ఆత్మను బట్టి సృజించెను గనుక మానవుని ఆత్మ అమర్త్యమైనది (1తిమో1:17). దేవుడు నిత్యుడు (కీర్త90:1,2) ఆయన సమస్త జీవమునకు అధారభూతుడు (యోహాను 5:26 1తిమో 6:16; లూకా 3:38). మరియు దేవునివలె మానవుడు అమర్త్యుడు. ఏలయనగా అతని ఆత్మ దేవుని ఆత్మ స్వరూపమందు సృజింపబడెను.

దేవుని "శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు" (ప్రసంగి 3:11; సామె 20:27). హృదయపు అంతరంగ పురుషుడు అక్షయమైన వాటితో అలంకరించబడవలెనని పేతురు చెప్పెను (1పేతురు 3:4). హృదయ ఆత్మల అంతరంగ పురుషుడు (రోమా 7:22) అసలు మనుష్యుడు అక్షయమైనది అనగా అమర్త్యమైనది. "మీ హృదయములు నిత్యము బ్రతుకును" అని దావీదు పలికెను (కీర్తన 22:26). శరీరము మాత్రమే మర్త్యమైనది (రోమా 6:12; 8:11; 2కొరింథీ 4:11). కాని పునరుత్థానము నందు అది కూడ అమర్త్యమగును (1కొరింథీ 15:42-45; రోమా 2:7).

మానవుని ఆత్మ గాలిని, ఊపిరిని సూచించక మానవునిలో వివేక విశిష్టమైన భాగమును, మరణమునొందని ఆత్మను సూచించుచున్నది. మానవునిలో దేవుని స్వరూపము మానవునికున్న దైవలక్షణములగు నైతిక తత్వము, జ్ఞానములతో కలిగియున్నది (యాకోబు 3:9). మానవుని ఆత్మ మానవుని సంగతుల నెరిగియున్నట్టిది: "ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవరికి తెలియును?" (1కొరింథీ 2:11; ఆది 6:5; యోబు 38:36; రోమా 11:1,10). పౌలు ఆత్మలో దేవుని సేవించెను. మనస్సుతోను సేవించెను

(రోమా 1:9; 7:25,22; ఎఫెసీ 4:23). మానవుని ఆత్మ మంటిలో నుండి గాక నిత్మ దేవునినుండి కలిగెను. గనుక ఆత్మ నిత్యముఉండునట్టి దియు, శరీరము క్షీణించిపోయినను అది జీవించునట్టిదియునని నమ్ముట సమంజసమే.

Thayer Greek - Indian Lexicon ఆత్మను ఇట్లు నిర్వచించెను: "వివేక విశిష్టమైన ఆత్మ, మానవుడు దేనివలన భావించునో, ఆలోచించునో, ఇచ్ఛయించునో, ఆ శక్తి The Soul "అది శరీరమునుండి వేరైనట్టిది. మరణము వలన క్షీణించనట్టిది".

అందువలన యెహోవాచే సృజింపబడిన మానవుడు మరణా నంతరము కూడ జీవించునట్టి అమర్త్య ఆత్మయై యున్నాడు. కంటికి కనబడు అతని భౌతిక కాయము విషయమైతే మానవుడు మర్త్యుడు కాని మరణము లేని, దేవునినుండి కలిగిన అంతరంగిక జ్ఞానము గల ఆత్మ విషయమైతే అతడు అమర్త్యుడు.

## 2. మరణ మనగా యేమిటి ?

శరీరమునుండి ఆత్మ ఎడబాటగుట భౌతిక మరణమని బైబిలు బోధించుచున్నది ఆ ఎడబాటులో మన్నయినది వెనుకటివలె మరల భూమికి చేరును ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరలపోవును (ప్రసంగి 12:7). శరీరము దాని ఆరంభమునకు మంటికి చేరుకొనును. నిజమైన మనుష్యుడగు ఆత్మ అయితే వాని ఆరంభమునకు, దేవుని యొద్దకు మంటికి చేరుకొనును. (ఆది 3:19). ప్రాణములేని శరీరము మృతము అని యాకోబు 2:26లో వ్రాయబడెను. శరీరము లేకుండ ఆత్మ (ప్రాణము) మృతమైనదని బైబిలు చెప్పుటలేదు గాని ఆత్మ లేకుండ శరీరము మృతమైనదని చెప్పుచున్నది. ఆత్మ మరణించదు. మరణమును థేయర్ (Thayer) ఇట్లు నిర్వచించెను : "శరీమునుండి ఆత్మ (సహజముగా

గాని లేక అసహజముగా గాని) వేరగుట ద్వారా భూమిపై జీవము అంతమగుట" (GK-Eng.Lex. Page 282)

మరణమునందు ఆత్మ శరీరమును విడిచిపెట్టి పోవును: రాహేలు చనిపోయినప్పుడు ఆమె ప్రాణము పోయెను (ఆది 35:17). ఆ దుఃఖ గడియలో శరీరాత్మలు ఒండొకరులనుండి ఎడబాటు పొందెను. ఆత్మను విడిచిపెట్టుట మరణము అని వర్ణించబడియున్నది. ఉదాహరణకు: అబ్రాహాము ప్రాణము విడిచి మృతిపొందెను(ఆది 25:8). యేసు సిలువపై వ్రేలాడుచు, "తండ్రీ నీచేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను" (లూకా 23:46; ఆది 35:29; 45:33; అపొ.కా. 5:15,10; 7:59,60). మరణమునందు ఆత్మయొక్క ఎడబాటును ఒక పక్షి ఎరిగిపోవుచున్నట్లు బైబిలు పోల్చుచున్నది "మేము ఎగిరిపోవుదుము" (కీర్తన 90:10). ఈ ఎగిరిపోయే మేము శరీరములు కాదు గాని ఆత్మలు. గనుక ఈ లోకమునుండి ఆత్మ నిష్క్రమించుట మరణమని చెప్పబడెను. రోమాలో ఒక చెరసాలలో యుంటూ మరణము 'వెడలిపోవుట' యని పౌలు పలికెను: "ఈ రెంటి మధ్యను ఇరుకునబడి యున్నాను, నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశ యున్నది, అది నాకు మరివేలు. అయినను నేను శరీరమందు నిలిచియుండుట మిమ్మును బట్టి మరి అవసరమైయున్నది" (ఫిలిప్పీ 1:23,24). తరువాత "నేను 'వెడలిపోవుట' అను మాటకు ఆదిమ గ్రీకు భాషలో ఓడయొక్క లంగరు త్రాళ్ళు విప్పుట, లంగరు ఎత్తుట, ప్రయాణమునకై తెరచాపలు ఎత్తుట అను భావము కలదు.

మానవుని శరీరము నిజమైన మనుష్యుడు నివసించే ఒక గుడారములేక నివాసస్థలము. మరణము అనగా గుడారమును విడిచిపెట్టుట యని చెప్ప బడెను (2 పేతురు 1:13–15). అపొ.పౌలు ఇట్లు వ్రాసెను. "భూమి మీద మన గుడారమైన యీ నివాసము

శిథిలమైపోయినను, చేతిపని కాక దేవునిచేత కట్టబడినదియు, నిత్య మైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2కొరింథీ5:1). ఈ గుడారములో యుండుటను గూర్చి దేహములో నివసించుటను గూర్చి కూడ అతడు పలికెను (4-8). గనుక శరీరాత్మలు రెండు కలిసి యున్న స్థితియే జీవము. శరీరమునుండి ఆత్మ ఎడబాటు పొందిన స్థితి మరణము.

బైబిలులో చనిపోయినవారిని తిరిగి బ్రతికించే అద్భుతములు కేవలము ఆత్మలను మరల శరీరములోనికి తెచ్చుటవలన జరిగెను. సారెపతులోని విధవరాలి కుమారుని ప్రాణము తిరిగి ఇమ్మని ఏలియా ప్రార్థించెను. "యెహోవా నాదేవా ఈ చిన్న వానికి ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థింపగా యెహోవా ఏలియా చేసిన ప్రార్థన ఆలకించి ఆ చిన్నవానికి ప్రాణము రానిచ్చినప్పుడువాడు బ్రతికెను" (1రాజులు 17:21,2) ప్రాణము వేరైపోయినప్పుడు మరణము వచ్చెను సమాజమందిర అధికారి యొక్క కుమార్తెను క్రీస్తులేపినప్పుడామె ప్రాణము తిరిగి వచ్చెను (లూకా 8:55; అపొ.కా. 9:36-41), ఆమె చనిపోయినప్పుడామె శరీరమునుండి ఆత్మ వెడలిపోయెను ఆమె మరల బ్రతికినప్పుడు ఆమె ఆత్మ తప్పక జీవించి యుండెను.

శరీర క్షీణతలో ఆత్మయొక్క క్షీణత ఇమిడిలేదు. శరీరము నుండి ప్రత్యేకముగ యున్న ఆత్మ, మరణము సంభవించిన తరువాత శరీరము లేకుండ ఉనికిని కలిగియుండలేదు అని నమ్ముటకు లేఖనములలో ఎట్టి ఆధారములు లేవు. భౌతిక దేహములకు వేరై ఆత్మీయ జీవులున్నారు దేవుడు, దూతలు అట్టివారే (యోహాను 4:24; కీర్తన 104:4; లూకా 24:39; హెబ్రీ 1:14). భౌతిక సంబంధముకాని అశరీరయైన మానవుని ఆత్మ భౌతిక దేహముతో కలిసియుండ వచ్చు లేక ఉండకపోవచ్చు. నిజానికి మరణమైన తరువాత మానవుని ఆత్మ ఉనికిని కలిగియుండునని బైబిలు

అనేకసారులు వక్కాణించుచున్నది. గోత్ర కర్తలు చనిపోయి తమ పితరుల యొద్దకు చేర్చబడిరి (ఆది 25:8,9,17; 35:29; 49:33; సంఖ్యా 230:26; ద్వితీ 32:50). దీని భావము ఒకే ఒక్కటై యుండును ఈ జీవితము తరువాత కూడ వారు ఉనికిని కలిగియున్న వారితో కలిసిరి ఈ కలయిక ఆత్మల కలయిక గాని శరీరముల కలయిక కాదు. దావీదు చనిపోయిన తన కుమారుడు ఇక ఉనికి లేకుండ పోయెనని తలంచలేదు గాని అతడుశరీరము నుండి వేరై వేరొక స్థలమున జీవించుచున్నాడని నమ్మెను. అతడిట్లనెను: "నేను వాని యొద్దకు పోవుదును గాని వాడు నాయొద్దకు మరల రాడు" (2సమూ 12:23). ఈ జీవితమును ఒకనొకప్పుడు వీడి తన కుమారుని యొద్దకు వెళ్ళుటకు అతడు నిరీక్షించెను.

"ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి"యని యేసు చెప్పినప్పుడు, శరీరము చనిపోయిన తరువాత ఆత్మ జీవించునని యేసు బోధించెను (మత్తయి 10:28; లూకా 12:24) శరీరము చనిపోయినప్పుడు ఆత్మ చనిపోదు అని దీనిభావము. సరిగదా మానవుడు చంపలేని ఆత్మ మరణము తరువాత జీవించుచునే యుండును, కాని మనుష్యుడు కేవలము మంటితోను జంతు జీవముతోను తయారైన వాడయితే, శరీరమును చంపువాడు అదే సమయములో ఆత్మను కూడ చంపును.

పశ్చాత్తాపపడి చనిపోవుచున్న దొంగతో క్రీస్తు 'నేడు నీవు నాతో కూడ పరదైసులో యందువని' సిలువపై చెప్పుట వలన మృతులైన వారు జీవించుచు యుందురని మరింత ధృవపరచబడెను (లూకా 23:43). చనిపోయిన తరువాత ఆ దొంగ ఉనికిని కలిగి యుండెనని ఈ మాటల భావము. అతడు క్రీస్తుతో వెంటనే వేరొక ప్రదేశములో ప్రవేశించ బోవుచున్నాడు. వారు చనిపోయిన ఆ దినమందు ఆ దొంగ యొక్క ఆత్మగాని క్రీస్తుయొక్క ఆత్మ గాని ఉనికి లేకుండ పోలేదు.

అంతేగాకుండా క్రీస్తు రూపాంతరము పొందినప్పుడు మోషే ఏలియాలు ఆయనతో మాటలాడిన సందర్భములో ఆత్మ వ్యక్తిగతముగా విదేహియై మానవుని మరణ పునరుత్థానముల మధ్య జీవించునని బోధింపబడెను (మత్తయి 17:1-8; లూకా 9:28-36). క్రీస్తు రూపాంతరము పొందుసరికి 1500 సంవత్సరములకు ముందే మోషే చనిపోయెను. ఏలియా మోషే, కూడ ఈ భూమి మీద ఇంక జీవిచుచుండిరి వారు తమ వ్యక్తిగత రూపురేఖలను వ్యక్తిత్వమును ఇంకను కలిగియుండిరి. మోషే ఏలియాలు ఇప్పుడు కూడ లేకుండ పోలేదు.

దీనిని ఆలోచించుము ! నాస్తికత్వము మానవుని జీవితాంతమున అంధకారమయమైన సమాధి తప్ప వేరొకటి అతనికియ్య లేకున్నది. మానవుడు కేవలము మర్త్యుడేయనియు అతని దేహములో ఆత్మ అనేది లేదనియు అనాత్మవాదులు చెప్పుదురు  చనిపోవుట అనగా ఇంక లేకుండుపోవుట  మృతులైనవారు దేవుని మనస్సులో తప్ప కేవలము ఉ నికి లేకుండ సంపూర్తిగా సృహలేనివారు  (J.F. Rutherford. "Where are the Dead?" Watch Tower Bible & Tract Society pp 29, 31). వీరి ప్రకారము మానవుడు చనిపోయినప్పుడు అతడొక చిన్న కుక్కవలె సంపూర్తిగ చనిపోవును! మృతిచెందిన తరువాత అతడు చచ్చిన కుక్కకంటే ఎక్కువ ఏమీకాదు.

మానవుడు మృగమువలె శరీరమును మించి జీవించే ఆత్మలేనివాడని ప్రసంగి 3:19,20 బోధించుచున్నదని కొందరు వాదింతురు. అయితే ఆలేఖన భాగము శరీర విషయములో మనుష్యుని యొక్కయు మృగముల యొక్కయు మృతి ఒకే రీతిగా యుండునని బోధించుచున్నది. వారిద్దరు చనిపోయి వారువచ్చిన మంటికే తిరిగి  పోవుదురు. అయితే  ఇంకొక విషయములో వారు చాల వేరుగా యున్నారు: మృగములకు గాక మానవునికి అమర్త్యమైన ఆత్మయున్నది(21వ). అల్పజాతి జంతువులవలె

మానవుని శరీరము భూసంబంధమైనది మరియు అతని మరణము తథ్యము. గనుక ఈ మాటకును కీర్తన 146:4లో చెప్పబడిన 'వారి సంకల్పములు నాడే నశించును' అను మాటకును సంపూర్ణ సమన్వయత యున్నది. అంతే గాకుండా మరణమైన తరువాత మానవుని ఆత్మ దేవుని యొద్దకు పోవును అని ప్రసంగి 12:7 చెప్పుచున్నది.

క్రీస్తు కాలములో సద్దూకయ్యులకు మరణము అనగా సంపూర్ణ నాశనము (annihilation) అనే భావ ముండెడిది చనిపోయిన వాడొక వ్యక్తి ఇక కాదు. శరీరముతో ఆత్మ కూడ చనిపోవునని తలంచే అనాత్మ వాదులు (materialists) వారు, గనుక మరణము తరువాత జీవముగాని పునరుత్థానము గాని ఉండనేరదు. వారు దేవదూతయైనను ఆత్మయైనను లేదనెడివారు (అపొ.కా. 23:8).

సద్దూకయ్యులు ఒకనాడు యేసునొద్దకు వచ్చి ఒక స్వల్పమైన సందర్భమును చెప్పిరి. ఏడుగురు మనుష్యులను వరుసగా పెండ్లి చేసుకొనిన ఒక స్త్రీ చనిపోయెను. అయితే ఆ ఏడుగురిలో ఎవడు పునరుత్థాన దినమందు ఆమెకు భర్త యగునని వారు యేసును అడిగిరి. వారు పునరుత్థానమును, భవిష్యత్ జీవమును అపార్ధము చేసుకొనిరని యేసువారికి చెప్పెను: "లేఖనములను గాని దేవుని శక్తిని గాని ఎరుగక మీరు పొరబడుచున్నారు. పునరుత్థాన మందు ఎవరును పెండ్లి చేసికొనరు, పెండ్లి కియ్యబడరు వారు పరలోక మందున్న దేవుని దూతల వలెనుందురు". మోషే వ్రాసిన లేఖనములనుబట్టి అబ్రహాము, ఇస్సాకు, యాకోబులు ఇంకా జీవించుచున్నారని యేసు వారికి నిరూపించెను. మృతుల పునరుత్థానమునుగూర్చి –నేను అబ్రహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదవలేదా ? ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడుకాదని వారితో చెప్పెను" (మత్తయి 22:29–32; మార్కు 12:18–

27). ఈ మాటలను మండుచున్న పొదలోనుండి దేవుడు ముందు మోషేతో చెప్పుసరికి అబ్రాహాము,ఇస్సాకు, యాకోబులు చనిపోయి అనేక తరములాయెను (నిర్గమ 3:6). అయినను అప్పటికి వారు జీవించుచుండిరి మరియు ఇప్పుడు కూడ వారు జీవించుచున్నారు. వారి దేహము మాత్రమే నాశనమయ్యెను. చనిపోయిన మిగతా వారందరియెడలకూడ ఇది సత్యమే. క్రీస్తు యొక్క వాదనలోని ప్రముఖ సూత్రమేమంటే "దేవుడు సజీవులకు దేవుడు". ఆయన సజీవులకే దేవుడు కాని మృతులకు దేవుడు కాడు ఆయన దృష్టికి అందరును జీవించుచున్నారని" యేసు వారికి ఉత్తర మిచ్చినట్లు లూకా వ్రాసెను (లూకా 20:38). ఆత్మ శరీరములో యున్నను, శరీరములో లేకపోయినను ఆయనలో అందరును జీవించుచున్నారు. శరీరములో లేకపోయినను ఆయనలో అందరును జీవించుచున్నారు. క్రీస్తు యొక్క సమాధానము సద్దూకయ్యులను ఎల్లప్పటికి సద్దణిపెను.

అనాత్మవాదులు మరణము యొక్క బైబిలు భావమును కోల్పోయిరి. మరణమనగా ఇక లేకుండపోవుటయని వారి నిర్వచనము. కాని అది దేవుని నిర్వచనము కాదు. ప్రభువునకు మరణము అనగా యెడబాటు అని అర్ధము. లేఖనములలో ఈ మాట నేరుగాగాని లేక అలంకార రీతిగా గాని ఉపయోగింపబడినను మరణమనగా ఎడబాటే గాని సంపూర్ణ నాశనమని మాత్రము అర్థము కాదు. మూడు రకములైన మరణమున్నది: 1) భౌతికము – శరీరమునుండి ప్రాణము వేరగుట (యాకోబు 2:26; ఆది 35:18). 2) ఆత్మీయము – దేవుని నుండి ఆత్మ వేరగుట (ఎఫెసీ 2:11; యోహాను 5:25; ఆది 2:17; యెషయా 59:1,2; మత్తయి 8:22; 1తిమో 5:6 ; 1యోహాను 3:14). 3) నిత్యమరణము –దేవునితో వేరై నిత్యము నరకములో యుండుట (ప్రక 20:14,15; 21 :8; మత్తయి 25:46; రోమా 6:23; యాకోబు 5:19,20; 2థెస్స 1:7–9; యెహెజ్కేలు 18:20). పాపము దేవునికిని మానవునికిని మధ్య ఎడబాటును తెచ్చును,

కాని ఆత్మ యెన్నడు ఉనికి లేకుండ నాశనము చేయబడదు.

జీవము కూడ ఈ మూడు భావములలో యున్నది: 1) భౌతికము (1రాజులు 17:21,22; లూకా 8:55) 2) ఆత్మీయము (యోహాను 11:25,26; 8:51; 1యోహాను 2:25; ప్రకటన 22:14). నిత్య జీవమునకును నిత్య ఉనికిని ఒకభేదము ఉన్నది. జీవ మరణములు రెండు పరిస్థితులను సూచించుచున్నవి: ఐక్యత, ఎడబాటు. మరణమనగా ఒక వ్యక్తి సంపూర్తిగా లేకపోవుటయని అర్థము కాదు. మానవులందరికి నిత్య ఉనికి యున్నది. పరిశుద్ధ జీవితము వలన కొందరు ఆనందముతోను, మిగిలినవారు పాపపు జీవితమువలన నిత్య యాతనలోను జీవింతురు. గనుక ఒక విధముగా మానవుడు మరణించి యుండవచ్చును గాని వేరొక విధముగా అతడు జీవించుచున్నాడు అతడు భౌతికముగా జీవించు చుండినను ఆత్మీయముగా చచ్చినవాడు కావచ్చును.

మరణమైన తరువాత మానవునిలో ఏ భాగము కూడ జీవించదు అని చెప్పువారు పలుమారులు తిరస్కరించబడిన పురాతన సద్దూకయ్యుల సిద్ధాంతమును చెప్పుచున్నారు. అయితే సత్యమేమంటే, భౌతికముగా చచ్చిన వారు తమ స్వంత వ్యక్తిత్వములతో ఇంకను జీవిచుచున్నారు. వారొకానొకప్పుడు ఉన్నారు అని కాదు గాని వారిప్పుడును ఉన్నారు. మృతులైనవారు అశరీరులై ఇంకను జీవించుచున్నారు. వారు తమ శరీరముల పునరుత్థాన దినము కొరకు కనిపెట్టుచున్నారు.

## 3. మృతులు స్మృతి కలిగినవారా ?

'మరణించిన తరువాత పునరుత్థానమునకు ముందు ఆత్మయొక్క పరిస్థితి యేమిటి? వెడలిపోయిన ఆత్మ స్మృతి కలిగినదా? కాదా? అని అనేకులు అడుగుదురు. ఈ ప్రశ్నలకు పరిశుద్ధ లేఖనములు జవాబిచ్చుట మాత్రమే గాకుండా ఖచ్చితమైన సమాచారమును మనకియ్యగలవు.

ధనవంతుడు, లాజరు గూర్చి ప్రభువు చెప్పినది భౌతిక మరణము నకును పునరుత్థానమునకును మధ్య ఆత్మ స్మృతి కలిగియుండునని బోధించుచున్నది (లూకా 16:19-31). భూమిపై జీవించిన జీవితమును బట్టి శరీరము మరణించిన తరువాత ఆత్మ ఆనందముతో గాని లేక ఆ వేదనతో గాని జీవించును. ధనవంతుడు చనిపోయెను. వెంటనే ఇతడు మహాయాతనలో ఉండెను. ఇతడు తన వేదనను ఎరిగినవాడు మాత్రమే గాక భూమిపై ఇంకను జీవించుచున్నతన అయిదుగురు సహోదరులను జ్ఞాపకము చేసి కొనెను. వారు అతడున్న చోటికి రాకుంటే మంచిదని కోరెను. ఇతడు భూమిపై తన గత జీవితమును జ్ఞాపకము చేసికొనిన యెడల అతడిప్పుడు ఎందుకు యాతన పడుచున్నాడో అర్థమగునని తండ్రియైన అబ్రాహాము అతనికి చెప్పెను. ఈలోగా లాజరు కూడా చనిపోయెను, గాని అతడు వెంటనే ఆనందముతో యుండి నెమ్మది పొందుచుండెను. గనుక ఈ ధనవంతుడును, లాజరును చైతన్యము కలిగిన స్థితిలో యుండిరి. భూమిమీద వారి జీవితమును ఇంకను జ్ఞాపక ముంచుకొనగల్గిరి.

యేసు బహు తేటగా చెప్పిన ఈ సంఘటనను ఒక ఉపమానముగా భావించి దానిని శక్తిహీనముగా చేయుటకు కొందరు ప్రయత్నింతురు. అయితే ఉపమానమేమి, చరిత్ర యేమి లేక ఈ రెండునేమి, లేఖనములు సత్యమునే బోధించును గాని అసత్యమును కాదు. అదొక ఉపమానమని చెప్పుటలో ఈ ఇద్దరి మనుష్యులను గూర్చిన సత్యము మార్చబడదు. కట్టుకథలవలె గాక క్రీస్తు యొక్క ఉపమానములు వాస్తవములు. యేసు ఇక్కడ వర్ణించిన జీవితానంతర పరిస్థితులు యధార్థమైనవి ఆయన వాటియొక్క వాస్తవిక స్థితిని వర్ణించెను. "ధనవంతుడొకడుండెను" అని యేసు చెప్పెను అతడుండెనా? ధనవంతుడు చనిపోయెనా?లాజరు చనిపోయెనా ? వారు చనిపోయిరా ? వారు చనిపోయిరని యేసు చెప్పెను.

ఆత్మీయ సత్యమును బోధించుటకు క్రీస్తు చారిత్రక వాస్తవములను పలుమారులు ఉపయోగించెను. ఈ సంఘటన ఒక కట్టుకథయని తలంచుట ఎంత బుద్ధిహీనతయో ?

ఈ వర్ణనలోని సంఘటనలు వాస్తవములైనను మానవునికి గ్రహింపగు నిమిత్తము క్రీస్తు కొంత అలంకార భాషనుపయోగించెను. ఆత్మీయ జీవులను వర్ణించుటకు క్రీస్తు మానవుని అనుభూతిని బట్టి మాటలాడవలసి వచ్చెను. ఆత్మీయ స్థితిలో నిజముగా అగ్నిగాని, నీరు గాని గొప్ప అగాధము గాని యుండక పోవచ్చును అయితే వీటివలన కొంత యధార్ధత, ఖచ్చితములు సూచింపబడెను. అశరీరులుగాయున్న ఈ రెండు ఆత్మల సంతోషయాతనలు స్మృతి యధార్ధము గాని అవి అలంకార రీతిగా వర్ణించబడెను.

ధనవంతుడు, లాజరును గూర్చిన ఈ వర్ణననుండి రెండు గొప్ప వాస్తవములను మనము నేర్చుకొనవచ్చును: 1) మరణమనగా సంపూర్తిగా ఇక లేకపోవుట (annihilation) కాదు  శరీరము క్షీణించిపోయినను ఆత్మ జీవించును. 2) అశరీరులుగా యున్న ఆత్మలు స్మృతి కలిగిన స్థితిలో యుండును. సంతోషముతో. గాని లేక దుఃఖముతో గాని, వారు శరీరములో యుండి జీవించిన దానిని బట్టి అవి యుండును. వారియొక్క ఉనికిని వారెరిగిన వారైయుందురు. వారియొక్క ఉనికిని వారెరిగిన వారై యుండి భూసంబంధ జీవితమును గూర్చి జ్ఞప్తి కలిగినవారై యుందురు. గనుక శరీరము క్షీణించిన తరువాత మానవుని ఆత్మ స్మృతి కలిగి ప్రత్యేకముగా జీవించగలదని బైబిలు బోధించుచున్నది.

మరణము నష్టము కాదు గాని లాభమే యని పౌలు తలంచెను అది క్రీస్తుతో కూడ నుండుటకు వెడలి పోవుట, మరియు అది మేలు (ఫిలిప్పీ 1:23). సంతోష దుఃఖములతో మిళితమై  ప్రభువును సేవించుట

కంటె చనిపోయి సంపూర్తిగ స్మృతి కోల్పోవుట శ్రేష్టమని పౌలు చెప్పుచున్నట్లు ఎవరు ఊహించలేరు ! ఈ లోకములో జీవించుటకంటె చనిపోయిన తరువాత నున్న పరిస్థితి మరి మేలైనది ఎట్లు కాగలదు? నిజముగా క్రైస్తవునికి చావైతే లాభము (21వ).

పౌలు 2కొరింథీ 12:2–4లో వర్ణించిన తన అనుభవము, అనగా 3వ ఆకాశమునకు, పరదైసులోనికి కొనిపోబడుట శరీరమునకు వెలుపల స్మృతి గల ఉనికిని బోధించుచున్నది. ఆ సమయమందు పౌలు శరీరముతో యుండెనో లేక శరీరము లేక యుండెనో నిజానికి అతడెరుగడు. శరీరము లేక యుండిన యెడల అతడు స్మృతి కలిగియే యుండెను. ఈ సందర్భములో ఏమైతే సత్యమో అదే శరీరము నుండి ఆత్మ వేరైన ప్రతి సందర్భములోను సత్యము. శరీరము నుండి వెడలిపోయిన తరువాత ఆత్మ స్మృతి కలిగి జీవించుచునే యుండును. ఆదిమ హతసాక్షుల యొక్క ఆత్మలు శరీరములేని స్థితిలో జీవించుచు స్మృతి కలిగి తీర్పుదినము కొరకు కనిపెట్టుచున్నట్లు చెప్పబడెను (ప్రక 6:9–11). మృతినొందిన నీతిమంతులు ధన్యులు లేక సంతోషముగా యున్నవారు : "ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు... వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు వారి క్రియలు వారివెంటపోవును" (ప్రక 14:14). సంపూర్తిగా స్మృతిని కొల్పోయిన వాడు సంతోషముగా యుండడు అయినను ప్రభువు నందు మృతినొందు వారు ధన్యులని బైబిలు చెప్పుచున్నది. వారుసంతోషముగా ఉండబోవుదురు అని అది చెప్పుటలేదు కాని వారిప్పుడు సంతోషముగా యున్నారని అది చెప్పుచున్నది.

మృతులైనవారు స్మత్రి లేకుండా యుందురని చెప్పుటకు కొందరు తరచు ప్రసంగి 9:5ను వినియోగింతురు. "చచ్చినవారు ఏమియు ఎరుగరు" అని అది చెప్పుచున్నది, అయితే తరువాత వారొకానొకప్పుడు జీవించిన ఈ లోకములో అని దాని యర్దము. మరణించిన తరువాత

భూమిపై మానవుని సంచలనము ఆగిపోవును  అతడు చనిపోయిన తరువాత భూమిమీద ఏమి జరుగుచున్నదో అతడేమియు ఎరుగడు. మరణించిన తరువాత ఆత్మ ఏమియు ఎరుగదని లేఖనములలో ఎక్కడ సూచింపబడలేదు.

కొందరు 'ఆత్మ నిద్రించుటను' నమ్ముదురు  అంటే మరణమైన తరువాత ఆత్మ స్పృహ కోల్పోయిన స్థితిలో యుండునని వారి భావము. చావును నిద్రగా వర్ణించు లేఖనములను దీనిని నమ్ము వారుపయోగించి మరణమునకు పునరుత్థానమునకు మధ్య ఆత్మ స్పృహ లేనిదై యుండునని వారు బోధింతురు (ఉదా : మార్కు 5:39;  యోహాను 11:11 అపో.కా. 7:60  1థెస్స 4:31–35). అయితే నిద్ర అనుమాట భౌతిక మరణమును గూర్చి ఉపయోగింపబడినప్పుడు ఎల్లప్పుడు అది శరీరములకే గాని ఆత్మలకు వర్తించదు. శరీరములు సమాధులలో నిద్రించును (దాని 12:2  మత్తయి 27:52,53). గనుక చనిపోయిన వారిని పాతిపెట్టే సమాధుల దొడ్డి నిజానికి మృతదేహములు పునరుత్థానమునకు కనిపెట్టు నిద్రించు స్థలము. ఆత్మలు సమాధులలో లేవు. అవి ఎక్కడ నిద్రించుట లేదు గాని అవి చైతన్యము కలిగియున్నవి. ఏలయనగా జీవించుచున్నను మరణించినను 'అందరు జీవింతురు' (లూకా 20:38). గనుక మరణమును వర్ణించుటకు నిద్రించుట అలంకార రీతిగా ఉపయోగింప బడెను  ఏలయనగా నిద్రించుచున్న శరీరమునకు మరణించిన శరీరమునకు పోలికలున్నవి. చనిపోయిన మనుష్యులు నిద్రించుచున్నట్లు అగుపడుదురు. మరణములో శరీరము నిద్రించునుగాని ఆత్మ నిద్రించదు. నిద్రించిన మానవుడు ఉదయాన్నే తన పనుల నెట్లు చక్కబెట్టుటకు లేచునో అట్లే సమాధులలో నిద్రించు శరీరములు ఒక క్రొత్త జీవితము కొరకు లేపబడును.

ఆత్మలు నిద్రించు భావము బైబిలులో బోధింపబడలేదు.

మరణమునకు పునరుత్థానమునకు మధ్యగల దీర్ఘకాలములో ఆత్మలు స్మృతి తప్పిన స్థితిలో కాలముగడుపవు , బైబిలులో మరణమనగా ఆత్మ సంపూర్తిగా లేకపోవుటగాని స్మృతి లేకపోవుట గాని కాదు. వెడలిపోయిన ఆత్మలు జీవించుచున్నవి, స్మృతి కలిగినవి.

## 4 మృతులు ఎక్కడ ఉన్నారు ?

మరణములో ఆత్మ శరీరమును విడనాడి ప్రత్యేకముగా స్మృతి కలిగి జీవించును. గాని ఎక్కడ ? ఆత్మ సమాధిలో శరీరములో నిద్రించదు, సరిగదా అది సమాధి చుట్టూ ఆవరించుకొని యుండదు. లేక మరికొన్ని మతస్థులు ఊహించుచున్నట్లు అది వేరొక దానిలోనికి వెళ్లుట లేక తిరిగి జన్మించుట అను భావములు బైబిలు బోధకు కేవలము ప్రతికూలముగా యున్నవి. మరణించిన తరువాత ఆత్మ దానిని దయచేసిన దేవునియొద్దకు పోవునని బైబిలు చెప్పుచున్నది (ప్రసంగి 12:7).

అయితే మరణించిన తరువాత పునరుత్థానము కొరకు కనిపెట్టుటకు ఆత్మలు ఎక్కడికి పోవును? తీర్పు తరువాత చివరి గమ్యమగు పరలోకము లేక నరకము లోనికి అవి పోవునా? లేక మధ్యస్థ నివాసములోనికి పోవునా? ప్రభువు మరల వచ్చునప్పుడు తీర్పుదినమందు, క్రీస్తు విమోచింపబడిన వారితో, “నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా రండి లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి” యని చెప్పును. దుర్మార్గులతో ఆయన “శపింపబడిన వారలారా, నిత్యాగ్నిలోనికి పోవుడి. వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు ” (మత్తయి 25:31-46). ఆ దినమందు క్రీస్తు అనుచరులు నీతి కిరీటమును పొందుదురు (2తిమో 4:8; 1 పేతురు 5:4; లూకా 14:14). క్రీస్తు ఇట్లనెను: “మీ హృదయము లను కలవరపడనియ్యకుడి దేవుని యందు విశ్వాసముంచుచున్నారు.

నాయందును విశ్వాసముంచుడి. నాతండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచు న్నాను. నేనువెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసుకొనిపోవుదును" (యోహాను 14:1-3). పాతనిబంధన కాలములో జీవించిన పరిశుద్ధులు కూడ నిత్యనీతి నివాసములోనికి ప్రవేశించుటకు కనిపెట్టుచున్నారు. పెంతెకొస్తునాడు పేతురు దావీదును గూర్చి చెబుతూ, "దావీదు, పరలోకమునకు ఎక్కిపోలేదు" అని ప్రకటించెను (అపొ.కా. 2:34). గనుక చనిపోయిన వెంటనే ఆత్మలు నిత్యస్థితి లోనికి అనగా పరలోకములో గాని నరకములో గాని ప్రవేశింపవు.

అశరీరులుగా యున్న ఆత్మలన్నియు మరణ పునరుత్థానముల మధ్య జీవించుటకు ప్రభువు ఒక మధ్యస్థ స్థలమును సిద్ధపరచెను. అది పాతాళ లోకము లేక మృతుల లోకము అని (Hades) పిలువబడెను. క్రొత్తనిబంధనలోని రెండు వచనములు ఈ సత్యమును తెలియజేయు చున్నవి : 1) లూకా 16:23. మరణించిన తరువాత ధనవంతుని యొక్కయు లాజరు యొక్కయు ఆత్మలు పాతాళములో (Hades) యుండెను. ధనవంతుడు పాతాళము నుండి కన్నులెత్తి చూచినట్లు యేసు చెప్పెను. 2) అపొ.కా. 2:27,31. యేసు చనిపోయినప్పుడు ఆయన ఆత్మ పాతాళమునకు కొనిపోబడెను. పెంతెకొస్తు నాడు పేతురు దావీదు చూసిన "నీవు నా (క్రీస్తుయొక్క) ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు" అను ప్రవచనమును చెప్పెను. మరల "క్రీస్తు పాతాళములో విడువబడలేదని" అతడు చెప్పెను. మనుష్యుడు చనిపోయినప్పుడు ఆత్మ పాతాళమునకు, శరీరము సమాధి లోనికి కొనిపోబడును. పాతాళము (Hades) రెండు భాగములుగా విభజింపబడియున్నది. నీతిమంతుల నివాసమగు పరదైసు (Paradise). మరియు దుర్మార్గుల నివాసమగు చీకటి

బిలము (Tartatus). పునరుత్థానము నందు నీతిమంతుల ఆత్మలు పరదైసును, దుర్మార్గుల ఆత్మలు చీకటి బిలమును విడుచును, అప్పుడు తీర్పు జరిగిన తరువాత నీతిమంతులు పరలోకములోను దుర్మార్గులు నరకములోను నిత్యము నివసింతురు.

పాతాళము అనగా వాటి నైతిక తత్వమెట్లున్నను ఆత్మలు వెళ్లు ప్రదేశమని అర్ధము. పాతాళము (Hades) అనగా అదృశ్యలోకమని దానియొక్క ప్రాముఖ్యార్ధము. వెడలిపోయిన ఆత్మలుండు ప్రదేశము. భూమిమీద నుండు ప్రజలకు అగోచరమైనను అది దేవునికి అగోచరము కాదు. క్రొత్త నిబంధనలో పాతాళము (Hades) అనునది ఎల్లప్పుడు అశరీరులుగా యున్న ఆత్మల ప్రదేశమును సూచించుచున్నది. సమాధి కేవలము శరీరమును స్వీకరించు స్థలము మాత్రమే. Hades అనగా అశరీరులైన ఆత్మల యొక్క సాధారణ స్థలము అని Thayer నిర్వచించెను. గ్రీకుభాషలో Hades అనే పాతాళము అను పదము ఈ దిగువ క్రొత్తనిబంధన వచనములలో కనబడును: మత్తయి 11:23; 16:18; లూకా 10:15; 16:23; అపొ.కా. 2:27,31; ప్రక 1:18; 6:8; 20:13,14).

దుష్టులయొక్క ఆఖరి నివాసము నరకము. అదియే నరకాగ్ని యని కూడ చెప్పబడినది. నరకము లేక నరకాగ్నియను పదములు క్రొత్త నిబంధనలో ఈ దిగువ వచనములలో కనబడుచున్నవి: మత్తయి 5:22; 29,30; 10:28; 18:9; 23:15,33; మార్కు 9:43;45,57; లూకా12:5; యాకోబు 3:6. గనుక ధనవంతుడు నరకములో నుండి కనులెత్తిచూచెనని యేసుగాని లేక యేసు యొక్క ఆత్మ నరకములో ఉండిపోయెనని పేతురుగాని చెప్పలేదు. గాని ఆయన శరీరము సమాధిలో యుండగ ఆయన ఆత్మ పాతాళములో (Hades) యుండెను. అట్లే ధనవంతుడు, లాజరు కూడ తమ కడవరి స్థితిలో అనగా నరకములో

గాని లేక పరలోకములో గాని లేరు. వారి సంఘటన తీర్పు జరుగక ముందున్న స్థితిని వర్ణించెను. ఏలయనగా ఆ ధనవంతునికి భూమిమీద ఇంకా అయిదుగురు సహోదరులుండిరి, మృతుల పునరుత్థానము, తీర్పు ఇంకా జరుగలేదు  అది కాలాంతమయ్యే వరకు జరుగదు.

Tartatus అనగా కటికచీకటి గల బిలము అనుపదము గ్రీకు నిబంధనలో ఒక్కమారే అగుపడును: "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళలోకమందలి  కటికచీకటిగల బిలములోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2పేతురు 2:4). పాపములో పడిన దూతలను గూర్చి అక్కడ చెప్పబడినది. యూదా 6వ వచనములో కూడా ఇదే సంగతి చెప్పబడినది. గనుక దుష్టులయొక్క ఆత్మలు మరణ పునరుత్థానముల మధ్యకాలములో ఆఖరితీర్పు కొరకు కనిపెట్టుచుయుండు ప్రదేశము పాతాళ లోకములో గల కటిక చీకటిగల బిలము .

పరదైసు (Paradise) అనుపదము పాతాళములో నీతిమంతుల ఆత్మలుండు ప్రదేశమును సూచించుచున్నది.నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువని క్రీస్తు సిలువపై నున్న దొంగతో చెప్పిన దానితో పోల్చిచూచిన పరదైసు పాతాళములో ఒక భాగమని గ్రహించుకొనగలము. క్రీస్తు పాతాళమునకు వెళ్ళెను. క్రీస్తు పరదైసునకు కూడ వెళ్ళెను గనుక పాతాళములో పరదైసు ఉన్నది. అందువలన పాతాళములో రెండు భాగములున్నవని బైబిలు బోధించుచున్నది: అవి పరదైసు, చీకటి బిలము అనునవి. మరణించిన తరువాత మంచివారు, చెడ్డవారు పాతాళమునకు వెళ్లినను, అక్కడ వారి పరిస్థితి సమానముగ యుండదు  కొందరు సంతోషస్థితిలోను మరి కొందరు వేదనగల స్థితిలోను యుందురు.

తీర్పు జరిగిన తరువాత అమర్త్యమైన శరీరములతో విమోచింపబడిన

వారుండు నిత్య నివాసమును పరదైసు అను పదము సూచించుచున్నది (ప్రక 2:7 2కొరింథీ 12:4). పరదైసు అను పదమునకు ఆనందవనము, సంతోష స్థానము అని యర్థము. లేఖనములలో ఆ పదము ఈ దిగువ భావములతో వినియోగించబడెను : 1) ఏదేను వనము 2) నీతిమంతుల ఆత్మలు విశ్రాంతి గైకొను ప్రదేశము 3) పరలోకము (ప్రక 22:1-5).

వినోదము కొరకు సిద్ధపరచబడిన ఏదైన ఒక స్థలము పరదైసు. అది సంతోషస్థితిని కూడ సూచించును. గనుక మానవుని ఆదిమ గృహమును వర్ణించుటకు లేక మరణమైన తరువాత నీతిమంతుల ఆత్మలు పునరుత్థానము కొరకు కనిపెట్టు స్థలమును వర్ణించుటకు లేక తీర్పు తరువాత వారి ఆఖరి నివాసమును, అనగా పరలోకమును వర్ణించుటకు 'పరదైసు' అను పదము వినియోగింనబడవచ్చును.

క్రీస్తును, సిలువపైనున్న దొంగయు ఆనాడే పరదైసులో యుందురని క్రీస్తు చెప్పినప్పుడు ఆయన అశరీరులుగా యున్న ఆత్మల విశ్రాంతి స్థలమును గూర్చి చెప్పెను (యోబు 3:17; ప్రక 14:13). పరదైసులో ఉండుటయనగా నిస్పృహ గల స్థితిలో యుండుట యనిగాని, ఇక ఉనికి కలిగియుండకపోవుటయని గాని లేక పరలోకమని గాని అర్ధము కాదు. క్రీస్తు పునరుత్థానుడైన 40 దినముల వరకు పరలోకమున కెక్కి పోలేదను దానిని గమనించుము (లూకా 24:50,51; అపొ.కా. 1:3-11). యేసును, మారుమనస్సు నొందిన దొంగయు పరదైసులో కలసియున్న యెడల, యేసు మరణించిన తరువాత పాతాళమునకు వెళ్లిన యెడల (అపొ.కా. 2:27,31), పరదైసు పాతాళములో యున్నది. మరియు యేసును ఆ దొంగయు పరదైసులో కలిసి యున్నప్పుడు పాతాళము లోయుండిరి. గనుక లూకా 23:42 యున్న పరదైసు రక్షింపబడిన వారి నిత్యనివాసము కాదు ఏలయనగా క్రీస్తు చనిపోయినప్పుడాయన పరలోకమునకు వెళ్లలేదు.

ఆయన సిలువ వేయబడిన మూడు దినముల తరువాత క్రీస్తుయొక్క ఆత్మ పాతాళము నుండి వెడలివచ్చెను. మరియు ఆయన శరీరము మృతులలో నుండి లేపబడెను. అయితే ఆ దొంగ యొక్క ఆత్మ పాతాళము నుండి వెడలి రాలేదు మరియు అతని శరీరము సమాధిలోనే యుండిపోయెను. పునరుత్థాన దినము వరకు అతని ఆత్మ పాతాళములోను, అతని శరీరము సమాధిలోను ఉండును. అదే విధముగా అశరీరులైన ఆత్మలన్నియు వారి శరీరముల పునరుత్థానము వరకు పాతాళములోనే యుండును. అందువలన నీతిమంతుడు చనిపోగానే అతని ఆత్మ నరలోకమునకు వెళ్లుననియు, దుష్టుడు చనిపోగానేఅతని ఆత్మ పరలోకమునకు వెళ్లుననియు కొందరు చెప్పుసంగతి తేటగాయున్న లేఖనములతో సమన్వయించుటలేదు.

క్రీస్తుయొక్క ఆరోహణము తరువాత నీతిమంతుల ఆత్మలు తక్షణమే పరలోకమునకు వెళ్లునని కొందరు చెప్పుదురు. పరదైసు ఇప్పుడు పరలోకమునకు బదిలీ చేయబడెనను భావమునకు లేఖనములు చేయూత నిచ్చుటలేదు (అపొ.కా. 2:34).

ధనవంతుడు లాజరు కూడా పాతాళములో యుండిరి అయితే వారిద్దరు ఒకే అరలోలేరు. ఏలయనగా వారిలో ఒకడు విశ్రాంతి పొందుచుండెను. మరొకడు యాతన పడుచుండెను. మరియు వారిద్దరి మధ్య గొప్ప అగాధముండెను (లూకా 16:23-26). లాజరు అబ్రాహాము రొమ్మున నుండెను. లూకా 23:43లో యున్న విశ్రాంతి స్థలమగు పరదైసు అని దీని అర్థము. మరణమైన తరువాత విశ్వాసుల ఆత్మలు ధన్యస్థితిలో ప్రవేశించును. పునరుత్థానము వరకు వారాస్థితిలో యుందురు. అటు తరువాత వారు నిత్య ఆనందములో ప్రవేశింతురు. అంతే కాకుండా, మరణమైన వెంటనే నీతి మంతులకు ఒక ధన్యస్థానము ఎట్లున్నదో అట్లే దేవుని చిత్తప్రకారము నడువని వారికొక యాతనపడు ప్రదేశము

పాతాళములో యున్నది. ధనవంతుడు మరణించగా పాతాళమునకు వెళ్లెను మరియు ఆ ప్రదేశములో అతడు నరకము (Gehenna) లో లేడు. నీతిమంతుల యొక్కయు దుర్మార్గుల యొక్కయు ఆత్మలు పాతాళములో యుండెను: ధనవంతుడు చీకటి (Tartarus) బిలములోను, లాజరు అబ్రాహాము రొమ్మునను ఉండిరి. తీర్పుకు ముందు, తీర్పు తరువాత కూడ భక్తిహీనులకు శిక్ష లభించును. "దుర్నీతి పరులను శిక్షలో ఉంచబడిన వారిని తీర్పుదినమువరకు కావలిలో ఉంచుటకు ప్రభువు సమర్థుడు" (2 పేతురు 2:10). అశరీరులైన దుష్టుల ఆత్మలు చీకటిబిలములో పొందే శిక్షకును ఆఖరి తీర్పు తరువాత వారు పొందే నరక శిక్షకును గల వ్యత్యాసమును గమనించవలెను. పునరుత్థానము, తీర్పు తరువాత కలుగు నరకశిక్షలో శరీరాత్మలుండును (మత్తయి 10:28 25:46).

పునరుత్థానమునకు ముందు పాతాళములో ఆనందమును, యాతనయు ఉండినను, కడపటి ఆనందము లేక శిక్షలు శరీరములు ఆత్మలతోపునరుత్థానము నందు ఏకమగువరకు, తీర్పు జరుగువరకు కనిపెట్టవలెను పాతాళములో మంచివారి యొక్కయు చెడ్డవారియొక్కయు పరిస్థితి ఎట్లుండినను, పునరుత్థాన మందు వారి స్థితి అదే రకమైన వేరొక పరిస్థితిలోనికి మార్చబడును.

సంగ్రహముగా పాతాళము (Hades) అనుపదము అశరీరులైన ఆత్మలు మరణమునకు పునరుత్థానమునకు మధ్య యుండు ప్రదేశమును సూచించు చున్నది. పరదైసు, చీకటి బిలము అనునవి పాతాళములోని రెండు అరలు నరకమనునది పునరుత్థానము తరువాత కలుగు నిత్య శిక్షాస్థలము. గనుక తీర్పు తరువాత దుష్టులు ఉండే ప్రదేశము నరకము. పాతాళమనునది ఆఖరి శిక్షా స్థలముని లేఖనములలో ఎన్నడు వినియోగింపబడలేదు. సరిగదా నరకము అనుమాట వినియోగింపబడెను. దుష్టుల ఆత్మలు తీర్పు కొరకు కనిపెట్టుచుండు ప్రదేశమగు చీకటిబిలము

(Tartarus) నరకము (Gehenna) కాదు.

తీర్పును గూర్చియు, నిత్యత్వమును గూర్చియు వక్కాణించుచు దేవుని వాక్యము అశరీరులైన ఆత్మల యొక్క మధ్య స్థితిని గూర్చి బహు స్వల్పముగా మాత్రమే చెప్పుచున్నది. ఈ ఆత్మల స్థానము నుండి వచ్చిన బైబిలు వృత్తాంతము ఏదియు లేదు. లాజరు తిరిగి బ్రదికి వచ్చిన తరువాత అక్కడ ఉన్న పరిస్థితులును గూర్చి ఏమియు చెప్పలేదు (యోహాను 11). పౌలు కూడ తాను మూడవ ఆకాశములో ఏమి చూచెనో దానిని గూర్చి కూడా ఏమియు చెప్పలేదు. ఏలయనగా ఆ మాటలు మనుష్యులు పలుక కూడదు (2కొరింథీ 12:3,4).

మరణమైన తరువాత ఒకడు తన జీవిత వృత్తాంతమును మార్చుకొను తరుణమేమియు లేదని గమనించుట ప్రాముఖ్యము. మరణము సంభవించినప్పుడు ఆత్మ పాతాళమునకు వెళ్ళగా రక్షింపబడినవారికి, నశించినవారికి మధ్య గల అగాధము నిర్ణయించబడియుండెను (లూకా 16:26; అపొ.కా. 1:25; ప్రక 14:32; ప్రసంగి 14:3; ప్రక 22:11). భూమిపై ఒకడు జీవించిన దానిని బట్టి పాతాళములో అతని పరిస్థితి నిర్ణయించబడును. అట్లే భూమిపై అతడు చేసిన క్రియలను బట్టి అతని నిత్యబహుమానము నిర్ణయించబడెను (యోహాను 8:21; రోమా 14:12; 2 కొరింథీ 5:10; తీతు 2:11,12). మధ్యస్థస్థితిలో అతని ఆత్మ పరీక్షణములో లేదు. మరణములో పరీక్షణము (Probation) అంతమగును అదృష్టము ముద్రవేయబడును. మరియు అతని గమ్యము చిరకాలము నిర్ణయించబడును. మరణమైన తరువాత పరీక్షణమును (Probation) గూర్చి బైబిలు ఏమియు చెప్పుటలేదు. "మనుష్యులొక్కసారే మృతిపొంద వలెనని నియమింపబడెను ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). శవపరీక్ష సువార్త ఏమియు లేదు (హెబ్రీ 3:7,15). కొందరు తలంచురీతిగా క్రీస్తు నోవహు కాలపు ప్రజలకు పాతాళములో రెండవ తరుణము నేమియు

ఈయలేదు. అట్టి వారు 1పేతురు 3:18-20లో యున్న వచనములను అపార్థము చేసికొందురు. పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన నోవహు ద్వారా క్రీస్తు సువార్త ప్రకటించెను. దానిని వినినవారు ఓడ సిద్ధపరచబడుచుండగా ఆ కాలములో జీవించినవారే (2 పేతురు 2:5; 1పేతురు 1:10,11; ఆది 6:3; లూకా 4:18; ఎఫెసీ 2:17).

రెండవతరుణము అనే అంశమునుగూర్చి తరుచుగా అపార్థము చేసికొన బడుచున్న మరియొక వచనము 1పేతురు 4:6. అది మృతులకు కూడ సువార్త ప్రకటింపబడెను అని చెప్పుచున్నది. అది వ్రాయబడుసరికి మృతులైన వారికివారు సజీవులై యుండగా సువార్త ప్రకటింపబడెనని ఆ లేఖనభాగము యొక్క అర్థము.

ఒకడు మరియొకనికి బదులుగా పొందే (Vicarious) బాప్తిస్మమును గూర్చి అనగా చనిపోయిన వారినిగూర్చి బ్రతికి యున్నవారే పొందే బాప్తిస్మమును గూర్చి బైబిలు బోధించుటలేదు. 1కొరింథీ 15:29లో పౌలు చెప్పిన దేమంటే ప్రజలు తమ శరీర పునరుత్థానమును మనస్సులో నుంచుకొని బాప్తిస్మము పొందుచున్నారని దానియర్థము. (అపొ.కా. 18:8; రోమా 6:3,4; 1కొరింథీ 15వ అధ్యాయము యొక్క ప్రముఖ భావ మేమంటే క్రీస్తుయొక్క పునరుత్థానముపై మానవుని పునరుత్థానము ఆధారపడియున్నది. జీవించినను, మృతుడైనను ఒకడు మరియొకని కొరకు బాప్తిస్మము పొందుట అసాధ్యము.

అంతేకాకుండా మృతులైన వారికిగాని లేక వారి నిమిత్తముగాని ప్రార్థించవలెనని బైబిలు ఆజ్ఞాపించుటలేదు (1తిమో 2:5; రోమా 8:34; హెబ్రీ 7:25). ప్రతి క్రైస్తవుడు ఒక యాజకుడు మాత్రమేగాక. అతడు పరిశుద్ధుడు (1పేతురు 2:5; 1 కొరింథీ 1:2). అతడు పరిశుద్ధులకు లేక పరిశుద్ధుల ద్వారా గాక క్రీస్తుద్వారా దేవునికి నేరుగా ప్రార్థనచేయును.

చనిపోయిన వారిని గూర్చి ప్రార్థించుట ఒక మూఢ నమ్మకపు విచారము. అట్లే చనిపోయినవారు భూమిపైయున్నవారికి ఏ మేలును చేయలేరు. జీవించియున్న తన సహోదరుల సహాయము నిమిత్తము ధనవంతుడు బతిమాలుకొనినను అది నిష్ప్రయోజన మాయెను. మనలను విడిచి వెళ్ళపోయిన వారి స్థితిని మార్చుటకు మనము ఇప్పుడు చేయగలిగినది ఏమియులేదు ఏలయనగా ఒక గొప్ప అగాధము అప్పుడే నిర్ణయింపబడి యున్నది.

## 5. శరీరము లేపబడునా ?

మృతుల పునరుత్థానమును గూర్చి బైబిలు బోధించుచున్నది. యేసు ఇట్లనెను: "దీనికి ఆశ్చర్యపడకుడి ఒక కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దమువిని మేలు చేసినవారు జీవపునరుత్థానమునకు. కీడుచేసిన వారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28,29). నీతిమంతులకును అనీతి మంతులకును పునరుత్థానము కలుగబోవుచున్నదని పౌలు చెప్పెను (అపొ.కా. 24:15). పునరుత్థాన శరీరము మార్చబడిన శరీరము. మన మందరము మార్చబడుదుము అని పౌలు చెప్పెను. ఈ మార్పు తృటికాలములో, కనురెప్పపాటు కాలములో జరుగును. మృతులు లేపబడుదురు క్రీస్తు వచ్చుసరికి జీవించుచున్నవారు చనిపోరు గాని వారి శరీరములు అమర్త్యములగును (ఫిలిప్పీ 3:21). "క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది" (1కొరింథీ 15:35).

యేసు మరల వచ్చునప్పుడు మానవుల ఆత్మలు పాతాళమును వీడుననియు, ఆ యాఖరి దినమున శరీరములు లేపబడుననియు లేఖనములు చెప్పుచున్నవి. కాలాంతమున ఆత్మలు పాతాళమునుండియు,

పునరుత్థానము నొందిన శరీరములు సమాధులనుండియు వచ్చును ఆ సమయమందు ఆత్మలన్నియు పునరుత్థానమునొందిన వాటి అమర్త్య శరీరములతో ఏక మగును (యోహాను 5:28,29; 1థెస్స 4:14; ప్రకటన 1:18 20:13). ఇది పాతాళము యొక్క అంతమగును (ప్రకటన 20:14). అప్పుడు మానవులు నిత్య బహుమానమును లేక నిత్యశిక్షను పొందు గొప్ప తీర్పుదినముండును (మత్తయి 12:41, 42; 16:27; 25:31-46; అపొ.కా. 17:31; 24:15).

క్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడగుటవలన మరణమును నిరర్ధకము చేసి జీవమును అక్షయతను సువార్త వలన వెలుగులోనికి తెచ్చెను (2తిమో 1:10). దేవునికి నమ్మకముగా యున్న కుమారుడు భయపడవలసినది మరణములో ఏమియులేదు (హెబ్రీ 2:14,15). క్రీస్తు మరణమును జయించెననియు, చివరిగా మృతులందరు లేతురనియు అతడెరుగును. అందువలన కీర్తనల గ్రంధకర్తతో గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను అని అతడు చెప్పగలడు (కీర్తన 23:4; రోమా 8:38,39).

## 6. భావిలో గుర్తుపట్టు సంగతి ఏమిటి?

చివరిగా, విమోచింపబడినవారు పరలోకములో ఒకరినొకరు ఎరుగుదురా? ఈ అంశముపై బైబిలు నేరుగా చెప్పకపోయినను, వారు ఒకరినొకరు గుర్తెరుగుదురనే భావమునిచ్చు అనేక లేఖనములు కలవు. భౌతిక సంబంధ బాంధవ్యములు పరలోకములో యుండవని యేసు చెప్పెను (మత్తయి 22:30; మార్కు 12:25) కాని జ్ఞాపకశక్తియు, వ్యక్తిగత రూపురేఖలును భవిష్యత్ స్థితిలో యుండునని ఆయన బోధించెను. ఇది గుర్తెరుగుట కవుసరమైన ప్రముఖ విషయములు (మత్తయి 25:34-46; ప్రక 6:9,10). పాతాళములో యుండి ధనవంతుడు లాజరును గుర్తెరుగ

గలిగెను (మత్తయి17:3,4).

పరలోకమునొక విందుగా యేసు పోల్చి చెప్పుటలో ఒకరినొకరు గుర్తు పట్టుట అందులో ఇమిడియున్నది: "అనేకులు తూర్పునుండియు పడమట నుండియు వచ్చి అబ్రాహాముతో కూడను ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను, పరలోకమురాజ్యమందు కూర్చుందురు" అని ఆయన చెప్పెను (మత్తయి 8:11). అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు తెలియుదురా? వారు తెలియువారయిన యెడల తప్పక ఇతరులు కూడ తెలియబడుదురు. అన్ని యుగములలో యున్న దేవుని కుటుంబము అంతయు తండ్రి యింటిలో యుండుటయే పరలోకము. అక్కడ దేవుడు వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును (ప్రకటన 21:4). నీతిమంతుల ఆత్మలు దయ్యములవలె గాక అమర్త్యమైన పునరుత్థాన శరీరములో యుండును (1కొరింథీ 15:42-54).

చనిపోయిన దావీదు కుమారుడు ఇంకా సమాధి చేయబడకముందు దావీదు "నేను వానియొద్దకు పోవుదును గాని వాడు నా యొద్దకు మరలరాడు" అనెను (2సమూ 12:23). నేను త్వరలో అతనితో యుందును అని దీని భావము. తన కుమారుని గుర్తెరుగు భావము ఇందులో ఇమిడి యుండలేదా? మరణమైన తరువాత ఆ కుమారుని అతడెన్నడు గుర్తెరుగని యెడల నేను వాని యొద్దకు పోవుదునని దావీదు చెప్పుటలో అతనికి లభించే ఆదరణ యేమున్నది? పౌలుద్వారా క్రైస్తవులుగా మార్చబడినవారు నమ్మకముగా యండి, రక్షింపబడినవారి లెక్కలో యున్న యెడల పరలోక మందతడు ఆనందించునని అతడు చెప్పెను (ఫిలిప్పీ 2:16; 4:1; 1 థెస్స 2:19,20; 2కొరింథీ 1:14; 4:14). జ్ఞాపకశక్తి నిర్మూలించబడదని పౌలు ఎరుగును. పాత సహవాసమును ఒండొరుల శ్రమలను గూర్చిన సంభాషణను, దేవునికి స్తుతి చెల్లించే అవకాశమును అతడు ఎదురు చూచెను. పత్మాసుదీవిలో యోహాను క్రీస్తును గుర్తుపట్టెను.

ఇది రక్షింపబడినవారు ఒండొరులను గుర్తు పెట్టుదురని సూచించుచున్నది (ప్రకట 1:13).

మనుష్యుడు భూమిమీద ఉండగా పరలోకమును గూర్చియు భవిష్యత్ జీవమును గూర్చియు అతనికున్న జ్ఞానము సంకుచితమైనది. సమాధి యనంతరమున్న సంతోషమును గూర్చి అతనికి కొద్దిగా మాత్రమే ఆచూకీ తెలియును. అపొస్తలుడైన యోహాను ఈ తలంపును దిగువ మాటలలో వ్యక్తపరచెను "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు. గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" (1యోహాను 3:2).

ఇక్కడ పొందే యెడబాటు తాత్కాలికమైనదని క్రైస్తవులు ఎరుగుదురు. వారొకరినొకరు కలసికొని పరలోకమందు ప్రభువుతో నిత్యము జీవింతురు. సమాధియనంతరము జీవమును, రాబోవు లోకములో విమోచింపబడిన వారందరితో ఏకమై యుండుట అను క్రైస్తవునికున్న నిరీక్షణ ఎంత ధన్యమైనదో. "కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనికొకడు ఆదరించు కొనుడి" (1థెస్స 4:18).

## సంగ్రహము

సమాధియనంతరము మానవులందరికీ నిత్య ఉనికి యున్నదని లేఖనములు ఖచ్చితముగా బోధించుచున్నవి.

మానవుడు దేవుని స్వరూపమందు సృజింపబడినవాడై మూడు పరిస్థితులలో ఉనికిని కలిగియున్నాడు: 1) శరీరము, ఆత్మ భౌతిక కాయములో ఏకమై యున్నవి. 2) శరీరము, ఆత్మ ఎడబాటు నొంది


ఆత్మ పాతాళములోను, శరీరము సమాధిలోను ఉండును. 3) పునరుత్థానము నొందిన శరీరము ఆత్మలో మరల లీనమై కడవరి నివాసమగు పరలోకములోనో లేక నరకములోనో యుండును.

దేవుని మహిమగల పట్టణమగు పరలోకము అతిసుందరమైన పదములతో వర్ణించబడినది. విశ్వాస నేత్రము ద్వారానే పరలోక ర్యములను మనము పరికించగలము. అది నిత్యానంద సంతోషములు గల స్థితి. రోగమైనను, బాధయైనను, మరణమైనను, దుఃఖముతో కూడిన ఎడబాటైనను లేని ప్రదేశము అది. దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో ఆ నిత్య నగరములో జీవించుట ఎంత ధన్యతయో!

నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును ఇందువలన మీరు నా శిష్యులగుదురు”

✤

# మృతులు ఎక్కడ ఉన్నారు?



# 10. క్రీస్తు యొక్క రెండవ రాకడ

## (The Second Coming of Christ)

క్రీస్తు మరల వచ్చును. క్రొత్తనిబంధనలో మూడు వందలకంటె పైగానున్న వచనములు ఆ సంఘటనను గూర్చి చెప్పుచున్నవి లేక సూచించుచున్నవి. దురదృష్టముగా ఆయన రెండవ రాకడను గూర్చిన అనేక సిద్ధాంతములు, విభేదములుండుటచే క్రైస్తవులలో అనేకులు ఈ అంశమును సరిగ పరిశీలించలేక పోవుచున్నారు.

### 1. ఆయన రాకడ ఖచ్చితము

క్రీస్తు యొక్క రెండవరాకడ బైబిలు యొక్క ప్రశ్నించతగని వాగ్దానము. దూతలు వారికి ఇట్లు చెప్పిరి: "గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే ఏరీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆరీతిగానే ఆయన తిరిగి వచ్చును" (అపొ.కా. 1:11). మరల వత్తునని యేసే చెప్పెను. తన శిష్యులను విడిచిపెట్టకముందే యేసు వారితో ఇట్లనెను: "మీకు స్థలము సిద్ధపరచవెళ్లుచున్నాను నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్దనుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:2,3). క్రీస్తు మరల వచ్చునని అపొస్తలులు ప్రకటించిరి. "పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని పౌలు చెప్పెను (1థెస్స 4:16). (హెబ్రీ పత్రిక లేఖకుడు ఆయన " రెండవసారి ప్రత్యక్షమగును" అని చెప్పెను (హెబ్రీ 9:28). "ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుము" అని యోహాను పలికెను (1యోహాను 3:2).

మొదటి దినములలో వలెనే ఇప్పుడు కూడా ప్రభువు రాకడను శంకించు వారు కొందరున్నారు. "అంత్య దినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్లే నిలచియున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను" (2 పేతురు 3:3,4). అవిశ్వాసులు సంశయించినను, అపహాసకులు పరిహసించినను క్రైస్తవులు బైబిలునందు విశ్వసించుదురు గనుక ఆయన రెండవసారి ప్రత్యక్షమగునని వారు నమ్ముదురు. ఈ వాగ్దాన నేరవేర్పును గూర్చి దేవునికి వెయ్యేండ్లు ఒక దినముగానున్నది (2 పేతురు 3:3,4). "కొందరు ఆలస్యమని యెంచు కొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము కలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును " (2పేతురు 3:10). ఈ లోకమును, ప్రస్తుత పరిస్థితులును అంతమగును. ఈ భూమి ఇకలేకుండ పోవును. యేసు మరల వచ్చును. అంతేగాకుండా, క్రీస్తు రెండవ రాకడ ఈ లోకాంతమందు వచ్చును. అప్పుడు కాలము గడిచిపోవును. అది ఆఖరి యుగములో ఆఖరిదినము.

## 2. ఆయన రాకడ కనబడునట్టిది

క్రీస్తు రాకడ వ్యక్తిగతమైనది, దృగ్గోచరమైనది, వినదగునది, మహిమ గలది మరియు హఠాత్తుగా వచ్చునది. యేసు వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచును. దేవుని కుమారుని సిలువ వేసినవారును ఆయనను చూతురు: "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు

భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు" (ప్రక 1:7). ప్రభువు వచ్చునప్పుడు ఆయనను చూచుటకు ఎవడును ఒక ప్రత్యేక స్థలమునకు వెళ్ళనవసరము లేదు. వారెక్కడ ఉన్నను భూజనాంగము లన్నియును ఆయన రాకను పరికింతురు: "మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయుండును.... అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి భూమిమీదనున్న సకల గోత్రముల వారు రొమ్ముకొట్టుకొందురు " (మత్తయి 24:27-30).

ఆయన మేఘారూఢుడై (అపొ.కా. 1:9,11; మత్తయి 26:64). అగ్నిజ్వాలలలో (2థెస్స 1:8), తన మహిమగల దూతలతోను (2థెస్స 1:7; మత్తయి 16:27), తన వేవేల పరిశుద్ధుల పరివారముతోను (యూదా :14), ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను దిగి వచ్చును (1థెస్స 1:16). నిస్సందేహముగా క్రీస్తు రాకడ గుప్తమైనదికాక, అగోచరమైనదికాక అది బట్టబయలుగా అందరికీ కనబడునట్టిది. అనుకొనని గడియలో హఠాత్తుగా ప్రభువు ప్రత్యక్షమగుట అవిశ్వాసులకు భయంకరమైన దృశ్యము కాని నీతిమంతులకుఅదొక ఆశ్చర్యకరమైన దినము.

## 3. ఆ గడియ తెలియనిది

ఆయన రాకడయొక్క సమయము దేవుని మనస్సులో దాచబడి యున్నది (ద్వితీయ 29:29). ఆ తేది ఏ మానవునికి దేవుడు బయలు పరచలేదు. ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగడు" (మార్కు 13:32). ఆయన రెండవరాకడ మధ్యరాత్రిలో గాని లేక తెల్లవారుజామున గాని యుండవచ్చును ఏ సమయము నందైనను

ఆయన ప్రత్యక్షము కావచ్చును  అది ఈ రోజే కావచ్చును. అదెప్పుడు జరుగునో మానవుడెరుగడు. అయితే ఒకటి మాత్రమే అతడెరుగును. అదేమంటే జలప్రళయమునకు ముందువలె ఈ లోక జీవనము యథావిధిగా యుండును  మరియు అనేకులు సిద్ధపడకయుందురు. "నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయును ఆలాగే యుండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసుకొనుచు, పెండ్లికిచ్చుచునుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగకపోయిరి  ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును" (మత్తయి 24:37–39).

క్రీస్తు రాకడ హఠాత్తుగా ముందు హెచ్చరిక లేకుండా యుండును. అనుకొనని రీతిగా, ఎవరికి చెప్పకుండ ఒక దొంగ వచ్చినట్లు ఆయన వచ్చును (2పేతురు 3:10;  1థెస్స 5:2). గనుకనే ఈ గంభీర హెచ్చరిక : "మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి (మత్తయి 24:44).

## A. తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు

క్రీస్తురాకడ సమయమును ఎవరు ఎరుగరు గనుక ఆయనరాకడ గూర్చి తేదీలు నిర్ణయించుట పరిహాసకరమైనది. అయినను కూడ ఇది జరిగెను. ఇంకా జరుగుచున్నది. మరియు ఈ తేదీలు నిర్ణయించువారిని బట్టి మంచిమనస్సు గల వారనేకులు మోసగించబడుచున్నారు. ఉదాహరణకు : ఎడ్వంటిస్టు ఉద్యమమును స్థాపించిన విల్లియం మిల్లర్ అనునతడు క్రీస్తు 1843లో అక్టోబరు నెలలో వచ్చునని జోస్యము చెప్పెను. అట్లు చెప్పి అనేకులను అతడు నమ్మించెను. తన అనుచరులు వారి ఆస్థులను అమ్మివేసి, తమకొరకు తెల్లటి ఆరోహణ దుస్తులను తయారు చేసుకొని ప్రభువు ప్రత్యక్షత కొరకు ఆనందముతో కనిపెట్టిరి. ఆ తేది

వచ్చెను గాని క్రీస్తురాలేదు. నిరుత్సాహపడినను, మిల్లర్ ఓడిపోలేదు. గనుక తన ప్రవచన లెక్కలలో ఒక సంవత్సరమును గూర్చి పొరపాటు చేసితినని తన అనుచరులకు చెప్పి ప్రభువు ఆ మరుసటి సంవత్సరమున అతడు నిర్ణయించిన తేదీన వచ్చునని ప్రకటించెను. మరల ఆ తేదీ వచ్చెను గాని, 1884 లో క్రీస్తు రాలేదు.

తరువాత,యోహోవా సాక్షులు అనే గుంపును స్థాపించిన చార్లెస్ టి.రస్సెల్ అనునతడు క్రీస్తు రాకడను గూర్చి వ్రాసెను. 1874లో అక్టోబరునెలలో ప్రభువు వచ్చెనుగాని కొంతమంది మాత్రమే అనగా అతని అనుచరులు మాత్రమే దానినెరుగుదురనియు మిగిలిన వారందరికి అది దృగ్గోచరము కాలేదనియు అతడు చెప్పెను. ఇంతకు ముందే మనము గమనించినదేమంటే ప్రభువు వచ్చినప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచుచు (ప్రక 1:7). ఆయన వ్యక్తిగతముగా వచ్చును. ఆయన రాకడను నీతిమంతులు, అనీతిమంతులు చూడగల్గుదురు.

'పాస్టర్‌రస్సెల్' అని తరుచు పిలువబడచున్న యతడు, క్రీస్తు రెండవ రాకడతో ఆరంభమగు 'సువర్ణయుగమును' గూర్చి అనేక ప్రవచనములు చేసెను. అయితే ఈ విషయములో అతడు చేసిన ప్రవచనములన్నియు అతడొక అబద్ధ ప్రవక్తయని నిరూపించెను. "ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు ఆ మాట జరుగకపోయిన యెడలను ఎన్నడు నెరవేరకపోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాటకాదు ఆ ప్రవక్త అహంకారము చేతనే దానిని చెప్పెను గనుక దానికి భయపడవద్దు" (ద్వితీ 18:22).

1916లో రస్సెల్ చనిపోగా,జడ్జి రూథర్‌ఫోర్డు అనునతడు అతని సింహాసనమునకు వారసుడాయెను. అతడు కూడ ప్రవచనములు పలికెను. 1920లో 'ఇప్పుడు జీవించుచున్న లక్షలాది ప్రజలు ఎన్నడు మృతిజెందరు' అనే చిన్న పుస్తకమును రూథర్‌ఫోర్డు ప్రచురించెను. 1925లో మృతి

బొందిన నీతి మంతులు లేపబడుదురనియు, అప్పటికి సజీవులుగాయుండి విమోచన కర్తను అంగీకరించిన వృద్ధులందరు తమ యౌవన ప్రాయమును తిరిగిపొంది భూమిమీద నిత్యము జీవించుచు మరణమును ఎన్నడు చూడరనియు అతడు ఆ పుస్తకములో ప్రవచించెను. అంటే 1925లో చెక్కతో చేయబడిన కాళ్లు కలిగిన వృద్ధులందరికీ క్రొత్త అవయవములు లభించును. పళ్లు కట్టించుకొనిన వారికి క్రొత్తపళ్లు లభించునని దీనియర్థము. అంతే కాకుండా అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, దావీదు మొదలగువారు మిగతా పాతనిబంధన వ్యక్తులతో సహా భూమిమీద జీవించెదరని, 1925 తరువాత వారు అందరికీ కనబడుదురని అతడు ప్రవచించెను. నిజముగా 1925 ముందు ప్రజలకు చాల చక్కగా కనబడెను. గాని 1925 వచ్చెను. రూధర్‌ఫోర్డు ప్రవచనము లన్నియు విఫలమాయెను. 1925 తరువాత అతడు కూడ చనిపోయెను. 1925 రాగా జీవించుచున్న లక్షలాది ప్రజలలో అతడొకడు కాని అతడు చనిపోయెను. అతడుకూడ ఒక అబద్ధ ప్రవక్తయే.

1939లో క్రీస్తు వచ్చునని మరొకడు చెప్పెను. మరికొందరు దాని తరువాయి తేదీలను నిర్ణయించిరి, అయితే ఆ తేదీలలో ఆయన ప్రత్యక్ష మాయెనా? గనుక దేవుని వాక్యము నెరుగని వారిని ఈ తేదీలు నిర్ణయించు వారు మోసగించుచునే యున్నారు.

మానవులచే నిర్ణయించబడిన ఏ తేదీలలోను క్రీస్తురాలేదు గనుక ఆ యంశమును గూర్చి మానవునికి ఇసుమంతయును తెలియదని నిర్ధారణ యగుచున్నది. ఈ వాస్తవములను బట్టి చూచిన, క్రీస్తురాకడ కొరకు తేదీలను కొందరు ఎందువలన నిర్ణయించుటకు పూనుకొన్నారు? క్రీస్తురాకడ కొరకు వీరొక తేదీని నిర్ణయించగా ఈ అబద్ధ ప్రవక్తలు దానిని బాగుగా యెరిగినవారని ప్రజలు వారినే ఎందుకు నమ్ముదురు? ఆ తేది ఎవరికిని బయలు పరచబడలేదు.

## B. సవరణ చేయబడిన తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు.

రక్షకుని రాకకొరకు కొందరు ఒక ప్రత్యేక తేదీని నిర్ణయించరు గాని ఆయన రాకడ సమీపముగా యున్నదని, అది " ఈ సంవత్సరములో "లేక "ఈ తరుణములో" జరుగునని నొక్కి చెప్పుదురు. ఇది సంభవమే కాని బైబిలు అట్లు బోధించుటలేదు. క్రీస్తురాకాడ బహు సమీపముగా నున్నదని మొదటి శతాబ్దములో లేఖనములు బోధించలేదు (2థెస్స 2:1-3) మరియు ప్రభువు యొక్క రెండవ రాకడ బహు ఆసన్నమైనదని అవి ఎప్పుడు బోధించుట లేదు. చరిత్రలో మున్నెన్నడు లేని విధముగా లోకాంతమును గూర్చి ప్రజలు ఆలోచించుచున్నారు. మిగుల క్షోభమును పుట్టించెడు బోధను బట్టియు, వ్రాతలను బట్టియు కొందరు లొంగిపోయినను మరికొందరు అబద్ధ ప్రవక్తల వలన ఆఖరి సంగతులను గూర్చి బైబిలును పఠించుటలో ఉదాసీనులైరి.

## C. మత్తయి 24లోని అనేక సూచనలు సరిగ ఉపయోగింపబడుటలేదు

సూచనలు, ప్రవచన నెరవేర్పు, క్రీస్తు రాకడ ఆసన్నతను గూర్చి చెప్పువారు, వారి భావర్థాములకు నిరూపణగా మత్తయి 24వ అధ్యాయము లోని మొదటి భాగము నుపయోగింతురు. అది చాల ప్రాముఖ్య అధ్యాయము గనుక దానిని చాలా జాగ్రత్తగా చదువవలెను. ఈ లేఖన భాగమును గూర్చి ఇప్పుడు కొన్ని సంగతులను గమనించుము.

క్రీస్తుయొక్క ఆఖరి బహిరంగసభ తరువాత, సిలువవేయబడక ముందు ఆయన దేవాలయమును వీడి తన శిష్యులతో ఒలీవ కొండకు వెళ్లెను. వారు దేవాలయమునుండి బయలుదేరుచుండగా యేసు శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపించిరి(1వ). అందుకాయన

రాతి మీద రాయి యొకటియైనను అక్కడ నిలిచియుండకుండ పడద్రోయ బడునని వారితో అనెను (2వ). తరువాత ఆయన ఒలీవకొండ మీద కూర్చుండి యున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతముగా వచ్చి – ఇవి ఎప్పుడు జరుగును ? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనిరి(3వ). వారి ప్రశ్నలకు సమాధానమిస్తూ యేసు ఆ నలుగురు అపొస్తలులకు దేవాలయ నాశనమును గూర్చియు తన రెండవరాకడను గూర్చియు ప్రవచనముల నిచ్చెను. క్రీస్తు రెండు ప్రశ్నలకు సమాధానమిచ్చెనని జాగ్రత్తగా గమనించుము అవేవన : 1) ఇవి ఎప్పుడు జరుగును? అంటే ఆయన ప్రవచించినట్లు యెరూషలేము దేవాలయ నాశనము ఎప్పుడు జరుగును? అనునది మరియు 2) నీరాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి. ఈ సంఘటనలన్నియు ఒకేసారి జరుగునని అపొస్తలులు తప్పుగా భావించిరి. వారు ఏ క్రమములో ప్రశ్నించిరో యేసు అదే క్రమములో వారికి జవాబిచ్చెను.

యేసు ఈమాటలు చెప్పిన 40 సంవత్సరములలోపు గానే క్రీ॥శ॥70లో యెరూషలేము రోమా చక్రవర్తియగు టైటస్ వలన నాశనము గావించబడెను. ఒకానొకప్పుడు దేవాలయమున్నచోట ఇప్పుడు ముస్లిములమసీదు ఒకటి ఉన్నది, ఒలీవకొండపై నుండి క్రీస్తు చెప్పిన ప్రవచనము అక్షరాల నెరవేరెను. ఆ దేవాలయము రాతిమీద రాయి ఒకటియైనను నిలువబడకుండ పడద్రోయబడెను. యెరూషలేము నాశనమును గూర్చి ఆదిమ శిష్యులు సంపూర్తిగ బోధింపబడి ఎంతవరకు హెచ్చరింపబడియున్నారంటే ఆ భయంకర సంఘటనలో క్రైస్తవు డొక్కడూ కూడ మరణించినట్లు చరిత్రలో వ్రాయబడి యుండలేదు.

ఇవన్నియు వారి తరములోనే జరుగునని ఆయన చెప్పిన దానిని మనము గమనించవలెను (34వ). గనుక సత్యవాక్యమును సరిగ విభజించలేని వారందరు, మత్తయి 24లో చెప్పబడిన సూచనలలో క్రీస్తు

రెండవరాకడను గూర్చిన సూచన తప్ప మిగతావన్నియు నెరవేరెనని గ్రహించవలెను అవన్నియు నెరవేరు వరకు ఆ తరము గతింపలేదు. యోరుషలేము నాశనమును గూర్చియు, యూదయ సామ్రాజ్యమును గూర్చియు యేసు చెప్పిన కొన్ని సంగతులను తీసికొని వాటిని రెండవ రాకడకును, యుగసమాప్తికిని కొందరు ఉపయోగించుట దురదృష్టము (మత్తయి 24:4-28; ద్వితీ 28:48-58).

మత్తయి 24వ అధ్యాయమును ఎల్లప్పుడు మార్కు 13లోను, లూకా 21:5-28 లోను వ్రాయబడిన సమానాంతర సంఘటనలతో సహా చదువ వలెను. మత్తయి 24:15లో యున్న మాటలను లూకా 21:20 బహు విపులమైన పదములతో యెరూషలేము రోమా సామ్రాజ్య సైనికులచే చుట్టబడుటను గూర్చి చెప్పుచున్నది: "యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమై యున్నదని తెలిసికొనుడి" (దానియేలు 9:24-29; మార్కు 13:14).

క్రీస్తు క్రీ॥శ॥ 30లో చెప్పినమాట అంటే "ఈరాజ్య సువార్త సకల జనులకు సాక్షార్థమై లోకమందంతటను ప్రకటింపబడును అటు తరువాత అంతము వచ్చును" (14వ మార్కు 13:10). అను దానిని తీసుకొని కాలాంతము దగ్గరగా యున్నదని కొందరు వాదింతురు. కాని క్రీ॥శ॥ 70 కి ముందే సువార్త భూలోక మందంతటికిని, భూదిగంతముల వరకును ప్రకటింపబడెను అని పౌలు వ్రాసెను (రోమా10:18). మరల ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి సువార్త ప్రకటింప బడెనని అతడు వ్రాసెను (కొలస్స 1:23).

గనుక అబద్ధ క్రీస్తులు (5వ), యుద్దములు యుద్ధ సమాచారములు (6వ), అబద్ధ ప్రవక్తలు (11,24), మరియు సకల జనులకు సువార్త ప్రకటింపబడుట ఇవన్నియు యెరూషలేము నాశనము కాకముందున్న

సమయమును గూర్చి చెప్పబడినవి. మరల రోమా సైన్యము యూదయ జనాంగమునకంతయు కలుగజేసిన సంఘటన గొప్ప శ్రమ కాలమని జోపిఫస్ అను యూదా చరిత్ర కారుడు వ్రాసెను (21వ). క్రీస్తు అనుచరులకొరకు దేవుని కరుణాకటాక్షము లేనియెడల ఆనాడున్న యూదా జనాంగ మంతయును తుడిచివేయబడియుందురు ఏ శరీరయు తప్పించు కొనలేక పోవును (22వ. దానియేలు 12:1; 1థెస్స 2:16). గనుక కొందరు బైబిలు వేత్తలు చెప్పు గొప్ప శ్రమ కాలము అది అప్పుడే జరిగిపోయినది, సంపూర్తిగ నెరవేర్చబడినది.

గనుక ఒలీవ కొండపై నుండి ప్రభువు చేసిన సంభాషణ శిష్యులకు ఆయన రెండవ రాకడను గూర్చిన సూచనలిచ్చుటకు కాదుగాని, ఆ తరములో యున్న విశ్వాసులకు రాబోవుచున్న యెరూషలేము నాశనమును గూర్చి హెచ్చరించుటకు, తరువాత వారు ఆ పట్టణమునుండి సురక్షిత ప్రదేశములకు పారిపోవుటకు ఒక ఖచ్చితమైన సూచన నిచ్చుటకు మాత్రమేయని గ్రహించవలెను. యెరూషలేము చుట్టూ రోమా సైనికులను వారు చూచినప్పుడు (లూకా 21:20; మత్తయి 24:15), వారు యెరూషలేము నుండియు యూదయ నుండియు పారిపోవుఘడియ వచ్చినదని ఖచ్చితముగా యెరుగుదురు. అయితే యుద్ధములు కరవులు, భూకంపములు మొదలగునవి ఆయన రెండవ రాకడ యొక్క సూచనలుగా గమనించరాదని యేసు విపులముగా చెప్పెను. ఇవి ఆయన రెండవ రాకడకు సూచనలు కావని యేసు చెప్పినను అవే ఆయన రాకడ యొక్క సూచనలని అనేకులు పదే పదే వల్లించుట ఆశ్చర్యముగా యున్నది. ఆ తరము గతించక ముందే ఈ సూచనలన్నియు నెరవేరినందున అవి క్రీస్తు రాకడను సూచించు చున్నట్టివి కావు. గాని యెరూషలేము నాశనమును గూర్చి ఆయన ముందు చెప్పిన దానిని సూచించుచున్నవి. ఆసూచనలన్నియును ఆయన రెండవ రాకడను గూర్చినవని చెప్పిన

యెడల, ఆయన రాకడను గూర్చిన సూచనలుగాని హెచ్చరిక గాని ఏదియు ఉండదని ఆయన చెప్పిన మాటలకు విరుద్ధముగా యుండును (మార్కు 13:22).

ఆయన సంభాషణ నంతటిని జాగ్రత్తగా గమనించిన యెడల ప్రభువు భవిష్యత్తును రెండు ప్రత్యేక కాలములుగ విభజించెనని తెలిసికొనగలము దానిలో మొదటిది ఆయన సంభాషణ చేసినప్పటినుండి యెరూషలేము నాశనమయ్యే వరకు ఉన్నది: రెండవది ఆయన రెండవ రాకడనుండి ఈ లోకాంతమువరకు ఉన్నది. మొదటికాలమును గూర్చి యేసు "మీరు జాగ్రత్తగాఉండుడి ఇదిగో సమస్తమును మీతో ముందుగా చెప్పియున్నాను" అని చెప్పెను (మార్కు 13:23) గాని రెండవ కాలమును గూర్చి రాబోవు అంతము ను గూర్చి ఒక సూచననిచ్చి తన ప్రజలను హెచ్చరించుటకు బదులు ఆయన కేవలము సామాన్య పదములతో మాటలాడెను. మరియు ఆయన రాకడ సమీపమై యున్నట్లు తన శిష్యులు తెలిసికొనకుండ ఏవిధమైన సూచనలు ఇయ్యబడవని ఆయన తెలియజేసెను. "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగునుగాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" అని ఆయన చెప్పెను (మత్తయి 24:36).క్రీస్తు రెండవ రాకడ దినమును దేవుడొక్కడే యెరుగును (అపో.కా. 17:31).

గనుక క్రీస్తురాకడ యెరూషలేము ముట్టడించబడినప్పుడు గాని లేదా అది నాశనము చేయబడినప్పుడు గాని సంభవించదు. గాని తరువాతనే సంభవించును. ఆ శ్రమకాలము అయిపోయిన ఎంతకాలము తరువాత ఆయన రాకడయు, కాలాంతమును జరుగునో క్రీస్తు చెప్పలేదు మరియు బైబిలులో ఎక్కడ చెప్పబడలేదు. ఆయన రెండవ రాకడను గూర్చి యేసు చెప్పిన ఉపమానములు సిద్ధపాటును గూర్చి వక్కాణించినవి గాని ఆయన రాకడ సమయమును గూర్చి కాదు. యజమానుడు వచ్చినపుడు

తన దాసుడు సిద్ధపడక యుండుట కంటే, యెల్లప్పుడు యజమానుని చిత్తమును జరిగించు వాడై యుండవలెనని ఆయన బోధించెను (45-51వ). తరువాత అధ్యాయములో రెండు ఉపమానములను, పదికన్యకలు తలాంతులను గూర్చి ఆయన చెప్పెను. ఆ సంభాషణలో ఆయన వక్కాణించిన ఒకే అంశము ఏమంటే ఆయన శిష్యులు ఆయన రెండవ రాకడకై ఎల్లప్పుడు కనిపెట్టుచు సిద్ధపడి యుండవలెను.

24వ అధ్యాయములో అంజూరపు చెట్టును గూర్చిన ఉపమానము యెరూషలేము నాశనమును వర్ణించుటకు చెప్పబడెను. అంజూరపు చెట్టు చిగిరించునప్పుడు వసంతకాలము యెట్లు సమీపముగా యుండునో అట్లే యూదయలో రోమా సైనికులు యొక్క ఉనికి యెరూషలేము యొక్క నాశనమునకు ఖచ్చితమైన రుజువు అని ఆయన దాని ద్వారా వారికి తెలియజేసెను. అయితే ఆయన రెండవ రాకడయితే దానికి విరుద్ధముగా యుండును  దానికి ముందు ఏవిధమైన సూచనలు వుండవు. క్రీస్తుయొక్క ఈ మాటలను బట్టి, బైబిలు నందున్న ప్రవచనముల ఆధారముగా ప్రభువు తిరిగి వచ్చే సంవత్సరమును గూర్చి లెక్కలుకట్టుట అసాధ్యమని మనము తప్పక చూడ గలము . అంతేకాకుండా ఏదో ఒక శ్రమ కాలము తరువాత ప్రభువు బయలు పరచబడునను భావము ఎంత సత్యవిరుద్ధమో గమనించ గలము.

ప్రభువు తన శిష్యుల కిచ్చిన ఇంత చక్కని హెచ్చరికలున్నను. ఎవడైనా బోధకుడు "కాలాంత సూచనలను గూర్చి" తెలిసిన వానివలె చెప్పునప్పుడు నేటి భక్తిపరులు అతని గూర్చి ఉప్పొంగి పోవుదురు. ఈ యుద్ధము ఆ యుద్ధము లేక భూకంపము లేక గొప్ప కరువు వగయిరాలు ప్రవచన ప్రకారము క్రీస్తు రాకడ యొక్క ఖచ్చితమైన సూచనయని అతడు తన శ్రోతలకు తెలియ జేయుటకు యత్నించును. అయితే ఆ దినమైనను ఆగడియైనను ఎవనికి తెలియదనియు ప్రజలు అనుకొనని సమయ మందు

అది జరుగుననియు యేసు వక్కాణించెను (మత్తయి 24:24). ఆ సమయము ఎప్పుడో తెలియదు గాని, క్రీస్తు వచ్చుట మాత్రము ఖచ్చితము.

## 4. యేసు వచ్చినప్పడు భూమి కాలిపోవును, మృతులు లేపబడుదురు మరియు లోకమునకు తీర్పు జరుగును.

క్రీస్తు రాకడలో జరుగు సంఘటనలు లేఖనములలో తేటగా చెప్పబడినవి అవేవనగా :

1) భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును. లోకాంతము సంభవించును: "అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువచేయబడినవై అదే వాక్యమువలన భద్రము చేయబడియున్నవి.... అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును. పంచభూతములు మిక్కటమైన వేంద్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" (2పేతురు 3:7-11). (చాల అభూతకల్పనగా ఈ మాటలు చెప్పబడెనని ఒకప్పుడు భావించబడెను.గాని ఆటంబాబులు హైడ్రోజన్ బాంబులు గల ఈ రోజులలో ఈ మాటలు ఎంత యధార్థమో మనము ఇట్టే గమనింప వచ్చును).

2) మానవులందరు, నీతిమంతులు అనీతిమంతులు ఒకేసారి లేప బడుదురు: "దీనికి ఆశ్చర్యపడకుడి ఒక కాలము వచ్చుచున్నది ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28,29). "ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన వరుసలోనే

బ్రతికింపబడును ప్రథమ ఫలము క్రీస్తు తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయన వారు బ్రతికింపబడుదురు. అప్పుడు అంతము వచ్చును. కడబూర మ్రోగును అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము" (1కొరింథీ 15:22-24,52).

3) మానవులందరకు నీతిమంతులకు అనీతిమంతులకు ఆఖరితీర్పు జరుగును: "తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు గొల్లవాడు మేకలలోనుండి గొర్రెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరు పరచును" (మత్తయి 25:31-32). ".... సజీవుల కును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు" (2తిమో 4:1). "మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని.... మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆసింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని, అప్పుడు గ్రంథములు విప్పబడెను ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రక 20:11,12).

లేఖనములు ఈ లోక అంతమును, మృతుల పునరుత్థానమును, ఆఖరి తీర్పును క్రీస్తు యొక్క రెండవ రాకడలో తేటగా కలుపుచున్నవి. ప్రభువు వచ్చే ఘడియను గూర్చి మానవునికి తెలియజేయబడకపోయినను, ఆయన మృతులను అనగా నీతిమంతులను అనీతిమంతులను లేపుటకు మానవజాతికంతటికిని తీర్పు తీర్చుటకును ఆయన వచ్చుచున్నాడని నిర్ధారణ చేయబడెను.

### A. క్రీస్తు ఒక భూ సామ్రాజ్యమును స్థాపించబోడు

క్రీస్తు మరల వచ్చునప్పుడొక భౌతిక రాజ్యమును స్థాపించి ఈ

లోకమంతటిని పరిపాలింప బోవుటలేదు. క్రీస్తు ఇప్పుడు రాజైయున్నాడని బైబిలు బోధించుచున్నది. (1తిమోతి 6:15) భూమిపై ఆయన రాజ్యమే సంఘము (మత్తయి 16:18,19). అయినను అది ఈలోకసంబంధమైనది కాదు (యోహాను 18:36). ఆదిమ క్రైస్తవులు అప్పుడే రాజ్యములో ప్రవేశించి యుండిరి (కొలస్స 1:13,14; హెబ్రీ12:28; ప్రక 1:9). మార్కు 9:1; అపొ.కా. 2:1-4లను మనము పోల్చి చదివిన యెడల భూమిపై క్రీస్తురాజ్యము పెంతెకొస్తు దినమున, యోరూషలేము పట్టణములో స్థాపించబడెనని గ్రహించగలము. క్రీస్తు మరల వచ్చునప్పుడు ఆయన తన పాలనను విరమించి రాజ్యమును తండ్రియైన దేవుని కప్పగించును (1కొరింథీ 15:24-26; అపొ.కా. 2:29-36; జెకర్యా 6:12,13; హెబ్రీ 8:1,4). క్రీస్తు రాకముందు గాని, ఆయన వచ్చిన తరువాతగాని క్రీస్తు ఒక భూసామ్రాజ్యము నేలును అని చెప్పే లేఖనము ఏదియు లేదు. క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పాలన అని చెప్పబడునది అబద్ధమని తిరస్కరించవలెను. ఆ సిద్ధాంతము అలంకార రీతిగా అనేక గురుతులతో నిండియున్న ప్రకటన 20:1-7పై ఆధారపడి చెప్పబడిన అసత్య భావార్థము వలన ఉద్భవించెను. ఆ భావార్థము లేఖనములలో అనేక చోట్ల తేటగా చెప్పబడిన వచనములకు విరుద్ధముగా యున్నది. ఈ దిగువ సంగతులను గూర్చి చెప్పుటలేదు: 1) క్రీస్తు రెండవ రాకడ 2) శరీర పునరుత్థానము 3) నీతిమంతులందరు 4) భూమిపై రాజ్యపాలన 5) భూమిపైక్రీస్తు 6) క్రీస్తు పాలన యొక్క సమయము మరియు 7) క్రీస్తురాజు గాను యెరూషలేము ముఖ్య పట్టణము గాను.

యోహాను ఇట్లనెను:"యేసు విషయమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తము శిరచ్ఛేదనము చేయబడినవారి ఆత్మలను చూచితిని, వారు బ్రదికిన వారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి ఇదియే మొదటి పునరుత్థానము". 'భూమిమీద' అనే మాట ఈ వాక్యములో

లేదు. నిజానికి ప్రభువు ఈ భూమిపై తన పాదములనెన్నడు మరల మోపడు. ఆయన వచ్చినప్పుడు ఈ భూమి కాలిపోవును (2పేతురు 3:10) నీతి మంతులు ఆయనను మధ్యాకాశములో కలిసికొందురు (థెస్స 4:17). గనుక క్రీస్తు తన పాలనను పెంతెకొస్తునాడు ఆరంభించెనని లేఖనములు బోధించుచున్నవి. ఆయన వచ్చిన తరువాత కాలము అంతమగు వరకు ఆయన కొనసాగించును. అందువలన భూమిపై క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పాలన అసాధ్యమగుచున్నది. సువార్త యుగమే ఆఖరి యుగము (అపొ.కా. 2:17). ఇప్పటి క్రైస్తవ యుగాంతము తరువాత వచ్చే మరొక భూసంబంధమగు యుగము లేదు. 'వెయ్యేండ్ల పాలన' క్రీస్తుయొక్క రెండవరాకడకు యుగాంతమునకు ముందు రావలసియున్నది. గనుక మొదటి పునరుత్థానము ఆత్మీయమైనది (మలాకీ 4:6 మత్తయి 11:14 లూకా 1:17; యెహెజ్కేలు 37:1-14).

క్రీస్తు భూమిమీద నిజముగా వేయ్యేండ్లు పాలించుననను భావమునకు బైబిలు ఆధారమేమియు లేదు. యేసు మరల వచ్చునప్పుడు 1) కాలము అంతమగును 2) మృతులందరు ఒకే సమయమున లేపబడుదురు. 3) ఆఖరి తీర్పు జరుగును. 4) నిత్యత్వము ఆరంభమగునని లేఖనములు బోధించుచున్నవి. ప్రకటన 20:1-6లో యున్న వర్ణన గురుతులతో కూడినట్టిది. గనుక క్రీస్తు రెండవరాకడను గూర్చియు, పునరుత్థానమును గూర్చియు, తీర్పును గూర్చియు బైబిలునందున్న మిగతా లేఖనములతో అది సమన్వయించబడ వలెను. అయినను వేయ్యేండ్ల పాలన సిద్ధాంతము లేఖనములలో తేటగా యున్న అనేక వాక్యములకు విరుద్ధముగా యున్నది. ప్రకటన గ్రంథములోని సంగతులను ఉన్నపాటుననే అంగీకరించుట చాల తప్పు. ప్రకటన 20:1-6లోని భాగము క్రైస్తవ్యము యొక్క పునరుజ్జీవ మును, హింసింపబడిన క్రైస్తవుల విజయమును అలంకార రీతిగా వర్ణించుచున్నది. క్రీస్తు క్రైస్తవుల హృదయములలోను, సంఘము మీదను

పాలించుచున్నాడు గనుక, క్రైస్తవులు ఇప్పుడు ఆ 'వెయ్యేండ్ల పాలనలో' యున్నారు. అందువలన మొదటి పునరుత్థానము ఆత్మీయమైనది. పునరుత్థానమును గూర్చి అలంకారరీతిగాను, శరీర రీతిగాను బైబిలే చెప్పుచున్నది (యోహాను 5:25; రోమా 6:4; యెహెజ్కేలు 37:1-14; మలాకీ 4:5; మత్తయి 11:11-14; మార్కు 9:11-13; లూకా 1:17). వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము అసత్యము.

## B. తీర్పు ఒక గొప్ప దినము

క్రీస్తు రాకడలో మృతులందరు లేచిన తరువాత ప్రభువు మానవులందరికీ తీర్పు తీర్చును. వీరిలో ఆయన లేపినవారును, ఆయన రెండవరాకడ సమయమునకు సజీవులైనవారును ఉందురు, తీర్పు దినము ఒకటి వచ్చుచున్నదని బైబిలు విశదముగా బోధించుచున్నది.

మిగతా అంశములకంటే క్రీస్తు రెండవ రాకడను గూర్చియు మానవులందరి పునరుత్థానమును గూర్చియు బహుకొద్ది ప్రసంగములు చేయబడుచున్నవి. అయితే ప్రవక్తలు, అపొస్తలులు, క్రీస్తుయొక్క పెదవులపైన కాలాంతము, ఆఖరి తీర్పు తరుచు కనబడు అంశములు. మనుష్యులందరు దానిని గూర్చి ఇప్పుడును తీవ్రమైన ఆసక్తిని కలిగి యుండవలెను.

"నీ మనస్సులో అతి తీవ్రముగాయున్న ఆలోచన యేమిటి? యనిడేనియల్ వెబ్‌స్టర్‌ను అడుగగా అతడు "దేవునికి నా వ్యక్తిగత బాధ్యత" యని జవాబిచ్చెను. ఇది ఎంత తీవ్రమైన ఆలోచనో! అందరికి తీర్పు జరుగుటతథ్యము. సంశయములతో ఇప్పటి జీవితము కప్పబడియున్నది. భావిలో ఏమి జరుగునో యెవనికి తెలియదు. అయితే ఒకటి మాత్రము ఖచ్చితము: "మన మందరము దేవుని న్యాయపీఠము యెదుట నిలుతుము... గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క

యొప్పగించవలెను... మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింప బడెను ఆ తరువాత తీర్పు జరుగును" (రోమా 14:10,12 హెబ్రీ 9:27). ఆ నియమించబడిన దానినుండి ఎవడు తప్పించు కొనలేడు. అది ఎంత గొప్ప సంఘటనో!

అది ఎంత ఆశ్చర్య దృశ్యమో! మానవ మాత్రులందరు అక్కడ ఉందురు! జీవించుచున్న వారు, మృతుల సమూహము అక్కడ ఉందురు. ఆదామునుండి ప్రభువురాకడ వరకు ప్రతి చోటనుండి, ప్రతి యుగములోను ఉన్నవారందరు అక్కడ ఉందురు. కొద్దివారు, గొప్పవారు, సన్మార్గులు, దుర్మార్గులు, ధనవంతులు, ధనహీనులు, జ్ఞానులు, అజ్ఞానులు, అన్ని జాతుల వారు, అన్ని భాషలవారు, ఆగొప్ప ధవళ సింహాసనము యెదుట ప్రత్యక్ష మగుదురు. ఏలయనగా, సజీవులేమి, మృతులైన వారేమి అన్ని జనాంగములు వారు క్రీస్తు న్యాయపీఠము ఎదుట నిలుతురు. అది ఎంత గొప్ప జనసమూహమో!

భవిష్యత్ తీర్పు అవుసరము. కొందరు నేరస్థులు అధికారులనుండి, న్యాయస్థానముల నుండి తప్పించుకొని యుండవచ్చును. అయితే ఎవడును తప్పించుకొనలేని ఒక తీర్పు దినము వచ్చుచున్నది. ఒక రీతిగా చూచిన మానవులకు ఈ లోకములోనే తీర్పు జరుగుచున్నది. అయితే అది భావిలో జరుగబోయే తీర్పును నిరర్ధకము చేయుటలేదు సంపూర్ణ ఆఖరి తీర్పు కొరకు అది మరింత చేయూత నిచ్చుచున్నది. ఈ లోకములో అనేక కారణములను బట్టి న్యాయము సంపూర్ణమును ఖచ్చితమును కాకపోవచ్చును: 1) మానవ చట్టములు గుర్తించని కృతఘ్నత, ద్వేషము, హింసాకాండము, అబద్ధములు, దూషణలు, తల్లిదండ్రుల నవమాన పరుచుట మొదలగు అతిక్రమములు ఇక్కడ ఎన్నో యున్నవి. 2) మానవుల తీర్పులు అసంపూర్ణములు, అసంతృప్తి కరములు . న్యాయస్థానములో యున్న మానవ న్యాయాధిపతులకు ఏ నేరమునకు ఎట్టి శిక్షను సరిగ

విధించవలెనో అనేకసారులు తెలియదు. నిజానికి ఒక్కోసారి దోషి జయించుట నిర్దోషి శిక్షింపబడుట జరుగును. 3) న్యాయసభలో పరిశీలించబడుచున్నవాడు దోషియో నిర్దోషియోయను దాని గూర్చి మానవ న్యాయాధిపతి అనేకసారులు సంశయించును. మానవతీర్పు దోష రహితమైనది నిజానికి ఎవడును ఆరోపించడు 4) ఒక్కోసారి నిర్ధోషులు శిక్షింపబడుచు, దోషులుశిక్షను తప్పించుకొనుట వలన ఈ లోక అన్యాయాలను సరిజేయుటకు తీర్పు అవుసరము. దోషులు శిక్షింపబడి, నీతిమంతులు రక్షింపబడు మాత్రమే కాకుండ వారి జీవితములు విప్పబడి అందరికి ప్రకటింపబడవలెను. అందువలన నీతి తీర్పు ఒకటి తప్పక రావలెనని మనుష్యజ్ఞానము కోరుచున్నది.

## C. ఈలోకమునకు క్రీస్తుద్వారా దేవుడు తీర్పు తీర్చును

క్రీస్తే న్యాయాధిపతిగా యుండును. సజీవులకును, మృతులకును తీర్పు తీర్చే ఘనత క్రీస్తుకు ఈయబడెను మరియు న్యాయపీఠము యెదుట మానవులందరు నిలబడవలెను (యోహాను 5:22,27; అపొ.కా. 17:31; మత్తయి 25:31,32). తానొక గొల్లవానిగా గొఱ్ఱెలను మేకలను వేరు చేయుచున్నట్లు వర్ణించుచు యేసు తీర్పుదృశ్యమును మనకు వర్ణించెను. ఆయన "తన కుడివైపున ఉన్నవారిని చూచి నాతండ్రిచేత ఆశీర్వదింపబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి...... అప్పుడాయన యెడమవైపు ఉండువారిని చూచి, శపింపబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి.... వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్తయి 25:33-46).

ఆయన మానవుల క్రియల యొక్కయు తలంపుల యొక్కయు పరిపూర్ణ జ్ఞానము కలిగినవాడు గనుక ఈ లోక విమోచకుడు భూలోక చరిత్ర ఆఖరి దినమున తీర్పరిగా యుండుటకు అర్హత గలవాడు. మానవునిలో యేమున్నదో క్రీస్తు యెరుగును (యోహాను 2:24,25)

సమస్తమును చూచుచున్న ఆయన నేత్రములనుండి యేమియు దాచబడియుండలేదు (హెబ్రీ 4:13; సామె 15:3). ఆయన ఒకప్పుడు భూమిపై జీవించెను గనుక ఆయనకు జాలికూడ కలదు. పరిపూర్ణ న్యాయసత్యములను సమన్వయించి ఎంతవరకు దయచూపవలెనో అంతవరకు సంపూర్తిగా దయ చూపించును.

## D. ప్రతివాడు తన జీవితపు లెక్క అప్పగించును

మానవుని క్రియలు, మాటలు, తలంపులే తీర్పునకు ఆధారముగా యుండును. తీర్పులో ఒకని జీవితపు గ్రంథములు విప్పబడును. అతని క్రియలన్నియు బయలు పరచబడును. మరియు ప్రతివాడును తాను జరిగించిన వాటి నిమిత్తము లెక్క అప్పగించును (2కొరింథీ 5:10). "మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవు చున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును" (మత్తయి 16:27). ప్రతిక్రియయు విమర్శకు తేబడును రహస్యముగా దాచబడినవి మంచివేవి చెడ్డమేమి సమస్తమును బట్టబయలు చేయబడును "గూఢమైన ప్రతి యంశమును గూర్చి దేవుడు విమర్శచేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదేగాని చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:14). తీర్పు దినమున సమస్తము బయలు పరచబడును.

యేసు ఇంకా ఏమి చెప్పెనంటే : "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు" (మత్తయి 12:36,37). దేవుడు మనుష్యుని క్రియలను గూర్చియే గాక అతని మాటలను గూర్చి కూడ రికార్డు ఉంచుచున్నాడు (మలాకీ 3:16; ఎఫెసీ 4:29).

ఆ న్యాయాధిపతి బాహ్యక్రియలు, తలంపులనే గాక "అంధకార మందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృదయములలోని ఆలోచనలను బయలు పరచును" (1కొరింథీ 4:5). ఆయన మనుష్యుల రహస్యములను తీర్పులోనికి తెచ్చును (రోమా 2:16). అనేకులవలె ఈ లోకములో పాపమును అవినీతిని దాచిపెట్టుట సాధ్యమే కాని ఆ గొప్ప దినమందు సమస్తమును బయలుపరచబడును. మరియు అందరు వ్యక్తిగతముగా పరిగణించబడుదురు.

## E. వాక్యము మానవునికి తీర్పు తీర్చును

మానవులు దేవుని చట్టానుసారముగ తీర్పు తీర్చబడుదురు. ఈ సంగతిని యోహాను చూచిన తీర్పు దృశ్యమును బట్టియు (ప్రక 20:12), క్రీస్తు యొక్క మాటలను బట్టియు మనము తెలిసికొనవచ్చును: "నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). మానవుల ప్రమాణ పుస్తకములు, వేదాంతములను బట్టిగాక దేవుని నిత్య వాక్యములను బట్టి అందరికి తీర్పు జరుగును.

ప్రతివాడు యేసుక్రీస్తునందలి విశ్వాసమును విధేయత ద్వారా తన శక్తికొలది చూపించినట్లయిన, దానిని బట్టియే నిజానికి మానవుడు అంగీకరించబడును (హెబ్రీ 5:8,9 మత్తయి 7:21-27 ప్రక 22:12,14 మత్తయి 12:41,42; లూకా 10:12-14; 12:47,48; మత్తయి 25:15,35,45).

తీర్పులో ప్రతివాడు తన ఆత్మను గూర్చి దేవుడిచ్చిన తీర్పును అంటే నిత్య సంతోషమునో లేక నిత్యవేదననో వినును. అప్పుడు కొందరు ఆశీర్వదింపబడిన వారితో యుండుటకు పోవుదురు. ఆసమయమందు నీతిమంతులు, అనీతిమంతులు నిత్యము వేరుచేయబడుదురు. అప్పుడు ఇయ్యబడిన తీర్పు మరెన్నడు మార్చబడదు. తీర్పులో ప్రతివాడు యూదాను

గూర్చి చెప్పబడినట్టు తన చోటికి పోవును (అపొ.కా. 1:25). అతడు జీవించుచుండగా తన క్రియలనుబట్టియు, కోరికలనుబట్టియు తన చోటును నిశ్చయము చేసికొనియుండును. ఈ స్థానములో అతడు నిత్యము ఉండును. గనుక రక్షణ గాని లేక శిక్షగాని అందరికి ఒకే రోజున ఆఖరి దినమందు ఈయబడును (యోహాను 6:39,40; 12:48; గలతీ 6:7,8).

మత్తయి 25:31-46లో యేసు పలికిన మాటలలో ఈ దిగువ సంగతులు చెప్పబడెను: 1) తీర్పు జరుగు సమయము-క్రీస్తు రెండవ రాకడనాడు 2) తీర్పరి-క్రీస్తు 3) తీర్పుతీర్చబడువారు-సమస్త జనాంగములు 4) ఈయబడే తీర్పు-నిత్యజీవములోనికి గాని నిత్య శిక్షలోనికి గాని ప్రవేశము.

## 5. నీ దేవుని కలసికొనుటకు సిద్ధపడుము

పాపులారా, జీతమురోజు వచ్చుచున్నది. నీతిమంతులు ఎంత నిశ్చయముగా బహుమానము నొందుదురో అట్లే దుర్మార్గులు శిక్షింపబడుదురు. జనసమూహములతో కలసి నిత్యశిక్షలోనికి మళ్లించబడినప్పుడు పొందు ఎడబాటు బహు దుఃఖకరము. మరెన్నడు కలసికొనకుండగ అప్పుడు కుటుంబములు విడదీయబడును. అయితే యెవడును నశింపవలెనని దేవుడు కోరుటలేదు. అందరు మారుమనస్సు పొందవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయన కృపను బట్టి క్రీస్తు రక్తముద్వారా ప్రతిమానవుడు తన పాపక్షమాపణ పొందే అవకాశమును కలుగజేసియున్నాడు (ఎఫెసీ 2:8.9; మార్కు 16:16; అపొ.కా. 2:38). ఒకడు సువార్తకు లోబడుట ద్వారా క్రీస్తు రక్తము నుపయోగించుకొనిన యెడల అతని పాపములు క్షమించబడును. వాటిని గూర్చి తీర్పునాడు న్యాయాధిపతి లెక్క అడుగడు. "వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (హెబ్రీ 8:12).

అయితే సువార్తకు విధేయత చూపుటకు ఆలసించిన అపాయము కలదు (2థెస్స 1:7-9). ఇదియే రక్షణదినము. పౌలు ఫేలిక్సు యెదుటను. ద్రుసిల్ల యెదుటను బోధించినప్పుడు అతడు నీతిని గూర్చియు ఆశానిగ్రహమును గూర్చియు రాబోవు విమర్శను గూర్చియు ప్రసంగించెను. ఆ ప్రసంగము శక్తివంతముగా యుండెను గనుక గవర్నరయిన ఫేలిక్సు మిగుల భయపడెను గాని అతడు విధేయత చూపలేదు. “ఇప్పటికి వెళ్ళుము, నాకు సమయమైన నిన్ను పిలువ నంపింతునని” అతడు పౌలుతో చెప్పెను (అపొ.కా. 24:25). అయితే మరెన్నడు అతడు సత్యమును గూర్చి తన ఆత్మలో అట్లు కలవరపడ లేదు. మనకు తెలిసినంతమట్టుకు అతడు క్రీస్తును ఎన్నడుఅంగీకరించలేదు గాని అతడు జీవించిన రీతిగానే పాపపు బానిసగా మరణించెను. తనకు వీలుగాయున్న సమయము ఎన్నడు రాలేదు.

తీర్పును గూర్చిన ఆలోచన పాపనిరోధక శక్తివలె పనిచేయవలెను. అందరు ప్రతి పనిని, ప్రతి నిర్ణయమును, ప్రతి శోధనను, ప్రతి క్రియను, ప్రతి సంబంధమును ఆ యాఖరి లెక్కను బట్టి జరిగించవలెను. నిష్కళంకులు గాను, నిరపరాధులుగాను ఆయన దృష్టిలో అగుపడునట్లు అందరు జాగ్రత్త వహించవలెను. నమ్మకమైన క్రైస్తవునిగా యుండుటవలన మాత్రమే ఒకడు క్రీస్తు రాకడకొరకు ఎల్లప్పుడు సిద్ధపడి యుండగలడు. సిద్ధపడనివారు తీర్పునాడు దేవుని కలసికొనుటకు ఇప్పుడే సిద్ధపడవలెను.

“నిశ్చింతగల ఆత్మా, ఇదిగో ఈ హెచ్చరికను వినుము. నీ జీవితము త్వరలోనే అంతమగును నీ దేవుని ఎదుర్కొనుటకు సిద్ధపడని యెడల ఇదిగో తీర్పును ఎదుర్కొనుట ఎంతో దుఃఖకరము”.

✤

# 11. ద్రాక్షావల్లి మరియు తీగెలు

## (The Vine and the Branches)

అలంకార రీతిగా ఉపదేశించడం యేసుప్రభువుకు యిష్టమైన ఒక పద్ధతి. సామాన్య జీవితంలో యదార్ధతకు సమీపంగా యున్న ఈ వర్ణనల ద్వారా తన పాఠములు అర్ధమయ్యేలాగున ఆయన బోధించేవారు. అందువలన "సామాన్య జనులు ఆయన మాటలను సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37). అట్టి ఉపదేశములలో ఆయన అప్పగింప బడక ముందు ద్రాక్షావల్లి దాని తీగెలను గూర్చి చేసిన ఉపదేశ మొకటి. అది ఆత్మీయ సత్యమును బోధించుటకు ఉపదేశించబడినది.

"నేను నిజమైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలించవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసి పారవేయును. నేను మీతో చెప్పిన మాటలను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో ఆలాగే నాయందు నిలిచియుంటేనే గాని మీరును ఫలించరు. ద్రాక్షావల్లిని నేను తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో, నేను ఎవని యందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును. మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు అవి కాలిపోవును. నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు

అనుగ్రహింపబడును ఇందువలన మీరు నా శిష్యులగుదురు" (యోహాను 15:1-8).

యేసుప్రభువు చెప్పిన ఈ సుందర దృశ్యములో, తన శిష్యులతో ఆయనకున్న సంబంధము చక్కగా వర్ణించబడినది. ఈ ఉపమానా లంకారములో క్రీస్తు బోధించిన కొన్ని పాఠములను గమనించుము:

## ద్రాక్షావల్లి యజమాని దేవుడు

మొదటిగా, దేవుడు ద్రాక్షావల్లి యజమానుడై యున్నాడు. నేను నిజమైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు" అని క్రీస్తు చెప్పారు. జీవనాధారముగ దేవుడు క్రీస్తును ఈ లోకంలో నాటి, ఆయన ద్వారా తీగెలు దేవునితో సంబంధము కలిగి జీవము కలిగియుండునట్లు ఆయననొక్కని మాత్రమే ద్రాక్షావల్లిగా చేసాడు. పాతనిబంధన ప్రవచనమును నెరవేర్చిన మెస్సీయ యేసుక్రీస్తు గనుక ఆయన నిజమైన ద్రాక్షావల్లియై యున్నాడు. అందువలన దేవుని యొద్దకు వెళ్ళేమార్గము యేసుద్వారానే యున్నది. జీవముగల నిజమైన ద్రాక్షావల్లి ఆయన ఒక్కడు మాత్రమే.

ద్రాక్షావల్లి యొక్క యజమాని దానిని సరిచేసి కత్తిరించి సాగుచేస్తాడు. యజమానియు సాగుచేయువాడైన దేవుడు, తీగెలు బహుగా ఫలించాలని కోరుచున్నాడు. ఫలించు తీగెలు మరి ఎక్కువగా ఫలించునట్లు ఫలింపలేని తీగెలను ఆయన కోసి బయట పారవేయును. వాక్యము ద్వారా ఈ పరిశుభ్రత జరుగును (3వ వచనము).

## క్రీస్తుకును ఆయన శిష్యులకును మధ్య వ్యక్తిగత సంబంధమున్నది.

రెండవదిగా, ద్రాక్షావల్లికి తీగెలకు ఉన్న సంబంధము క్రీస్తుకు ఆయన

శిష్యులకు ఉన్న సంబంధము ఒక్కటే. ప్రకృతి ప్రపంచములో తీగెకు ద్రాక్షావల్లి యెట్టిదో, ప్రతి మనుష్యునికి క్రీస్తు అట్టివాడు. తీగెలకు ద్రాక్షావల్లి ఆహారము సరఫరా చేయును. తండ్రితో ఏకమైన యేసు సమస్త జీవానికి ఆధారభూతుడు. ఆయన శిష్యులు పరిశుద్ధ ఫలము ఫలించునట్లు ఆయన సహాయము చేయును. ఒండొరుల సంబంధములో ద్రాక్షావల్లి తీగెలు ప్రముఖ ఏకత్వము కలిగియున్నవి.తీగెలు ద్రాక్షావల్లి నుండి జీవమును పొందుచు తండ్రితో ఏకమైయున్నారు.

పండ్లు ద్రాక్షావల్లికి గాక ఎల్లప్పుడు తీగెలపైనే కాయును. అట్లే ద్రాక్షావల్లికి వేరై తీగెలు ఎన్నడు పండ్లు కాయవు. తీగెలు లెకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించదు. ద్రాక్షావల్లి లేకుండా తీగెలు బ్రతుకవు. అట్టి పరస్పర సంబంధమే క్రీస్తుకు ఆయన అనుచరులకు మధ్య ఉన్నది. అందువలన “నేను ద్రాక్షావల్లిని మీరు నా తీగెలు” అని క్రీస్తు చెప్పారు.

క్రీస్తుద్రాక్షావల్లి అయియున్నారు. వ్యక్తిగత క్రైస్తవులు తీగెలు. ద్రాక్షావల్లి తీగెలకున్నట్టి సంబంధమువలె క్రీస్తు శిష్యులకు క్రీస్తుకు మధ్య సంబంధమున్నది.

## తీగెలు శిష్యులుగాని మతశాఖలు కాదు

మూడవదిగా, ఆయా డినామినేషన్లు సంఘముయొక్క శాఖలు కాదు. నేటిలోకములో యున్న ఆయా మతశాఖలన్నియు ద్రాక్షావల్లి యొక్క తీగెలని, అవన్నియు కలిసి నిజమైన సంఘమగునని కొందరి భావన. అయితే “నేను నిజమైన ద్రాక్షావల్లిని, డినామినేషన్లన్నియు తీగెలని” క్రీస్తు చెప్పలేదు. “ద్రాక్షావల్లిని నేను, మీరు తీగెలని” ఆయన చెప్పారు. తీగెలను మాట వివిధ మతశాఖలకు వర్తించదనుటకు కనీసం మూడు కారణాలున్నాయి:

మొదటిగా ద్రాక్షావల్లిని నేను అని యేసు చెప్పుసరికి నేడున్న

మతశాఖలలో యేదియు లేదు. క్రీస్తు తరువాత కొన్ని వందల సంవత్సరముల వరకు మతశాఖల తత్వము ఆరంభం కాలేదు. తీగెలు లేకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించి జీవము కలిగియుండలేదు. కొందరను కొనుచున్నట్లుగా మతశాఖలు గనుక తీగలైతే అవి ఉద్భవించిన కొన్ని శతాబ్దముల వరకు సంఘము తీగలు లేనిదై ఫలహీనమైనదై నిర్జీవము అయిన సంస్థవలె యున్నదన్నమాట! అయితే తీగెలను గూర్చి చెప్పినప్పుడు అవి మతశాఖలని క్రీస్తు యొక్క ఉద్దేశము కాదనునది విధితమే.

రెండవదిగా, ఒకే ద్రాక్షావల్లి నుండి వందలకొలది. వేలకొలది తీగెలు వచ్చి. ఆఒక్కొక్క తీగెమీద వేర్వేరు ఫలములు ఫలించుట ప్రకృతి విరుద్ధము. అమెరికాలోనే 250 కంటే ఎక్కువ డినామినేషన్లున్నవి. ద్రాక్షావల్లి యొక్క ఒక తీగె గుమ్మడికాయలు, మరొకటి దోసకాయలు, ఇంకొకటి ద్రాక్షాపండ్లుకాయునా ? అట్టిది ప్రకృతి విరుద్ధము కాదా? అయితే ప్రకృతిలో ద్రాక్షావల్లి యొక్క ప్రతితీగెలు వివిధ ఫలములను ఫలించును. అయినను ద్రాక్షావల్లి యొక్క తీగెలు వివిధ ఫలములను ఫలించునని అంగీకరించని ప్రజలు నిజద్రాక్షావల్లియైన క్రీస్తులో యున్న ప్రతి తీగె ఒక డినామినేషనని చెప్పే వింత వర్ణనను అంగీకరిస్తారు. మతశాఖల తత్వాన్ని సమర్ధించుటకు బైబిలులో ఎవనికి యేమి దొరుకదు. దేవుని దృష్టిలో చీలికలు పాపము ఆదిమ సంఘము ఏకత్వము కలిగిన విశ్వాసుల సమాజము (యెహాను 17:20, 23; 1కొరింథీ 1:10-13; 12:12-27; ఎఫెసీ 1:22, 23; 4:3,6). అపొస్తలుల కాలములో క్రైస్తవులు నేడున్న మతశాఖలలో దేనిలోను సభ్యులుకారు. వారు కేవలము ప్రభువు సంఘుసభ్యులు. అందువలన అపొస్తలుడెవడును సంఘము యొక్క 'ఏశాఖను' సంబోధించలేదు.

మూడవదిగా, వివిధ డినామినేషన్ల తీగెలని క్రీస్తు వర్తింపజేయలేదు.

ఏలయనగా ఆయన వ్యక్తిగత నామవాచకమగు 'మీరు' అను మాటలను వినియోగించారు. "ద్రాక్షావల్లిని నేను తీగెలు మీరు" అని ఆయన చెప్పారు. మరల ఎవడైనను (ఏ మనుష్యుడైనను) నాయందు నిలిచి యుండని యెడల వాడు (ఆమనుష్యుడు) అని ఆయన చెప్పారు. ద్రాక్షావల్లి నుండి వచ్చిన తీగెలన్నియు ఆయన శిష్యులని యేసు పలికారు. క్రీస్తు యొక్క శిష్యులు 'సంఘశాఖ' యొక్క సభ్యులు కారు. ప్రజలే క్రీస్తుయొక్క తీగెలు లేక కొమ్మలు.

"నేను ఫలాన మతశాఖలో సభ్యుడనని" కొందరు చెబుతారు. "నాలో నిలిచియుండుడి" యని క్రీస్తు చెప్పారు. డినామినేషన్లులలో సభ్యులు కాకుండా మొదటి శతాబ్ధములో ప్రజలు క్రీస్తు సంఘ సభ్యులుగా ఉండగలిగిన యెడల, అప్పుడది సరియైతే ఇప్పుడెందుకు సరికాదు? ఈనాడు ప్రజలు క్రొత్త నిబంధనను విశ్వసించి విధేయత చూపిన యెడల అది వారిని క్రైస్తవులుగాను క్రీస్తు శరీరములో సభ్యులుగాను మాత్రమే తయారు చేయును. క్షేమకరమైన మార్గదర్శిగా క్రొత్త నిబంధన యుండగా, తాను క్రైస్తవుడను, క్రైస్తవుడనుగా మాత్రమే యుందునని మానవుడు నిశ్చయించు కొనవలెను. అతడు ఏ డినామినేషన్‌కు చెందకుండా సత్యాన్నంతటిని విశ్వసించి విధేయతచూపగలడు. అతడు అప్పుడు ఏడినామినేషన్‌కు చెందకుండా రక్షింపబడి పరలోకమునకు వెళ్ళగలడు.

## ఫలించాలంటే క్రీస్తులో యుండాలి

ఒకడు ఫలములు ఫలించాలంటే క్రీస్తుతో ప్రాముఖ్యమైన సంబంధం కలిగి యుండాలి. తీగెయొక్క ఫలించుశక్తి ద్రాక్షావల్లితో దానికి గల సజీవ సంబంధము పై ఆధారపడి యుంటాది. అందువలన, "నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును" అని క్రీస్తు

చెప్పారు. మరల, “నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు” అని ఆయన చెప్పారు. మనము ధ్యానించుచున్న వాక్యభాగములో క్రీస్తు “నాలో” అను మాటను 6 సార్లు వినియోగించారు.

మానవుడు క్రీస్తులో నున్నప్పుడే దేవుని కొరకు ఫలములు ఫలిస్తాడు . ఒకడు నైతికంగా ఎంతటి పవిత్రుడైననూ క్రీస్తు నుండి వేరై రక్షణ పొందలేడు.

క్రీస్తులో ఏకము కాకముందు కొర్నేలి నైతికంగా మంచివాడే గానీ అతడు రక్షింనబడలేదు(అపో.కా. 10:1–3; 11:14) రక్షణ క్రీస్తులో ఉన్నది. గనుక క్రీస్తుకు వెలుపల ఆత్మీయ జీవములేదు (2తిమో 2:10). “మరి ఎవని వలనను రక్షణ కలుగదు” అని పేతురు చెప్పాడు (అపో. 4:12). కుమారునిలో జీవమున్నది (1యోహాను 5:11–12). “నేనే మార్గమును, సత్యమును జీవమును, నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు” అని క్రీస్తు చెప్పారు (యోహాను 14:6).

క్రైస్తవులు కానివారు క్రీస్తుకు వెలుపల యుండి క్షేమముగానే యున్నామను కొనుచూ మోసపోవుచున్నారు. ద్రాక్షావల్లినుండి వేరైన తీగెఫలములను ఫలించలేదు. క్రీస్తుతో సత్సంబంధము కలిగినవారే ఫలములు ఫలించగలరు.అట్లయితే ఒకడు క్రీస్తులోనికెట్లు ప్రవేశిస్తాడు? పౌలు దానికి జవాబిచ్చాడు: “క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలోనుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి” (రోమా 6:4). మరల, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని

యున్నారు" (గలతీ 3:27).

పైవచనమును బట్టి ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందేవరకూ యోగ్యమైన ఫలములు ఫలించలేడని గ్రాహ్యమగుచున్నది. ఒకడు క్రీస్తులోనైనా వుంటాడు. లేదా ఆయనకు వెలుపలనైనా వుంటాడు. మానవులను క్రీస్తులోనికి తెచ్చుటకు బాప్తిస్మము దేవుడు నిర్ణయించిన మార్గము.

క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుట అని బైబిలు బోధించుచున్నది. సంఘమను శరీరమునకు క్రీస్తు శిరస్సై యున్నాడని పౌలు చెప్పాడు (కొలస్స 1:18). సంఘమను శరీరము (ఎఫెసీ 1:23). గనుక క్రీస్తులో నుండుట యనగా ఆయన శరీరమయిన సంఘములో నుండుటయే. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు అతడు గత పాపములనుండి రక్షింపబడి ప్రభువుచే సంఘముతో చేర్చబడతాడు (అపొ.కా. 2:47). ఒకడు క్రీస్తులోను, ఆయన సంఘములోను యున్నాడనుటలో అతడొక డినామినేషన్‌లో యున్నాడనుట కాదు. సంఘము రక్షింపబడిన దేవుని కుటుంబము.

క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటతో సమానము గనుకను, ఫలించాలంటే ఒకడు క్రీస్తులో యుండాలి గనుకను, క్రీస్తు సంఘములో లేనివాడు దేవుని మహిమ కొరకు ఫలములు ఫలించలేడు (ఎఫెసీ 3:21).

## ఫలిస్తూ యుండాలంటే క్రీస్తులో నిలిచియుండాలి

జీవముకొరకు, ఫలించుట కొరకు శిష్యుడు క్రీస్తులో నిలిచియుండాలి. నాయందు మీరును, మీయందు నామాటలును నిలిచియుండాలని క్రీస్తు చెప్పారు. క్రీస్తులోనికి ప్రవేశించుట మాత్రము

కాదు గాని ఆయనలో నిలిచియుండాలి కూడా. "ఎవడు నాయందు నిలిచియుండునో, నేను ఎవని యందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును". ఆయనలో నిలిచియుండకపోతే, ఫలహీనత, పారవేయబడుట సంభవించును. "నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును" (యోహాను 15:2).

తీగెయొక్క ప్రయోజనం ఫలించడం. ఫలింపని తీగె నరికి వేయబడును. తీగెకును ద్రాక్షావల్లికిని యున్న సంబంధమే క్రీస్తుకును, క్రైస్తవునికి ఉన్నందున, క్రీస్తునందున్నవాడు ఫలించని యెడల అతడు పారవేయబడును. "ఎవడైననూ నాయందు నిలిచియుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును, మనుష్యులు అట్టివాటిని ప్రోగుచేసి అగ్నిలో పారవేతురు. అవి కాలిపోవును, మనుష్యులు అట్టివాటిని ప్రోగుచేసి అగ్నిలో పారవేతురు. అవి కాలిపోవును". గనుక ద్రాక్షావల్లిలో యున్న తీగెపారవేయబడును. ఫలింపని తీగె బయట పారవేయబడి యెండిపోగలదు.

ఫలింపని తీగెలు ఎట్లు పారవేయబడి, ఎండిపోయి కాల్చబడునో అట్లే క్రీస్తునుండి వేరుచేయబడిన వారి గతి యుండును. కాలాంతమందు క్రీస్తు "తన దూతలను పంపును వారాయన రాజ్యములో నుండి ఆటంకము లగు సకలమైన వాటిని దుర్నీతి పరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లుకొరుకుటయు ఉండును" (మత్తయి 13:41,42).

మార్పునొంది, దేవుని బిడ్డయైన వాడు నిత్యము నాశనము కావచ్చు నని దీనియర్థము. క్రైస్తవుడైనవాడు పతనము కాలేడని వాదించేవారు, అతడెన్నడు ద్రాక్షావల్లిలో లేడని అంగీకరించాలి. క్రైస్తవులు క్రీస్తులో నిలిచియుండాలని బోధించు నిమిత్తము పౌలు ఇశ్రాయేలీయుల నుండి

మంచి పాఠాన్ని ఉపదేశించాడు. "దేవుడు స్వాభావికమైన కొమ్మలను విడిచిపెట్టని యెడల నిన్నును విడిచిపెట్టడు. కాబట్టి దేవుని అనుగ్రహ మును, కాఠిన్యమును అనగా పడిపోయిన వారిమీద కాఠిన్యమును నీవు అనుగ్రహప్రాప్తుడవై నిలిచి యున్న యెడల నీ మీదనున్న దేవుని అనుగ్రహము చూడుము. అట్లు నిలువని యెడల నీవును నరికి వేయబడుదువు" (రోమా 11:21,22).

క్రైస్తవుడు పడిపోయి చివరకు నిత్యనాశనము కాగలడని లేఖనములు బోధించుచున్నవి. వీటిలో కొన్నిటిని గమనించుము. క్రీస్తులోనుండి బొత్తిగా వేరైపోయి కృపలోనుండి తొలగిపోయిన వారిని గూర్చి పౌలు ఈలాగు చెప్పాడు: "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి వేరు చేయబడియున్నారు. కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4). తనను గూర్చి చెప్పుకొనుచు, ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేను భ్రష్టుడనైపోదునేమో అని నాశరీరమును పగలగొట్టి దానిని లోపరచుకొనుచున్నాను" అని పౌలు చెప్పాడు (1కొరింథీ 9:27). అంతేకాదు, పౌలు మిగిలిన క్రైస్తవులను కూడ వారు పడిపోకుండునట్లు హెచ్చరించాడు: "తాను నిలుచుచున్నానని తలంచుకొను వాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1కొరింథీ 10:12). ఒకడు పడిపోయే ప్రమాదము లేకపోతే ఈ హెచ్చరిక ఎందుకు?

క్రైస్తవులు దూతలకంటే భద్రముగా యున్నారా? దేవదూతలు పాపము చేసారని పేతురు చెప్పాడు : "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళలోకమందలి కటిక చీకటిగల బిలము లోనికి త్రోసి తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2పేతురు 2:4). లవొదికయ సంఘముతో నులివెచ్చగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను" అని ప్రభువు చెప్పారు (ప్రకటన 3:16). మరల, "జయించువాడు ఆలాగున తెల్లని

వస్త్రములు ధరించుకొనును జీవ గ్రంథములోనుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక.... అతని పేరు ఒప్పుకొందునని" ప్రభువు చెప్పుచున్నారు (ప్రకట 3:5). ఒకని పేరు జీవగ్రంథములో ఎన్నడు లేకపోతే అది తుడుపు పెట్టబడదు. ఒకడు గత పాపములనుండి రక్షింపబడకపోతే అతని పేరు జీవగ్రంథములో ప్రవేశించదు. రక్షింపబడని వాని పేరు ఆ గ్రంథములో ఎన్నడు ఉండదు. అయితే జయించని వారిపేర్లు ఆ గ్రంథమునుండి తుడుపు పెట్టబడునని ప్రభువు చెప్పుచున్నారు. అట్టివారు తీర్పులో నిత్యనాశన మొందుదురు. "ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రక 20:15). "యెవడు నా యెదుట పాపము చేసెనో వాని నా గ్రంథములో నుండి తుడిచి వేయుదునని " యెహోవా దేవుడు మోషేతో అన్నారు (నిర్గమ 32:33).

విశ్వాసి యైనవాడు విశ్వాస భ్రష్టుడు కాగలడని (1తిమోతి 4:1), విశ్వాస విషయమై ఓడ బద్దలైనవానివలె కాగలడని (1తిమోతి 1:19), విశ్వాసము చెరుపుకోగలడని లేఖనములు బోధించుచున్నవి (2తిమో 2:18). అందువలననే మరణ పర్యంతము నమ్మకముగా యుండుము నేను నీకు జీవకిరీట మిచ్చెదనని " బైబిలు చెప్పుచున్నది (ప్రకట 2:10).

## క్రీస్తులో నిలిచియుండాలంటే విధేయత అవుసరం

ఆత్మీయ ద్రాక్షావల్లి యగు క్రీస్తులో విధేయత చూపిస్తూ యుంటే గాని ఎవడును నిలిచియుండలేడు. "నాయందు మీరును, మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి అది మీకు అనుగ్రహింపబడునని" యేసు చెప్పారు (యోహాను 15:7). గనుక క్రీస్తు యొక్క మాటలకు లోబడుట ద్వారా ఒకడు, క్రీస్తులో నిలిచియుండును. నమ్మకమైన విధేయత వలన ఒకడు క్రీస్తులో

నిలిచియుండును. "నేను నా తండ్రి ఆజ్ఞలుగైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలను గైకొనిన యెడల నా ప్రేమయందు నిలిచియుందురు" అని యేసు చెప్పారు (యోహాను 19:10). "... కృపాసహితముగా మీ హృదయములలో దేవునని గూర్చి గానము చేయుచు సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" యని పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (కొలస్స 3:16).

ఒకడు క్రీస్తులో నిలిచియుంటేనే అతని ప్రార్ధనలంగీకరించబడును. ఎవనిలో దేవుని వాక్యము నివసిస్తూ యుంటాదో అతని ప్రార్థనలకు జవాబు దొరుకును (యాకో 5:16). "మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయనదృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (1యోహాను 3:22). గాని "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొనువాని ప్రార్ధన హేయము" (సామె 28:9). "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్ధనల వైపునకు  ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా ఉన్నది" (1పేతురు 3:12).

## ఫలదాయకమైన జీవితము వలన దేవుడు మహిమపరచబడును

క్రైస్తవులందరు ఫలములను ఫలించుటవలన దేవుని మహిమ పర్చుదురు. "మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమ పరచబడునని" యేసు అన్నారు (యోహా 15:8). తన బిడ్డలు ఆత్మీయ ఫలములను ఫలించాలి అపో.పౌలు ఇట్లు చెప్పారు  "ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము  ఇట్టివాటికి విరోధమైన నియమము ఏదియు లేదు" (గలతీ 5:22,23). క్రైస్తవులు

నమ్మకముగాను, ఆసక్తిపరులు గాను వినయులు గాను, ప్రతిష్టించుకొనిన వారుగాను, విధేయత చూపుచు ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులై యుండాలి (1కొరింథీ 15:18).

## సంగ్రహము

యోహాను 15:1-8లో చెప్పబడిన సుందర దృశ్యము క్రీస్తుకును ఆయన శిష్యులకును ఉన్న అత్యంత సన్నిహిత సంబంధమును చూపుచున్నది. దానిలో ఏడు పాఠములు గమనించుము :

1. దేవుడు ద్రాక్షావల్లి యజమాని.
2. ద్రాక్షావల్లి దాని తీగెలకు ఉన్న సంబంధము యెట్టిదో క్రీస్తుకు ఆయన శిష్యులకు ఉన్న సంబంధము అట్టిది.
3. ఆయా డినామినేషన్లు సంఘము యొక్క శాఖలు కావు.
4. ఎవడైనను ఫలములు ఫలించాలంటే క్రీస్తుతో ప్రాముఖ్యమైన సంబంధమును కలిగియుండాలి.
5. జీవము కొరకు ఫలము కొరకు శిష్యుడు క్రీస్తులోనే యుండాలి.
6. విధేయత చూపుచు యుంటేనేగాని ఎవడును క్రీస్తులో నిలచి యుండలేడు,మరియు
7. ఫలములు ఫలించుట ద్వారా క్రైస్తవులు దేవుని మహిమపరతురు. నమ్మకమైన క్రైస్తవునిగా యుండుటకంటే శ్రేష్టమైన ఆనందాయకమైన , సంపూర్ణమైన జీవితం మరొకటి లేదు.

✤

# 12. బైబిలు దేవునినుండి కలిగినదా లేక మానవుల నుండి కలిగినదా ?

## (Is the Bible from God or Men?)

క్రైస్తవ్యమును గూర్చిన రెండు ప్రాధమిక ప్రశ్నలేవనగా (1) విశ్వమును, మానవుని సృజించిన నిత్యుడగు దేవుడున్నాడా? (2) బైబిలు దేవునినుండి కలిగినదా? బైబిలు యొక్క ప్రారంభాన్ని గూర్చిన ప్రశ్నను పరిశీలించుటయే ఈ ఉపన్యాసము యొక్క ఉద్దేశ్యము.

బైబిలు ఎక్కడనుండి వచ్చెను? ఈ ప్రశ్నకు రెండే సమాధానా లున్నాయి. క్రైస్తవులు విశ్వసించిన విధంగా అది మానవుల నుండి కలిగియుండాలి. బైబిలు ప్రేరణ లేని మానవ జ్ఞానముయొక్క ఫలితమా? లేక దైవావేశమా? మనం లేఖనములు దేవుని బయలుపాటు అనే విశ్వాసాన్ని కలిగియున్నామా? లేక బైబిలు మానవులనుండి కలిగిన ఒక గ్రంథమనే అభిప్రాయాన్ని కలిగియున్నామా? మతప్రపంచం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ప్రశ్నయిది.

### బైబిలు చెప్పుచున్న మాట

బైబిలు దేవునినుండి కలిగినదని చెప్పుచున్నది. ఈ మాట నిజమా? కాదా? పౌలు ఇట్లు వ్రాసెను: “దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము” (2తిమోతి 3:16). అంటే “దేవుడు మాటలాడెను” “దేవుని శ్వాసనుండి వెలువడెను” అని అర్థము. బైబిలునందలి భాగములన్నియు పూర్తిగా దైవావేశము వలన కలిగినవని ఇది స్పష్టముగ తెలియజేయుచున్నది. పాతనిబంధనలో ప్రవక్తలు చెప్పిన మాటలను అపొస్తలుడైన పేతురు తిరిగి

చెప్పుచూ “ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపడినవారై దేవుని మూలముగ పలికిరి” (2పేతురు 1:21). క్రొత్తనిబంధన లేఖకులు ఆలాగే దైవావేశమును కలిగియుండిరి. ఆత్మమూలముగా పరిశుద్ధులకు అపొస్తలులకును, ప్రవక్తలకును సత్యము బయలుపరచబడెను.

దేవుని ద్వారా బైబిలు కలిగియున్నట్లయితే ఆ పవిత్ర గ్రంధము ద్వారా ఆయన ఈ విషయాన్ని మనకు తెలియజేయును. దేవుడున్నట్లయితే, ఆయన మన తండ్రియైతే ఆయన తన పిల్లలతో మాటలాడును. భూసంబంధమైన ఒక తండ్రి తన గృహానికి దూరంగాయున్న తన కుమారునితో మాటలాడలేడు. అతడు మాటలాడగలిగినప్పుడు అతనితో సంభాషించగలడా? బైబిలునందు సుమారు వెయ్యిమారులు ఈ మాటలు మనం కనుగొనగలము. ప్రభువు ఈలాగు సెలవిచ్చెను: “యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను”. “ప్రభువు నాకీలాగు సెలవిచ్చెను”. ఉదాహరణకు చూడండి 2సమూ 23:2; యిర్మియా 1:4-9; మత్తయి 1:22; 2:25; అపొ.కా. 1:16. బైబిలు బోధించుచున్నప్పుడు మనకర్థమగును. అది ఇచ్చే సాక్ష్యాన్ని స్పష్టమైన ఆధారము లేకుండ నమ్మశక్యము కానిదని తిరస్కరించకూడదు. మనము బైబిలు దైవావేశము వలన కలిగినదని ఎట్లు గ్రహించగలము?

బైబిలు గ్రంధమందు, వెలుపల అది దైవసంబంధమైన ప్రారంభాన్ని కలిగియున్నదనుటకు అనేక ఆధారాలున్నాయి. అది దేవుని వలన కలిగినదని చెప్పే అనేక సంగతులను అది కలిగియున్నది. అది దైవావేశము వలన కలిగినదనుటకు దోషములేని ఆధారము కలదు. దేవుడు మనతో మాటలాడిన అనేకములైన, సమృద్ధియైన ఆధారములు కలవు (హెబ్రీ 1:1-2). లేఖనముల యొక్క దైవ సంబంధమైన ప్రారంభాన్ని తెలియజేసే కొన్ని ఆధారములను ఇప్పుడు పరిశీలిద్దాం.

## బైబిలునందలి ఆధారములు

బైబిలు దైవావేశమువలన కలిగినది, ఇది దోషరహితమైనది. క్రైస్తవ్యము యొక్క సత్యములను గూర్చి అపొస్తలుడైన పౌలు మాటాలాడుచూ "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలు పరచియున్నాడు. మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" (1కొరింథీ 2:10–13). ఒకమాట అంటే ఒకని మనస్సులోని తలంపును మరొకనికి అందించే సమాచారము. దైవావేశమువలన కలిగిన మాటల ద్వారా ఆయన మనస్సునందలి తలంపులు మానవులకు అందించుచున్నాడు. ఈ మాటలద్వారా ఆయన తన చిత్తాన్ని బయలుపరచెను. లేఖకులు వ్రాసిన సంగతులు వారి స్వంత మాటలు కాదు కాని అవి దేవుని యొక్క మాటలు. లేఖనముల యందున్న మాటలు దైవసంబంధమైన మాటలయినప్పటికిని మానవులైన లేఖకులే వాటిని వ్రాసిరి. అందుచేత పరిశుద్ధాత్మ నడిపింపుద్వారా మానవులు వాటిని వ్రాయుటవలన బైబిలు దైవావేశము వలన కలిగినది.

"దేవుని శ్వాసనుండి వెలువడెను" అంటే అది దోషరహితమైనది. ఎందుకనగా దేవుడు అబద్ధమాడజాలని వాడు (హెబ్రీ 6:18). దావీదు ద్వారా ప్రభువు చెప్పిన దేమనగా దేవుని వాక్యము "స్వచ్ఛమైనది" (కీర్త 19:8; 119:140). దీనికి అర్ధమేమనగా యధార్థామైనది. దావీదు ఇట్లు వ్రాసెను : "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యధార్ధమైనది "నీవు నియమించిన నాయ్యవిధులన్నియు నిత్యము నిలుచును" (కీర్త 199:160; 19:7). దేవుడు మానవునికి సంపూర్ణమైన, యధార్ధమైన గ్రంథాన్ని యిచ్చెను. అది దోషరహితమైనది. లేఖకులు సత్యమును చూపించి

దానియొక్క దైవసంబంధమైన ప్రారంభాన్ని నిరూపించిరి. దైవజనులు ప్రభువు దేనినైతే వ్రాయమని వారిని కోరెనో ఆ దేవుని చట్టమైయున్న సత్యమును వ్రాసిరి (కీర్తన 119:142; యోహా 17:17). బైబిలు దానిని గూర్చి అదిచెప్పే సమాచారము సరిగా లేకపోయిన యెడల అది యితర అంశాలను గూర్చి చెప్పే విషయాలను ఎట్లు మనము నమ్మి గ్రహించగలము? బైబిలు నమ్మశక్యము కానిదయినట్లయితే మన క్రైస్తవ విశ్వాసము సత్యముపై ఆధారపడినది కాదు. దానినుండి మనకెట్టి ఆదరణ లభించదు. కాని బైబిలు దైవావేశము వలన కలిగి నమ్మదగిన దేవుని వాక్యమైతే మనము దాని బోధలను వినునప్పుడు దేవుని మాటనే గాని మానవుని మాటను వినుటలేదు.

బైబిలు 66 పుస్తకములు కలిగిన ఒకే గ్రంథము. ఈ గ్రంథము చుట్టూ ఐక్యత అనే బంగారు తీగ చుట్టబడి యున్నది. బైబిలు ఎవరిద్వారా వ్రాయబడినదో ఆ యూదులు వాఙ్మయమునందు గాని విజ్ఞాన శాస్త్రము నందు గాని ప్రవీణులు కారు. కొందరు జాలరులు, సుంకరులు, గొఱ్ఱెల కాపరులు మిగిలినవారు వారు తాము నివసించు చోటుకే పరిమితమైన వారు. అయితే "విద్యలేని పామరులు" (అ.కా. 4:13). ప్రపంచానికి నిర్దోషమైన, సంపూర్ణఐక్యత కలిగిన గ్రంథాన్ని అందించిరి. వేర్వేరు ప్రదేశాలలో నివసించి, ఒకరికొకరు సంబంధములేని స్థితిలో వ్రాసిన వ్రాతలు ఒకచోటుకు చేర్చినప్పుడు అందు ఎట్టి వ్యత్యాసము గాని, తప్పిదము గాని కనబడలేదు. దైవసంబంధమైన ప్రారంభము బైబిలు కలిగియున్నదనుటకు యిది ఖచ్చితమైన ఋజువు. ఒకగొప్ప మనస్సు వారందరిని నడిపించెను, లేనియెడల వేర్వేరు అలవాట్లు, భాషలు కలిగిన 40 మంది మనుష్యులు 16 శతాబ్దాల కాలంలో మోషే అనే మొదటి లేఖకుడు మొదలుకొని, యోహాను అను ఆఖరి లేఖకుని వరకు దైవశక్తి లేకుండ ఇట్టి గ్రంథాన్ని ఎట్లు వ్రాయగలిగిరి?

బైబిలు యొక్క శత్రువులు 'మైక్రోస్కోపు' ఉపయోగించునట్లు నిశితముగా అందలి దోషముల కొరకు దానిని పరిశోధించిరి. కొన్ని పరస్పర విరుద్ధంగా కనబడే సంఘటనలు పోగుచేసిరి గాని వాటిని ఋజువు చేయలేక పోయిరి . మానవులు వ్రాసిన గ్రంధాలవలె కాక బైబిలునందలి ప్రతి మాట ఖచ్చితముగా నమ్మదగినది. బైబిలు పూర్తిగా దేవుని వాక్యము. ప్రపంచమందలి అనేక మత గ్రంధాలకు వేరుగా అది దైవసంబంధమైన గ్రంధకర్తను కలిగియున్నది. ఈ విషయాలను బట్టి మేము మావిశ్వాసాన్ని ఈ గ్రంధముపై నుంచి అది దైవావేశము వలన కలిగిన, దోషరహితమైన దేవుని వాక్యమని నమ్ముచున్నాము .

## నెరవేరిన ప్రవచనములు

నెరవేరిన ప్రవచనములు, వాటిని గూర్చిన శక్తివంతమైన ఋజువులను పరిశీలిద్దాం. నెరవేరిన ప్రవచనాలు వాస్తవాలై దేవునియొక్క సర్వజ్ఞానాన్ని తెలియజేయుచున్నవి. ప్రవచనమనగా ముందుగా వ్రాయబడిన చరిత్ర తప్ప మరొకటి కాదు. ఆయా వ్యక్తులను గూర్చి, దేశాలను గూర్చి ఆత్మావేశము ద్వారా అవి సంభవించకముందే ప్రవక్తలు చెప్పిన సంగతులు మనము చూచినప్పుడు బైబిలు దేవుని నుండి కలిగినదను వాస్తవాన్ని విస్మరించలేము. కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

క్రీస్తు రాకడను గూర్చి ప్రవచనాలు ముఖ్యముగా పాతనిబంధనలో రక్షకుని గురించి 330 ప్రవచనాలు ఆయన భూమిమీద నివసించుటను గూర్చి వ్రాయబడినవి నెరవేరెను. ఆయన కన్యక గర్భమందు జన్మించవలెను (యెష7:14). అబ్రహాము సంతానము (ఆది. 12:2; గలతీ 3:16). యూదా వంశము (ఆది.49:10; హెబ్రీ 7:14). దావీదు గోత్రము (2సమూ 7:13-16) ఆయన జన్మస్థలము యూదయ బేత్లెహేము (మీకా 5:2). ఆయన జీవితంలోని సంఘటనలు, ఆయన వ్యక్తి గత పరచర్య

యథార్థముగా ప్రవచింపబడెను. ఆయన 30 వెండి నాణెములకు అప్పగింపబడును (జెకర్యా 11:12) అని ప్రవచింపబడెను. ఆయన మరణ సమయములో ఆయన చేతులును , పాదములను పొడవబడును (కీర్త 22:16). ధనవంతుని యొద్ద ఆయన సమాధి చేయబడును (యోష53:9). ఆయన మరణములో నుండి సజీవుడై పరలోకమునకు కొనిపోబడును (కీర్తన 16:10; దాని 7:13-14). ఆ నాలుగవ రాజుల కాలములో ఆయన రాజ్యమును స్థాపించును (దాని 2:44). ఈ ప్రవచనములు ఇంకా అనేకమైనవి క్రీస్తు పుట్టక అనేక సంవత్సరాల ముందు ప్రవచింపబడి క్రొత్త నిబంధనలో లిఖించబడిన విధముగా నెరవేర్చబడెను.

మోషే తనను గూర్చి వ్రాసిన ప్రవచనములన్నియు నెరవేరినవని యేసు చెప్పెను (యోహా 5:39; లూకా 24:44-49). ఆయన లేఖనాలను గూర్చి మాటలాడుచూ “లేఖనము నిరర్ధకము కానేరదు గదా” అని చెప్పెను (యోహా 10:35). సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలులు వారి బోధయందు ఆ విషయాన్ని తెలియజేసి యేసే క్రీస్తని పాతనిబంధన యందలి ప్రవచనాల ఆధారంగా ఋజువుచేసిరి (అపొ.కా. 13:23-37). అవి నెరవేరక కొన్ని శతాబ్దాల యుందు చేయబడిన వివిధములైన ప్రవచనములు, భవిష్యత్ సంఘటనలను గూర్చి దైవ సంబంధమైన జ్ఞానము ద్వారా కాకుండ ముందుగా ఎట్లు చెప్పగలిగిరి?

యూదా జనాంగము యొక్క పతనాన్ని గూర్చి ద్వితీయోపదేశ కాండము 28వ అధ్యాయమునందు మోషే ప్రవచించెను. ఆసక్తికరమైన ప్రవచనము వ్రాయబడినది. “యెహోవా దూరమై యున్న భూదిగంతముల నుండి ఒక జనమును, అనగా నీకు రాని భాష కలిగిన జననమును క్రూర ముఖము కలిగి వృద్ధులను, యౌవనస్థులను కటాక్షింపని జనమును గద్ధఎగిరి వచ్చునట్లు నీ మీదికి రప్పించును”. ఇక్కడ క్రొత్త భాష మోషే ఉపయోగించెను. వారు యెరూషలేము గోడలు పడద్రోయబడువరకు

ముట్టడించుదురు. ఈ ముట్టడివలన ప్రజలు భయంకరమైన బాధ నొందుదురు. మృదుత్వము చేతను నేలమీద తన అరకాలు మోప తెగింపని స్త్రీ తన కాళ్ళ మధ్యనుండి పడుమావిని, తాను కనబోవు పిల్లలను తాను రహస్యముగా తినును. (ద్వితీ 28:49-57). ఈ ముట్టడిలో వారు ఎక్కువ సంఖ్యలో నశించుదురు. తీతు నాయకత్వంలో రోమా వారు క్రీ॥శ॥ 70లో జరిగించిన యెరూషలేము నాశనమే పై వచనముల నెరవేర్పు. ఇవి ప్రవచింప బడిన 1500 సంవత్సరాలకు నెరవేరెను. జోసెఫస్ అను యూదా చరిత్రకారుడు ఈ విషయాలను ఖచ్చితముగా వ్రాసెను. పట్టణ ముపై ముట్టడి జరిగిన కాలములోనే అతడు జీవించెను. యెరూషలేము జయించబడెను. గోడలు కూల్చబడెను. పదిలక్షల మంది యూదులు చంపబడిరి. ఆకలిగొన్న ప్రజలు వారి కుమార్తెలను కుమారులను భక్షించిరి.

యూదులు భూమిపైనున్న అన్ని దేశాలకు చెదరిపోవుదురని, వారు ప్రపంచములో ఒక సామెతవలె ఉందురని మోషే ప్రవచించెను. అంతేకాదు వారు నశింపరు. ఏ దేశమందు నేడు వారు కనబడుట లేదు ? ఏ దేశమందు వారు హింసింపబడుట లేదు? అయినప్పటికి యూదులు అలాగే ఉన్నారు. మోషే ఈ ప్రవచనములన్నియు పరిశుద్ధాత్మ ద్వారా చెప్పెను. ఫ్రెడ్రిక్ అను నతడు ఒక మాటలో బైబిలు దేవాశము వలన కలిగినదనుటకు ఋజువు “యూదుడు” (Jew) అని చెప్పాడు.

ఇప్పటినుండి 150 సంవత్సరాల తరువాత అమెరికా అధ్యక్షుడగు వారు ఎవరో అతనెట్టి పరిపాలన చేయునో ఎవడూ చెప్పలేడు. కాని బైబిలు లేఖకులు పర్షియా పాలకుని గూర్చి తన పరిపాలన గూర్చి ముందుగా ప్రవచించిరి. కోరెషు పుట్టక 150 సం॥రాల పూర్వము దేవుని ప్రవక్తయైన యోషయా అతని ఊరును అతని పనిని గూర్చి తెలియజేసి యూదులు బబులోను చెరనుండి విడిపింపబడుటను గూర్చి ముందుగా తెలియజేసెను (యెషయా 44:26-28; 45:1-4). ఈ కాలములో

యూదా రాజ్యము చెరలో లేదు. యెషయా ప్రవచనములు నెరవేరెను.

బబులోను గూర్చి యెషయా వ్రాసిన (13:19-92; యిర్మియా 50) ప్రవచనములు ఆసక్తికరముగ కనబడుచున్నవి. బబులోను దాని మహిమ నుండి ఏ జనాంగము అందు నివసించని విధముగా పడద్రోయబడును. అరబ్బీయుడు తన గుడారమును అక్కడ వేయడు. కాపరులు అక్కడ మందలను మేపరు. అక్కడ ఎడారిలో నివసించు క్రూరమృగములు, గుడ్ల గూబలు, రోదనచేయు జంతువులు నివసించును. బబులోను క్రీ॥పూ॥2234లో మిక్కిలి సుందరమైన నగరము. దాని గోడలు 15 చదరపు మైళ్ళ విస్తీర్ణము, 300 అడుగుల ఎత్తు 87 అడుగుల మందము కలిగి యున్నవి. అనేక వందల ద్వారములు, గోపురములు, వ్రేలాడే ఉ ద్యానవనములు మరియు గొప్ప భవనములుండెను, యూఫ్రటీస్ నది అద్దరిని సారవంతమైన లోయ కలదు. అదే బబులోను సామ్రాజ్యము యొక్క ముఖ్య పట్టణము. అప్పటికి ఆ పట్టణమునకు నాశన చిహ్నాములు ఏమియు లేవు. కాని ఈ ప్రవచనము చెప్పబడిన రెండు వందల సంవత్సరములకు బెల్షస్సరు యొక్క త్రాగుబోతు విందులో ఆ సామ్రాజ్యము తలవంచి మరల పైకెత్తలేదు. మాదీయులు , పారశీకుల దాని నాక్రమించిరి. ఇప్పటి వరకు అది తిరిగి నిర్మింపబడలేదు. యుగాల తరబడి అది నివాస యోగ్యముగా లేదు. ఈ ప్రవచనములో ఒక్క మాట కూడ నిరర్ధకము కాలేదు.

అలాగే యెహెజ్కేలు మధ్యధరా సముద్ర తీరమున నున్న తూరు పట్టణమును గూర్చి అది వైభవముతో నున్న సమయములో ప్రవచించెను (యెహె 26:1-14). కల్దీయులు ఆ పట్టణమును ఆక్రమించి నాశనము చేసిరి. తరువాత తూరు సముద్రమునందలి ఒక ద్వీపములో పునర్నిర్మింప బడెను. ప్రవక్త చెప్పిన విధముగ అలెగ్జాండరు దానిని తనసముద్ర మార్గములో నాశనము గావించిన రెండవవాడు. శతాబ్దాల తరబడి చేపలు

పట్టువారు వలలు వేసుకొను స్థలంగా అది ఉన్నది గాని పునర్నిర్మింప బడలేదు.

బైబిలునందలి అనేక ప్రవచనాల్లో ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రవచనములకు వాటి నెరవేర్పునకు మధ్య కాలం శతాబ్దాలున్నాయని సంపూర్ణంగా ఒప్పుకొనదగినది. "మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" (2పేతు 1:21). ఇదే ప్రవచనములు నెరవేరుటకు కారణము. బైబిలు దైవవేశముపైన క్రైస్తవ విశ్వాసముపై దాడి జరిగిన కాలంలో బైబిలు ప్రవచనములు నెరవేర్పు మనకు వారిని ఎదిరించగల అవకాశమిచ్చింది.

## విజ్ఞాన సంబంధమైన యదార్థత

బైబిలు విజ్ఞానశాస్త్ర పాఠ్య పుస్తకము కాదు. (యేసు క్రీస్తు ద్వారా పాపము నుండి మానవుని రక్షించుటయే దీని గురి). విజ్ఞానశాస్త్రము యొుక్క అనేక విషయాలను అది కలిగి యుండుట మనము గమనించగలము. విజ్ఞాన శాస్త్ర సంబంధముగా అది బోధించే అంశము యదార్థమైనది. బైబిలు విజ్ఞాన శాస్త్రమునకు విరోధముగా నున్నదని చెప్పేవారున్నారు. కాని విజ్ఞానశాస్త్ర సంబంధమైన దాని సంపద బైబిలు దేవుని వాక్యమని ఋజువు చేయుచున్నది. నిజానికి బైబిలు విజ్ఞానశాస్త్ర విషయాలను ఎరిగిన గ్రంథము. విజ్ఞాన శాస్త్రము ద్వారా కనుగొనబడిన విషయాలను అది కలిగియున్నది. అవి కనుగొనబడక పూర్వము కొన్ని వందల సంవత్సరాలకు ముందే బైబిలు నందు విజ్ఞాన శాస్త్ర సంబంధమైన విషయాలు వ్రాయబడెను. ఈ విషయాలన్నీ బోధించే బైబిలు గ్రంథము యొక్క యదార్థత మనకు ఆశ్చర్యము కలిగించుచున్నది.

'విజ్ఞానశాస్త్రము' అను పదానికి పరిపూర్ణ 'జ్ఞానము ' అని అర్థము.

దేవునిచేత నిర్మితమైన సంపూర్ణ చట్టాలలో మానవుని యొక్క పరిమితమైన, అసంపూర్ణ మైన జ్ఞానముపై ఆధారపడిన కొన్ని సిద్ధాంతములు విజ్ఞానశాస్త్రము కానేరవు. విజ్ఞానశాస్త్ర సంబంధమైన మానవ సిద్ధాంతాలతో బైబిలు ఏకీభవించుట లేదు (1తిమో 6:20). గాని యదార్ధమని నిరూపింపబడిన విజ్ఞానశాస్త్ర సంబంధమైన సిద్ధాంతాలతో మాత్రమే అది ఏకీభవించుచున్నది. సత్యము కనుగొనబడినప్పుడు అది బైబిలునందున్నది. సత్యము ముందే బైబిలునందు బయలుపరచ బడెను.

మానవులు విశ్వముయొక్కయు మానవునియొక్కయు ప్రారంభమును గూర్చి ఆసక్తిని కలిగియున్నారు. ఈ ఆలోచన ఎక్కువగా చర్చింపబడు చున్నది. మానవులచేత వ్రాయబడిన అన్ని గ్రంధాలకంటె ఆదికాండము నందలి మూడు వచనభాగాలు ప్రజలయొక్క ప్రశ్నలకు సంతృప్తికరమైన జవాబు వచ్చుచున్నవి. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (వ.1) దేవుడు వాటి జాతి ప్రకారము జీవము గల వాటిని భూమి పుట్టించును గాకని పలికెను. ఆప్రకారమాయెను (వ. 24) "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను.... స్త్రీని గాను, పురుషునిగాను వారిని సృజించెను" (వ.27, 2:7). క్రీస్తు చెప్పెను "సృష్ట్యాది నుండి దేవుడు వారిని పురుషునిగాను స్త్రీని గాను కలుగజేసెను" (మార్కు 10:6; 1తిమో2:13). మానవుడు చిన్న జంతువులనుండి పరిణామము చెందినవాడు కాదు. అతడు దేవుని కుమారుడు (అపొ.కా. 17:28,29). మన ఆత్మలకు దేవుడు తండ్రి (హెబ్రీ 12:9).

మానవుని ప్రారంభాన్ని గూర్చిన పరిణామ సిద్ధాంతము విజ్ఞానశాస్త్ర సంబంధమైనది కాదు. ఋజువు చేయబడలేదు, ఋజువు చేయబడదు. నిర్జీవము నుండి జీవము ఉద్భవించలేదు. ఋజువు లేకుండా అది అంగీకరించ బడుచున్నది. భూమి నిత్యమైనది కాదు. అది సృజింపబడెను. "ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమిని సముద్రమును

వాటిలో సమస్తమును సృజించి... ” (నిర్గమ 10:11). “ప్రతి యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును. స్తమస్తమును కట్టినవాడు దేవుడే. ఇంటికంటె దానిని కట్టిన వాడెక్కువ ఘనత నొందినట్టు ” (హెబ్రీ 3:4, 11:3). భూమియొక్క వయస్సు ఎవడును ఎరుగడు. బైబిలు కూడ దీనిని గూర్చి చెప్పుటలేదు. సర్వశక్తి మంతుడైన యెహోవా ఆదామును. హవ్వను సంపూర్ణముగ అంటే పూర్తిగా ఎదిగిన వారిగ సృజించెను. అట్లే బొగ్గు ఖనిజములు అవి ఉన్న స్థితిలో సృజించెను. “యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను... ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను. ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచబడెను” (కీర్త 33:6-9). ఈ విషయము యథార్థము కాదని ఏ శాస్త్రజ్ఞుడు ఋజువు చేయలేదు.

బైబిలు స్పష్టమైనది, యదార్థమైనది. ఆదికాండము మొదటి అధ్యాయము సృష్టిని గూర్చి నిజమై. సమాచారము నిచ్చుచున్నది. అది కల్పితము కాదు కట్టుకథ కాదు. అది కల్పితమైతే అందలి ఏ భాగము నమ్మదగినది కాదుకదా. ఒక కట్టుకథ ఎక్కడ ప్రారంభింపబడునో, ఎక్కడ ముగించబడునో ఎవరు తీర్పు చెప్పగలరు? లేక ఏది సత్యము ఏది అసత్యము?

భూమి గుండ్రముగా నున్నదను సంగతి కొన్ని వేల సంవత్సరముల వరకు మానవుడు తెలిసికొనలేదు. క్రీస్తు పుట్టుకకు 700 సంవత్సరాల పూర్వము యెషయా ఇట్లు చెప్పెను: “ఆయన భూమండలము మీద ఆసీనుడై యున్నాడు” యెష 40:22. ఇది విజ్ఞానశాస్త్ర సంబంధమైన భవిష్యత్ జ్ఞానము. పితరుడైన యోబు దేవుని గూర్చి మాటలాడుచు “శూన్య మండలముపైన ఉత్తర దిక్కుననున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. శూన్యముపైని భూమిని వ్రేలాడజేసెను” (యోబు 26:7). ప్రతి బాలుడు, బాలిక భూమి గుండ్రముగానున్నదని, అంతరిక్ష యాత్రికులు భూమి

చుట్టు తిరిగి వారి అంతరిక్ష నౌకలనుండి భూమిని చూసిరి. ఇట్టి భౌతిక సమాచారము ఖచ్చితముగ లేఖకులు బైబిలు గ్రంథమందు వ్రాయుట ఎట్లు సాధ్యమయ్యెను? ఎవరైతే ఈ విశాల విశ్వాన్ని రూపకల్పన చేసి సృజించెనో ఆయన దైవావేశము ద్వారా లేఖకులకు తెలియజేసిరి. అది దైవసంబంధమైన బయలుపాటు.

నిజమైన విజ్ఞానశాస్త్ర సూత్రమేదీ దేవుని వాక్యానికి వ్యతిరేకముగా కనబడుటలేదు. బైబిలునందలి ఏ మాట కూడ వ్యతిరేకముగా నున్నట్లు ఏ శాస్త్రజ్ఞుడు కనుగొనలేదు. బైబిలుతో విజ్ఞానశాస్త్ర సంబంధమైన వాస్తవాలు పొందిక కలిగియున్నవి.

## అద్భుతములు

అద్భుతములు బైబిలేయొక్క దైవావేశముకు స్పష్టమైన ఋజువుగా నున్నవి. అద్భుతములు ప్రకృతి ధర్మమునకు విరుద్ధంగా జరిగే అతీతమైన కార్యాలు. ఉదాహరణకు గ్రుడ్డివాడు వైద్యసహాయంతో స్వస్థత నొందితే (యెహాను 9వ అధ్యాయములో వ్రాయబడిన గ్రుడ్డివానివలె) అది అద్భుతము. లాజరును మృతులలోనుండి లేపుట అద్భుత కార్యము (యోహా11). క్రీస్తు వర్తమానము దేవునినుండి కలిగినదని మానవులు ఆయనయందు విశ్వాసముంచునట్లు క్రీస్తు అద్భుత కార్యములు జరిగించెను (యోహా 3:2; 20:30-31). అద్భుత కార్యములు జరిగించిన వారిలో ఇతరులు అపొస్తలులు అద్భుత శక్తి ద్వారా దేవుని వాక్యమును ప్రకటించిరి. వారి మాటలు “సూచక క్రియలచేతను మహత్కార్యముల చేతను” స్థిరపరచబడెను (హెబ్రీ2:3-4). క్రీస్తు ఆరోహణము తరువాత “వారు వాక్యమును ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడైయుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియలవలన వాక్యమును స్థిరపరచుచుండెను” (మార్కు16:20). అతడు దేవుని వాక్కు కలిగియుండెనని ఇశ్రాయేలీయుల

యెదుట ఫరో యెదుట అద్భుతములు చేసి మోషే నిరూపించెను (నిర్గ 4:1-9; 29:31, 7,13 అధ్యాయములు).అద్భుతములు దేవుని వాక్యానికి ఆయన పంపిన వారికి నిజమైన దేవుని ముద్రగా నున్నవి. బైబిలునందలి అద్భుతాలతో పోల్చి చూచినపుడు నేడు అద్భుతములు చేయుచున్నట్లు నటించుచున్న మనుష్యులు విలువలేని వారుగ కనబడుచున్నారు. అవి దుర్నీతిని పుట్టించు మహత్కార్యములు (2థెస్స 2:9). కాని దేవుని వాక్యమునందలి అద్భుతాలను బైబిలు వ్యతిరేకులు వ్యర్థముగా నిరాకరించుచున్నారు. వారే దానియొక్క దైవసంబంధమైన ప్రారంభమునకు ఋజువుగా ఉన్నారు.

## గొప్ప నైతిక విలువలు నీతి సూత్రాలతో కూడిన బోధ

లోకానికి తెలిసిన విధముగ బైబిలు గొప్ప నైతిక విలువలను నీతి సూత్రాలను కలిగియున్నది. సృష్టికర్తయైన దేవుని వెంబడించవలసిన గురుతర బాధ్యత మానవునిపై నున్నదను విషయాన్ని బైబిలు స్పష్టము చేయుచున్నది. మానవుడు యితరుల యెడల కలిగి యుండవలసిన బాధ్యత, తన యెడలతన బాధ్యత నిర్ణయింపబడినది, సమస్తమైన దుర్గుణమును విడిచిపెట్టి సద్గుణమును అలవరచుకొనవలెనని బైబిలు ఆజ్ఞాపించుచున్నది. తగిన స్థాయిలో గొప్ప జ్ఞానమును లోకమునకు అనుగ్రహించ గలిగిన నీతి సూత్రములు ఇందున్నవి. ఏ రాజ్యమందు అట్టి గొప్ప నీతి సూత్రాలు లేవు. గ్రీకులుగాని, రోమనులుగాని అట్టి నీతి బోధలను చేయలేదు. మోషే ధర్మశాస్త్రమునకు మించిన న్యాయచట్టాన్ని ఎక్కడ మనం కనుగొనగలము? (నిర్గమ 20). మోషే ఇట్టి గొప్పజ్ఞానాన్ని, ఆధునిక యుగాల తత్వజ్ఞానంతో కూడిన న్యాయచట్టాన్ని ఎక్కడ పొందెను? కొండమీద ప్రసంగమునందలి నీతి బోధ (మత్తయి 5,6,7) “నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించుము” (మత్తయి 22:36-40) అనే ఆజ్ఞ,

మత్తయి 7:12లో వ్రాయబడిన బంగారు ఆజ్ఞ క్రీస్తునకు ఎక్కడనుండి లభించెను? 1కొరింథీ13వ అధ్యాయములోని ప్రేమను గూర్చిన అందమైన కీర్తన పౌలునకు ఎక్కడ లభించెను? దేవుని ప్రత్యేకమైన ప్రభావము చేతగాక మరో విధముగ ఇంత గొప్ప బోధ అనుగ్రహింపబడుట అసాధ్యము. బైబిలు ఎక్కడ నుండి కలిగినదో అదే సాక్ష్యమిచ్చుచున్నది.. "నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను" (గలతీ 1:11).

## బైబిలునకు వెలుపలగల ఆధారములు

బైబిలు బోధ ఎల్లప్పుడూ నైతికంగా ఘనతను పవిత్రతను అను గ్రహించును. సార్వత్రికంగా అంగీకరింపబడిన ఈ క్రీస్తు మాట లేఖనములకు వర్తింపజేయబడినది: "వారి ఫలమువలన మీరు వారిని తెలిసికొందురు'' మత్తయి 7:14. బైబిలు యొక్క ఫలము నేడు ఫలించుచున్నది. ఈ గ్రంధము వెళ్ళిన చోట నాగరికత ఉన్నత స్థితికి ఎత్తబడును. అది మంచి భర్తలను, భార్యలను కుమారులను, కుమార్తెలను ఉద్యోగులను, పౌరుగువారిని మరియు దేశాలను తయారుచేయుచున్నది. ఈ సత్యము గృహంలో మధురానుభూతిని, మహిళలకు గౌరవాన్ని, బాలలకు పవిత్రతను, మానవునికి మిమోచనమును అనుగ్రహించుచున్నది. ఈ గ్రంధము యొక్క స్వభావము ప్రేమ, దయ మరియు మంచితనము. బైబిలు యొక్క మంచి పలుకుబడి లోకములో లేనియెడల నివసించుటకు లోకము విషాదకరమైనదిగా యిట్టి పలుకుబడిని మానవులకివ్వలేదు.

మానవ నాగరికత తత్వజ్ఞానము మరియు విజ్ఞానశాస్త్రము బైబిలు కంటె మంచిదని కొందరు చెప్పుదురు. దేశాలయొక్క చరిత్రను చదువునప్పుడు మానవజ్ఞానము వారికి నైతిక విలువలను, పవిత్రతను ఇవ్వలేదని గ్రహించుము. చూడండి దేవుని వాక్యమును ఎక్కడ మానవులు

దానిని ప్రేమించి విధేయులయ్యారో అక్కడ గొప్ప వ్యక్తులు, పవిత్ర స్త్రీలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మరియు గొప్ప ప్రభుత్వాలు ఏర్పడినడి. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలేవి? అమెరికా మరియు బ్రిటన్. అక్కడ బైబిలు తెరవబడి  క్రీస్తుయొక్క మహిమకొరకు అత్యుత్తమైన సువార్త పరిచర్య జరగుచున్నది. చాలాకాలం చరిత్ర గలిగి సగం అభివృద్ధిని సాధించిన దేశాలేవి? చైనా, ఇండియా, రష్యా. అక్కడ బైబిలు ప్రజలకు దూరంగా ఉంచబడినది. ప్రపంచంలో సగంభాగం పాపములోను అవిశ్వాసములోను ఉన్నది. అక్కడ దేవుని వాక్యాన్ని ప్రజలు పఠించుటలేదు. ప్రేమించుటలేదు, విధేయత చూపుట లేదు. మానవాళి గొప్ప ప్రవర్తన కలిగియుండునట్లు వారిని నడిపించ గలిగిన బోధ బైబిలునందున్నది. లోకసంబంధమైన జ్ఞానము మరియు నాగరికత హృదయాన్ని పవిత్ర పరచి ప్రజలెట్లుండవలెనో వారికి త్రోవ చూపలేదు. ఆత్మ సంబంధమైన అభివృద్ధికి సంతోషకరమైన మానవ కుటుంబానికి మానవుల ద్వారా వ్రాయబడిన గ్రంధములనిటికంటె బైబిలు యోగ్యతలో మార్గదర్శకముగా యున్నది. మానవతత్వ జ్ఞానము అన్నిటికంటె మానవ స్వభావాన్ని మంచి కొరకు మార్చగలదు. ఈ గ్రంధమందలి నీతిబోధకు దూరంగా వేసే ప్రతి అడుగు ముందడుగు కాదు గాని ప్రకృతి సంబంధమైనది, సృష్టిని పూజించునది, అజ్ఞానమైనది. ఎవడైతే దేశాలలో బైబిలు పలుకుబడిని కించపరచునో అతడు మానవాళికి విరోధి. ఇంకా ఏదేశమైతే బైబిలు బోధను చిన్న చూపు చూస్తుందో ఆ దేశము భయంకరమయిన ఫలితాలను చూస్తుంది.

అందుచేత బైబిలు దైవసంబంధమయిన మూలమును కలిగియున్న దనుటకు దాని బోధయే ఋజువుగానున్నది. బైబిలు దేవుని వాక్యమని నమ్ముచున్నామని చెప్పుటకు మాకెట్టి సంకోచము లేదు. ఎందుకనగా అది గొప్ప మంచిని లోకంలో జరిగించి దానిని కొనసాగించుచున్నది.

## నాశనముకాని దాని తత్వము

బైబిలు ఇప్పుడు కలిగియున్న సంపూర్ణతను 2000 సంవత్సరాల క్రితమే కలిగియున్నది, మూలపడిన ఇతర గ్రంధాలవలె యిది లేదు. ప్రపంచ మందలి ప్రతి గ్రంధానికంటె ఎక్కువగా గౌరవించబడి, ఎక్కువగా ముద్రింపబడి అమ్ముడగుచున్నది. ఇతర గ్రంధాలన్నిటికంటె ఎక్కువ భాషలలోనికి ఇది తర్జుమా చేయబడినది. గ్రంధాలు మనుష్యులవలె పుట్టి, వ్యాపించి వెంటనే అంతమయి మరుగుపడినవి. అవి ఒకసారి ప్రయోజనకరమయినవైతే అంత కంటే మంచి గ్రంధాలు వచ్చి వాటి స్థానాన్ని ఆక్రమించినవి. అలాగు బైబిలు విషయంలో జరుగలేదు. దాని వయస్సు దాని శక్తిపై ఎట్టి ప్రభావము చూపలేదు. అది ఎల్లప్పుడును జీవముతో ముందుకు కొనసాగుచున్నది (హెబ్రీ 4:12, రోమా 1:16).

బైబిలునకు విధేయులగుటకు ఇష్టపడినవారు బైబిలును తీవ్రముగా ఎదుర్కొనిరి. కాని దాని భయంకర శత్రువులను, కపట స్నేహితులను అది ఎదుర్కొని నిలిచింది. బైబిలుకంటె ఎక్కువగా ఏ గ్రంధం మానవుని వ్యతిరేకతకు గురి కాలేదు. దాని చరిత్ర విషయంలో మానవులు దానిని నాశనం చేసే ప్రయత్నాలను దాటి ముందునకు కొనసాగింది.

ఉదాహరణకు క్రీ॥శ॥ 303లో డయొక్లిషయన్ అను రోమా చక్రవర్తి బైబిలును నాశనము చేయుటకు ఒక ఉత్తర్వును జారీచేసెను. అతడు తన గురిని నెరవేర్చగలనని తలంచెను. కాని 25 సంవత్సరముల అనంతరము కాన్‌స్టాంటిన్ అను క్రొత్త చక్రవర్తి ప్రభుత్వ ఖర్చులతో బైబిలు యొక్క 50 ప్రతులు తయారు చేయుటకు ఉత్తర్వులు జారీచేసెను. వాల్టెయిర్ అనుఫ్రెంచి భౌతికవాది క్రీ॥శ॥ 1776లో 100 సంవత్సరముల తరువాత బైబిలు అదృశ్యమగునని చెప్పెను. కాని అతడు మరణించిన 25 సంవత్సరముల తరువాత బ్రిటిష్ మరియు విదేశి బైబిలు సొసైటి

స్థాపింపబడెను. 100 సంవత్సరముల అనంతరము అతడు అవిశ్వాస సంబంధమయిన వాఙ్మయాన్ని ముద్రించిన తన స్వంత అచ్చు యంత్రముపై బైబిలు ముద్రించబడెను. అతడు నివసించిన గృహము దేవుని వాక్యమును భద్రపరచుటకు ఉపయోగింపబడెను. వాల్టెయిర్ మరణించిన కాలంలో థామస్ జెఫర్‌సన్ అనునతడు “వెష్టరన్ వర్జీనియా” అను తన గ్రంథములో 50 సంవత్సరాల తరువాత పురాతన గ్రంధాలు గల చోట్ల తప్ప అమెరికాలో బైబిలు కనపడదని చెప్పెను. థామస్ వైస్ అనునతడు బైబిలు అంతాన్ని గురించి చెప్పెను. ఈ మనుష్యులందరు శరీరంతో ఉన్న మానవులు వెళ్ళే చోటికే వెళ్ళిరి గాని దేవుని వాక్యము ఇప్పటి వరకు నిలిచే యున్నది. న్యూయార్కు నగరమునందలి బైబిలు సొసైటీవారు బైబిలు అందలి భాగములు మిలియన్ల కొలది ముద్రించి అమెరికా దేశమంతటికి విస్తరింపజేయుచున్నారు. ఈ రోజు అమెరికాలో బైబిలు గ్రంధము గాని ఏదో ఒక వచన భాగములుగల పత్రిక గాని లేని గృహము లేదు.

రాబర్ట్ జి ఇంజెర్ సోల్ (1833 –1899) అను ముఖ్య భౌతికవాది అమెరికాలో బైబిలును ఎక్కువగా విమర్శించెను. అతడు మోషే తప్పిదములు ” అను ఉపన్యాసముల నిచ్చెను. మనం మోషే పుస్తకాలు చదివినప్పుడు “ఇంజెర్ సోల్ తప్పిదములు” గ్రహించగలము.

నిజముగా బైబిలునకు వ్యతిరేకముగా శతాబ్ధాల తరబడి క్రూర యుద్ధములు జరిగెను. బైబిలును నాశనము చేయు ప్రయత్నములు జరిగినను బైబిలు నిలిచేయున్నది. నాస్తికుల ద్వారా, ఆవిశ్వాసుల ద్వారా విమర్శకుల ద్వారా హింసాత్మకమైన తుఫానుల నెదుర్కొని నిలిచియున్నది. యెహోవా తన గ్రంధమును శతాబ్ధాల తరబడి భద్రపరచెను. “ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు” (మత్తయి 24:35; 1పేతురు 1:23–25). విమర్శకులు వచ్చి గతించి పోయిరి. రాజ్యములు నాశనమైనను. బైబిలు నిలిచియున్నది. బైబిలు

కాలాంతము వరకు నిలుచును. ఏదీ దానిని నాశనము చేయలేదు. దానిలో తప్పిదమును కనుగొనవలెనని శక్తినంతటిని ఉపయోగించి ప్రయత్నించి నను నేడు అది మన మధ్యనున్నది.

ఒక కవి ఈ మాటలలో దానిని గూర్చిన సత్యమును అందమును వివరించెను.

శతాబ్దాల తరబడి అది నిలిచియున్నది.

రాజ్యములు స్థాపింపబడి నాశనమై మరువబడినను అది నిలిచియున్నది.

నాస్తికులు దానిపై దాడిచేసినను అది నిలిచియున్నది.

భౌతికవాదుల అపహాస్యము చేసినను అది నిలిచియున్నది.

అనుకరించి గేళి చేసేవారు గేళిచేసినను అది నిలిచియున్నది.

అవిశ్వాసము దానిని విడిచిపెట్టినను అది నిలిచియున్నది.

విమర్శకులు దానిదైవావేశమును నిరాకరించినను అది నిలిచియున్నది.

మంటలు దానిని ఆవరించినను అది నిలిచియున్నది.

కాలపు కోరలు కాటు వేసినను అది గాయపరచబడలేదు అది నిలిచి యున్నది.

అవిశ్వాసులు దాని అంతాన్ని గురించి చెప్పినను అది నిలిచి యున్నది. దేవుని వాక్యము ఎల్లప్పుడును నిలుచును.

✤

# ముగింపు

బైబిలు జీవముగల దేవుని సత్యవాక్యమని చెప్పుటకు ఈ విషయాలు తిరుగులేని ఆధారములు : 1. దోషరహితమైనది 2. ప్రవచనములు నెరవేరనవి. 3. విజ్ఞానసంబంధమైన యదార్ధత 4. అద్భుతములు 5. గోప్ప నైతిక విలువలు నీతి సూత్రములతో కూడిన బోధ 6. గొప్ప పలుకుబడి 7. నాశనము కాని దాని తత్వము.

బైబిలు మానవునికి దేవుడిచ్చిన సంపూర్ణమైన, పవిత్రమైన మరియు దోషరహితమైన దేవుని బయలుపాటు. దానిని సరిచేయవలసిన అవసరము లేదు. అందలి ఆజ్ఞలను మనము ప్రేమించి విధేయులము కావలసియున్నది. మానవునికొరకేది ఉత్తమమో దేవునికి మాత్రమే తెలియును. ఈ రోజులలో బైబిలు మానవుని కెంత సన్నిహితముగా నున్నదో మొదటి శతాబ్దమందు కూడ అట్లే ఉన్నది. అది కాలములలోను మానవులందరినీ నడిపించుచున్నది. దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము "ప్రతి సత్కార్యమునకు సంపూర్ణముగా" సిద్ధపరచును (2తిమో 3:17). మన విశ్వాసమునకు బైబిలు మాత్రమే అధికారముతో కూడిన కట్టడలను కలిగియున్నది. అదే మన విశ్వాస ప్రమాణ పుస్తకము. సంఘము యొక్క క్రమశిక్షణకు అవసరమైన గ్రంధము ఇదే. యేసు క్రీస్తు ద్వారా మానవులు విమోచన పొందుటకు దేవుని సంకల్పము అందు బయలు పరచబడెను (రోమా 3:23 యోహా 3:16). ఆఖరి దినమున ఈ గ్రంధమే మనకు తీర్పు తీర్చును (యోహా 12:48; ప్రక 20:11-13; 2 కొరింథీ 5:10).

బైబిలు మానవునియొక్క ప్రారంభాన్ని స్వభావాన్ని మరియు

బాధ్యతను తెలియజేయుట మాత్రమే గాక సమాధి తరువాత జీవితాన్ని చూపించిన టెలిస్కోపు. మనము త్వరగా ఈ జీవితము నుండి వెడలి పోవుదుమని ఎరుగుదుము. కాని తరువాత ఏమిటి? యోహానుకు బయలుపాటు కలిగిన దర్శనము వలన గొఱ్ఱెపిల్ల రక్తములో విమోచన పొంది. మానవునికి తన ఆత్మకు నిత్యనివాసమే పరలోకమను సంగతి మనము గ్రహించగలము (ప్రక 7:9-17; 21,22అధ్యా). బైబిలు దైవసంబంధమైనదనే నమ్మకము లేనియెడల మన భవిష్యత్తు చీకటిలో నుండును. మనకు నిరీక్షణ ఉండదు. లేఖనాలలో "జీవమును అక్షయతను" గూర్చిన వర్తమానము కనపడును (2 తిమోతి 1:10; కీర్త 23).

అందువలన మనుష్యులు గొప్ప శక్తిద్వారా నడిపింపబడకుండ బైబిలును వ్రాయలేరని మనము నమ్ముచున్నాము. ఒక మానవుడు ఇట్టి గ్రంధాన్ని వ్రాయలేడు. బైబిలు ప్రపంచమునందు అద్భుతమైన గ్రంధము (కీర్త 119:129). అది గ్రంధాలకే గొప్ప గ్రంధము. వాఙ్మయ విశ్వంలో సంచరించే గ్రహాలన్నిటికంటే ఎక్కువగా ప్రకాశించు సూర్యుని పోలియున్న గ్రంధము బైబిలు మాత్రమే. మనమందలి ఆజ్ఞలను గౌరవించి విధేయులమైన యెడల ఒక మధురమైన దినమున పరలోకము మన గృహమగును.

ఈ పురాతన గ్రంధము దేవుని మనస్సును, మానవుని స్థితిని, రక్షణా సంకల్పమును, పాపుల అంతమును మరియు విశ్వాసుల ఆనందమును కలిగియున్నది. దాని చరిత్రలు వాస్తవాలు. దాని బోధలు పరిశుద్ధమైనవి. జ్ఞానివగుటకు దానిని పఠించుము. క్షేమంగా నుండుటకు దానిని నమ్ముము. పరిశుద్ధముగా నుండుటకు దానిని ఆచరించుము. నిన్ను నడిపించుటకు అది వెలుగు, నిన్ను జీవింపజేయుటకు ఆహారము, నిన్ను నడిపించుటకు అది ఆదరణయై యున్నది. అది ప్రయాణికుని పటము. యాత్రికుని చేతికర్ర, నావికునిదిక్సూచి, సైనికుని ఖడ్గము మరియు క్రైస్తవుని చట్టము.

ఇక్కడ పరదైసు పునరుద్ధరింపబడెను. పరలోకము తెరువబడెను పాతాళలోక ద్వారములు మూయబడెను. దాని గొప్ప మూర్తి క్రీస్తు. మన మంచి దాని సంకల్పము మరియు దేవుని మహిమ దాని అంతము. అది మనస్సును నింపును. హృదయమును పరిపాలించును మరియు పాదములకు త్రోవచూపును. నిదానముగా తరచుగా, ప్రార్థనా పూర్వకముగా దానిని పఠించుము. అది సంపదలకు గని, మహిమతో నిండిన పరలోకము మరియు ఆనంద నది. అది నీకు .జీవము నిచ్చును, తీర్పు దినమున తెరువబడును. అది శ్రమపడిన వారికి గొప్ప బహుమానమిచ్చును. అందలి పరిశుద్ధమైన వాటిని అల్పమైన విషయాలుగా భావించు వారిని శిక్షించును.

✤

*Copies can be had from:*

SATYA VANI - Church of Christ

P.O. Box: 80, KAKINADA

A.P., 533 001